

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+20 వెల: ₹ 5.00

సంపుటి: 10
సంచిక: 348

శనివారం 10-3-2018



ట్విటర్ సీటీవోగా పరాగ్
చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా నియామకమైన ఐఐటీ-బాంబే పూర్వ విద్యార్థి - బిజినెస్‌లో



షమీపై కేసులు నమోదు
గృహ హింస, వేధింపుల ఆరోపణలపై పేసర్ షమీ సహా ఐదుగురిపై కేసులు - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

కటీఫ్ వెనుక కథ!



కేంద్ర ప్రభుత్వం నుంచి వైదొలిగినా ఇంకా ఎన్డీయే మిత్రపక్షంగానే టీడీపీ

- ఒక పక్క బీజేపీతో చెలిమి కొనసాగించే ఎత్తుగడ
- అదే సమయంలో బీజేపీపై దుష్ప్రచారం చేయాలని టీడీపీ శ్రేణులకు ఆదేశం
- హోదా సెంటిమెంట్ బలంగా ఉండటంతో కంటితుడుపుగా కేంద్ర మంత్రులతో రాజీనామాలు
- ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానంపై స్పందన లేదు
- ఇది మరోసారి మభ్యపెట్టే ప్రయత్నమేనా?

సాక్షి, అమరావతి

ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేయడం వల్లే కేంద్రంతో కటీఫ్ చెప్పి తమ మంత్రులతో రాజీనామాలు చేయించామని ప్రకటించిన సీఎం చంద్రబాబు.. ఎన్డీఏలో మాత్రం కొనసాగుతామంటూ తమ బంధాన్ని కాపాడుకునేందుకు ఆపసోపాలు పడుతుండటంపై ప్రజల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయన నిజంగానే రాష్ట్ర ప్రయోజనాలు కాంక్షిస్తే మంత్రి పదవులకు రాజీనామాలు చేసినప్పుడు ఎన్డీఏ నుంచి ఎందుకు తప్పుకోరని ప్రశ్నిస్తున్నారు. ఓవైపు మైత్రిబంధం కొనసాగిస్తూనే మరోవైపు బీజేపీపై దుష్ప్రచారానికి సిద్ధం కావటం వెనక చంద్రబాబు పక్కా వ్యూహాత్మకంగా

మిగతా 2వ పేజీలో ▶

కేటాయింపు బారెడు.. వ్యయం మూరెడు

- 2017–18 కేటాయింపులు, సవరించిన అంచనాలతో తేటతెల్లం
- గ్రామీణాభివృద్ధి, సంక్షేమం, వైద్య రంగాల కేటాయింపుల్లో భారీగా కోత
- సాగునీటికి మాత్రం పెంపు.. కమీషన్లే కారణమంటున్న అధికార వర్గాలు

7 లో



కారుణ్య మరణానికి ఓకే

చారిత్రాత్మక తీర్పు వెల్లడించిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం

ప్రత్యేక సందర్భాల్లో చికిత్స నిలిపి వేయమని రోగి కోరేందుకు సమ్మతి

- వివరాలు 6లో

టీడీపీ- బీజేపీ బంధం బాగానే ఉంది



- ఈ వివాదం మంత్రుల రాజీనామా వరకే పరిమితం: పురందేశ్వరి
- బీజేపీతో విడిపోలేదని చంద్రబాబే స్వయంగా చెప్పారు
- అవి కేవలం రాజీనామాలే..

- వివరాలు 2లో

సాయం చేయకపోగా ఎదురు దాడి

- కేంద్రంపై సీఎం చంద్రబాబు విమర్శలు
- ఏపీకి అన్యాయంపై మూడ్రోజులు అడిగినా స్పందన లేదు
- రాజధానికి కేంద్ర సాయంతో పోలిస్తే రైతులిచ్చిన భూమే విలువైనది
- హెచ్‌వోడీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు

7 లో

హోదా కోసం అదే పట్టు

- పార్లమెంట్‌లో కొనసాగిన వైఎస్సార్ సీపీ ఎంపీల ఆందోళన
- టీడీపీ ఎంపీలు అవిశ్వాసానికి మద్దతిచ్చి పదవులను వీడాలని డిమాండ్

2 లో



పార్లమెంట్ మెయిన్ గేట్ వద్ద ఎంపీల ఆందోళన

రాజ్యసభ అభ్యర్థులపై టీడీపీ సస్పెన్స్

- ఉత్కంఠను కొనసాగిస్తున్న సీఎం చంద్రబాబు
- ఆశావహుల్లో ఆందోళన
- 11న పొలిట్‌బ్యూరో భేటీలో ఖరారు చేసే అవకాశం - 2లో

ప్రజాసంకల్ప యాత్ర 108 వ రోజు



నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉదయం 7.30 గంటలకు సంతరావూరు శివారు

ముఖ్యాంశాలు

చీరాల నియోజకవర్గం సంతరావూరు శివారు, అంబేడ్కర్‌నగర్, వేటపాలెం, దేశాయ్‌పేట, జాండ్రపేట, రామకృష్ణాపురంలో జనంతో మమేకం. చీరాలలో క్లాక్ టవర్ సర్కిల్ వద్ద బహిరంగ సభ.

అర్చకుల గ్రాట్యుటీ రద్దు ఉత్తర్వులు నిలిపివేయండి

ముఖ్యమంత్రికి మాజీ సీఎస్ ఐవైఆర్ లేఖ



సాక్షి, అమరావతి: ఆలయాల్లో వంశపారంపర్య అర్చకత్వంలో కొనసాగుతున్న అర్చకులకు గ్రాట్యుటీ చెల్లింపులను నిలుపుదల చేస్తూ దేవదాయ శాఖ అధికారులు జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖ రాశారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగానే అర్చక సంక్షేమ నిధి నుంచి అర్చకులతో పాటు ఆలయాల్లో పనిచేసే ఇతర ధార్మిక ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లింపులు జరుగుతున్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు. చిన్నచిన్న సాంకేతిక అంశాలను పరిగణనలోకి తీసుకుని.. ప్రభుత్వంతో సంప్రదింపులు జరపకుండా గ్రాట్యుటీ నిలిపివేత ఉత్తర్వులు ఇచ్చి ఉంటారని తాను భావిస్తున్నట్టు తెలిపారు. వంశపారంపర్య అర్చకులకు వృద్ధాప్యంలో ప్రభుత్వం అందజేసే సహాయంగా ఇది ఉపయోగపడుతుందని, గ్రాట్యుటీ చెల్లింపులు భవిష్యత్‌లో కొనసాగేలా అధికారులను ఆదేశించాలని ముఖ్యమంత్రిని ఐవైఆర్ కోరారు. 2007లో దేవదాయ చట్టానికి సవరణలు జరిగినప్పటికీ, ఇప్పటివరకు సర్వీసు రూల్స్ ఖరారు చేయలేదని.. వంశపారంపర్య అర్చకుల సర్వీసు రూల్స్‌కు సంబంధించి ప్రభుత్వం జారీ చేయాల్సిన తుది నోటిఫికేషన్ పది నెలలుగా పెండింగ్ ఉందన్న విషయాన్ని ఐవైఆర్ తన లేఖలో పేర్కొన్నారు.

మార్చి 12 నుంచి ఒంటి పూట బడులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అన్ని పాఠశాలల్లో ఈ నెల 12వ తేదీ నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటి పూట బడులు నిర్వహించనున్నారు. పాఠశాలలు ఉదయం 7.45 గంటలకు ప్రారంభమై, మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు కొనసాగుతాయని విద్యాశాఖ అధికారులు శుక్రవారం తెలిపారు.

రెండ్రోజుల ముందే వడగాడ్పు హెచ్చరికలు

- జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా రక్షణ
- పోస్టర్ ఆవిష్కరించిన విపత్తు నిర్వహణ శాఖ

సాక్షి,, అమరావతి: ఈ వేసవిలో గతేడాది కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రమాదం ఉన్నందున వడగాడ్పుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచించారు. వాతావరణంలో మార్పులు, గ్లోబల్ వార్మింగ్ వల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయన్నారు. ఎండల తీవ్రతకు గురికాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన పోస్టర్‌ను రాష్ట్ర విపత్తు నిర్వహణ కమిషనర్ ఎంవీ శేషగిరిబాబు శుక్రవారం ఆవిష్కరించారు. గుంటూరు జిల్లా కుంచనపల్లిలోని రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ కార్యాలయంలో శేషగిరి బాబుతో పాటు భారత వాతావరణ విభాగం హైదరాబాద్ కేంద్రం డైరెక్టర్ వైకే రెడ్డి ఇతర అధికారులు విలేకరులతో మాట్లాడారు. వడగాడ్పుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంసిద్ధతలను వివరించారు. వడగాడ్పుల కార్యాచరణ ప్రణాళిక–2018 రూపొందించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను అన్ని శాఖలకు, జిల్లాల అధికారులకు పంపించామని ఎంవీ శేషగిరిబాబు చెప్పారు. సాధారణం కంటే 4–5 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటే వడగాలులని, సాధారణం కంటే 6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటే తీవ్ర వడగాలులుగా పరిగణిస్తారని భారత వాతావరణ విభాగం హైదరాబాద్ కేంద్రం డైరెక్టర్ వైకే రెడ్డి తెలిపారు. ఉష్ణోగ్రతలు ఎలా ఉంటాయనే వివరాలను రెండ్రోజుల ముందే వాతావరణ శాఖ రోజూ విపత్తుల నిర్వహణ ద్వారా తెలియజేస్తుందని, దాని ఆధారంగా ప్రజలు జాగ్రత్తలు తీసుకొని వడగాలుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. వడగాడ్పుల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు ఎండ సమయంలో చేయాల్సిన, చేయకూడని అంశాలను పోస్టర్‌లో పేర్కొన్నారు. ప్రజలకు అవగాహన నిమిత్తం ఈ పోస్టర్లను రాష్ట్రమంతా అంటించి ప్రచారం సాగిస్తారని అధికారులు తెలిపారు.

▶ మొదటి పేజీ తరువాయి

కటీఫ్ వెనుక కథ!

వ్యవహరిస్తున్నారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ప్రత్యేక హోదా కోసం తానే పోరాడుతున్నట్లు రాష్ట్ర ప్రజల దృష్టిలో ఛాంపియన్‌గా నిలిచిపోవడం... ఆది నుంచి పోరాడి ఉద్యమాన్ని సజీవంగా ఉంచిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆ క్రెడిట్ దక్కకుండా చేయడం ఆ వ్యూహంలో భాగమే. ప్రజల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహాన్ని తట్టుకోలేక, విధిలేని పరిస్థితుల్లోనే కేంద్ర మంత్రి మండలికి తన మంత్రులతో సీఎం రాజీనామా చేయించారనే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది.

ఎన్డీఏలో కొనసాగితే కేంద్రం స్పందిస్తుందా?

వ్యక్తిగత ప్రయోజనాలను పరిరక్షించుకోవడం, బీజేపీని ప్రసన్నం చేసుకోవడంలో భాగంగానే ఎన్డీఏ నుంచి ఇప్పటికిప్పుడు వైదొలగరాదని చంద్రబాబు నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. 'ప్రధాని మోదీ నాకు ఫోన్ చేశారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకుందాం అని సూచించినా నేను పట్టించుకోలేదు. రాజీనామాలకు కట్టుబడ్డామని చెప్పా' అని అనుకూల మీడియాలో లీకులు ఇచ్చి సీఎం ప్రచారం చేయించుకుంటున్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే కేంద్ర మంత్రి పదవులకు రాజీనామాలు చేసి ఉంటే ఎన్డీఏ నుంచి ఇప్పటికిప్పుడు ఎందుకు వైదొలగటం లేదనే ప్రశ్నకు టీడీపీ వర్గాల నుంచి సమాధానం లేదు. టీడీపీ మంత్రులు రాజీనామా చేయడంతోపాటు ఎన్డీఏ నుంచి వైదొలిగి ఉంటే కేంద్రంపై ఒత్తిడి ఉండేదని.. ఇందుకు భిన్నంగా ఎన్డీఏలోనే కొనసాగాలని టీడీపీ నిర్ణయించుకోవటంతో ఎలాంటి స్పందన లేకుండా పోయిందని రాజకీయ పరిశీలకులు తేల్చిచెబుతున్నారు.

'మైత్రి'బంధం బద్ధలవడంపై అనుమానాలు

'టీడీపీ మంత్రులు రాజీనామా చేసినంత మాత్రాన జనం మనల్ని నమ్మరు. ఎన్డీఏ నుంచి బయటకు వస్తేనే విశ్వసిస్తారు' అని సూచించిన తనపై సీఎం చంద్రబాబు రుసరుసలాడినట్లు ఓ సీనియర్ ఎంపీ లోక్‌సభ సెంట్రల్ హాల్‌లో శుక్రవారం బాహాటంగా వ్యాఖ్యానించటం కలకలం రేపింది. ఎన్డీఏ నుంచి ఇప్పటికిప్పుడు బయటకు వస్తే వ్యక్తిగతంగా ఇబ్బంది పడాల్సి వస్తుందని సీఎం అన్నట్లు ఆయన చెబుతున్నారు. ఇచ్చిన నిధులకు లెక్కలు అడగడం వల్లే కేంద్ర మంత్రి మండలి నుంచి టీడీపీ వైదొలగిందని, కానీ ఎన్డీఏలో కొనసాగుతామని చంద్రబాబే చెబుతున్నారని బీజేపీ సీనియర్ నేత పురందేశ్వరి సైతం చెప్పారు. బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మంత్రి పదవికి రాజీనామా చేశాక గురువారం శాసనసభలో చంద్రబాబు అంతటి సమర్థవంతమైన నాయకుడు మరొకరు లేరంటూ ప్రశంసించడం.... అజాతశత్రువు అంటూ కామినేని శ్రీనివాస్‌ను సీఎం పొగడటం గమనార్హం. మంత్రి పదవులకు మాత్రమే రాజీనామా చేశామని, ఎన్డీఏలో కొనసాగుతామని అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరి కూడా చెప్పారు. ఇవన్నీ పరిశీలిస్తే బీజేపీ–టీడీపీల మధ్య మైత్రి బంధం కొనసాగుతోందని స్పష్టమవుతోంది.

కొంప ముంచిన గొప్పలు!

లేనిది ఉన్నట్లు చూపి రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని ప్రచారం చేయడం.. రూ.16 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఎంవోయూలు కుదుర్చుకున్నారంటూ హడావుడి చేయటం.. వృద్ధి రేటును అధికంగా చూపడం వల్ల కేంద్రం నుంచి తగినన్ని నిధులు రావని ప్రతిపక్షంతోపాటు ఆర్థిక నిపుణులు, ఉన్నతాధికారులు ఆది నుంచి హెచ్చరిస్తూ వస్తున్నారు. దీన్ని పెడచెవిన పెట్టి తాజా బడ్జెట్‌లోనూ బడాయి అంకెలతో లేని వృద్ధిని ఉన్నట్లు చూపారు. రెవెన్యూ లోటు ఉన్నప్పటికీ తప్పుడు లెక్కలతో రూ.5,235 కోట్ల రెవెన్యూ మిగులు ఉన్నట్లు బడ్జెట్‌లో చూపడం గమనార్హం. అలాగే గత మూడేళ్లలో జాతీయ వృద్ధి రేటు 7.31 శాతం కాగా ఆంధ్రప్రదేశ్ వృద్ధి రేటు 10.96 శాతంగా ఉందంటూ గొప్పలు చెప్పుకున్నారు. ఇదే సమయంలో 2014–15కి సంబంధించి రూ.16,078 కోట్లు రెవెన్యూ లోటు కింద మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నారు. ఓవైపు దేశం కన్నా రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందంటూ ప్రచారం చేస్తూ నిధులు ఇవ్వమంటే కేంద్రం ఎలా ఇస్తుందని సీనియర్ ఐఏఎస్‌లు, ఆర్థిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు. కేంద్రం నిధులు ఇవ్వకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చూపిన తప్పుడు గణాంకాలే కారణమని విశ్లేషిస్తున్నారు.

సీఎంకు ఇబ్బందనే ఆత్మగౌరవ నినాదం

సీఎం చంద్రబాబుకు ప్రజల మనోభావాలను గౌరవించే సాంప్రదాయం నిజంగానే ఉంటే, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడాలన్న చిత్తశుద్ధి ఉంటే ఎన్డీఏ నుంచి వైదొలగుతూ నిర్ణయం తీసుకునేవారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎన్డీఏ నుంచి బయటకు వస్తే వ్యక్తిగతంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతోనే ప్రజల ఆత్మగౌరవం నినాదాన్ని చంద్రబాబు అందుకున్నారని సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. 'తెలంగాణ ఎంపీలు అందరూ పార్టీలకు అతీతంగా ఏకతాటిపై పోరాడటం వల్లే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. అదే తరహాలో వైఎస్సార్ సీపీ ఎంపీలతో కలిసి టీడీపీ ఎంపీలు రాజీనామా చేస్తే కేంద్రంపై ఒత్తిడి పెరుగుతుంది. అప్పుడే ప్రత్యేక హోదా వస్తుంది. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ చేసిన సూచనకు సీఎం చంద్రబాబు స్పందించకపోవడం ఆశ్చర్యకరం' అని బీజేపీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు.

చిత్తశుద్ధి అంటే ఇదేనా?

రాష్ట్రానికి ప్రత్యేక హోదా మంజూరు చేయనందుకు నిరసనగా.. 'కేంద్రంపై మీరు అవిశాస్వం పెట్టండి. మేం మద్దతు ఇస్తాం.. లేదంటే మేం పెడతాం. మీరు మద్దతు ఇవ్వండి' అంటూ ప్రధాన ప్రతిపక్ష నేత, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూటిగా చేసిన ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు నుంచి ఏమాత్రం స్పందన లేకపోవడం గమనార్హం. రాష్ట్రం నుంచి ఎంపికైనా 25 మంది ఎంపీలంతా మూకుమ్మడిగా రాజీనామా చేసి ప్రత్యేక హోదా కోసం కేంద్రంపై ఒత్తిడి తెద్దామంటూ ప్రతిపక్ష నేత చేసిన సూచనకు టీడీపీ నుంచి ఎలాంటి ప్రతిస్పందన లేకపోవడంపై రాజకీయ విశ్లేషకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఇన్నాళ్లూ ప్రశంసించి.. ఇప్పుడు విమర్శలా?

అధికారం చేపట్టినప్పటి నుంచి నిన్నమొన్నటి వరకూ కేంద్రం సహకరించడం వల్లే ఇబ్బందులను అధిగమించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు శాసనసభలోనూ బయటా సీఎం చంద్రబాబు పదేపదే పొగడటం తెలిసిందే. ప్రత్యేక హోదా వల్ల ఒరిగేదేమీ ఉండదని.. అది ఉన్న ఈశాన్య రాష్ట్రాలు ఏం బావుకున్నాయ్? అని హేళన చేస్తూ వచ్చారు. హోదా కంటే ప్రత్యేక సహాయం ద్వారానే రాష్ట్రానికి అధిక ప్రయోజనం చేకూరుతుందని, అనుభవం ఉన్న నేతగా చెబుతున్నానని నమ్మకంగా చెబుతూ వచ్చారు. కానీ ప్రతిపక్ష నేత జగన్ నాలుగేళ్లుగా ముందుండి పోరాడి ప్రత్యేక హోదా ఉద్యమాన్ని సజీవంగా ఉంచటం, ఎన్డీఏ సర్కారు చివరి బడ్జెట్‌లోనూ ఏపీకి మొండిచేయి చూపటంపై ప్రజల్లో రగిలిన ఆగ్రహ జ్వాలలను పసిగట్టిన సీఎం చంద్రబాబు ఇప్పుడు హోదా కావాలంటూ కొత్త పాట అందుకున్నారని, రాజీనామాల పేరుతో ఎన్డీఏ నుంచి తప్పుకోకుండా డ్రామాలాడుతున్నారని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

'బీజేపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆ పార్టీతో పొత్తు వల్ల టీడీపీకి అదనంగా వచ్చిన లాభమేమీ లేదు. కేంద్ర మంత్రివర్గం నుంచి మన పార్టీ మంత్రులను ఉపసంహరించుకున్నాం. ఈ రెండు రోజులు మీ నియోజకవర్గాల్లోనే పర్యటించి బీజేపీపై దుమ్మెత్తిపోయండి. కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం, రాష్ట్రం నుంచి ఎన్నికైన లోక్‌సభ సభ్యుల మూకుమ్మడి రాజీనామాల కోసం వైఎస్సార్ సీపీ డిమాండ్లను తిప్పికొట్టండి'.

– శుక్రవారం టీడీపీ ఎంపీలతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

టీడీపీ-బీజేపీ బంధం బాగానే ఉంది

- రాజధాని డిజైన్లు సిద్ధం కాకపోయినా రూ.2,500 కోట్లు ఇచ్చాం: పురందేశ్వరి
- గ్రామాల్లో జరిగే ప్రతి అభివృద్ధిలో కేంద్రం పాత్ర ఉంది

సాక్షి, అమరావతి: టీడీపీ – బీజేపీల మధ్య రాజకీయ బంధం ఇప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనసాగుతోందని బీజేపీ జాతీయ మహిళా మోర్చా ఇన్‌చార్జి పురందేశ్వరి పేర్కొన్నారు. కేంద్రంలో టీడీపీ మంత్రులు, రాష్ట్రంలో బీజేపీ మంత్రులు రాజీనామాలు చేయడం మినహా మిత్రపక్షాల మధ్య మరే విధమైన ఇబ్బందులూ లేవన్నారు. కేవలం మంత్రి పదవులకు మాత్రమే రాజీనామాలు చేస్తున్నామని, తాము ఇంకా ఎన్డీఏలోనే కొనసాగుతున్నామని సీఎం చంద్రబాబే స్వయంగా చెప్పారని గుర్తు చేశారు. పురందేశ్వరి పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్నీ ఇస్తున్నా ఏమీ ఇవ్వడం లేదని అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, విభజన చట్టంలోని అన్ని అంశాలను సంపూర్ణంగా అమలు చేస్తారని చెప్పారు.

ప్రతి అభివృద్ధిలోనూ కేంద్ర భాగస్వామ్యం

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధికి నిధులు ఎక్కడ నుంచి వస్తున్నాయని ఆమె ప్రశ్నించారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, మరుగుదొడ్లు, ఇళ్ల నిర్మాణానికీ కేంద్రమే నిధులిస్తోందని చెప్పారు. ఇక్కడ జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమంలోనూ కేంద్ర భాగస్వామ్యం ఉందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సహకారంపై దుష్ప్రచారం జరుగుతోందన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న ఏ ఒక్క కార్యక్రమానికైనా కేంద్రం నిధులు ఇవ్వనని చెప్పిందా? అని ప్రశ్నించారు.

'కియా'కి కేంద్ర రాయితీలు

14వ ఆర్థిక సంఘం సిఫార్సుల అనంతరం ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలకు, హోదా లేని రాష్ట్రాలకు కేంద్ర సాయం విషయంలో ఎటువంటి వ్యత్యాసం ఉండడం లేదని పురంధేశ్వరి చెప్పారు. అయినప్పటికీ ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలకు అదనంగా అందజేసే 30 శాతం నిధులను కూడా ప్రత్యేక పరిస్థితుల్లో ఏపీకి ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించిందన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమలో వెనుకబడ్డ 7 జిల్లాల్లో నెలకొల్పే పరిశ్రమలకు ప్రత్యేక పన్ను రాయితీలు ఇస్తోందని చెప్పారు. కేంద్రం పన్ను రాయితీలు కల్పించిన కారణంగానే రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. అనంతపురంలో ఏర్పాటైన 'కియా' కార్ల తయారీ సంస్థ సైతం కేంద్ర పన్ను రాయితీలను వినియోగించుకుంటోందన్నారు.

వెయ్యి కోట్లిచ్చినా డ్రైనేజీ పనులు చేయలేదు

రాజధాని అమరావతి నిర్మాణానికి ఇప్పటివరకు డిజైన్లు సిద్ధం కాకపోయినా, కనీసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక లేకున్నా కేంద్రం రూ.2,500 కోట్ల సాయం చేసిందని చెప్పారు. విజయవాడ, గుంటూరులో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి కేంద్రం రూ.1,000 కోట్లు విడుదల చేసినా పనులు జరగకుండా ఆగిపోయాయని, కావాలంటే తానే స్వయంగా వచ్చి మీడియాకు దీన్ని చూపిస్తానని తెలిపారు.

పదేళ్లైనా హైదరాబాద్ ఐఐటీ పూర్తి కాలేదు

హైదరాబాద్‌లో ఐఐటీ ఏర్పాటుకు నాలుగైదేళ్లు కష్టపడాల్సి వచ్చిందని, పదేళ్లు దాటిన తర్వాత కూడా ఇప్పటికీ అక్కడ నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు. మన రాష్ట్రంలో మాత్రం మూడున్నర ఏళ్లలోనే ఐఐటీ ఏర్పాటును పూర్తి చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనన్నారు. సమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దారా సాంబయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటకృష్ణ, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

హోదాపై పట్టువీడని ప్రతిపక్షం

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా డిమాండ్‌తో వైఎస్సార్‌సీపీ ఎంపీలు పార్లమెంట్ వేదికగా పోరాటాన్ని ఉధృతం చేశారు. శుక్రవారం ఉ. 10.30 గంటలకు పార్టీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వి.విజయసాయిరెడ్డి, వెలగపల్లి వరప్రసాదరావు, వైఎస్ అవినాష్‌రెడ్డి, పి.వి. మిథున్‌రెడ్డి పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ టీడీపీకి చెందిన కేంద్ర మంత్రులు రాజీనామాలు చేయడం ఓ డ్రామా, ప్రహసనమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయినందున రాజీనామాలు చేసినట్లు చెబుతున్న టీడీపీ ఎన్డీఏలో కొనసాగటంలో ఔచిత్యాన్ని ప్రశ్నించారు. కేంద్రంపై విశ్వాసం కోల్పోయినందున అవిశ్వాస తీర్మానం పెట్టటంతోపాటు టీడీపీ ఎంపీలంతా రాజీనామాలు చేయాలన్నారు. అన్ని పార్టీల రాష్ట్ర ఎంపీలు రాజీనామాలు చేసి కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు.

బాబు డ్రామాను ప్రజలు గుర్తించారు

కేంద్ర ప్రభుత్వం ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేవరకూ తమ పోరాటం కొనసాగుతుందని వైఎస్సార్ సీపీ ఎంపీలు స్పష్టం చేశారు. ఏపీకి హోదా కోసం నాలుగేళ్లుగా మడమ తిప్పని పోరాటం చేస్తున్నామని గుర్తు చేశారు. కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ రెండేళ్ల క్రితం చెప్పిన విషయాన్నే ఈనెల 7వ తేదీన మరోసారి చెప్పారన్నారు. రెండేళ్ల క్రితం జైట్లీకి శాలువా కప్పి సన్మానించిన చంద్రబాబు ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నుంచి తమ మంత్రులను ఉపసంహరించుకోవటాన్ని బట్టి ఆయన డ్రామాను ప్రజలు గ్రహించారని చెప్పారు.

చిత్తశుద్ధి ఉంటే అవిశ్వాసానికి మద్దతివ్వాలి: ఎంపీ వరప్రసాదరావు

ప్రత్యేక హోదా సాధనపై టీడీపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వంపై ప్రవేశపెట్టబోయే అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని వైఎస్సార్ సీపీ ఎంపీ వరప్రసాదరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ నేతలు కేంద్ర మంత్రి పదవులకు రాజీనామాలు చేస్తే సరిపోదని, ప్రజలిచ్చిన ఎంపీ పదవులను వీడేందుకు తమ మాదిరిగా సిద్ధంకావాలని సూచించారు. ఎన్డీఏలో కొనసాగడం వెనకున్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

ఉభయ సభల్లో కొనసాగిన ఆందోళన

శుక్రవారం ఉదయం 11 గంటలకు పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాగానే ఉభయ సభల్లో వైఎస్సార్ సీపీ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ హోదా కోసం నినదించారు. వివిధ పార్టీల సభ్యుల ఆందోళనలతో ఉభయ సభలు పలుసార్లు వాయిదాపడ్డాయి. కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన అశోక్ గజపతిరాజు పార్లమెంట్ ఆవరణలో టీడీపీ నిర్వహించిన ధర్నాలో, లోక్‌సభ వెల్‌లో చేపట్టిన ఆందోళనలోనూ పాలుపంచుకున్నారు. పార్టీ ఎంపీ మాగంటి బాబు వెంకటేశ్వరస్వామి ప్రతిమ, భగవద్గీత, ఖురాన్, బైబిల్ గ్రంథాలను ప్రదర్శించారు. టీడీపీ ఎంపీ శివప్రసాద్ కోయదొర వేషంతో సభకు వచ్చారు.

రైతుల ఆదాయం రెట్టింపునకు ప్రణాళికలు

- మంత్రివర్గ కమిటీ నివేదికల ఆధారంగా చర్యలు
- ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, అమరావతి: రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని కేంద్ర మంత్రి రాధా మోహన్‌సింగ్ శుక్రవారం రాజ్యసభకు తెలిపారు. వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. 2016 ఏప్రిల్‌లోనే నేషనల్ రెయిన్ ఫెడ్ ఏరియా సీఈవో అధ్యక్షతన మంత్రివర్గ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ ఇప్పటివరకు తొమ్మిది నివేదికలు ప్రభుత్వానికి ఇచ్చిందని, వీటి ఆధారంగానే చర్యలు చేపట్టినట్టు వివరించారు. వ్యవసాయోత్పత్తులకు గిరాకీతో పాటు, గిట్టుబాటు ధర లభించే వాతావరణం కల్పించేందుకు సమగ్రమైన స్టేట్ మార్కెట్ చట్టం తీసుకురానున్నట్లు తెలిపారు. సీజన్‌కు ముందే రైతులు తమ ఉత్పత్తులకు సంబంధించి కొనుగోలుదారులతో ఒప్పందం చేసుకునేలా మోడల్ కాంట్రాక్ట్ ఫార్మింగ్ చట్టానికి తుది మెరుగులు దిద్దుతున్నట్లు వివరించారు. వచ్చే మూడేళ్లలో దేశవ్యాప్తంగా 22 వేల గ్రామీణ సంతలను దశల వారీగా ఏర్పాటు చేస్తామని వివరించారు.

కరువు నివారణకు ఐఫాడ్‌తో ఏపీ ఒప్పందం

కరువు నుంచి ఉపశమనం కల్పించేందుకు ప్రత్యేక ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐక్యరాజ్యసమితికి చెందిన ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చర్ (ఐఫాడ్)తో ఒప్పంద కుదుర్చుకున్నట్లు కేంద్ర సహాయ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ శుక్రవారం రాజ్యసభలో వెల్లడించారు. ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వకంగా బదులిచ్చారు. అనంతపురం, చిత్తూరు, వైఎస్సార్, ప్రకాశం జిల్లాల్లో ఈ ప్రాజెక్ట్ అమలవుతుందన్నారు.

తుని–కొత్తవలస రైల్వే లైన్ సర్వే పూర్తి

తుని నుంచి నర్సీపట్నం, చోడవరం, మాడుగుల మీదుగా కొత్తవలస వరకు సింగిల్ లైన్ బ్రాడ్‌గేజ్ రైల్వే మార్గం నిర్మాణం కోసం సర్వే పనులు పూర్తయినట్లు రైల్వే శాఖ సహాయ మంత్రి శ్రీ రాజెన్ గొహైన్ తెలిపారు. ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా బదులిచ్చారు. ఈ రైల్వే లైన్ నిర్మాణానికి రూ. 3771.21 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసినట్టు తెలిపారు.

రాజ్యసభ అభ్యర్థులపై టీడీపీ సస్పెన్స్

- ఉత్కంఠను కొనసాగిస్తున్న సీఎం చంద్రబాబు
- ఆశావహుల్లో ఆందోళన
- 11న పొలిట్‌బ్యూరో భేటీలో ఖరారు?

సాక్షి, అమరావతి: రాజ్యసభ అభ్యర్థులపై టీడీపీలో ఇంకా అస్పష్టత కొనసాగుతోంది. సోమవారంతో నామినేషన్ల దాఖలు గడువు ముగియనున్నా ఎంపిక ఇంకా ఓ కొలిక్కి రాలేదు. ఒకవైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రెండురోజుల క్రితమే నామినేషన్ దాఖలు చేసినా టీడీపీ ఇంతవరకూ అభ్యర్థులనే ఖరారు చేయకపోవడం గమనార్హం. రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ముగ్గురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుండడంతో వారి స్థానాల్లో కొత్త వారిని ఎన్నుకునేందుకు మార్చి 23వ తేదీన ఎన్నిక నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేల సంఖ్యను బట్టి మూడింటిలో రెండు టీడీపీకి, ఒకటి వైఎస్సార్ సీపీకి దక్కే పరిస్థితి ఉంది. టీడీపీ అభ్యర్థిని ప్రకటించకపోవటంతో ఆశావహుల్లో రోజురోజుకూ టెన్షన్ పెరిగిపోతోంది. అధినేత చంద్రబాబు ఎప్పటి మాదిరిగానే నాన్చుడు ధోరణి అనుసరిస్తుండటంపై పార్టీలో ఒకింత అసహనం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం పొలిట్‌బ్యూరో సమావేశం అనంతరం టీడీపీ అభ్యర్థులను ప్రకటించే అవకాశం కనిపిస్తోంది.

భారీగా ఆశావహుల జాబితా

టీడీపీకి దక్కే రెండు స్థానాల్లో ఎస్సీ, బీసీలకు చెరొక స్థానం కేటాయించే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఎస్సీ వర్గానికి చెందిన సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత, మాజీ ఎమ్మెల్యే మసాల పద్మజ, మాజీ స్పీకర్ ప్రతిభాభారతి, వర్ల రామయ్య పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. బీసీల నుంచి ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు రేసులో ఉన్నా చంద్రబాబు ఆయనకు అవకాశం ఇస్తారో లేదో అనుమానమే. తనను రాజ్యసభకు పంపాలని యనమల చాలాకాలం నుంచి కోరుతున్న విషయం తెలిసిందే. పారిశ్రామికవేత్త బీద మస్తాన్‌రావుకు అవకాశం ఇవ్వాలని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన పార్టీ నేతలు మంగళవారం చంద్రబాబును కలిసి కోరారు. మరోవైపు తెలుగుదేశం పార్టీలోని రెడ్డి సామాజికవర్గం నేతలు ఈసారి తమకు అవకాశం ఇవ్వాలని చంద్రబాబును కోరినట్లు తెలిసింది. ఆ సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు మంత్రులతో సమావేశమైన నేతలు తమలో ఒకరికి సీటు దక్కేలా చూడాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి కంభంపాటి రామ్మోహనరావు కూడా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. తనను మరోసారి కొనసాగించాలని రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సీఎం రమేష్ గట్టిగా కోరుతున్నారు. తెలంగాణ టీడీపీ నేతలు దేవేందర్‌గౌడ్, మోత్కుపల్లి నరసింహులు, రావుల చంద్రశేఖర్‌రెడ్డిలు తమకూ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

ఓ అభ్యర్థిని సూచించిన జనసేన అధినేత?

మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంను పార్టీలో చేర్చుకుని రాజ్యసభకు పంపడానికి కొద్దిరోజుల క్రితం చంద్రబాబు గట్టి ప్రయత్నాలు చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే ఎంత ఒత్తిడి తెచ్చినా ముద్రగడ ఒప్పుకోలేదని, చంద్రబాబును నమ్మి టీడీపీలో చేరలేనని కుండబద్ధలు కొట్టడంతో ఆ ప్రయత్నాలు విరమించుకున్నట్లు సమాచారం. మరోవైపు జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ కూడా తన తరపున ఒకరిని రాజ్యసభకు ప్రతిపాదిస్తున్నట్లు టీడీపీలో ప్రచారం జరుగుతోంది. నిజ నిర్ధారణ కమిటీలో చంద్రబాబుకు అనుకూలంగా మాట్లాడుతున్న ఓ ముఖ్య నేతకు అవకాశం ఇవ్వవచ్చనే ప్రచారం జరిగింది. ఢిల్లీలో కార్పొరేట్ లాబీయింగ్ కోసం ఓ ప్రముఖ పారిశ్రామికవేత్త కంపెనీకి చెందిన వ్యక్తికి చంద్రబాబు రాజ్యసభ సభ్యత్వాన్ని ఆఫర్ చేశారనే ప్రచారం కూడా సాగింది.



18న ఏపీ సెట్ నోటిఫికేషన్ విడుదల



విలేకరులతో మాట్లాడుతున్న ఏయూ వీసీ నాగేశ్వరరావు

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): రాష్ట్ర స్థాయి అర్హత పరీక్ష (ఏపీ సెట్)కు ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఏయూ సెనేట్ మందిరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 26వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. జూలై 1న రాష్ట్రవ్యాప్తంగా 6 ప్రాంతీయ కేంద్రాల పరిధిలో పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్ష రెండు పేపర్లుగా ఉంటుందన్నారు. పూర్తి సమాచారం కోసం www.apset.in, www.andhrauniversity.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించాలి. కార్యక్రమంలో ఏపీ సెట్ మెంబర్ సెక్రటరీ ఆచార్య కె.శ్రీనివాసరావు, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీల గుర్తింపు రద్దు చేయండి

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఆ పార్టీలు విస్మరించాయి
- కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు



సాక్షి, న్యూఢిల్లీ: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఏపీ ప్రజలను మోసం చేసిన బీజేపీ, టీడీపీల గుర్తింపును రద్దు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. ఏపీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ కేవీపీ రామచంద్రరావు, గిడుగు రుద్రరాజు తదితరులు శుక్రవారం ఢిల్లీలో ఎన్నికల ప్రధాన అధికారిని కలసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఎన్నికలకు ముందు ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడంతో పాటు, విభజన చట్టంలోని అన్ని హామీలు అమలు చేస్తామని బీజేపీ హామీ ఇచ్చి, అమలులో మాత్రం విస్మరించిందన్నారు. అలాగే రాష్ట్రంలోని టీడీపీ ఎన్నికల ముందు 600 హామీలు ఇచ్చి అమలు చేయలేదన్నారు. టీడీపీ ఇచ్చిన 600 హామీలు ఎలా సాధ్యం అంటూ నాడు కేంద్రం ఎన్నికల సంఘం వివరణ కోరిన విషయాన్ని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేస్తామని టీడీపీ వివరణ కూడా ఇచ్చిందన్నారు. అయితే రైతు, డ్వాక్రా రుణమాఫీ, నిరుద్యోగులకు రూ. 2 వేల భృతిలాంటి ప్రధాన హామీలను టీడీపీ అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను దారుణంగా మోసం చేసిందన్నారు. హామీలు విస్మరించినందునా ఎన్నికల నియమావళికి అనుగుణంగా బీజేపీ, టీడీపీల గుర్తింపును రద్దు చేయాలని కాంగ్రెస్ నేతలు కోరారు.



'కాలా' శునకానికి కోట్లలో బేరం



రజనీకాంత్‌తో శునకరాజు మణి

పెరంబూరు(చెన్నై): దక్షిణ భారతీయ సినీ సూపర్‌స్టార్ రజనీకాంత్ గ్యాంగ్‌స్టర్‌గా నటించిన కాలా చిత్రంలో నటించిన ఒక శునకానికి కోట్లలో బేరాలు రావడం ఇప్పుడు కోలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. అది ఒక సాధారణ కుక్క అట. అయితే సిమోన్ అనే శునకాల శిక్షకుడు ఈ కుక్కకు చక్కగా ట్రెనింగ్ ఇచ్చి కాలా చిత్రంలో నటింపజేశారట. దీనికి మణి అని నామకరణం కూడా చేశాడట. ఈ శునకమహారాజు మన సూపర్‌స్టార్‌తో పాటు కాలా చిత్రం అంతా ఉంటుందట. చిత్రాల్లో జంతు జీవాలు నటించడం మామూలు విషయమే. షూటింగ్ పూర్తి అయిన తరువాత వాటి యజమానుల వెంట వెళ్లిపోతుంటాయి. అయితే శునకరాజు మణిపై సూపర్‌స్టార్ చేయి పడింది కదా! మరి ఆ ప్రభావం ఆ శునకంపై కచ్చితంగా ఉంటుంది. అందుకే దానికి కోట్ల రూపాయల్లో బేరం పలుకుతోంది. మలేషియాకు చెందిన రజనీకాంత్ అభిమానులు ఇప్పటికే రూ.2 కోట్లు ఆఫర్ చేశారట. అయితే మణి అనే ఆ శునకాన్ని దాని శిక్షకుడు సిమోన్ విక్రయించడానికి నిరాకరించారని సమాచారం.

మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.625 కోట్లు

వీటిల్లో కేంద్ర ప్రభుత్వ సాయం రూ.300 కోట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.625 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తంలో రూ.300 కోట్లు కేంద్ర ప్రభుత్వం నిధులివ్వగా, దీనికి మ్యాచింగ్ గ్రాంట్‌గా రూ.325 కోట్లు కలిపి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

దినకరన్ పార్టీకి కోర్టు అనుమతి

కుక్కర్ గుర్తు కేటాయింపు ● ఈసీకి ఢిల్లీ కోర్టు ఆదేశం



సాక్షి ప్రతినిధి, చెన్నై: అన్నాడీఎంకే బహిష్కృత నేత, చెన్నై ఆర్కేనగర్ ఎమ్మెల్యే టీటీవీ దినకరన్‌కు కుక్కర్ గుర్తును కేటాయించాలని, పార్టీకి పేరు ఖరారు చేయాలని ఢిల్లీ హైకోర్టు ఎన్నికల కమిషన్ (ఈసీ)ను శుక్రవారం ఆదేశిస్తూ తీర్పు చెప్పింది. అన్నాడీఎంకే అధినేత్రి జయలలిత మరణం తరువాత పార్టీ ప్రధాన కార్యదర్శిగా శశికళ ఎన్నికయ్యారు. ఆస్తుల కేసులో శశికళ జైలుకు వెళుతూ ఉపప్రధాన కార్యదర్శిగా టీటీవీ దినకరన్‌ను నియమించి పార్టీ బాధ్యతలు అప్పగించారు. అయితే ఆ తరువాత జరిగిన రాజకీయ పరిణామాలతో శశికళ, దినకరన్‌లపై బహిష్కరణ వేటు పడింది. గడిచిన ఆర్కేనగర్ ఎన్నికల్లో దినకరన్ కుక్కర్ చిహ్నం పొంది స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. తరువాత కొత్త పార్టీ సన్నాహాల్లో ఉన్నారు. తమిళనాడులో జరిగే ఎన్నికల్లో ఇకపై కుక్కర్ గుర్తును శాశ్వతంగా తమకే కేటాయించేలా ఈసీని ఆదేశించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో దినకరన్ గతంలో పిటిషన్ వేశారు. అలాగే కొత్తగా పెట్టబోయే పార్టీకి మూడు పేర్లను కోర్టులో ప్రతిపాదించి ఏదో ఒకటి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసును న్యాయమూర్తి రేఖబాలి బెంచ్ ముందుకు శుక్రవారం విచారణకు వచ్చింది. పిటిషన్‌దారుడు కోరిన కుక్కర్ గుర్తును కేటాయించాలని, దినకరన్ దరఖాస్తు చేసుకున్న అఖిలభారత అమ్మ ద్రావిడ మున్నేట్రకళగం, ఎంజీఆర్ అమ్మ మున్నేట్ర కళగం, అమ్మ ఎంజీఆర్ మున్నేట్ర కళగం.. ఈ మూడు పేర్లలో ఒకదానికి పార్టీపేరుగా నిర్ణయించాలని ఈసీని ఆదేశిస్తూ తీర్పు చెప్పారు.







సాక్షి
శనివారం, మార్చి, 10

చరిత్రాత్మక తీర్పు

వైద్య కారణాలరీత్యా సుదీర్ఘకాలం అచేతన లేదా అర్ధ చేతన స్థితిలో ఉన్నవారు సమాజంలోని ఇతరుల్లా తమకు నచ్చినట్టుగా జీవించలేరు. అటువంటివారు మరణాన్ని ప్రసాదించమని కోరడం చట్టబద్ధమవుతుందా కాదా అనే ప్రశ్నకు ఎట్టకేలకు సర్వోన్నత న్యాయస్థానం నుంచి జవాబు లభించింది. హుందాగా, గౌరవప్రదంగా జీవించడం ప్రాథమిక హక్కు అయినట్టే హుందాగా మరణించాలనుకోవడం కూడా ప్రాథమిక హక్కే అవుతుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం శుక్రవారం చరిత్రాత్మక తీర్పులో తేల్చి చెప్పింది. ఆసుపత్రుల్లో జీవచ్ఛవాల్లా బతుకీడుస్తూ నిస్సహాయ స్థితికి చేరుకున్నవారు 'పాక్షిక కారుణ్య మరణాన్ని' కోరుకునే వీలు కల్పిస్తూ... ఈ విషయంలో పార్లమెంటు ఒక చట్టం చేసేవరకూ అమల్లో ఉండేలా కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది.

ఎంతటి సంక్లిష్టమైన పరిస్థితుల్లో చిక్కుకున్నవారికైనా అర్ధాంతరంగా తనువు చాలించేందుకు అవకాశమీయడం హత్య చేయడంతో సమానమని ప్రపంచ దేశాల్లో చాలాచోట్ల భావిస్తారు. అమెరికా, బ్రిటన్, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా, బెల్జియం, కొలంబియా, లగ్జెంబర్గ్, కెనడా వంటి 27 దేశాల్లో మాత్రమే కారుణ్య మరణానికి అనుమతి ఉంది. అయితే వీటిల్లో 'క్రియాశీల కారుణ్య మరణానికి' అనుమతించేవి కొన్నయితే, 'పాక్షిక కారుణ్య మరణానికి' అనుమతించేవి మరికొన్ని. పైగా అమెరికా, ఆస్ట్రేలియా వంటిచోట్ల దేశమంతా ఒకే విధానం అమల్లో లేదు. ఆ దేశాల్లో కొన్ని రాష్ట్రాలు కారుణ్యమరణాన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించాయి. చట్ట పరిభాషలో రోగికి మోతాదుకు మించి మందులిచ్చి మరణానికి చేరువయ్యేలా చేయడం 'క్రియాశీల కారుణ్య మరణం' అవుతుంది. అలాకాక జీవస్పందన ఉండేందుకు దోహదపడే కీలకమైన మందుల్ని రోగికి ఇవ్వడం ఆపేస్తే లేదా చేయాల్సిన చికిత్సను నిలుపుచేస్తే సంభవించే మరణం 'పాక్షిక కారుణ్య మరణం' అవుతుంది. ఈ రెండూ వైద్యుల పర్యవేక్షణలో జరగాల్సినవే. రోగి లేదా అతని సన్నిహితులు సొంతంగా నిర్ణయించుకుని అమలు చేసేవి కాదు. నైతికంగా అయినా, విలువల పరంగానైనా ఈ రెండు విధానాలూ హత్య చేయడంతో సమానమని వాదించేవారు కొందరైతే... 'క్రియాశీల కారుణ్యమరణం' మాత్రం స్పష్టంగా హత్యేనని చెప్పేవారు మరికొందరు. ఇది ఒక నిండు జీవితాన్ని ముగించడానికి సంబంధించిన అంశం గనుక సహజంగానే దీన్లో సామాజిక, మతపరమైన అంశాలు కూడా ఇమిడి ఉంటాయి.

నిజానికి ఈ కారుణ్య మరణం అంశం మన దేశంలో చర్చకు రావడానికి ప్రధాన కారణం నలభై రెండేళ్లపాటు అచేతన స్థితిలో మంచానికే పరిమితమై ఉండిపోయిన అరుణా రామచంద్ర శాన్‌బాగ్ అనే యువతి. ముంబైలోని కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్(కేఈఎం) ఆసుపత్రిలో నర్స్‌గా పనిచేస్తూ ఆమె అత్యాచారానికి గురైంది. ఆ దుర్మార్గుడు అరుణ మెడకు ఇనుపగొలుసు బిగించి ఈడ్చుకుపోవడం పర్యవసానంగా మెదడుకు ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయింది. దాంతో ఆమె శాశ్వత అచేతనస్థితికి వెళ్లిపోయింది. ఆ ఆసుపత్రిలో ఆమెతో పనిచేసిన సహ సిబ్బంది, కాలక్రమంలో అక్కడ ఉద్యోగ విధుల్లో చేరినవారు ఈ నాలుగు దశాబ్దాలూ అరుణను కంటికి రెప్పలా చూసుకున్నారు. అయితే అరుణ చలనరహిత స్థితిలో ఉండటాన్ని తట్టుకోలేని ఆమె స్నేహితురాలు పింకీ విరానీ 2009లో ఆమెకు కారుణ్యమరణం ప్రసాదించాలని 2009లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అంతకు మూడేళ్ల ముందు అంటే... 2006లో జస్టిస్ ఎం. జగన్నాథరావు నేతృత్వంలోని లా కమిషన్ ఈ అంశంపై విపులంగా చర్చించింది. లా కమిషన్ నివేదికను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పరిశీలించినా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. ఇదే అంశంపై తిరిగి జస్టిస్ పీవీ రెడ్డి ఆధ్వర్యంలోని లా కమిషన్ కూడా 2012లో సిఫార్సుచేసింది. ఇందుకోసం ముసాయిదా బిల్లును సైతం రూపొందించింది. దాంతోపాటే అది దుర్వినియోగమయ్యే అవకాశం లేకపోలేదని కూడా హెచ్చరించింది. అరుణ కేసులో 2011లో సుప్రీంకోర్టు తీర్పు వెలువరిస్తూ అసాధారణ పరిస్థితుల్లో కారుణ్యమరణానికి అనుమతినీయవచ్చునంటూ పాక్షిక చట్టబద్ధత కల్పించింది. కానీ ఇది అరుణా శాన్‌బాగ్ విషయంలో వర్తించబోదని తెలిపింది. చివరకు ఆమె 2015 మేలో కన్నుమూసింది.

అయితే ఇప్పుడు సుప్రీంకోర్టు వెలువరించిన మార్గదర్శకాల ప్రకారం... రోగి మానసిక స్వస్థతతో ఉండి, తనకెదురుకాగల పరిస్థితేమిటో అవగాహన చేసుకోగల సామర్థ్యం ఉన్న సమయంలో ముమ్ముందు తాను అచేతన స్థితికి వెళ్లినపక్షంలో వైద్య చికిత్స నిలిపేయవచ్చునని సూచిస్తూ వైద్యులకు 'సజీవ వీలునామా' అందజేయాలి. చికిత్స వల్ల మరణాన్ని వాయిదా వేయడం మినహా మరే ప్రయోజనమూ ఉండదని రోగి గ్రహించినప్పుడు వైద్య చికిత్సను తిరస్కరించే హక్కు అతడికి/ఆమెకు ఉంటుందని ధర్మాసనం వ్యక్తం చేసిన అభిప్రాయం ఎన్నదగ్గది. అయితే ఇలాంటి ముందస్తు వీలునామా విధానం కొన్ని ప్రమాదాలకు దారితీసే అవకాశం కూడా లేకపోలేదు. ముఖ్యంగా తీవ్ర అనారోగ్యం బారినపడేవారికి, వృద్ధాప్యంలోకి అడుగిడినవారికి ఇది ప్రాణాంతకంగా మారుతుంది. వారిని 'త్వరగా' వదుల్చుకోవాలని, ఆస్తిపాస్తుల్ని రాబట్టుకోవాలని చూసే బంధువులు ఆ రోగికి మాయ మాటలు చెప్పి లేదా నయానో, భయానో ఒప్పించి 'సజీవ వీలునామా'కు ఒత్తిడి చేయరన్న గ్యారెంటీ ఏమీ లేదు. దురాశ, స్వార్థం, విలువల లేమి వంటివి వ్యక్తులను దేనికైనా దిగజారుస్తాయి. అలాగే తొలుత అనుమతినిచ్చిన రోగులే తదుపరి మనసు మార్చుకునే అవకాశం లేకపోలేదు. కానీ ఆ సమయానికి దాన్ని వైద్యులకు వ్యక్తపరిచే స్థితిలో వారు ఉండకపోవచ్చు. రోగిని మాత్రమే కాక... సమాజాన్నంతటినీ పరిగణనలోకి తీసుకున్నపక్షంలో తాజా విధానం అమలు ఎంత సంక్లిష్టమైనదో అర్థమవుతుంది. కనుక ఆచితూచి దీన్ని అమలు చేయడం ఉత్తమం.




"మరణించడానికి 'హక్కు' అనే భావనలో.. సులువుగా మరణించడం 'బాధ్యత'గా మారిపోయే ప్రమాదం పొంచి ఉంది."

– పీటర్ శాండర్స్
బ్రిటన్ సామాజిక పరిశోధకుడు

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి బ.అష్టమి ఉ.7.00 వరకు, తదుపరి నవమి నక్షత్రం మూల పూర్తి (24గంటలు), వర్జ్యం ప.1.25 నుంచి 3.10 వరకు, దుర్ముహూర్తం, ఉ.6.14 నుంచి 7.50 వరకు, అమృతఘడియలు రా.12.00 నుంచి 1.54 వరకు.

సూర్యోదయం : 6.19
సూర్యాస్తమయం : 6.04
రాహుకాలం: ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుంచి 3.00 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	5.16	మగ్రీబ్	6.25
జొహర్	12.26	ఇషా	7.37
అసర్	4.45		

శిలా విగ్రహాలు కూలితేనేం?



శేఖర్ గుప్తా

మనం ఒక బూటకపు సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలో కూరుకుపోయి ఉన్నాం. అదే నిజమైన ఏకైక జాతీయ సిద్ధాంతం. ఒక పార్టీ వామపక్ష కంచుకోటను బద్దలు చేసినందుకు సంబరాలు జరుపుకుంటుంది. ఒక ఉద్రిక్త క్షణంలో ఆ పార్టీ కార్యకర్తలు లెనిన్ విగ్రహాన్ని కూల్చివేశారు. వారు ద్వేషిస్తున్న నియంత ఇప్పటికీ విజయం సాధిస్తూ ఉన్నాడన్నదే వారికి తెలియని విషయం. లెనిన్ 1924లో చనిపోయాడు. ఆయన సొంత దేశం తన తాత్విక చింతనను 1990లో వదిలిపెట్టేసింది. కానీ భారత్‌లో అది మార్పు లేకుండా కొనసాగుతోంది.

జాతిహితం



భారత వామపక్షంతో నా తొలి అవగాహన క్రికెట్ ఆటలో మొదటి బాల్‌కే డకౌట్ కావడంతో సరిసమానమైనదే. 1975లో నేను జర్నలిజం విద్యార్థిగా ఉన్నప్పుడు జరిగిందిది. అప్పుడు మాతో పాటు ఒకే ఒక కామ్రేడ్, నిజానికి శాంతియుతంగా ఉండే నక్సలైట్ ఉండేవాడు. ఆయనతో పందెం వేశాను. ఈఎంఎస్ నంబూద్రిపాద్ జీవించి ఉన్నారా, లేదా అన్నదే ఆ పందెం. ఆ పందెంలో నేను పది రూపాయలు పోగొట్టుకున్నాను. విద్యార్థి వసతిగృహం అద్దె, మెస్ బిల్లు కట్టడానికి ఇంటి దగ్గర నుంచి వచ్చే 200 రూపాయల కోసం ఎదురు చూసే రోజులవి. కాబట్టి పది రూపాయలంటే పెద్ద మొత్తమే.

తరువాత చాలాకాలానికి కేరళ మీద వార్తా కథనం రాస్తున్నప్పుడు జరిగింది. వామపక్ష ప్రభుత్వం చేపట్టిన అక్షరాస్యత కార్యక్రమం గురించి ప్రత్యేక కథనం (అప్పుడు అక్కడే ఉన్న దాదా జర్నలిస్ట్ రమేశ్ మేనన్‌తో కలసి) రాసినప్పుడు సాక్షాత్తు ఈఎంఎస్‌ను కలుసుకున్నాను. నా పందెం విషయం ప్రస్తావించాను. ఆయన తన చేయి పైకి ఎత్తి, మణికట్టు దగ్గర చూపిస్తూ, 'మీరు నా నాడిని ఎందుకు పరీక్షించకూడదు' అన్నారు, నిర్వికారంగా. ఇంకా, 'మీరు చెప్పిందే నిజమైతే, మీ డబ్బు మీకు వెనక్కి రావలసిందే'అన్నారు. అంతా నవ్వుకున్నాం. జర్నలిజం విద్యార్థిగా ఉన్నప్పుడు కూడా నేను వామపక్ష రాజకీయాల గురించి తెలియకుండా ఉండిపోయానంటే అందుకు పంజాబ్ పల్లెటూళ్లలో ఉండే చిన్న చిన్న పాఠశాలల్లో, తరువాత హరియాణా వంటి చోట చదవడం కొంత కారణం. అక్కడ పెద్దగా రాజకీయ కార్యకలాపాలు ఉండేవి కావు. ఒక ఉపాధ్యాయుడు కామ్రేడ్ వంటి పదాలతో పిలిపించుకోవాలని ఆసక్తిగా ఉన్నప్పటికీ అసలు ఎలాంటి కార్మిక సంఘాలు, అందులోను వామపక్ష కార్మిక సంఘాలు లేనేలేవు. ఇక తూర్పున వచ్చిన నక్సల్ ఉద్యమం మాకు చేరేటప్పటికి పురాతనమైపోయింది.

నేను భారత వామపక్ష రాజకీయాల గురించి తెలుసుకున్నది జర్నలిస్టుగా పనిచేయడం మొదలు పెట్టిన తరువాతనే. ఆ క్రమంలో నేను వామపక్ష విమర్శకుడిగానే ఎదిగాను. ముఖ్యంగా వారి ఆర్థిక సిద్ధాంతం, రాజకీయ –సామాజిక కపటత్వాన్ని నేను ఎప్పుడూ విమర్శిస్తూనే ఉన్నాను. నియంతృత్వం నుంచి అధికారాన్ని తెచ్చుకునే ఒక సిద్ధాంతం 'ప్రజాస్వామిక' అనే పదం పక్కన ఎలా ఇముడుతుంది? అలాగే భద్రలోక్ అని పిలుచుకునే అగ్ర కులాల నుంచి వచ్చిన వ్యక్తులు(విదేశాలలో చదువుకున్నవారు, ప్రత్యేక హక్కులు ఉన్న భారతీయ వ్యవస్థల నుంచి వచ్చిన వారు) సమానత్వం గురించీ, బలహీన వర్గాల గురించీ ఏకధాటిగా ఎలా మాట్లాడతారు? ఇన్ని దశాబ్దాలలోను వామపక్ష రాజకీయాలతో నేను ఏకీభవించిన పరిస్థితి ఎక్కడా లేదు. ఈ మేధోపరమైన, తాత్వికమైన అహంకారం గురించి నేను బాధపడ్డాను కూడా. నీవు మాతో రాకపోతే పెట్టుబడుదారుల తాబేదారువి అయినట్టే. బూర్జువా అనే పదం కాలక్రమంలో వెలుగులోకి వచ్చి, తరువాత అదే నియో లిబరల్‌గా రూపాంతరం చెందింది. ఇది కాకపోతే ఇంకొకటి. 1989–1993 మధ్య పంజాబ్‌ను తుది దశ ఉగ్రవాదం కకావికలు చేసింది. సరిహద్దు జిల్లాలలో ఉగ్రవాదులు 'విముక్తం'చేశామని చెప్పిన గ్రామాల మీద తిరిగి పట్టు సాధించిన ఏకైక రాజకీయ శక్తులు, అందుకు త్యాగాలు చేసిన పార్టీలు, ఇప్పటికీ కార్యకర్తలు ఉన్న పార్టీలు కమ్యూనిస్టు పార్టీలు మాత్రమే. పోలీసులు వారికి ఆయుధాలు అందించారు. ఒక మహిళా కామ్రేడ్ ఎల్ఎమ్‌జీ (లైట్ మెషీన్ గన్)ని తన ఇంటి మీద ఏర్పాటు చేసి, నిరంతరం రక్షించుకుంటూ ఉన్న ఉదంతం గురించి మేం నివేదించాం కూడా.

ఆ ఒక్క రాష్ట్రంలో ఆ దశను మినహాయిస్తే, వామపక్షం గురించి చప్పట్లు కొట్టేందుకు ఏదీ నాకు కనిపించలేదు. 2004లో వాజ్‌పేయి ప్రభుత్వం అనూహ్యంగా ఓడిపోయిన తరువాత సీపీఐ నాయకుడు ఏబీ బర్దన్ 'భాడ్‌మే జాయే డిజిన్వెస్ట్‌మెంట్' అంటూ ఇచ్చిన ప్రకటనకు నేను మండిపడ్డాను కూడా. అణు ఒప్పందం గురించి జరిగిన ఓటింగ్‌లో డాక్టర్ మన్మోహన్ సింగ్ విజయం సాధించినప్పుడు, వామపక్షాలు ఏహ్యాభావంతో చూసే మాయవతి, బీజేపీ సహా కుల,మత శక్తులని పిలిచే వారితో చేతులు కలిపినప్పుడు కూడా నేను అభినందించాను. ఆ తరువాత అంతిమంగా మమతా బెనర్జీ వారిని పశ్చిమ బెంగాల్‌లో ఓడించినప్పుడు అభినందించాను. దాంతోనే భారత వామపక్ష రాజకీయాల కథ ముగిసిందని స్పష్టమైంది. తూర్పు, మధ్య భారతంలో ఉగ్రవాద వామపక్షం కూడా అనివార్యంగా అదే బాటలో ఉంది. కాబట్టి లెనిన్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుర్ఘటన పట్ల నేను నిరసన ప్రకటించనని మీలో చాలా మంది ఊహించవచ్చు. కానీ నేను నిరసన ప్రకటించాను. కానీ దానికి అనివార్యమైన వేరే కారణాలు ఉన్నాయి. ఈ దేశంలో ఎవరైనా తమకు నచ్చిన దేవుళ్లను ఎంచుకుని పూజించుకునే హక్కు కలిగి ఉన్నారు. ఇతరులకు చెందిన విగ్రహాలను ధ్వంసం చేసే హక్కు ఇక్కడ ఎవరికీ లేదు.

1980 దశకం చివరి అంకంలో ప్రపంచ కమ్యూనిజంలో మార్పు ఆరంభమైంది. సోవియెట్ యూనియన్ కూలిపోయే స్థితికి చేరుకుంది. ఆఫ్ఘనిస్తాన్‌తో చేసిన యుద్ధంలో ఓడిపోయింది. గోర్బచెవ్ పెరిస్త్రోయికా, గ్లాస్‌నోస్త్‌లను ప్రవేశపెట్టారు. డెంగ్ సరళీ కరణను అనుమతిస్తూ, ఎలకలని పట్టుకోగలిగినదైతే పిల్లి తెల్లగా ఉంటే ఏమి, నల్లగా ఉంటే ఏమి అంటూ చైనా ప్రజలకు హితబోధ చేశారు. 'భారత్‌లో మారని వామపక్షం' అన్న అంశం మీద పని చేయడానికి ఆ సమయంలో నేను కలకత్తాలో ఉన్నాను. అప్పుడు సరోజ్ ముఖర్జీ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి. పార్టీ ప్రధాన కార్యాలయంలో కూర్చుని ఉన్నారు. ఆయన వెనకాల లెనిన్, స్టాలిన్, మార్క్స్‌ల పెద్ద పెద్ద చిత్రాలు ఉన్నాయి. 'గోర్బచెవ్, డెంగ్ మారుతున్నారు. మీరు ఎందుకు మారడం లేదు సార్?' అని అడిగాను. 'ఎందుకంటే, నా కమ్యూనిజం డెంగ్, గోర్బచెవ్‌ల కమ్యూనిజం కంటే స్వచ్ఛమైనది' అన్నారాయన అచంచల విశ్వాసంతో.

తరువాత సరిగ్గా రెండేళ్లకి రిపబ్లిక్‌లు విడిపోయాక సోవియెట్ యూనియన్‌ను చూసేందుకు నేను మాస్కో వెళ్లాను. బుఖారెస్ట్‌లో ట్యాంకులు ఇంకా రోడ్ల మీదే ఉన్నాయి. వందలాదిమంది ప్రజలు సీసెస్క్యూను చంపిన చోటికి తండోపతండాలుగా వచ్చారు– శపించడానికి, ఉమ్మడానికి. రుమేనియా కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమావేశాలకు వెళ్లిన భారత వామపక్ష బృందం ఒకటి అంతకు కొన్ని వారాల ముందే మన దేశం చేరుకుంది. ఈ బృందంలోనే ఎవరో ది పయనీర్ పత్రికకు ఒక వ్యాసం రాశారు. సీసెస్క్యూ అరాచకాలకు సంబంధించి వస్తున్న వార్తలు, ఆయన ప్రభుత్వం పతనం కావడం గురించిన వార్తలు– ఇవన్నీ పాశ్చాత్య దేశాల దుష్ప్రచారమేనని రాశారు. అందుకు చూపించిన ఉదా॥ నియంత తన ఉపన్యాసం ముగించిన వెంటనే మొదలైన ప్రశంసల వర్షం కొన్ని గంటల దాకా ఆగలేదని పేర్కొన్నారు.

ఇది జరిగిన సరిగ్గా ఎనిమిది మాసాల తరువాత మళ్లీ నేను మాస్కో వెళ్లాను. ఇవాళ ఇక్కడ ఎలా జరిగిందో, అలాగే అక్కడ జరిగిన కమ్యూనిస్టు నేతల విగ్రహాలను ఎలా పెళ్లగించడం జరిగిందో చూసేందుకు వెళ్లాను. ఆ విగ్రహాలను కూల్చివేసినందుకు రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న కొందరు తప్ప చాలా తక్కువ మంది విచారం వ్యక్తం చేశారు. ఇది మంచి పరిణామం. ఒక సిద్ధాంతం కాలగర్భంలో కలసిపోతే, దానితో పాటు ఆ సిద్ధాంతం పునాదిగా వెల్లువిరిసిన నియంతృత్వాలు, వాటిని సాగించిన నియంతలు కూడా దాని వెంట కాలగర్భంలోకి నిష్క్రమించవలసిందే.

తన 34 సంవత్సరాల పాలనలో రాజకీయంగా వామపక్ష కూటమి బెంగాల్ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసింది. అది ప్రజాస్వామ్యం గురించి, ఉదారవాదం గురించి ప్రబోధించింది. కానీ దుండగులతో, బలవంతపు వసూళ్లు చేసేవారితో కూడిన ఒక సైన్యాన్ని తయారు చేసి పెట్టింది. ఈ సైన్యం ఏ ఒక్క ప్రతిపక్షాన్ని బతకనివ్వలేదు. కేరళకు ఒక సోషలిస్టు గుణం ఉంది. అక్కడ కాంగ్రెస్, వామపక్షం ఒకదాని తరువాత ఒకటి అధికారం పంచుకుంటాయి. మిగిలిన దేశమంతటా పంజాబ్ మొదలు మహారాష్ట్ర వరకు; బిహార్ నుంచి ఆఖరికి అస్సాం వరకు కూడా వామపక్షాలు అంతర్ధానమయ్యాయి. అయితే ఇతరుల పుణ్యమా అని 2004లో 59 స్థానాలు పొందిన వామపక్షాలకు జాతీయ స్థాయి అధికారాన్ని రుచి చూసే అవకాశం దక్కింది.

ఆ తరువాతే వారి రాజకీయ అధికారం పతనం కావడం ఆరంభమైంది. వామపక్షం అడుగంటిపోతోంది. ఆ పార్టీ పెద్దల విగ్రహాలు కూలుతున్నాయి. కానీ వాళ్ల సిద్ధాంతం ఇంకా ఏలుతుంది. అది సవాలు చేయలేనిది. నేను ప్రయాణించిన ట్యాక్సీ డ్రైవర్ చెప్పిన ప్రకారం పత్రికా విలేకరులు వార్తా కథనాల కోసం హేళన చేస్తూ ఉంటారు. వాక్లవ్ హావెల్ వెల్వెట్ రివల్యూషన్ కారణంగా ప్రేగ్ నగరంలో కమ్యూనిజం కకావికలైంది. అక్కడ మీరు ప్రయాణించే కారు డ్రైవర్ ఒక అణు ప్రయోగశాలలో ఉద్యోగం పోగొట్టుకున్న కంప్యూటర్ ఇంజనీర్ అయి ఉండవచ్చు. మేం ప్రయాణించిన కారు డ్రైవర్ అలాంటి వాడే. మా సంభాషణ అనివార్యంగా కమ్యూనిజం వైఫల్యాలు, తీవ్ర చర్యల మీదకు మళ్లింది. భారతదేశంలో సోషలిజం ఇప్పటికీ ఎందుకు అంత ప్రాచుర్యం కోల్పోకుండా ఉంది వంటి ప్రశ్న నుంచి చాలా ప్రశ్నలే అడిగాడు. అలాగే ముఖ్యమైన రాష్ట్రాలలో తరుచూ ఎందుకు ఎన్నికవుతారని కూడా అతడు ప్రశ్నించాడు. దానికి అతడే సమాధానం కూడా చెప్పాడు. మీ సోషలిజం మా సోషలిజం కంటే భిన్నమైనదని అన్నాడు. మా సోషలిస్టులు మా రాజకీయ, ఆర్థిక స్వేచ్ఛలను మా నుంచి దూరంగా తీసుకుపోయారు. కానీ మీ స్వేచ్ఛలు మీ దగ్గరే ఉన్నాయి అన్నాడు. ఎమర్జెన్సీ సమయంలో వాటిని ప్రభుత్వం లాక్కున్నా మళ్లీ మీరు సాధించుకున్నారని కూడా వ్యాఖ్యానించాడు. అతడు చెప్పింది నిజమే. అయితే మీరు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ఎన్నడూ రుచిచూడలేదు కాబట్టి సోషలిజం మిమ్మల్ని నష్టపరిచింది ఏమిటో మీరు అర్థం చేసుకోలేరు.


అతడు చెప్పింది నిజం. మనం ఇప్పుడు ఒక బూటకపు సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలో కూరుకుపోయి ఉన్నాం. అదే నిజమైన ఏకైక జాతీయ సిద్ధాంతం. ఒక పార్టీ వామపక్ష కంచుకోటను బద్దలు చేసినందుకు సంబరాలు జరుపుకుంటుంది. ఒక ఉద్రిక్త క్షణంలో ఆ పార్టీకి చెందిన కొందరు కార్యకర్తలు లెనిన్ విగ్రహాన్ని కూల్చివేశారు. వారు ద్వేషిస్తున్న నియంత ఇప్పటికీ విజయం సాధిస్తూ ఉన్నాడన్నదే వారికి తెలియని విషయం. లెనిన్ 1924లో చనిపోయాడు. ఆయన సొంత దేశం తన తాత్విక చింతనను 1990లో వదిలిపెట్టేసింది. కానీ భారత్‌లో అది ఏమాత్రం మార్పు లేకుండా కొనసాగుతోంది.

వ్యాసకర్త దప్రింట్ ఛైర్మన్, ఎడిటర్–ఇన్–చీఫ్
Twitter@ShekarGupta

విగ్రహాలు కాదు, విలువల కూల్చివేత

లెనిన్ విగ్రహాలను కూల్చినవారు, పెరియార్ విగ్రహాన్ని కూడా కూలగొట్టాలని చెప్పినవారు తాము ఆదర్శ పురుషుడిగా చెప్పే రాముణ్ని కానీ, ధర్మరాజును కానీ అనుసరించలేదు. 'విజయాంతాని వైరాణి' అనుకోలేదు. అల్పబుద్ధిని చాటుకున్న భీముణ్ని ఒరవడిగా తీసుకున్నారు.

అభిప్రాయం



భాస్కరం కల్లూరి

త్రిపురలో లెనిన్ విగ్రహాల కూల్చివేత దృశ్యాలను చూసినప్పుడు ఇద్దరు ఇతిహాస పాత్రలు మనసులో మెదిలారు. ఒకరు రాముడు, ఇంకొకరు ధర్మరాజు. రావణసంహారం జరిగిన తర్వాత, అన్న మరణానికి విభీషణుడు శోకిస్తున్నప్పుడు అతణ్ని ఓదార్చిన రాముడు, మృతుడైన రావణుని పట్ల తన వైఖరిని వివరిస్తూ, "విభీషణా! వ్యక్తులు జీవించి ఉన్నంతకాలమే వైరాలు ఉండాలి. ఆ తర్వాత వాటిని విడిచిపెట్టాలి. ఇప్పుడు మన కార్యం నెరవేరింది కనుక ఇతనికి అంత్యక్రియలు నిర్వహించు. ఇతడు నీకెంత గౌరవనీయుడో.. ఇప్పుడు నాకూ అంతే గౌరవనీయుడు" అంటాడు. ఈ సందర్భంలో రాముడు అన్న "మరణాంతాని వైరాణి" అనే మాట ఒక గొప్ప సూక్తిగా జాతి నాలుకలపై నిలిచిపోయింది. ధర్మరాజు విషయానికి వస్తే, తన గదాఘాతానికి తొడలు విరిగి దుర్యోధనుడు పడిపోయిన తర్వాత భీముడు అతణ్ని దూషిస్తూ ఎడమ కాలితో అతని శిరస్సును తంతాడు. ఆ చర్యను ధర్మరాజు, అర్జునుడు ఏవగించుకుంటూ మొహం పక్కకు తిప్పుకుంటారు. భీముడు రెండోసారి ఆ పని చేసినప్పుడు ధర్మరాజు ఊరుకోలేకపోతాడు. "ఎందుకలా తంతున్నావు? ఈ అధర్మం నీకు రోత పుట్టించడం లేదా? ఈ రాజరాజు తమ్ముళ్ళు, బంధువులు మరణించిన తర్వాత కూడా యుద్ధం చేసి పడిపోయిన గౌరవాన్ని పొందుతున్నప్పుడు నువ్వు చేసిన ఈ హీనమైన పనిని జనం మెచ్చుతారా?" అని తీవ్రంగా మందలిస్తాడు. విజయం కలిగించిన హర్షావేశాలతో ఉచితానుచితాలు పట్టించుకోని అల్పబుద్ధిగా ఈ ఘట్టంలో కవి భీముణ్ని వర్ణిస్తాడు.

లెనిన్ విగ్రహాలను కూల్చినవారు, పెరియార్ విగ్రహాన్ని కూడా కూలగొట్టాలని చెప్పినవారు తాము ఆదర్శ పురుషుడిగా చెప్పే రాముణ్ని కానీ, ధర్మరాజును కానీ అనుసరించలేదు. 'విజయాంతాని వైరాణి' అనుకోలేదు. అల్పబుద్ధిని చాటుకున్న భీముణ్ని ఒరవడిగా తీసుకున్నారు. అఫ్ఘానిస్తాన్‌లోని బామియాన్‌లో బుద్ధ విగ్రహాలను నేలమట్టం చేసిన తాలిబన్లను ఆదర్శం చేసుకున్నారు. ఈ విగ్రహ విధ్వంసం ఇంతటితో ఆగదనీ, అది తమ నేతలకు కూడా వ్యాపిస్తుందనే స్పృహ లోపించింది కనుక దీని వెనుక అల్పబుద్ధే కాక మందబుద్ధి కూడా ఉంది. పశ్చిమ బెంగాల్‌లో శ్యామాప్రసాద్ ముఖర్జీ విగ్రహంపట్ల అపచారం జరిగింది. పెరియార్, అంబేడ్కర్, మహాత్మా గాంధీల విగ్రహాలకు మసిపూశారు. ఇది ఇటీవలి కాలంలో ఎరగని ధోరణి. మూడు దశాబ్దాలకు పైగా వామపక్షాలకు త్రిపురను మించి పెద్ద కంచుకోటగా ఉన్న పశ్చిమ బెంగాల్‌ను చేజిక్కించుకున్న తర్వాత కూడా మమతాబెనర్జీ ఇలాంటి దురాగతానికి పాల్పడలేదు. అయినా సరే త్రిపురలో తమది గొప్ప భావజాల విజయంగా మోదీ చెప్పుకోవడం ఒక విడ్డూరమైతే, భిన్న భావజాలప్రతీకైన లెనిన్ విగ్రహాన్ని అనుయాయులు భౌతికంగా కూల్చివేయడం ఇంకొక వైపరీత్యం.

లెనిన్ విదేశీయుడు కనుక అతని విగ్రహాన్ని కూల్చినా తప్పులేదని సమర్థించుకున్నారు కానీ, వాస్తవానికి తాము గురిపెడుతున్నది లెనిన్ భావజాలాన్ని నమ్మే స్వదేశీయులపైనేనన్న సంగతిని గమనించుకోలేదు. భావజాలం వ్యక్తుల ఆలోచనల్లో ఉంటుంది తప్ప విగ్రహాలలో ఉండదన్న గ్రహింపు లోపించింది. తన సమకాలీన భారత దేశ పరిణామాలపై లెనిన్ ఎలాంటి సానుకూల వైఖరి తీసుకున్నాడో ఆయనకూ, ఎం. ఎన్. రాయ్‌కి మధ్య జరిగిన చర్చల ద్వారా తెలుస్తుంది. గాంధీ నాయకత్వంలో స్వాతంత్ర్య పోరాటం సాగిస్తున్న జాతీయవాద శక్తులను తిరోగమనవాదులుగా పేర్కొంటూ, వారికి



సైతం వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాన్ని నిర్మించాలని ఎం.ఎన్. రాయ్ వాదిస్తే,, లెనిన్ దానిని ఖండిస్తూ కమ్యూనిస్టులు గాంధీ సహా జాతీయవాద శక్తులను బలపరచితీరాలని స్పష్టం చేశాడు. విదేశీయుడన్న కారణంతో లెనిన్ విగ్రహాన్ని కుప్పకూల్చడంలోని సంకుచితత్వం, చారిత్రిక అజ్ఞానం మాటలకు అందనిది. లెనిన్ విగ్రహాన్ని కూల్చివేయడమంటే, భారత్‌తో ముడిపడిన ఆయన తాలూకు చారిత్రిక ఆనవాళ్లను చెరిపివేసి చరిత్రకు ద్రోహం చేయబోవడమే.

ద్రవిడ ఉద్యమ నిర్మాత, సంఘసంస్కర్త పెరియార్ రామస్వామి నాయకర్ విగ్రహాన్ని కూడా కూల్చివేయాలని తమిళనాడుకు చెందిన బీజేపీ నేత ఒకరు పిలుపు ఇవ్వడం, విగ్రహానికి మసిపూయడం వెనుక ఉన్నదీ; భిన్న ఆలోచనా పంథాలను తుడిచిపెట్టి, వ్యక్తుల మెదళ్లు వంచి దేశం ఆ చివరి నుంచి ఈ చివరివరకూ ఏకశిలా సదృశమైన భావజాలాన్ని రుద్దే వ్యూహమే. ఈ సందర్భంలో కంచిలోని శంకరాచార్యపీఠాన్ని, చిరకాలం పీఠాధిపత్యం వహించిన పరమాచార్యను గుర్తు చేసుకోవడం అవసరం. కంచి మఠానికి ఎదురుగా గోడలపై పెరియార్ నాస్తికప్రబోధాలు కనిపిస్తాయి. మఠానికి దగ్గరలోనే ఒక మసీదు కూడా ఉంది. శతాబ్దకాలానికి పైనుంచీ ఈ మూడింటి సహజీవనం అక్కడ కొనసాగుతూవచ్చింది. మఠం పక్కనే మసీదు ఉండడం పరమాచార్యకు అభ్యంతరం కాకపోగా, తెల్లవారుజామున అక్కడ జరిగే నమాజుతోనే తను మేలుకునేవాడినని ఆయన చెప్పుకున్నారు. భిన్న విశ్వాసాల శాంతియుత సహజీవనానికి అతి గొప్ప ప్రతీకలలో ఇదొకటి. ఈ సహజీవన వైవిధ్యాన్ని, చెరిపివేసి ఒకే మూసభావజాలాన్ని, మూర్తులను, చరిత్రలను ఉత్తర, దక్షిణ తేడాలు లేకుండా యావద్భారతవ్యాప్తం చేసే ఎత్తుగడలో భాగంగానే లెనిన్ విగ్రహ ధ్వంసాన్ని, పెరియార్ విగ్రహంపై దాడిని చూడవలసి ఉంటుంది.

ఈ దుశ్చర్యలను సమర్థించుకునే విఫలయత్నంలో బీజేపీ శ్రేణులూ, పరివార్ సంస్థల ప్రతినిధులూ చేసిన వితండవాదాలు, దొర్లించిన వికృత వ్యాఖ్యలు అంతే విస్తుగొలిపాయి. 'ఒక ప్రభుత్వం చేసిన దానిని ఇంకో ప్రభుత్వం రద్దు చేస్తుం'దని అంటూ త్రిపుర గవర్నర్ బాహాటంగా సమర్థించారు. మనుషులపై దాడి చేసినా, చంపినా హింస అవుతుంది తప్ప విగ్రహాలపై దాడి హింస కాబోదని ఆయన నిర్వచనం. 'లెనిన్ విగ్రహాలను కూల్చింది రష్యాలో కాదు, త్రిపురలో! మార్పు రావలసిందే'నని మరో నేత వ్యాఖ్య. ఎప్పటిలానే ప్రధాని ఆలస్యంగా గొంతు విప్పి విగ్రహాల కూల్చివేతను ఖండించినా ఈ సమర్థింపు ప్రహసనం సాగుతూనే ఉంది. అధినేత ఖండిస్తారు. అనుయాయులు తాము చేసేది చేస్తూనే ఉంటారు. అంతిమంగా కుప్పకూలుతున్నవి ఏవో విగ్రహాలో మరొకటో కావు... వేల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ దేశ సంస్కృతీ, సభ్యతా, సంప్రదాయాలు. మనం ఎంతో అపురూపంగా పెంచి పోషించుకోవలసిన ప్రజాస్వామిక విలువలు.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
ఈమెయిల్ : kalluribhaskaram9@gmail.com

కేంద్రం సత్యం

అన్ని దేశాల వాస్తుకి సరిపోయేలా 33 వేల ఎకరాల నేలని చూపిస్తే అది హాట్ కేక్ అవుతుందని బాబు కలలు కన్నారు. అదంత వీజీ కాదని తేలింది.



శ్రీరమణ

చంద్రబాబు బాగా ఇరుకున పడ్డాడని కొందరు అనుకుంటున్నారు. సమస్యే లేదు, వ్యతిరేక పరిస్థితుల్ని అనుకూలంగా మలచుకొనే సామర్థ్యం ఉంది. పొలస చేపలా వరద గోదారికి ఎదురీదగలడని ఇంకొందరంటున్నారు. పొత్తిళ్లనాటి నించి చంద్రబాబు గంపెడాశలతో మోదీ వెనకాల ఆవు వెంట దూడ వలె తిరుగుతున్న మాట నిజం. ఆఖరికి మోదీ చాటపెయ్యని చూపించి, చేపించి పాలు పిండుకున్నారని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. కొన్ని బిల్లులు ఇవ్వకపోయినా, చాలా బిల్లులకు ప్రధానికి బాబు సహకరించారని ఇంకొందరు విశ్లేషిస్తున్నారు. మోదీకి చంద్రబాబు పాలనమీద పూర్తి నమ్మకం ఉంది. ఘటనాఘటన సమర్థుడని విశ్వాసం ఉంది. అందుకే చంద్రబాబు భుజంమీద మోది చెయ్యి వేశారని చెబుతారు. అవసరమైతే ఏ భాష సభ్యులనైనా ఓ గొడుగు కిందికి చేర్చగల పనితనం చంద్రబాబుకి ఉందని పెద్దాయనకి గట్టి నమ్మకం. ఇక ఇట్నించి చూస్తే– వాజ్‌పేయి హయాంలోలాగే ఆవకాయ వాటంగా, నల్లేరుమీద బండి చందంగా నడిచి పోతుందనుకున్నారు. బాబుకి ప్రమాణ స్వీకారం దగ్గర్నించి మోదీ హయాం గతుకుల రోడ్డుగానే అనిపిస్తోంది. కుదుపులు, మలుపులు బాగానే ఇబ్బంది పెడుతున్నాయ్.

ఎన్టీఆర్ 'కేంద్రం మిథ్య' అని ప్రతిపాదిస్తే చంద్రబాబు 'కేంద్రం సత్యం' అని విభేదించారు. మనం కేంద్రంతో గొడవపడితే, కష్టాతికష్టం అది నష్టాతినష్టం అని తాను నమ్మి ఏపీతో నమ్మించారు. మనం తెలివిగా స్నేహ భావంతో ఉన్నట్టే ఉండి మనక్కావల్సిన నిధులు రాబట్టుకోవాలి. నేనేదో చేస్తున్నానని ఎన్నోసార్లు నొక్కి వక్కాణించారు.

అక్షర తూణీరం



సరిగ్గా మోదీ కూడా స్నేహ భావం విషయంలో అదే వ్యూహంతో ఉన్నారు. మిత్రపక్షం కుంపట్లో చంద్రబాబు పప్పులు ఉడకలేదు. గోలవరం తప్ప పోలవరం కదల్లేదు. ప్రపంచ ప్రసిద్ధ కాపిటల్‌లో మొదటి అక్షరం కూడా పడలేదు. ప్రధాని ప్రత్యేక విమానంలో ఉదారంగా తెచ్చిన మృత్తికలు, గంగాజలం మాత్రం ప్రజకి బాగా గుర్తుంది. 33 వేల ఎకరాల నేలని అన్ని దేశాల వాస్తుకి సరిపోయేలా చూపిస్తే అది హాట్ కేక్ అవుతుందని బాబు కలలు కన్నారు. అదంత వీజీ కాదని తేలింది. గుగ్గిళ్ల మూటని చూస్తూ పరిగెత్తిన గుర్రంలా నాలుగేళ్లు చంద్రబాబు భ్రమలో ఉన్నమాట నిజం. ఇప్పుడు మార్గాంతరం లేదు. గేరు మార్చి ప్రత్యేక హోదా జిందాబాద్! ప్యాకేజి డౌన్ డౌన్ అని అరుస్తున్నారు. మిత్రపక్షంలో ఉంటామంటూనే ఒకటిన్నర మంత్రి పదవుల్ని త్యాగం చేశారు. ప్రత్యేక హోదా ఉద్యమం చేజారి ఇంకోరి చేతుల్లోకి పోతుందేమోనని టీడీపీకి భయం. వైఎస్సార్‌సీపీ వైపు బీజేపీ మొగ్గుతుందేమోనని తెలుగుదేశంకి పీడకలలు వస్తున్నాయి. తృతీయఫ్రంట్ అనే ఓ గడి ఖాళీగా ఉంది. చంద్రబాబు ఆ గడిలోకి రాకుండా కేసీఆర్‌తో మోదీయే కర్చీఫ్ వేయించాడని ఓ వదంతి ప్రచారంలో ఉంది. ఈ గందరగోళాల్లో వేలకోట్ల బ్యాంకు స్కాంలు, ఏపీ బడ్జెట్ పక్కకి వెళ్లిపోయాయి.

ఇంతా చేసి అంతా ఒకటే. మోదీ, చంద్రబాబు, కేసీఆర్– ఎవరెవరితోనూ విభేదించరు. అనంత విశ్వంలో గ్రహాల్లా ఎవరి కక్ష్యలో వాళ్లు తిరుగుతూ ఉంటారు. అప్పుడప్పుడు మాత్రం గ్రహణాలు తెప్పించుకుంటూ ఉంటారు. తర్వాత సంప్రోక్షణలు జరుగుతాయ్.

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)


fbb
INDIA'S FASHION HUB
కిడ్స్ ఫ్యాషన్ ₹299 నుండి ప్రారంభం
లేడీస్ ఫ్యాషన్ ₹399 నుండి ప్రారంభం
ఈ ఉగాదికి, జీవితంలో నింపండి
సరిక్రొత్త ఫ్యాషన్ అభిరుచిని.
₹300 గిఫ్ట్ ఓచర్స్ ₹3000* మరియు ఆపైన ఫ్యాషన్ షాపింగ్‌తో
₹600 గిఫ్ట్ ఓచర్స్ ₹5000* మరియు ఆపైన ఫ్యాషన్ షాపింగ్‌తో
ప్రత్యేకమైన ఎఫ్‌బిబి స్టోర్: – 2వ అంతస్తు, పి.వి.పి మాల్, ఎమ్.జి. రోడ్, విజయవాడ.
ఎఫ్‌బిబి స్టోర్ బిగ్‌బజార్‌లో: – వి.వి.కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ.
/ fbbonline | కస్టమర్ హెల్ప్‌లైన్: 1800 200 2255
నిబంధనలు– గిఫ్ట్ ఓచర్స్‌ని తర్వాతి కొనుగోలులో అన్ని శ్రేణుల ఉత్పత్తులపైన వినియోగించుకోవచ్చు.
మార్చి 2 నుండి మార్చి 18, 2018 వరకు ఆఫర్ వర్తిస్తుంది.
ప్రతి పండుగ సంబరానికి
BIG BAZAAR
ఇండియాని చేస్తుంది బిజీఫుల్


A HAVELLS Brand
LLOYD
5 రెట్లు ఎక్కువ సంతోషం!
₹8000/-** విలువగల 5 సంవత్సరాలు పొడిగించబడిన వారంటీ ఉచితం
LS19B32FM-1.5 TON (2018 RANGE)
OFFER PRICE: ₹35,990/-
LS18I31AF-1.5 TON (INVERTER) (2018 RANGE)
OFFER PRICE: ₹38,990/-
LS13B31AB-1.0 TON (2018 RANGE)
OFFER PRICE: ₹26,990/-
HIDDEN LED DISPLAY | SELF-DIAGNOSIS FUNCTION | BLUE FIN CONDENSER | FUNGUS PROOF | 4 WAY SWING | OPTIONAL WI-FI | 100% COPPER | Environment Friendly R-32
HIDDEN LED DISPLAY | SELF-DIAGNOSIS FUNCTION | STRONG DEHUMIDIFIER | CLEAN AIR FILTER | 10 YEARS WARRANTY ON INVERTER COMPRESSOR | *STABILISER FREE OPERATION | 100% COPPER | Environment Friendly R-410 INVERTER
HIDDEN LED DISPLAY | SELF-DIAGNOSIS FUNCTION | STRONG DEHUMIDIFIER | CLEAN AIR FILTER | EASY NIGHT MODE | 100% COPPER | Environment Friendly R-410
Visit us at www.mylloyd.com
Follow us on /MyLloydIndia
Toll Free No.: 1800-4251-5666
ATTRACTIVE FINANCE SCHEME#
BAJAJ FINSERV | Pine Labs | CAPITAL FIRST | HDB FINANCIAL SERVICES
For Online Complaint Visit- m.lloydsvc.com
Download MyLloyd App Now
Give a missed call or SMS <APP> to 9243107811
Lloyd does not give any warranty on products purchased from any unauthorised dealer or any unauthorised online portal except www.mylloyd.com. *Terms & Condition Apply: 5 years Extended Component Warranty and Additional 5 years on Compressor in Inverter Split ACs. 5 years Extended Component Warranty including compressor in all Split & Window ACs. For detail warranty terms & conditions kindly visit www.mylloyd.com. To avail extended warranty Registration of product, installation and servicing of the ACs by Lloyd Authorised Service center during warranty period is mandatory. #Finance is the sole discretion of Financer. **Saving is calculated based on estimated comprehensive AMC cost, excluding Regular Maintenance Service given by Competitors. * Stabiliser is required if Voltage fluctuation is below 140V or above 270V. All product names, logos & brand are property of their respective owners. Images are for illustration purpose only. (*E&OE). Offer Valid till 31st March 2018.
Available at: Reliance digital | croma
VIJAYAWADA - TMC (TIRUMALA MUSIC CENTRE (P) LTD.) – 0866 6661331/6661441, TMC-PATAMATA (TIRUMALA MUSIC CENTRE (P) LTD.) - 9885125919, VIJAY DIGITAL - 0866 2499008/2499009, SRR E-CITY – 0866 2444295, SRINIVASA ELECTRONICS – 9989333999, SHANMUKHA ELECTRONICS – 9440133937, BALAJI REFRIGERATION – 9866631310, COOL CITY – 9291200561, ASHISH AIRCON – 9393475093, SREE MATHA ENTERPRISES –9848196059, ASHA COMMERCIAL CORPORATION – 9705368881, BHAVANIPURAM : SMART E-WORLD – 8977079998, VIJAY DIGITAL – 0866 2414193/2414194, SINGH NAGAR - R K ELECTRONICS - 8297199199, DISTRIBUTOR - SRI VENKATESWARA ENTERPRISES – 7799199998 & 9676376548, SMART COOL MARKETING – 9393479888, CMK AIRCON – 9849774850, MDH ENTERPRISES – 9701040103, GUDIWADA - SRINIVASA ELECTRONICS – 8341432333, G K ELECTRONICS – 9849184126, SRI BHARGAVI ELECTRONICS – 8297066060, SRUJANA ELECTRONICS – 9848146793, CHALLAPALLI - SRI SAI RAM ELECTRONICS – 9885418160, MACHILIPATNAM - VAMSHI ELECTRONICS – 9966674444, ADILAKSHMI ELECTRONICS - 9441061223, JAYAM ELECTRONICS – 9292058895, NANDIGAMA : OM BHASKAR WATCH & ELECTRONICS - 9246492255, NUZVID - DNL DIGITAL – 9491110101, CHAND COOLERS : 9949330785, JAGGIAHPETA - RAVI ENTERPRISES - 9491024901, SRI RAVI TEJA ENTERPRISES- 9848345862, SRI SAI ENTERPIRSES – 9951025040 HANUMANJUNCTION - MARUTHI ELECTRONICS & HOME NEEDS – 9948189088, MYLAVARAM - KAMADHENU ELECTRONICS-9963660299, TIRVUR – PREMNAGAR ELECTRONICS-9848450792, KAMADHENU ELECTRONICS - 9494889012, CROMA 24x7-7207-666-000. PLEASE CONTACT NEAREST DEALER FOR LLOYD PRODUCTS & FOR MORE INFORMATION – TAHER-9703332451.

కారుణ్య మరణానికి ఓకే

కోలుకోలేని పరిస్థితుల్లో చికిత్స నిలిపివేయమని రోగి కోరేందుకు సుప్రీం సమ్మతి

- రోగి ఇచ్చే మెడికల్ డైరెక్టివ్ లేదా లివింగ్ విల్ అమలుకు అంగీకారం
- ప్రశాంతంగా మరణించేలా చూడడం జీవించే హక్కులో భాగం
- సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు



న్యూఢిల్లీ

కోలుకునే అవకాశం ఏమాత్రం లేని పరిస్థితుల్లో.. మృత్యువు కోసం ఎదురుచూస్తూ, మంచంపైనే కాలం వెళ్లదీస్తున్నవారికి ఊరటనిచ్చేలా దేశ అత్యున్నత న్యాయ స్థానం శుక్రవారం కీలక తీర్పును వెలువరించింది. మరణం వాయిదా వేయడం మినహా మరే ఆశ లేనప్పుడు, శారీరక బాధను భరించలేని దయనీయ పరిస్థితిలో.. రోగి లేదా అతని తరఫున నమ్మకమైన వ్యక్తి అనుమతితో కారుణ్య మరణం ప్రసాదించవచ్చని పేర్కొంటూ పరోక్ష కారుణ్య మరణానికి(పాసివ్ యుథనేసియా) సమ్మతించింది. గౌరవప్రదమైన మరణం కూడా జీవించే హక్కులో భాగమేనని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, ఈ కారుణ్య మరణం అమలుకు సంబంధించి కొన్ని కచ్చితమైన మార్గదర్శకాలను కోర్టు పేర్కొంది. చికిత్స సాధ్యం కాదని, మరణం అనివార్యమని తెలిసినప్పుడు లేక చాన్నాళ్లుగా అచేతన స్థితిలో (కోమా) ఉన్నప్పుడు ఆ రోగి లేదా ఆ వ్యక్తి తరఫున.. కేవలం మరణాన్ని వాయిదా వేసే వైద్య చికిత్స తనకవసరం లేదని, ఆ ప్రాణాధార చికిత్సను నిలిపేయాలని కోరుతూ 'అడ్వాన్స్‌డ్ మెడికల్ డైరెక్టివ్' లేదా 'లివింగ్ విల్'ను ఇవ్వొచ్చని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం వివరించింది. కారుణ్య మరణం కోసం 'అడ్వాన్స్‌డ్ మెడికల్ డైరెక్టివ్'ని చట్టబద్ధం చేయకపోవడం.. ఆర్టికల్ 21 ప్రకారం రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ప్రశాంతంగా, గౌరవ ప్రదంగా మరణించే హక్కును పట్టించుకోకపోవడమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ అంశంపై వీలైనంత త్వరగా చట్టం చేయాలని ప్రభుత్వానికి సూచించింది. 'ఈ అంశంపై పార్లమెంటు చట్టం చేసే వరకూ కోర్టు ఆదేశాలు, మార్గదర్శకాలు అమల్లో ఉంటాయి' అని సీజేఐ మిశ్రా తెలిపారు. తనతో పాటు జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్ తరఫున ఆయన తీర్పు వెలువరించగా.. జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్‌లు వేర్వేరుగా తీర్పు వెలువరించారు. చికిత్సకు సంబంధించిన స్వయంగా నిర్ణయం తీసుకోలేని స్థితిలో ఉన్న రోగికి అన్ని విధాలా దగ్గరివారైన, రోగి మనస్సును అర్థం చేసుకోగలవారైన వ్యక్తికి రోగి కారుణ్య మరణంపై నిర్ణయం తీసుకునే అధికారం అప్పగించడాన్నే మెడికల్ పవర్ ఆఫ్ అటార్నీ లేదా లివింగ్ విల్ లేదా అడ్వాన్స్‌డ్ మెడికల్ డైరెక్టివ్ అంటారు.

త్వరగా చట్టం చేయాలి

సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా 192 పేజీల తీర్పునిస్తూ 'బతికే ఆశ లేని పరిస్థితుల్లో లేక కోలుకునే అవకాశం లేకుండా సుదీర్ఘంగా అచేతనంగా(కోమా) ఉన్నప్పుడు.. ఆ వ్యక్తి పడే బాధను తగ్గించే క్రమంలో మరణ ప్రక్రియను వేగవంతం చేయడమంటే గౌరవంగా జీవించే హక్కును కల్పించడమే.. మానవ జీవిత పవిత్రతను ఎంతో గౌరవించాల్సి ఉన్నప్పటికీ.. వారు కోలుకునే ఆశ లేనప్పుడు.. ముందస్తు అనుమతి, సొంత నిర్ణయ హక్కుకు ప్రాధాన్యమివ్వాలి' అని చెప్పారు. జస్టిస్ చంద్రచూడ్ 134 పేజీల తీర్పును వెలువరిస్తూ.. 'చావు, బతుకులు విడదీయరానివి.. మరణించడం తప్పనిసరని తెలిసిన పరిస్థితుల్లో కూడా రాజ్యాంగం ప్రసాదించిన గౌరవప్రదంగా జీవించే హక్కు కొనసాగుతుందని తెలుసుకోవడం కోర్టుకు తప్పనిసరి. గౌరవప్రద మరణం కూడా జీవించే హక్కులో భాగం. గౌరవ ప్రదమైన మరణం లేకుండా చేయడమంటే ఒక వ్యక్తికి ఉండే అర్థవంతమైన ఉనికిని లేకుండా చేయడమే. అందుకే మరణించే వరకూ ఒక వ్యక్తి గౌరవప్రదంగా జీవించేందుకు ఉన్న హక్కును రాజ్యాంగం పరిరక్షిస్తుంది' అని పేర్కొన్నారు. సీజేఐ తీర్పుతో జస్టిస్ సిక్రీ ఏకీభవిస్తూ.. ఈ అంశంపై చట్టసభలు వీలైనంత త్వరగా సమగ్ర చట్టం తీసుకురావాలని సూచించారు. జియాన్ కౌర్ కేసులో 'గౌరవప్రదంగా మరణించడం రాజ్యాంగ హక్కు' అని 1996లో సుప్రీం ధర్మాసనం చెప్పిన విషయాన్ని తన తీర్పులో జస్టిస్ భూషణ్ పునరుద్ఘాటించారు.

2011లోనే..: 2011లో అరుణా షాన్‌బాగ్ కేసు సమయంలో పరోక్ష కారుణ్య మరణాన్ని సుప్రీంకోర్టు గుర్తించింది. అనంతరం ఇలాంటి సంఘటనలో పరోక్ష కారుణ్య మరణం కోసం రోగి ఇచ్చే లివింగ్ విల్లును గుర్తించాలని కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేయగా.. సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది.

లివింగ్ విల్ అంటే..

రోగి తన ఆరోగ్య సంరక్షణకు సంబంధించి నిర్ణయాలు తీసుకోలేని స్థితిలో ఉన్నప్పుడు ఆ బాధ్యతను నమ్మకస్తుడైన మరో వ్యక్తికి కట్టబెట్టే 'మెడికల్ పవర్ ఆఫ్ అటార్నీ'నే 'లివింగ్ విల్' లేదా 'అడ్వాన్స్ మెడికల్ డైరెక్టివ్'గా పరిగణిస్తాం.

➢ రోగి స్పృహలో లేనప్పుడు, ఒక నిర్ణయం తీసుకునే తీసుకునే స్థితిలో లేనప్పుడు అతనికి ఎంతకాలం వైద్యం కొనసాగించాలో నిర్ణయించేది ఆ నమ్మకస్తుడైన వ్యక్తే

➢ సుప్రీం మార్గదర్శకాల ప్రకారం..మానసికంగా ఆరోగ్యవంతుడైన, సరిగా భావ వ్యక్తీకరణ చేసే వయోజనుడు లివింగ్ విల్ రూపొందించుకోవచ్చు. దాని ఉద్దేశం, అమలుచేశాక తలెత్తే పరిణామాలను అతను అర్థం చేసుకొని ఉండాలి.

తీర్పులో వివేకానంద, ప్లేటో, షేక్స్‌పియర్..!

తీర్పు సందర్భంగా కోర్టు తత్వవేత్తలు స్వామి వివేకానంద, చార్వాకుడు, ప్లేటో, హిపోక్రటస్, ఎపిక్యురస్‌లను ఉదాహరించింది. వీరితో పాటు విలియమ్ షేక్స్‌పియర్, అల్ఫ్రెడ్ టెన్నిసన్, ఎర్నెస్ట్ హెమ్మింగ్‌వే తదితర రచయితలు, కవులు జీవితం, మరణంపై వ్యక్తీకరించిన అభిప్రాయాల్ని తీర్పులో చేర్చారు. సీజేఐ మిశ్రా తీర్పును వెలువరిస్తూ 'శ్వాసించే మనుషులె వరూ ఇప్పటివరకూ మృత్యువును కోరుకోలేదు' అని టెన్నిసన్ వ్యాఖ్యలను ఉటంకించారు. 'ఈ ప్రపంచం ఓ రంగస్థలం. మనం కేవలం పాత్రధారులమే' అని షేక్స్‌పియర్‌మాటల్ని ఉదహరించారు. జస్టిస్ సిక్రీ తీర్పును వెలువరిస్తూ.. 'ఈ లోకంలోకి ప్రతీ ఒక్కరూ ఏడుస్తూనే వస్తారు. కానీ నవ్వుతూ చనిపోయే వాడే అందరిలోకెల్లా అత్యంత అదృష్టవంతుడు' అని ఓ హిందీ సినిమా డైలాగ్‌ను తీర్పులో చేర్చారు. 'ఓ వ్యక్తి పరిపూర్ణం కాని రాజ్యాంగంతో పాటు అనారోగ్యకరమైన అలవాట్లు కలిగిఉంటే ఆ జీవితం వల్ల ఆ వ్యక్తికి, ఇతరులకు ప్రయోజనం శూన్యం' అని ప్లేటో వ్యాఖ్యలను జస్టిస్ భూషణ్ ఉటంకించారు.

ఆ కేసుతోనే కారుణ్య మరణంపై చర్చ

అరుణ రామచంద్ర షాన్‌బాగ్.. 1973లో ముంబైలోని కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ ఆస్పత్రిలో నర్సుగా చేస్తున్న సమయంలో వార్డు బాయ్ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె మెడకు గొలుసు బిగించి గాయపర్చడంతో అరుణ మెదడుకి రక్తప్రసారం నిలిచిపోయి అచేతన స్థితికి వెళ్లిపోయింది. 42 ఏళ్ల పాటు అలా మంచానికే పరిమితమయ్యారు. ట్యూబులతో ద్వారా వైద్యులు ఆహారం అందించారు. 2009లో సామాజిక కార్యకర్త పింకీ విరాని ఆమె స్థితికి చలించి ట్యూబుల్ని తొలగించి కారుణ్య మరణం ప్రసాదించాలని సుప్రీంలో పిటిషన్ వేశారు. కోర్టు ముగ్గురు ప్రముఖ వైద్యులతో కమిటీ వేయగా.. అరుణ బ్రెయిన్ డెడ్ అవలేదని, యుథనేసియా ఈ కేసుకి వర్తించదని ఆ కమిటీ తెలిపింది. దీంతో విరానీ పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఆ తర్వాత అరుణ న్యుమోనియా సోకడంతో 2015, మే 18న మరణించారు.

యుథనేసియా రకాలు..

స్వచ్ఛంద(వాలంటరీ):
రోగి అంగీకారం, అనుమతి మేరకు అతడికి మరణాన్ని అందించడం. బెల్జియం, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్‌లో ఈ రకం యూథనేసియా చట్టబద్ధం.

స్వచ్ఛందం కాని(నాన్‌వాలంటరీ):
రోగి అనుమతి, అంగీకారం తీసుకునే పరిస్థితి లేనప్పుడు నిర్వహించే మరణ ప్రక్రియ ఇది. పసిపిల్లల విషయంలో అరుదుగా ఉపయోగిస్తుంటారు. ఏ దేశంలోనూ ఇది చట్ట సమ్మతం కాదుగానీ.. నెదర్లాండ్స్‌లో కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం అనుమతిస్తారు.

బలవంతపు(ఇన్‌వాలంటరీ):
పేరులో ఉన్నట్లే రోగికి ఇష్టం లేకపోయినా అతడిని చంపేసే ప్రక్రియను ఇన్‌వాలంటరీ యూథనేసియా అని పిలుస్తారు.

పాసివ్, యాక్టివ్:
పాసివ్ యుథనేసియాలో రోగికి అందిస్తున్న వైద్యాన్ని ఆపివేయడం ద్వారా మరణించేలా చేస్తారు. యాక్టివ్ యుథనేసియాలో వెంటనే చనిపోయేలా విషపు ఇంజెక్షన్లు ఇస్తారు.

సుప్రీం మార్గదర్శకాలు..

కారుణ్య మరణం అమలు కోసం రోగి లేదా అతని తరఫు నమ్మకమైన వ్యక్తి రాసిచ్చే అడ్వాన్స్‌డ్ మెడికల్ డైరెక్టివ్ లేదా లివింగ్ విల్ విషయంలో కోర్టు పలు మార్గదర్శకాలు నిర్దేశించింది. మెడికల్ డైరెక్టివ్ పూర్తి ఆరోగ్యంతో ఉన్న వయోధికుడు మాత్రమే రాసి ఇవ్వాలి. అనుమతి పత్రం ఉద్దేశం, అమలు అనంతర పరిణామాల పట్ల వారికి అవగాహన ఉండాలి. ఎలాంటి నిర్బంధం లేకుండా స్వచ్ఛందంగా అనుమతి పత్రాన్ని రాసివ్వాలి. ముందుగా ఎలాంటి చికిత్స తీసుకున్నప్పటికీ వ్యాధులు నయంకాని రోగి గురించి చికిత్స చేసే వైద్యుడు ఆస్పత్రి యాజమాన్యానికి తెలియచేయాలి. అనంతరం ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు, బంధువులకు చెపుతారు. దీనిపై సంబంధిత విభాగాధిపతితో పాటు జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, అంకాలజీ విభాగాల్లో నిష్ణాతులైన ముగ్గురు వైద్యులతో ఆస్పత్రి యాజమాన్యం ఓ మెడికల్ బోర్డును ఏర్పాటుచేస్తుంది. బంధువుల సమక్షంలో రోగిని ఈ బృందం పరీక్షించి వైద్య సేవల్ని నిలిపివేయాలా? వద్దా? అని నిర్ణయం తీసుకుంటుంది. ఒకవేళ రోగికి వైద్యాన్ని నిలిపివేయడానికి బోర్డు అంగీకరిస్తే.. ఈ విషయాన్ని సంబంధిత జిల్లా కలెక్టర్‌కు తెలియజేయాల్సి ఉంటుంది. ఈ విషయమై కలెక్టర్ మరో మెడికల్ బోర్డును ఏర్పాటుచేసి ఇంతకుముందు ఆస్పత్రి తీసుకున్న నిర్ణయాన్ని సమీక్షిస్తారు. ఈ కమిటీ ఆస్పత్రి నిర్ణయంపై సంతృప్తి చెందితే కలెక్టర్ రోగిని సందర్శించి పాసివ్ యూథనేసియాకు అనుమతిస్తారు. ఒకవేళ కలెక్టర్ నియమించిన బోర్డు పాసివ్ యూథనేసియాకు ఆమోదం తెలపకుంటే రోగి కుటుంబ సభ్యులు, చికిత్స అందించిన వైద్యుడు, ఆస్పత్రి యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఓ డివిజన్ బెంచ్‌ను ఏర్పాటుచేసి నిర్ణయం తీసుకుంటారు. ముందస్తు వినతి లేని సమయంలో సదరు ఆస్పత్రి యాజమాన్యం మెడికల్ బోర్డును ఏర్పాటుచేస్తుంది.

సూఫీ గాయకుడు వదాలీ కన్నుమూత




అమృత్‌సర్: ప్రముఖ పంజాబీ సూఫీ గాయకుడు, వదాలీ సోదరుల్లో ఒకరైన ఉస్తాద్ ప్యారేలాల్ వదాలీ(75) శుక్రవారం అమృత్‌సర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గుండెపోటుతో మరణించారు. ఛాతీలో నొప్పి రావడంతో ప్యారేలాల్‌ను సోమవారం ఇక్కడి ఫోర్టిస్ ఆస్పత్రిలో చేర్పించి వెంటిలేటర్‌పై వైద్యం అందించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. వదాలీ సోదరులుగా పేరుగాంచిన పురాన్‌చంద్, ప్యారేలాల్ వదాలీలు 'తూ మానే యా నా మానే' 'రంగ్రేజ్ మేరే' వంటి విజయవంతమైన పాటల్ని ఆలపించారు. సూఫీ సంగీతానికి వీరిద్దరూ చేసిన సేవలకు గుర్తుగా పలు రాష్ట్ర, జాతీయస్థాయి అవార్డులు వీరిని వరించాయి. ప్యారేలాల్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైలు టికెట్‌ను బదిలీ చేసుకోవచ్చు

న్యూఢిల్లీ: రైలు టికెట్ బుక్ చేసుకుని చివరి నిమిషంలో రద్దుచేసుకునే కష్టాలు ఇకపై ఉండబోవు. ఇకపై ఆ టికెట్‌ను రద్దుచేసుకునే అవసరం లేకుండా తెలిసిన వారికి లేదా బంధువులకు బదిలీచేయొచ్చు. అయితే ఇందుకోసం రైల్వే శాఖ అనుమతి తప్పనిసరి. ఈ సేవను వినియోగించుకోవాలంటే మీ టికెట్ కన్ఫర్మ్ అయి ఉండాలి. టికెట్ బదిలీ చేసుకునేందుకు అనుమతిచ్చే అధికారం ముఖ్యమైన స్టేషన్లలోని చీఫ్ రిజర్వేషన్ పర్యవేక్షకులకు కల్పించారు. రైలు బయల్దేరడానికి 24 గంటల ముందు లిఖిత పూర్వకంగా అనుమతి తీసుకునే టికెట్‌ను బదిలీ చేయాలి. ఇక విద్యార్థులు టికెట్‌ను బదిలీ చేయాలనుకుంటే మాత్రం వారు చదివే విద్యా సంస్థ ప్రిన్సిపల్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఒక టికెట్‌ను ఒకసారి మాత్రమే బదిలీ చేయాలి.

చెన్నైలో మృగోన్మాదం

యువతిని వెంటాడి గొంతుకోసిన కిరాతకుడు



సాక్షి ప్రతినిధి, చెన్నై: ప్రేమించడం లేదన్న కోపంతో ఓ యువతిని ప్రేమోన్మాది కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన చెన్నైలో చోటుచేసుకుంది. ఇక్కడి మధురవాయల్‌కు చెందిన అశ్వని(18) స్థానికంగా ఓ కాలేజీలో బీకాం మొదటి సంవత్సరం చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన అళగేశన్(22) అనే యువకుడితో ఆమెకు స్నేహం ఏర్పడింది. కొన్నాళ్లకు తనను తనను ప్రేమించాలని వేధించడం మొదలుపెట్టాడు. ఆమె అంగీకరించకపోవడంతో కోపంతో ఇంట్లోకి చొరబడి తాళి కట్టాడు. యువతి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అళగేశన్ జైలు పాలయ్యాడు. ఇటీవల బెయిల్‌పై బయటికొచ్చి మళ్లీ వేధించడం మొదలు పెట్టాడు. దీంతో ఆమె తల్లిదండ్రులు బంధువుల ఇంట్లో ఉంచి 10 రోజులు కాలేజీకి పంపలేదు. 8 నుంచి అశ్వనీ కళాశాలకు వస్తోందని తెల్సుకుని శుక్రవారం మధ్యాహ్నం కాలేజీ నుంచి ఇంటికి తిరిగొస్తుండగా కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడిచేశాడు. వదిలేయమని బతిమాలుతున్నా వినకుండా కత్తితో నిర్దాక్షిణ్యంగా ఆమె గొంతు కోశాడు. దీంతో అశ్వని గిలగిలా కొట్టుకుంటూ ప్రాణాలు కోల్పోయింది. పరారయ్యేందుకు యత్నించిన అళగేశన్‌ను స్థానికులు పట్టుకుని చితకబాదడంతో అతను స్పృహ కోల్పోయాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న చెన్నై కేకే నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

త్రిపుర సీఎంగా విప్లవ్ ప్రమాణం

తొలిసారి కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం



ప్రమాణ స్వీకార వేదికపై విప్లవ్‌తో మోదీ, అమిత్ షా

అగర్తలా: సుమారు పాతికేళ్ల కమ్యూనిస్టుల పాలన అనంతరం త్రిపురలో తొలిసారి బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర నూతన సీఎంగా విప్లవ్ కుమార్ దేవ్(48) శుక్రవారం ప్రమాణం చేశారు. అగర్తలాలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ తథాగతరాయ్ విప్లవ్‌తో సీఎంగా ప్రమాణంచేయించారు. ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ , కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్, బీజేపీ నాయకులు అడ్వాణీ, ఎంఎం జోషి, తాజా మాజీ సీఎం మాణిక్ సర్కార్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. విప్లవ్‌తో పాటు బీజేపీకే చెందిన జిష్ణు దేవ్ వర్మన్ ఉప ముఖ్యమంత్రిగా, మరో ఏడుగురు మంత్రులుగా ప్రమాణం చేశారు. బీజేపీ సీఎంలు రూపానీ(గుజరాత్), శివరాజ్ సింగ్ చౌహాన్(మధ్యప్రదేశ్), సర్బానంద సోనోవాల్(అసోం), రఘువర్ దాస్(జార్ఖండ్)లూ కార్యక్రమంలో పాల్గొన్నారు.

త్రిపురకు పూర్తి మద్దతు: మోదీ

త్రిపుర సమగ్రాభివృద్ధి కోసం కొత్త ప్రభుత్వానికి కేంద్రం పూర్తిగా మద్దతిస్తుందని ప్రధాని మోదీ ప్రకటించారు. విప్లవ్ ప్రమాణ స్వీకారం చేశాక మోదీ ప్రసంగించారు. ఈశాన్య రాష్ట్రాలు అభివృద్ధి చెందడానికి అవకాశాలు అపారంగా ఉన్నాయని, వాటిని వెతికిపట్టుకోవాలని పిలుపునిచ్చారు. 'త్రిపుర ప్రజల జీవితాల్లో మార్పు రావాలంటే రాష్ట్రాన్ని అభివృద్ధిలో కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలి. ప్రతి భారతీయుడు ఈశాన్య వాసులకు అండగా ఉంటాడు' అని అన్నారు.

ఆరెస్సెస్ నుంచి మరో సీఎం..

విప్లవ్ రాజకీయ ప్రస్థానం ఆరెస్సెస్‌తో మొదలైంది. గోమతి జిల్లా రాజ్‌ధార్ నగర్ గ్రామంలోని మధ్య తరగతి కుటుంబంలో 1971, నవంబర్ 25న విప్లవ్ జన్మించారు. ఆయన తండ్రి జనసంఘ్‌లో పనిచేశారు. డిగ్రీ పూర్తిచేసిన విప్లవ్ ఆరెస్సెస్‌లో చేరి సుమారు 16 ఏళ్లు సేవలందించారు.



శుక్రవారం ఢిల్లీ చేరుకున్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మాక్రన్‌కు స్వాగతం పలికి ఆలింగనం చేసుకున్న మోదీ. మాక్రన్ వెంట ఆయన భార్య బ్రిగిటె మేరీ, మంత్రులు వచ్చారు. శనివారం మోదీ, మాక్రన్‌ల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు జరుగుతాయి.

వారమంతా రగడే..!

పార్లమెంట్‌లో ఐదో రోజూ ఆందోళనలు



రాజ్యసభలో నినాదాలు చేస్తున్న విపక్ష సభ్యులు

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో శుక్రవారం ఐదో రోజూ ఆందోళనలు కొనసాగాయి. దీంతో ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించకుండానే సోమవారానికి వాయిదాపడింది. శుక్రవారం లోక్ సభ ప్రారంభం కాగానే స్పీకర్ మహాజన్ దక్షిణ కొరియా పార్లమెంటరీ ప్రతినిధుల బృందానికి స్వాగతం పలికారు. వెంటనే వివిధ పార్టీల సభ్యులు వెల్‌లోకి వెళ్లి నిరసనలకు దిగారు. పీఎన్‌బీ కుంభకోణంపై కాంగ్రెస్, టీఎంసీ.. ఏపీకి ప్రత్యేక హోదాపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీ.. రిజర్వేషన్ కోటా పెంచాలని టీఆర్ఎస్.. కావేరి బోర్డు ఏర్పాటు, పెరియార్ విగ్రహం ధ్వంసంపై ఏఐఏడీఎంకే సభ్యులు నినాదాలు, ప్లకార్డులతో ఆందోళనలు చేపట్టారు. దీంతో స్పీకర్ 50 నిమిషాలసేపు సభను వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభం అయ్యాకా నిరసనల హోరు కొనసాగటంతో స్పీకర్ సభను సోమవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇదే తీరుగా నిరసనలు సాగాయి. పీఎన్‌బీ కుంభకోణం, ఏపీకి ప్రత్యేక హోదాపై సభ్యులు వెల్‌లోకి వెళ్లి నిరసనలకు దిగారు. దీంతో స్పీకర్ వెంకయ్య సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. మళ్లీ సమావేశమైన తర్వాతా నినాదాల హోరు సాగటంతో సభ సోమవారానికి వాయిదా పడింది.

కిమ్‌తో భేటీకి ట్రంప్ సిద్ధం

మేలో చర్చలు: వైట్ హౌస్



వాషింగ్టన్: ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో భేటీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంగీకరించారు. ఈ విషయాన్ని వైట్‌హౌస్ శుక్రవారం తెలిపింది. మే నెలలో కిమ్, ట్రంప్ సమావేశమయ్యే వీలుందని తెలిపింది. వైట్ హౌస్‌ను సందర్శించిన దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందం ట్రంప్‌ను చర్చలకు ఆహ్వానిస్తూ కిమ్ పంపిన లేఖను అందజేసింది. ట్రంప్, కిమ్ సమావేశం ద్వారా యుద్ధ మేఘాలు తొలగించేందుకు అవకాశం ఉందని ప్రతినిధి బృంద అధ్యక్షుడు, దక్షిణ కొరియా జాతీయ భద్రతా సలహాదారు చుంగ్ ఈ యాంగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కిమ్, ట్రంప్ ఎప్పుడు ఎక్కడ సమావేశం అవుతారన్నది త్వరలో వెల్లడిస్తామని వైట్‌హౌస్ పేర్కొంది. కిమ్‌తో భేటీపై ట్రంప్ ట్వీట్ చేశారు. కిమ్‌తో దక్షిణ కొరియా ప్రతినిధులు, అణు క్షిపణుల నియంత్రణకు జరుపుతున్న చర్చలు కొనసాగుతున్నాయని ట్రంప్ ఆ ట్వీట్లో పేర్కొన్నారు. ఉ.కొరియా ఇటీవల క్షిపణి పరీక్షలకు దూరంగా ఉండటాన్ని ఆయన స్వాగతించారు. సమావేశానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

మోదీకి అధికారం దక్కనివ్వం!

ఇందుకోసం విపక్షాలన్నీ ఏకమవుతాం

- దేశ ప్రజల్లో భయం, ఆందోళన నెలకొన్నాయి
- చరిత్రను తిరగరాసే ప్రయత్నం.. ప్రశ్నిస్తే అణచివేతలా?
- ఇండియాటుడే సదస్సులో సోనియా గాంధీ



ఇండియాటుడే సదస్సులో సోనియాగాంధీ

ముంబై: ప్రధాని మోదీ ప్రభుత్వంలో దేశ పౌరుల్లో భయం, ఆందోళన పెరిగిపోయాయని యూపీఏ చైర్‌పర్సన్, కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియాగాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. మోదీ ప్రభుత్వం దేశాన్ని తిరోగమనంలోకి తీసుకెళ్తోందన్నారు. కాంగ్రెస్, మిత్ర పక్షాలన్నీ కలిసికట్టుగా పోరాడి 2019 ఎన్నికల్లో మోదీకి అధికారం దక్కకుండా అడ్డుకుంటామని ఆమె ఉద్ఘాటించారు. ముంబైలో ఇండియాటుడే సదస్సులో పాల్గొన్న సోనియా.. మోదీ సర్కారుపై నిప్పులు చెరిగారు. ప్రజాస్వామ్యం అంటే ఒక్కరే మాట్లాడటం కాదని.. వ్యవస్థలో భిన్నాభిప్రాయాలు, చర్చ ఉండాలని పరోక్షంగా మోదీనుద్దేశించి వ్యాఖ్యానించారు. మూడున్నరేళ్లుగా దేశ ప్రజల స్వాతంత్ర్యం పద్ధతిప్రకారం ప్రమాదంలో పడుతోందని.. భారతీయ మౌళిక సిద్ధాంతాలను పునర్నిర్వచించే ప్రయత్నం జరుగుతోందన్నారు. మూడున్నరేళ్లుగా దేశ చరిత్రను తిరగరాసేందుకు, వాస్తవాలను అబద్ధాలుగా చెప్పే ప్రయత్నం జరుగుతోందని సోనియా విమర్శించారు. మే, 2014 ముందు దేశంలో భారీగా అవినీతి జరుగుతోందని దుష్ప్రచారం చేశారని.. మరి బీజేపీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి దిశగా వెళ్తోందా? అని ఆమె ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో రాయ్‌బరేలీలో పోటీ చేయటంపై పార్టీదే తుదినిర్ణయమన్నారు. ఈ సదస్సులో దేశంలో ప్రజాస్వామ్యం పాత్ర, ప్రభుత్వం నడుస్తున్న తీరు, దేశవ్యాప్తంగా పరిస్థితులు, ఆమె కుటుంబం, బయటకు తక్కువగా రావటం వంటి విస్తృతాంశాలపై తొలిసారిగా ఆమె మనసు విప్పి మాట్లాడారు.

టార్గెట్ ప్రధాని మోదీ

బీజేపీ ప్రభుత్వంలో అందరినీ కలుపుకుపోయే స్ఫూర్తి లేదని సోనియా విమర్శించారు. దీని కారణంగానే వారం రోజులుగా పార్లమెంటు సమావేశాలు రసాభాసగా మారుతున్నాయన్నారు. దేశంలో దళితులు, మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని అయినా వీటిని నియంత్రించటంలో ప్రభుత్వం విఫలమైందని సోనియా విమర్శించారు. దేశ రాజ్యాంగాన్ని మార్చేందుకు, దేశ ప్రతిష్టను మసకబార్చేందుకు పదేపదే ప్రయత్నాలు జరుగుతున్నాయని తీవ్ర ఆరోపణలు చేశారు. '2014కు ముందు దేశం తీవ్రమైన ప్రమాదంలో ఉందా? నాలుగేళ్లలోనే దేశం అభివృద్ధివైపు పరిగెడుతోందా? ప్రజల మేధస్సును అవమానించే ప్రయత్నం కాదా ఇది?' అని ఆమె ప్రశ్నించారు. 'జాతి నిర్మాతలను దూషిస్తున్నారు. స్వాతంత్ర్యం అనంతరం కాంగ్రెస్ పార్టీ, ప్రధానులు సాధించిన విజయాలను రంధ్రాన్వేషణతో తక్కువచేసి చూపించేందుకు ప్రయత్నిస్తున్నారు' అని అన్నారు.

వాజ్‌పేయితో మోదీని పోల్చలేం: '2014 ఎన్నికల్లో మేం నరేంద్ర మోదీ ప్రచారంతో పోటీపడలేకపోయాం. అందుకే ఓటమిపాలయ్యాం. కానీ 2019లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేను మేం గెలవనివ్వం' అని ఆమె వెల్లడించారు. 'మోదీకి నేను సలహాలిచ్చే ధైర్యం చేయను. మోదీ వ్యక్తిగతంగా నాకు తెలియదు. వాజ్‌పేయితో మోదీని పోల్చలేం. వాజ్‌పేయి పార్లమెంటరీ విధానాలను గౌరవించారు. అప్పుడు కూడా మేం రాజకీయ ప్రత్యర్థులమే. చాలా అంశాల్లో భిన్నాభిప్రాయాలుండేవి. కానీ.. సభ సజావుగా సాగింది' అని సోనియా పేర్కొన్నారు.

ప్రమాదంలో దేశం: 'అధికార పార్టీనుంచి రెచ్చగొట్టే ప్రకటనలు రావటం ఓ వ్యూహాత్మక విధానంలో భాగం. ఇది రాబోయే ప్రమాదానికి సంకేతం' అని అన్నారు. 'ప్రభుత్వ నిర్ణయంతో విభేదించేందుకు, నచ్చింది తినేందుకు స్వేచ్ఛ లేదు. ఓవైపు నిరుద్యోగులు ఉపాధికోసం అలమటిస్తుంటే.. 2017లో ఏడున్నర లక్షల ఉద్యోగాలు సృష్టించామని ప్రకటించటంలో వాస్తవముందా?' అని ఆమె ప్రశ్నించారు.

ప్రశ్నించే గొంతుకల అణచివేత: ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తే వారిని అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని సోనియా విమర్శించారు. 'దేశాన్ని బలమైన శక్తిగా నిలిపిన సిద్ధాంతాలు, విధానాలు యథేచ్ఛగా ఉల్లంఘనకు గురవుతున్నాయి. పార్లమెంటులో మెజారిటీని.. చర్చ జరగకుండా అణచివేయటం, చట్టాలను బలవంతంగా అమలుచేసేందుకు ఇచ్చిన లైసెన్స్‌గా భావిస్తున్నారు. విచారణ సంస్థలను దుర్వినియోగం చేస్తూ రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుంటున్నారు' అని సోనియా ఆరోపించారు.

మన్మోహన్ నాకన్నా సమర్థుడు: 2004 ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధాని మంత్రిగా ఎవరిని నియమించాలనే ప్రశ్న ఎదురైనపుడు.. మన్మోహన్ సింగ్ కన్నా సమర్థుడైన వ్యక్తి తనకు కనిపించలేదన్నారు. 'నా పరిమితులు నాకు తెలుసు. నాకన్నా మన్మోహన్ సింగ్ సమర్థుడైన ప్రధాని అని తెలుసు' అని స్పష్టం చేశారు. 'బహిరంగ వేదికలపై సహజంగా మాట్లాడటం నాకు రాదు. అందుకే నన్ను ఓ లీడర్ కన్నా రీడర్‌గానే చూస్తారు' అని తెలిపారు.

రాజకీయ పార్టీలపై..: భావసారూప్యత ఉన్న పార్టీలు దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక సమస్యలను పరిష్కరించుకోవాలి. 'కాంగ్రెస్ పార్టీ భావసారూప్యత ఉన్న పార్టీల నేతలతో తరచూ సమావేశమవుతోంది. పార్లమెంటులోనూ ఈ పార్టీలతో చక్కటి సమన్వయం ఉంది. అయితే జాతీయస్థాయిలో అందరినీ కలుపుకుని పోవటం అంత సులువేం కాదు. అయినా.. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముందుకెళ్తాం' అని అన్నారు.

ఏం చేయాలో రాహుల్‌కు తెలుసు

'రాహుల్‌కు తన బాధ్యతలేంటో బాగా తెలుసు. అవసరమైతే నేనున్నా. అంతేగానీ.. అతని ప్రయత్నాల్లో జోక్యం చేసుకోను. యువ రక్తంతో సీనియర్ల అనుభవాన్ని జోడించాలని రాహుల్ ఆలోచిస్తున్నారు' అన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ పీఠంపై గాంధీ కుటుంబానికి చెందిన వ్యక్తి కాకుండా బయటివారు ఉండేందుకు అవకాశముందని సోనియా పేర్కొన్నారు. 'ప్రియాంక రాయ్‌బరేలీ, అమేథీలకు పరిమితమైంది. రాజకీయాల్లోకి రావటం ఆమె వ్యక్తిగత నిర్ణయం' అని ఆమె చెప్పారు. 'నా గురించి ఆలోచించుకునేందుకు కొంత సమయం దొరికింది. నా భర్త (రాజీవ్), అత్త (ఇందిర)లకు సంబంధించిన పాత లేఖలను సేకరిస్తున్నాను. వాటిని డిజిటలైజ్ చేయిస్తాను' అని సోనియా పేర్కొన్నారు.

అశోక్, సుజనా రాజీనామాలకు ఆమోదముద్ర

సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: కేంద్ర మంత్రి పదవులకు టీడీపీ ఎంపీలు అశోక్ గజపతిరాజు, వైఎస్ చౌదరి(సుజనా చౌదరి) చేసిన రాజీనామాలను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదించారు. ప్రధాన మంత్రి సలహా మేరకు ఆర్టికల్ 75, క్లాజ్ 2 ప్రకారం వారి రాజీనామాలను రాష్ట్రపతి ఆమోదించారని రాష్ట్రపతి భవన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. కాగా, అశోక్ గజపతిరాజు రాజీనామాతో ఖాళీ అయిన పౌర విమానయాన శాఖ ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ వద్దే ఉంది. మరోవైపు రాష్ట్ర ప్రయోజనాల కోసమంటూ టీడీపీ ఎంపీలు కేంద్ర మంత్రిత్వ పదవులకు చేసిన రాజీనామాలపై దేశ రాజధానిలోని రాజకీయ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. రాష్ట్రంలో క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న టీడీపీని రక్షించేందుకు మాత్రమే వారు మంత్రి పదవులకు రాజీనామాలు చేశారని పలువురు రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అంతేగానీ ఎన్డీఏకు విడాకులు ఇవ్వలేదని గుర్తు చేస్తున్నారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో.. దాన్నుంచి బయటపడేందుకు వాళ్లు బీజేపీపైకి ఆ వ్యతిరేకతను మళ్లిస్తున్నారని పేర్కొన్నారు. కాగా, కేంద్ర మంత్రి ఒకరు మాట్లాడుతూ, ఏపీకి అవసరమైన నిధులు ఇస్తున్నా కూడా.. టీడీపీ ప్రభుత్వం ఆ వివరాలు బయటపెట్టేందుకు నిరాకరిస్తోందని మండిపడ్డారు.

రేపు బీజేపీ కోర్ కమిటీ సమావేశం

సాక్షి, అమరావతి: బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం ఆదివారం విజయవాడలో జరగనుంది. కేంద్ర మంత్రి పదవులకు టీడీపీ నేతలు, రాష్ట్ర మంత్రి పదవులకు బీజేపీ నేతలు రాజీనామాలు చేసిన తర్వాత రాష్ట్రంలో చోటు చేసుకున్న తాజా రాజకీయ పరిణామాలపై సమావేశంలో చర్చించనున్నారు. బీజేపీ కేంద్ర పరిశీలకుడు సతీష్‌జీతో పాటు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు హరిబాబు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్రానికి చెందిన ఇద్దరు పార్టీ ప్రధాన కార్యదర్శులు సమావేశంలో పాల్గొంటారు. మంత్రుల రాజీనామాల తర్వాత టీడీపీతో పార్టీ అనుసరించాల్సిన వైఖరి, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించి కొన్ని నిర్ణయాలు తీసుకోనున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు.

అవిశ్వాసానికి మద్దతివ్వండి: రామకృష్ణ

ఎన్డీయే నుంచి టీడీపీ బయటకి రావాలని డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానానికి టీడీపీ మద్దతు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. వామపక్షాలు, ప్రత్యేక హోదా సాధన సమితి, పలు జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని ఏపీ భవన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. కేంద్ర కేబినెట్ నుంచి బయటకు వచ్చినట్లే ఎన్డీయే కూటమి నుంచి కూడా టీడీపీ బయటకొచ్చి హోదా సాధన కోసం పోరాడాలన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచేలా రాష్ట్రంలో జరుగుతున్న పోరాటాల్లో ప్రభుత్వం కలసిరావాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉత్తర భారత ప్రభుత్వంగా వ్యవహరిస్తూ ఏపీని విస్మరిస్తోందని చలసాని శ్రీనివాస్ విమర్శించారు.

బీజేపీతో కలసి ఎన్నికలకు పోతే ఇబ్బందే: టీజీ

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీతో కలసి మళ్లీ ఎన్నికలకు పోతే తమకు ఇబ్బందులు తప్పవని టీడీపీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. ఇచ్చిన హామీలను విస్మరించిన బీజేపీ వల్ల టీడీపీ నష్టపోతుందన్నారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. తమ పార్టీ ఎంపీలు కేంద్ర మంత్రి పదవులకు రాజీనామానాలు చేశారని, ఇక ఉభయసభలను స్తంభింపజేస్తామన్నారు. అప్పటికి కేంద్రం దిగిరాకపోతే ఎన్డీయే కూటమి నుంచి వైదొలిగి రాజకీయ యుద్ధం ప్రకటిస్తామని ఆయన చెప్పారు. పార్లమెంటులో బీజేపీకి పూర్తిస్థాయి మెజారిటీ లేకపోయి ఉంటే ఈపాటికి మేమే అవిశ్వాసం పెట్టేవారిమని టీజీ అన్నారు.

ఆర్య వైశ్యులపై చంద్రబాబు చిన్నచూపు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్

సాక్షి, అమరావతి: ఆర్యవైశ్యుల పట్ల సీఎం చంద్రబాబుకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని మరోసారి రుజువైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. తాజా బడ్జెట్‌లో రూ.30 కోట్లు మాత్రమే ఆర్యవైశ్యులకు కేటాయించి, దారుణంగా అవమానించారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో చంద్రబాబుకు ఆర్యవైశ్యులు తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే రూ.వెయ్యి కోట్లతో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చిన తమ అధినేత వైఎస్ జగన్‌కి తాము అండగా ఉంటామన్నారు.

టెట్ ప్రాథమిక కీపై 19 వేల అభ్యంతరాలు

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రాథమిక కీపై 19,314 అభ్యంతరాలు వచ్చాయి. పేపర్–1కి సంబంధించి 12,070, పేపర్–2కు సంబంధించి 5,018, పేపర్–3కి సంబంధించి 2,226 అభ్యంతరాలు వచ్చాయి. ఈనెల 16న ఫైనల్ కీ విడుదల కానుంది.

'పది' విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఏపీఎస్‌ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనుంది. ఉచిత, రాయితీ బస్ పాస్ ఉన్న విద్యార్థులు పరీక్ష హాల్ టికెట్ చూపితే వారి నివాస ప్రాంతం నుంచి పరీక్ష కేంద్రానికి వెళ్లి, మళ్లీ తిరిగి వచ్చేందుకు ఉచితంగా ప్రయాణించవచ్చని ఆర్టీసీ కార్యదర్శి అన్సారీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఈ నెల 15 నుంచి 28 వరకు వినియోగించుకోవచ్చని తెలిపారు.

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

ఏడుగురి దుర్మరణం.. ఎడ్లబండిని ఢీకొన్న లారీ

సాక్షి, బళ్లారి: కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పొలం పనులకు వెళ్లి వస్తున్న అన్నదాతల కుటుంబాలను మృత్యువు చిదిమేసింది. ఎడ్లబండిని లారీ ఢీకొని ఏడుగురు దుర్మరణం చెందిన ఘటన బాగల్‌కోటె జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది. బాగల్‌కోటే జిల్లా హూనగుంద తాలూకా రక్కసగి గ్రామానికి చెందిన 9 మంది శుక్రవారం ఉదయం పొలం పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా రక్కసగి సమీపంలో వీరి ఎడ్లబండిని లారీ ఢీకొంది. ప్రమాద తీవ్రతకు బండి తునాతునకలై అందులో ప్రయాణిస్తున్న చెన్నయ్య హీరేమఠ్(48), లక్ష్మిబాయి హీరేమఠ్(47), కాశీబాయ్ హీరేమఠ్(22), విజయలక్ష్మి హీరేమఠ్(20), బసమ్మ గొరవర్(60), సిద్ధవ్వ హుగార్(60), గంగవ్వ హుగార్(38)లు అక్కడికక్కడే మృతి చెందారు.

సాయం చేయకపోగా ఎదురు దాడి

- కేంద్రంపై సీఎం చంద్రబాబు విమర్శలు
- ఏపీకి అన్యాయంపై మూడ్రోజులు అడిగినా స్పందన లేదు
- రాజధానికి కేంద్ర సాయంతో పోలిస్తే రైతులిచ్చిన భూములే విలువైనవి
- హెచ్‌వోడీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం వ్యాఖ్యలు



సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న సీఎం

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి న్యాయం చేయాల్సిన కేంద్రం సాయం చేయకపోగా ఎదురుదాడికి దిగుతోందని, అందుకనే ప్రభుత్వం నుంచి వైదొలిగామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం సచివాలయం నుంచి విభాగాధిపతులు, ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ నేతలు వెంకయ్యానాయుడు, అరుణ్‌జైట్లీ ఏపీకి అన్యాయం జరుగుతోందని గట్టిగా నిలదీస్తే ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక ఇవ్వలేమంటున్నారని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో ఎక్కడా ఏపీ పేరు ప్రస్తావించలేదన్నారు. మూడు రోజులుగా రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అడుగుతూ వచ్చానని, బడ్జెట్ ప్రసంగంలో గవర్నర్ ఈ అంశాన్ని ప్రస్తావించినా కేంద్రం నుంచి సానుకూల స్పందన లేదన్నారు. నిధుల వినియోగ పత్రాలు ఎప్పటికప్పుడు పంపిస్తూనే ఉన్నా ఇవ్వట్లేదని కేంద్రం చెబుతోందన్నారు. రాజధానికి కేంద్రం ఇచ్చింది కేవలం రెండున్నర వేల కోట్ల రూపాయలేనన్నారు. అమరావతికి కేంద్రం కన్నా రాజధాని రైతులే 40 వేల కోట్ల రూపాయల విలువైన భూములు ఇచ్చారని వ్యాఖ్యానించారు. ప్రజాసాధికార సర్వే, భూదార్, ఇ–ప్రగతి, రియల్ టైమ్ గవర్నెన్స్, సమగ్ర ఆర్థిక విధానం తేవటంతో అనూహ్య ఫలితాలు కనిపిస్తున్నాయని సీఎం చెప్పారు.

1 నుంచి 'ఈ – ఆఫీస్ తప్పనిసరి'

అటవీ శాఖ 2,150 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అదనంగా పచ్చదనాన్ని పెంచి దేశంలోనే రాష్ట్రాన్ని ముందు వరుసలో నిలిపిందన్నారు. దేశంలోని అత్యుత్తమ పంచాయతీలలో మనవే ఎక్కువ ఉన్నాయన్నారు. వ్యవసాయంలో రెండు అంకెల వృద్ధి రేటు సాధించినా సేవలు, పరిశ్రమల రంగంలో వెనుకబడి ఉన్నట్లు చెప్పారు. మూడు సంవత్సరాల 9 నెలల్లో తలసరి ఆదాయం రూ.50 వేలు పెంచగలిగామన్నారు. విభజన సమయం కన్నా ప్రస్తుతం మెరుగైన స్థితిలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగలిగామన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రతి శాఖలో 'ఈ–ఆఫీస్' విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. మార్చి 29 నుంచి సీఎఫ్‌ఎంఎస్ గో–లైవ్ విధానాన్ని ప్రారంభిస్తున్నామని ఆర్థిక శాఖ కార్యదర్శి రవిచంద్ర తెలిపారు. ప్రతి శాఖలో మేకర్, చెకర్, అప్రూవర్‌లను ఏర్పాటు చేయకుంటే ఏప్రిల్ నుంచి బిల్లుల చెల్లింపు నిలిచిపోతుందని తెలిపారు. ఈ విధానం వల్ల ఖర్చు, ఆదాయం వివరాలు కచ్చితంగా తెలుస్తాయని చెప్పారు. దీనిపై పేటెంట్ హక్కులకు దరఖాస్తు చేసుకుంటే ఆదాయాన్ని ఆర్జించే వీలుంటుందని చెప్పారు. కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలంలో భూధార్ పైలట్ ప్రాజెక్టు పూర్తయిందని, మిగతా చోట్ల ఈ నెలలోనే ప్రారంభిస్తామన్నారు.

బీజేపీపై ఇక పోస్టర్ల యుద్ధం

హోదాను హక్కుగా భావిస్తున్నారు: సీఎం

సాక్షి, అమరావతి: ప్రత్యేక హోదాను ప్రజలు హక్కుగా భావిస్తున్నారని, అందుకే కేంద్ర మంత్రి పదవులకు రాజీనామాలు చేసినట్లు చెప్పాలని టీడీపీ ఎంపీలతో శుక్రవారం తన నివాసం నుంచి నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు పేర్కొన్నట్లు తెలిసింది. ప్రత్యేక హోదా ఇవ్వడానికి కేంద్రం ఆలస్యం చేసేకొద్దీ ప్రజల్లో సెంటిమెంట్ పెరుగుతోందన్నారు. పార్లమెంట్‌కు రెండు రోజులు సెలవులు ఉన్నందున ఎంపీలు నియోజకవర్గాల్లో పర్యటించి ప్రజలను కలుసుకోవాలని సూచించారు. రాష్ట్రానికి బీజేపీ ఏమీ చేయలేదని, అవమానించిందనేలా పోస్టర్లు వేయాలని సీఎం చెప్పినట్లు తెలిసింది. రాష్ట్రం ఏం అడిగింది? కేంద్రం ఏం ఇచ్చింది? ఎలా మోసం చేసిందనే అంశాలతో కూడిన కరపత్రాలను రూపొందిస్తున్నామని, వీటిని గ్రామాల్లో అందరికీ పంపిణీ చేయాలని ఆదేశించారు. రాజీనామాలపై జాతీయ స్థాయిలో వివిధ పార్టీల స్పందన గురించి ఎంపీలను సీఎం ఆరా తీసినట్లు సమాచారం. సచివాలయంలో పార్టీ నేతలతో నిర్వహించిన టీడీపీ వ్యూహ కమిటీ సమావేశంలోనూ ఇవే అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం.

మాయమాటలతో నాలుగేళ్లుగా వంచిస్తున్నారు

చంద్రబాబుపై జర్నలిస్టుల ఆగ్రహం

కర్నూలు (గాయత్రీ ఎస్టేట్)/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): మాయమాటలతో నాలుగేళ్లుగా వంచిస్తున్నారని సీఎం చంద్రబాబుపై జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. శుక్రవారం టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్లను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. టీడీపీ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమానికి నిధులు కేటాయించకపోవడం, సీఎం హామీ ఇచ్చిన మూడు పడకల గృహ నిర్మాణాల గురించి ఎలాంటి ప్రస్తావన లేకపోవటంపై వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నేతలు అంబన్న, సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ... సీఎంకు చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జర్నలిస్టుల సంఘాలన్నీ ఏకమై ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించకుండా ప్రభుత్వం జర్నలిస్టులను మరోమారు మోసం చేసిందని ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ కృష్ణా అర్బన్ యూనిట్, ప్రెస్ క్లబ్ సంయుక్త కార్యవర్గం విజయవాడలో నిర్వహించిన సమావేశంలో మండిపడింది.

గంజాయి ధ్వంసానికి అనుమతివ్వండి

కేంద్ర నార్కోటిక్ విభాగానికి రాష్ట్ర సర్కారు లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో నిల్వ ఉన్న గంజాయి ధ్వంసానికి అనుమతివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర నార్కోటిక్ విభాగానికి లేఖ రాసింది. మార్చిలోగా గంజాయి మొత్తం ధ్వంసం చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. గడిచిన నాలుగేళ్లుగా రైళ్ల ద్వారా, రోడ్డు మార్గంలో రవాణా చేస్తున్న 1.57 టన్నుల గంజాయిని ఎక్సైజ్, పోలీసులు సీజ్ చేశారు. సీజ్ చేసిన గంజాయిని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో భద్రపరుస్తారు. ఈ భద్రపరిచే ప్రాంతాన్ని కాంట్రాబెన్ అంటారు. కాంట్రాబెన్‌ను ఎక్సైజ్ ఉన్నతాధికారులు తనిఖీ చేసి రిజిస్టర్‌లో పొందుపరచాలి. ఏవైనా తేడా ఉంటే సంబంధిత స్టేషన్ ఇన్‌చార్జ్‌పై చర్యలు తీసుకుంటారు. అయితే రాష్ట్రంలో సీజ్ చేసిన గంజాయిని స్మగ్లర్లతో కలిసి ఎక్సైజ్ అధికారులు విక్రయించారని విశాఖ, విజయనగరం జిల్లాల్లో పలువురిపై ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఒక ఎకరాలో గంజాయి సాగు చేస్తే టన్ను పంట చేతికి అందుతుంది. అంటే వెయ్యి కేజీల గంజాయి వస్తుంది. మార్కెట్లో కేజీ గంజాయి విలువ రూ.10 వేల వరకు ఉంటుందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

కేటాయింపు బారెడు.. వ్యయం మూరెడు

సాక్షి, అమరావతి: పేదలు, రైతులు, పారిశ్రామిక రంగాలకు చెందిన ఆస్తుల కల్పన వ్యయంలో భారీగా కోతలు పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. మరోవైపు కమీషన్లు దండుకునే సాగునీటి రంగ వ్యయాన్ని మాత్రం భారీగా పెంచేసింది. అంతే కాకుండా గ్రామీణాభివృద్ధి, సంక్షేమం, యువత, వైద్య రంగాల కేటాయింపుల్లోనూ కోతలు విధించింది. 2017–18 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ కేటాయింపులు, సవరించిన అంచనాల్లో ఈ విషయం వెల్లడైంది. బడ్జెట్ కేటాయింపులకు, వాస్తవ వ్యయానికి పొంతన లేని విషయం దీంతో స్పష్టమైంది. ప్రధానంగా క్యాపిటల్ వ్యయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమానికి సంబంధించి కేటాయింపులను సవరించిన అంచనాల్లో భారీగా తగ్గించేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యాపిటల్ పద్దులో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సంక్షేమానికి సంబంధించిన ఆస్తుల కల్పన కోసం 1,126.92 కోట్ల రూపాయలను కేటాయించగా.. సవరించిన అంచనాల్లో రూ.742 కోట్లకే పరిమితం చేశారు. అలాగే రైతులకు సంబంధించి వ్యవసాయ అనుబంధ రంగాలకు క్యాపిటల్ పద్దులో రూ.300.53 కోట్లు కేటాయించగా.. సవరించిన అంచనాల్లో రూ.226.47 కోట్లకు కుదించారు. పారిశ్రామిక రంగానికి క్యాపిటల్ పద్దులో రూ.383.01 కోట్లు కేటాయించగా.. సవరించిన అంచనాల్లో రూ.71.01 కోట్లకే పరిమితం చేశారు. అలాగే రవాణా రంగంలో సవరించిన అంచనాల్లోనూ రూ.200 కోట్లకు పైగా కోత పెట్టారు. ఇతర రంగాలకు క్యాపిటల్ పద్దులో రూ.818 కోట్లను కోత పెట్టారు. క్యాపిటల్, రెవెన్యూ పద్దులు కలిపి సంక్షేమ రంగానికి సవరించిన అంచనాల్లో రూ.652 కోట్లు కోత విధించారు. అలాగే క్యాపిటల్, రెవెన్యూ పద్దుల్లో కలిపి పట్టణాభివృద్ధి రంగానికి సవరించిన అంచనాల్లో కేటాయింపులను బాగా తగ్గించేశారు. గ్రామీణాభివృద్ధి, ఇంధన, పరిశ్రమలు, రవాణా, సాధారణ విద్య, యువజన, క్రీడలు, సాంకేతిక విద్య, వైద్య, కుటుంబ సంక్షేమం తదితర రంగాల కేటాయింపుల్లోనూ సవరించిన అంచనాల్లో కోతలు విధించారు. మరోపక్క సాగునీటి పనుల అంచనాలతో పాటు బడ్జెట్ కేటాయింపులను కూడా భారీగా పెంచేశారు. ప్రభుత్వ పెద్దలకు కమీషన్ల రూపంలో ఈ రంగం నుంచి భారీగా ప్రయోజనం కలుగుతున్నందునే ఈ రంగానికి కేటాయింపులు, సవరించిన అంచనాల్లో రూ.2వేల కోట్ల మేర పెంచేశారని, మిగతా రంగాల నుంచి కమీషన్లు రానందునే ఆ రంగాల్లో కోతలు విధించారని అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.



2017-18లో క్యాపిటల్, రెవెన్యూ పద్దుల్లో రంగాల వారీగా కేటాయింపులు, సవరించిన అంచనాల వివరాలు(రూ.కోట్లలో)

రంగం	బడ్జెట్ కేటాయింపు	సవరించిన తర్వాత
సంక్షేమం	11,361.52	10,709.99
పట్టణాభివృద్ధి	5,207.45	5,049.09
గ్రామీణాభివృద్ధి	19,565.44	18,817.42
ఇంధన	4,274.75	3,590.00
పరిశ్రమలు	2,085.96	1,474.25
సాధారణ విద్య	20,384.72	19,633.25
యువజన, క్రీడలు	1,005.20	424.90
సాంకేతిక విద్య	765.00	636.72
వైద్యం	7,020.63	6,541.56

2017-18లో క్యాపిటల్ పద్దులో రంగాల వారీగా కేటాయింపులు, సవరించిన అంచనాల వివరాలు(రూ.కోట్లలో)

రంగం	బడ్జెట్ కేటాయింపు	సవరించిన తర్వాత
ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమం	1,126.92	742.94
వ్యవసాయ అనుబంధ	300.53	226.47
పరిశ్రమలు	383.01	71.01
రవాణా	2,019.54	1,781.77
ఇతర	6,060.96	5,242.23
సాగునీటి	12,056.27	14,786.07

ఈ లెక్కలెలా నమ్మాలి బాబూ!

- కేంద్రం నుంచి భారీగా నిధులు వస్తాయని రాష్ట్ర బడ్జెట్‌లో చూపిన సర్కార్
- కేంద్ర బడ్జెట్‌లో పైసా కూడా కేటాయించని వైనం
- ఇంత తప్పుల తడక బడ్జెట్ ఎన్నడూ చూడలేదంటున్న అధికార వర్గాలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం భారీ అంచనాలతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విశ్వసనీయత కనిపించడం లేదని.. ఇంత తప్పుల తడకలతో కూడిన బడ్జెట్‌ను ఎన్నడూ చూడలేదని అధికార వర్గాలు నోరెళ్లబెడుతున్నాయి. బడ్జెట్ గణాంకాలు కూడా వారి వ్యాఖ్యలకు బలం చేకూర్చేలా ఉన్నాయి. కేంద్రం నుంచి నిధులు రావాలని అందరం కోరుకుంటామని.. కానీ కేంద్రం నుంచి రాని నిధులు కూడా వస్తాయంటూ బడ్జెట్ అంచనాల్లో ప్రతిపాదించడం ప్రజల్ని మోసం చేయడమేనని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. 2014–15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెవెన్యూ లోటు భర్తీ కింద కేవలం రూ.138 కోట్లు మాత్రమే వస్తాయని కేంద్రం ఇప్పటికే పలుసార్లు స్పష్టం చేసిందని అధికారులు గుర్తు చేస్తున్నారు. అంతేకాకుండా బడ్జెట్ పెట్టడానికి ముందు కూడా ముఖ్యమంత్రి ఈ విషయం చెప్పారని.. అయినా కూడా రెవెన్యూ లోటు భర్తీ కింద కేంద్రం నుంచి రూ.12,099 కోట్లు వస్తాయని రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతిపాదించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. కేంద్రం ముందుగానే బడ్జెట్ ప్రవేశపెట్టిందని.. మన రాష్ట్రానికి ఏఏ నిధులు వస్తాయో అందులో స్పష్టం చేసిందని వారు గుర్తు చేస్తున్నారు. కేంద్ర బడ్జెట్‌లో రెవెన్యూ లోటు భర్తీ కింద కేటాయింపులు చేయకుండా.. రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేసుకోవడం మనల్ని మనం మోసం చేసుకోవడమేనని ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. అలాగే రాజధాని నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో పైసా కూడా కేటాయించలేదు. అయినా కూడా రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాజధాని నిర్మాణానికి కేంద్రం నుంచి రూ.వెయ్యి కోట్లు వస్తాయని ప్రతిపాదించడాన్ని అధికారులు తప్పుపడుతున్నారు. అలాగే వెనుకబడిన ఏడు జిల్లాలకు కేంద్ర బడ్జెట్‌లో పైసా కూడా కేటాయించలేదు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో మాత్రం కేంద్రం నుంచి రూ.350 కోట్లు వస్తాయని ప్రతిపాదించడంపై అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రాష్ట్ర సొంత పన్నుల ద్వారా రాని నిధులను కూడా వస్తాయంటూ భారీగా ప్రతిపాదించడాన్ని కూడా తప్పుపడుతున్నారు. పోలవరం ప్రాజెక్టు కోసం ప్రత్యేకించి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో పైసా కూడా కేటాయించలేదు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి రూ.9000 కోట్లు వస్తాయని పేర్కొనడాన్ని అధికారులు తప్పుపడుతున్నారు. ఇలాంటి అంకెల వల్ల రాష్ట్రాభివృద్ధికి ఎటువంటి ప్రయోజనం ఉండదని.. కేవలం ప్రచారం చేసుకోవడానికే పనికివస్తుందని అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

యువతులను మోసగించిన ఏడుగురు అరెస్టు

- జనసేన కార్యకర్తలుగా చెప్పుకుంటున్న నిందితులు
- సినీ హీరోలను పరిచయం చేస్తామంటూ సామాజిక మాధ్యమాల ద్వారా వల
- పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి
- 3.5 కిలోల బంగారం, కారు, రెండు బైక్‌లు స్వాధీనం



ఏలూరులో నిందితులను అరెస్టు చూపిస్తున్న పశ్చిమ ఎస్పీ ఎం.రవిప్రకాష్, ఏలూరు డీఎస్పీ ఈశ్వరరావు

ఏలూరు టౌన్: పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో మహిళలు, యువతులను మాయమాటలతో మోసగిస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. జనసేన కార్యకర్తలుగా చెప్పుకుంటున్న వీరు ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా యువతులతో పరిచయం పెంచుకుని వేధింపులకు పాల్పడుతుండేవారు. వీరి వేధింపులను భరించలేక ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్పీ ఎం.రవిప్రకాష్ దర్యాప్తు చేపట్టి నిందితులైన ఏడుగురు యువకులను అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ రవిప్రకాష్, ఏలూరు డీఎస్పీ ఈశ్వరరావుతో కలిసి శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. ఏలూరుకు చెందిన దత్తి బాలాజీ, సింహాద్రి బాలచందర్ అలియాస్ బాలు, పిళ్లా సాయి దేవేంద్ర నాయుడు, విప్పర్తి ఫ్రాన్సిస్, కొండి రాజేష్, గుజ్జుల రాజీవ్, టి.అశోక్‌కుమార్‌లు గత కొంతకాలం నుంచి కొందరు యువతులను మాయమాటలతో ట్రాప్ చేసి భారీగా ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీస్ విచారణలో తేలింది. జనసేన పార్టీ కార్యకర్తలుగా తిరుగుతూ యువతులను సినీ హీరోలకు పరిచయం చేయిస్తామని, ఫొటోలు తీయిస్తామంటూ మాయమాటలు చెప్పి స్నేహం చేసి అనంతరం బెదిరింపులకు పాల్పడుతూ బంగారు ఆభరణాలు, డబ్బు గుంజుతున్నారు. ఈనెల 4న ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బంగారు వ్యాపారి కుమార్తెను మోసం చేసి మూడున్నర కిలోల బంగారు ఆభరణాలు తీసుకున్నారని ఫిర్యాదు వచ్చింది. దీనిపై ఎస్పీ రవిప్రకాష్ సమగ్ర విచారణ చేయాలని ఏలూరు డీఎస్పీ ఈశ్వరరావును ఆదేశించారు. ఈ యువకులు యూఏఈ ఎక్ఛేంజ్, ముత్తూట్, మణప్పురం, యాక్సిస్ బ్యాంకుల్లో బంగారు ఆభరణాలు తాకట్టుపెట్టి ఆ వచ్చిన సొమ్ముతో గోవా, ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడ క్యాసినోలలో రోలెట్, బ్లాక్‌జాక్, పోకర్, అందర్ బాహర్ వంటి విలాసవంతమైన జూదాలు ఆడుతుంటారు. లగ్జరీ కార్లు, మోటారు సైకిళ్లు, సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు కొనుగోలు చేసి జల్సాలు చేయటం వీరి అలవాటు. వీరి నుంచి 3424 గ్రాముల బంగారు ఆభరణాలు, చవర్‌లెట్ కారు, రెండు ఖరీదైన మోటారు సైకిళ్లు, యాపిల్, సామ్‌సంగ్ కంపెనీ ఫోన్లు, ఏసీ, టీవీ వంటి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

పెళ్లింట పెను విషాదం

- చెట్టును ఢీకొన్న ఇన్నోవా వాహనం
- వరుడు సహా ఐదుగురి దుర్మరణం



కొణిజర్ల: పెళ్లింట పెను విషాదం చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండల కేంద్రం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఇన్నోవా వాహనం చెట్టుకు ఢీకొనడంతో వరుడు సహా ఐదుగురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఏపీ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లాలో పెళ్లి అనంతరం.. వీరంతా వాహనంలో వస్తుండగా మార్గమధ్యంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన అచ్చి రామకృష్ణ ప్రసాద్ (36) వివాహం.. ఏపీ రాష్ట్రం రాజమండ్రికి చెందిన భావన దుర్గతో గురువారం రాత్రి తణుకులోని పాతూరు కేశవస్వామి ఆలయంలో జరిగింది. పెళ్లి అనంతరం వధూవరులతో సహా 10 మంది ఇన్నోవా వాహనంలో బయలుదేరారు. పెళ్లి కొడుకు రామకృష్ణ ప్రసాద్ స్వతహాగా డ్రైవర్ కావడంతో తానే డ్రైవింగ్ చేయడం మొదలు పెట్టాడు. తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో కొణిజర్ల సమీపానికి రాగానే అతి వేగంగా ఉన్న వీరి వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వరుడు రామకృష్ణ ప్రసాద్, అతడి అక్క పద్మ (42) బావ శరత్ (39), చెల్లి శ్రీదేవి (37), డ్రైవర్ వడ్లకొండ వేణు (37) అక్కడికక్కడే మృతిచెందారు. వధువు దుర్గ సహా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో వరుడి బావ చలపతి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ఘటనా స్థలాన్ని కొత్తగూడెం ఎస్పీ అంబర్ కిషోర్ ఝా, ట్రాఫిక్ ఏసీపీ జె.సదానిరంజన్, వైరా ఏసీపీ డి.ప్రసన్నకుమార్, వైరా ఎమ్మెల్యే బాణోత్ మదన్‌లాల్ సందర్శించారు. మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

చిత్తశుద్ధి ఉంటే అవిశ్వాసానికి మద్దతివ్వండి

- టీడీపీకి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స సవాల్
- ప్రత్యేక హోదా పోరుకు కలిసి రావాలని హితవు
- ప్రధాని వద్ద హోదా నినాదం ఎందుకు వినిపించలేదో చెప్పాలని నిలదీత
- రాష్ట్ర ప్రయోజనాలు పట్టవా? అని ఆగ్రహం
- ప్రజా వ్యతిరేకత వల్లే రాజీనామా డ్రామాలు ఆడుతున్నారని మండిపాటు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వంపై తాము ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానానికి మద్దతునివ్వాలని టీడీపీకి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ సవాల్ విసిరారు. ఇప్పటికైనా కుయుక్తులు ఆపి.. హోదా పోరుకు కలసి రావాలని టీడీపీకి హితవు పలికారు. హైదరాబాద్‌లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మూడున్నరేళ్లుగా రాష్ట్రానికి కేంద్రం ఎంతో చేసిందని.. పార్టీ ఆదేశం మేరకే విధిలేని పరిస్థితుల్లో రాజీనామాలు చేశామంటూ సుజనా చౌదరి చెప్పడాన్ని బొత్స తప్పుబట్టారు. వాళ్లు రాష్ట్ర ప్రజల కోసం మనస్ఫూర్తిగా రాజీనామాలు చేయలేదనే విషయం దీన్ని బట్టి అర్థమైపోతోందన్నారు. ప్రత్యేక హోదా కోసమే రాజీనామా చేశామని ప్రధానితో చెప్పలేని దౌర్భాగ్య స్థితిలో చంద్రబాబు ఉండటం శోచనీయమన్నారు. 5 కోట్ల ఆంధ్రుల డిమాండ్ అయిన ప్రత్యేక హోదాపై ప్రధానిని ఎందుకు నిలదీయలేకపోయారని ప్రశ్నించారు..

జైట్లీ కొత్తగా ఏం చెప్పలేదే..!

ప్రత్యేక హోదా గురించి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ కొత్తగా ఇప్పుడు చెప్పిందేమీ లేదని బొత్స అన్నారు. గతంలోనే ప్రత్యేక హోదా ఇవ్వబోమని జైట్లీ ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అప్పుడు జైట్లీ మాటలను ఎందుకు స్వాగతించారో.. ఇప్పుడు ఎందుకు యూ టర్న్ తీసుకున్నారో చెప్పాలని చంద్రబాబును డిమాండ్ చేశారు. హోదా ఆకాంక్ష ప్రజల్లో బలంగా ఉండటం వల్లే రాజీనామా డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం ఈ జిమ్మిక్కులు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలపై కేంద్రంపై ఒత్తిడి తేవడంలో, ప్రత్యేక హోదా సాధన పోరాటంలో తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటి నుంచీ ఒకే మాట మీద ఉన్నారని బొత్స గుర్తు చేశారు. టీడీపీ కూడా తమతో కలిసి వస్తుందేమోనని.. ఆ అవకాశం ఇవ్వడానికే ఈ నెల 21న కేంద్రంపై అవిశ్వాసం తీసుకొస్తున్నామని బొత్స వివరించారు. ఇప్పటికైనా హోదా పోరులో కలిసి వచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని టీడీపీకి సూచించారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలు అమలు కాకపోతే రాష్ట్రానికి ఏ విధంగా నష్టం జరుగుతుందో.. దేశ ప్రజలకు చెప్పడమే అవిశ్వాసం అసలు ఉద్దేశమని తెలిపారు. ఏపీకి ప్రత్యేక హోదా అవసరాన్ని దేశ ప్రజల దృష్టికి తీసుకెళ్లాలన్నదే తమ పార్టీ తపనగా పేర్కొన్నారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. టీడీపీ ఎన్నికల హామీలను నెరవేర్చే విధంగా లేదన్నారు. ఎన్ని హామీలు ఇచ్చామో.. ఎన్ని నెరవేర్చామో ప్రజలకు చెప్పి ఎన్నికలకు వెళ్లిన ఘనత ఒక్క వైఎస్సార్‌కే దక్కిందన్నారు.

సత్తాలేదన్న మంత్రి ఎక్కడైనా ఉంటారా?

పోలవరంతో పాటు దుగరాజపట్నం పోర్టు తదితర అంశాలన్నీ రాష్ట్రంతో మాట్లాడే నిర్ణయం తీసుకున్నామని కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ చెబుతున్నారని.. దీనిపై టీడీపీ జవాబు చెప్పాలని బొత్స డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అశోక్ గజపతిరాజు కేంద్ర మంత్రిగా ఉండి రాష్ట్రానికి సాధించిందేంటని నిలదీశారు. వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని విభజన చట్టంలోనే పేర్కొంటే.. ఈ హామీ గురించి ఏనాడైనా కేంద్రాన్ని నిలదీశారా అని ప్రశ్నించారు. అంతర్జాతీయ విమానాశ్రయంగా భోగాపురం ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేసేందుకు ఎయిర్ ఇండియా అథారిటీ వేసిన టెండర్‌ను రద్దు చేశారని, ఆ సంస్థకు సత్తాలేకపోవడం వల్లే ఇలా చేసినట్టు అశోక్ గజపతిరాజు మాట్లాడటం సిగ్గుచేటని బొత్స అన్నారు. ఆయనే.. స్వయంగా తన కింద ఉన్న విభాగానికి సత్తా లేదంటూ కించపరచడం దేశ చరిత్రలోనే ప్రథమమన్నారు.



తూర్పు గోదావరి జిల్లా కాకినాడ శివారు తూరంగి వద్ద మంచినీటి కోసం ట్యాంకర్ వద్ద మహిళల తోపులాట

సాక్షి విజిట్

భూగర్భ శోకం!

వేసవి ఆరంభంలోనే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి చుక్కలు చూపిస్తోంది. ఇప్పుడే ఇలా ఉంటే మండు వేసవిలో సమస్య తీవ్రత ఎలా ఉంటుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. మరో వైపు భూగర్భ నీటిమట్టం శరవేగంగా పడిపోతున్న తీరు అధికార యంత్రాంగంలో కలవరం రేపుతోంది. ఈ ఏడాది జనవరి నెలతో పోలిస్తే ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్తంగా సగటున 1.02 మీటర్ల మేరకు భూగర్భ నీటిమట్టం పడిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా సగటున ఒక మీటరు నీటిమట్టం తగ్గిందంటే 101 టీఎంసీల నీటిని తోడేశారని అర్థం.

- రాష్ట్రంలో పొంచి ఉన్న తాగునీటి ఎద్దడి
- పడిపోతున్న నీటి మట్టాలు
- ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో అప్పుడే అవస్థలు
- పట్టణాలు, గ్రామాల్లోనూ తాగునీటికి కటకట
- ప్రమాద ఘంటికలు మోగిస్తున్న కలుషిత నీరు
- ఇప్పుడే జాగ్రత్తపడకపోతే ఇబ్బందేనంటున్న అధికారులు

సాక్షి, అమరావతి

సాధారణంగా జనవరిలో పంటలు పెద్దగా ఉండవు. ఎండ తక్కువగా ఉండటంవల్ల ఉన్న పైర్లకు కూడా నీటి తడుల అవసరం తక్కువ. ఇలాంటి సీజన్‌లోనే రాష్ట్రవ్యాప్తంగా ఒక మీటరు నీటి మట్టం పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇక మార్చి, ఏప్రిల్ నెలల్లో పంటలకు నీటి తడుల అవసరం ఎక్కువ. ఈ కాలంలోనే తాగునీటికీ రెట్టింపు డిమాండ్ ఉంటుంది. దీంతో ప్రతినెలా సగటున రెండు మీటర్లపైగా నీటి మట్టం పాతాళానికి పడిపోతుందని అంచనా. మార్చి, ఏప్రిల్, మేలో రెండేసి మీటర్ల చొప్పున మూడు నెలల్లో ఆరు మీటర్ల (19.68 అడుగుల) భూగర్భ జలమట్టం పడిపోతే పరిస్థితి క్లిష్టంగా మారుతుందని అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. పైపెచ్చు భూతాపం (భూమి వేడెక్కడం)వల్ల సమ్మర్ స్టోరేజి ట్యాంకుల్లో కూడా ఎక్కువగా నీరు ఆవిరవుతోంది.

40 పట్టణాలు, 5 నగరాల్లో..

రాష్ట్రంలోని 108 మున్సిపాల్టీలు, 18 నగరపాలక సంస్థలు ఉంటే, దాదాపు 40 పట్టణాలు, ఐదు నగరాల్లో నీటి ఎద్దడి అప్పుడే ప్రారంభమైంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా కొన్నిచోట్ల రక్షిత మంచినీటి పథకాలు నిర్మించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో అక్కడక్కడ రెండు మూడు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు. గుంటూరు, విజయవాడ, విశాఖపట్నాల్లో కొత్తగా పెరిగిన ప్రాంతాల్లోనూ తాగునీటి ఇబ్బందులు మొదలయ్యాయి. ఇక్కడ కొన్ని ప్రాంతాల వారు రాత్రిపూట నీరు తెచ్చుకుంటున్నారు. పిడుగురాళ్ల మున్సిపాల్టీ పరిధిలో బోరు బావుల్లో నీరు అడుగంటుతున్నందున నీటి ఎద్దడి పెరుగుతుందని అక్కడి అధికారులు హెచ్చరిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో జనవరితో పోలిస్తే.. ఫిబ్రవరి నెలలో భూగర్భ నీటి మట్టం సుమారు రెండు మీటర్లు పడిపోయింది. ధర్మవరం, గిద్దలూరు, గుత్తి, హిందూపురం, నందికొట్కూరు, నూజివీడు, ఒంగోలు, ప్రొద్దుటూరు, రాయదుర్గం, విజయనగరం మున్సిపాల్టీల్లో రెండు రోజులకోసారి.. మార్కాపురం మున్సిపాల్టీలో మూడు రోజులకోసారి నీటి సరఫరా జరుగుతోంది. కళ్యాణదుర్గం, గుత్తి, తాడిపత్రి, మదనపల్లి మున్సిపాల్టీల్లోనూ నీటి కటకట మొదలైంది. కాగా, మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎంతోకొంత వర్షం పడితే పర్వాలేదని.. లేదంటే ఇబ్బందే అని ఒక ఉన్నతాధికారి చెప్పారు. సాధారణంగా రాష్ట్రంలో నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లోనే కోస్తాంధ్రలో తుపాన్లు వస్తాయి. కానీ, ఈ సీజన్‌లో తుపాన్లు రాలేదు. ఇక మార్చి, ఏప్రిల్ నెలల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉండవని వాతావరణ శాఖ నిపుణులు వివరించారు. ప్రకాశం జిల్లాలోని కొన్ని గ్రామాలకు చెందిన వారు 4–5 కిలోమీటర్ల దూరం నుంచి మంచినీళ్లు తెచ్చుకుంటున్నారు. ఒంగోలు కార్పొరేషన్‌లో రెండు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని ప్రాంతాలకు ఒకరోజు, మరికొన్ని ప్రాంతాలకు మరో రోజు చొప్పున ఇస్తున్నారు.

ఎండుతున్న సమ్మర్ స్టోరేజి ట్యాంకులు

రాష్ట్రవ్యాప్తంగా 301 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంగల సమ్మర్ స్టోరేజి ట్యాంకులు ఉండగా.. ప్రస్తుతం వాటిల్లో 75 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఇంకా చాలా ట్యాంకుల్లో నీరు నిండుకుంటోంది. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎలా ఉంటుందో చెప్పలేమని అధికారులు అంటున్నారు. సాధారణంగా రాయలసీమలో భూగర్భ జలమట్టం పడిపోవడం, వేసవిలో నీటి ఎద్దడి ఉండటం రివాజు. ఈ ఏడాది దీనికి భిన్నంగా కోస్తా జిల్లాల్లో భూగర్భ జలమట్టం పడిపోతుండటం గమనార్హం. ఇదిలా ఉంటే.. రాష్ట్రంలో రక్షిత నీటి పథకాల నిర్వహణకు ఏటా రూ.338కోట్లు ఖర్చవుతుందని అంచనా. వీటి నిర్వహణకు ప్రభుత్వం నిధులివ్వకపోవడంవల్ల అనేక గ్రామాల్లో నీటి సరఫరా అస్తవ్యస్తంగా సాగుతోంది.



శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఏజెన్సీ బర్నగూడ గ్రామస్తులు కాలువనీటిని తెచ్చుకుంటున్న దృశ్యం

నాలుగేళ్లుగా నోళ్లెండగా..

రెండు రూపాయలకే 20లీటర్ల మినరల్ వాటర్‌ను సరఫరా చేసే ఎన్టీఆర్ సుజల పథకం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా ఉంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన నాడే ఈ పథకంపై తొలి సంతకం చేశారు. ఇప్పటికి నాలుగేళ్లు గడుస్తున్నా రాష్ట్రంలో కనీసం నాలుగు శాతం నివాస ప్రాంతాల్లో కూడా ఈ పథకాన్ని అమలుచేయలేదు. అంటే రాష్ట్ర వ్యాప్తంగా 12,918 గ్రామ పంచాయతీలు, 48,363 నివాస ప్రాంతాలకు మంచినీటి సరఫరా చేయాల్సి ఉండగా కేవలం 1440 నివాస ప్రాంతాల్లో మాత్రమే దీనిని అమలుచేసినట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు గ్రామాలకు నీటిని సరఫరా చేసే ట్యాంకర్ల కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించడంలేదు.



కావలి పట్టణంలో భూగర్భ జలాలు అడుగంటడంతో ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

ట్యాంకర్లతో కూడా నీరు ఇవ్వడం లేదు..


బోర్ల నుంచి నీళ్లు రావడంలేదు. అవి ఎండిపోవడంతో గ్రామంలో పశువులకు సైతం నీరు అందించలేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. ట్యాంకర్ల ద్వారా నీరు అందజేసేందుకు ప్రభుత్వం ముందుకు రాలేదు. గ్రామంలోని యువకులు పని నిమిత్తం కనిగిరికి వెళ్లి వచ్చేటప్పుడు నీటి క్యాన్లు కొనితెచ్చుకుంటున్నారు. నీటి సమస్య మాకు పెద్ద గుదిబండగా మారింది. దీనివల్ల చాలామంది వలస వెళ్లిపోతున్నారు.

– రోశమ్మ, నారాయణమ్మ, రమణారెడ్డి, ఆదినారాయణరెడ్డి, ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం హుస్సేన్‌పురం

కలవర పరుస్తున్న కలుషిత నీరు

తాగునీటి కొరత ఇలా ఉంటే.. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో మంచినీటి పైప్‌లైన్లకు కాలం చెల్లింది. ఎప్పటికప్పుడు పైపులైన్ల పరిశీలన, పాత పైపుల స్థానే కొత్తవి ఏర్పాటు, వాల్వుల సర్వీసింగ్, లీకుల నివారణకు చర్యలు తీసుకోకపోవడంతో సరఫరా అవుతున్న రక్షిత మంచినీరు కలుషితమై ప్రజలు డయేరియా బారినపడుతున్నారు. కొన్నిచోట్ల పైపులైన్లు మురుగు కాల్వలలో కూడా ఉంటున్నాయి. గుంటూరులో జరిగిన సంఘటన ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. రాష్ట్రంలోని తిరుపతి, ఒంగోలు, విశాఖపట్నం, కర్నూలు తదితర నగరపాలక సంస్థలతోపాటు పలు మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాల్టీల్లో మొత్తం 30 వేల కి.మీ నిడివిలో విస్తరించిన పైపులైన్లలో 5 వేల కి.మీ. పైపులైన్లు 15 నుంచి 30 ఏళ్ల క్రితం నుంచి వినియోగంలో ఉన్నాయి. గుంటూరు, విజయవాడ కార్పొరేషన్లలో 300 కి.మీ. పైప్‌లైన్లు దాదాపు 30 ఏళ్ల నుంచి వినియోగంలో ఉన్నాయి. వీటి స్థానంలో కొత్త పైపులు వేయాలనే ప్రతిపాదనలను మున్సిపల్ అధికారులు ప్రభుత్వానికి అందచేసినా నిధులు విడుదల కాలేదు. కాగా, ఒక్క పైపుల లీకులపైనే మున్సిపాల్టీలకు రోజుకు 400 వరకు ఫిర్యాదులు వస్తున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. సమస్యలు రోజుల తరబడి పరిష్కారం కాకపోవడంతో కాలుష్యంతో కూడిన నీరే ప్రజలకు సరఫరా అవుతోంది.

రెండు నెలల్లో భూగర్భ నీటిమట్టం పడిపోయిన తీరు (మీటర్లలో)



పంచాయతీ ఎన్నికలకు నిధులు ఏవీ?

2018–19 నిధులు కేటాయించని ఏపీ ప్రభుత్వం

ఆగస్టుతో ముగియనున్న సర్పంచుల పదవీ కాలం

సాక్షి, అమరావతి: పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. ఈ ఏడాది ఆగస్టు 1 కల్లా సర్పంచుల పదవీ కాలం ముగియనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జూన్, జూలైలోనే పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఎన్నికల నిర్వహణకు మొత్తం రూ. 180 కోట్లు ఖర్చు అవుతుందని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ మేరకు నిధులు కేటాయించాలంటూ అధికారులు ప్రభుత్వానికి విన్నవించారు. అయితే, గురువారం ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కేవలం రూ. 10 కోట్లు కేటాయించడంపై అధికారులే విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ఈ కేటాయింపులు చూస్తే ప్రభుత్వం ఈ ఏడాది గ్రామ పంచాయతీలకు ఎన్నికల నిర్వహించే ఉద్దేశం లేదని పలువురు అంటున్నారు.

రెండో రోజుకు చేరిన జూడాల సమ్మె

విశాఖలోని ఆస్పత్రుల్లో విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న జూనియర్ వైద్యులు

పాతపోస్టాఫీసు (విశాఖ దక్షిణ): డిమాండ్ల పరిష్కారం కోసం జూనియర్ వైద్యులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి రెండో రోజుకు చేరుకుంది. ప్రభుత్వం తక్షణమే దిగివచ్చి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే అత్యవసర సేవలకు కూడా హాజరుకాబోమని ఏపీ జూనియర్ వైద్యుల సంఘం ప్రతినిధి డాక్టర్ కోదండరాం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న జూనియర్ వైద్యుల సమ్మెలో భాగంగా విశాఖలోని కేజీహెచ్, ప్రభుత్వ విక్టోరియా (ఘోషా), విమ్స్, ఈఎన్‌టీ, టీబీసీడీ, మానసిక, కంటి ఆసుపత్రులలోని జూనియర్ వైద్యులు విధులను బహిష్కరించారు. పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అత్యవసర సేవలకు అంతరాయం కలిగించకుండా సేవలను కొనసాగిస్తామని తెలిపారు. ఆంధ్ర వైద్య కళాశాల పరిధిలో ఉన్న జూనియర్ వైద్యులకు సెప్టెంబరు నుంచి ఎరియర్స్ రాకపోయినా ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోలేదన్నారు. జూనియర్ వైద్యులచే వెట్టిచాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం వారికి ఇవ్వాల్సిన బకాయిలను, ప్రస్తుతం ఇస్తున్న ఉపకార వేతనాలను సవరిస్తామన్న విషయాలను పూర్తిగా మరిచిపోయిందన్నారు.

రేపు దేశీయ వరి విత్తనాల ప్రదర్శన

రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు గ్రామంలోని రైతు శిక్షణా కేంద్రంలో రేపు(ఆదివారం) దేశీయ వరి విత్తనాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి జస్టిస్ చలమేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. గోశాల, భూసార పరీక్షా కేంద్రాలు ఈ సందర్భంగా ప్రారంభం అవుతాయన్నారు. ఈ సందర్భంగా కొంతమంది సేంద్రీయ రైతులను సత్కరిస్తామని చెప్పారు. కార్యక్రమానికి మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇతర ప్రముఖులు హాజరుకానున్నారని వివరించారు.

సాగు విస్తీర్ణం తగ్గితే... దిగుబడి పెరిగిందా?

- బడ్జెట్‌లో వ్యవసాయంపై ప్రభుత్వం చెప్పేవన్నీ తప్పుడు లెక్కలే
- వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి మండిపాటు
- దిగుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్



విలేకర్లతో మాట్లాడుతున్న నాగిరెడ్డి, చిత్రంలో సింహాద్రి రమేష్

విజయవాడ సిటీ: బడ్జెట్‌లో వ్యవసాయంపై ప్రభుత్వం చెబుతున్నవన్నీ తప్పుడు లెక్కలేనని వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి మండిపడ్డారు. ఈ ఏడాది గరిష్టంగా సాగు విస్తీర్ణం తగ్గితే.. దిగుబడులు పెరిగాయని ప్రభుత్వం అవాస్తవాలు చెబుతోందని విమర్శించారు. పంటలు ఎండిపోతే దిగుబడులు ఎలా పెరిగాయని నిలదీశారు. విజయవాడలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన శుక్రవారం వ్యవసాయ బడ్జెట్ కేటాయింపులపై విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఈ ఏడాది వ్యవసాయ బడ్జెట్‌ను 4.6 శాతం మాత్రమే పెంచిందని చెప్పారు. గత ఏడాది వ్యవసాయ బడ్జెట్ రూ.18,214 కోట్లు కాగా, ఈ ఏడాది రూ.19,070 కోట్లకు పెంచారని తెలిపారు.

ఇంత తక్కువ సాగు ఎన్నడూ లేదు...

దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఈ 13 జిల్లాల్లో 45.65 లక్షల హెక్టార్లలో సాగు జరిగితే... చంద్రబాబు సీఎం అయ్యాక 2014–15లో 40.96 లక్షల హెక్టార్లలో సాగు జరిగిందన్నారు. ఈ ఏడాది 35.9 లక్షల హెక్టార్లలో సాగు జరిగిందని, ఇంత తక్కువ సాగు ఎన్నడూ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల హెక్టార్లలో వేరుశనగ, కంది పంటలు ఎండిపోయాయన్నారు. ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వైఎస్సార్ హయాంలో, మీ(చంద్రబాబు) హయాంలో ఏ మేరకు దిగుబడులు వచ్చాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదని మండిపడ్డారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు కావడం లేదన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి బడ్జెట్ ప్రసంగంలో గవర్నర్ ప్రసంగానే వల్లెవేశారని ఎద్దేవా చేశారు.

రుణమాఫీ విషయంలో మళ్లీ మోసం

రాష్ట్రంలో విద్యుత్ మిగులు ఉన్నప్పటికీ రైతులకు 9 గంటల పగలు విద్యుత్ ఇవ్వడం లేదని నాగిరెడ్డి మండిపడ్డారు. రుణమాఫీ విషయంలోనూ రైతులను మళ్లీ మోసగించారన్నారు. రాష్ట్రంలో రైతుల రుణాలు రూ.87 వేల కోట్లు ఉండగా, ఆ మొత్తాన్ని రూ.24 వేల కోట్లకే కుదించారన్నారు. రుణమాఫీకి ఈ నాలుగేళ్లల్లో రూ.13 వేల కోట్లు ప్రకటించి, అందులో రూ.11,500 కోట్లు మాత్రమే చెల్లించారని దుయ్యబట్టారు. ఇంకా రూ.11 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, బడ్జెట్ పద్దులో రూ.4,100 కోట్లు మాత్రమే కేటాయించారని మండిపడ్డారు. రైతులు దినసరి కూలీలుగా మారి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తుంటే వ్యవసాయ రంగం విపరీతమైన అభివృద్ధి జరిగిపోతోందని చంద్రబాబు ప్రకటించడం దారుణమన్నారు. సమావేశంలో పార్టీ రైతు విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి సింహాద్రి రమేష్ పాల్గొన్నారు.

రూ.4 కోట్ల ఎర్రచందనం పట్టివేత

చైనాకు తరలిస్తుండగా పట్టుకున్న అధికారులు



పట్టుబడ్డ ఎర్రచందనం

పాతపోస్టాఫీసు (విశాఖ దక్షిణ): విశాఖ కంటెయినర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్(వీసీటీఎల్)లో భారీగా ఎర్రచందనం పట్టుబడింది. చెన్నై నుంచి చైనాకు విశాఖపట్నం మీదుగా వెళ్తున్న నౌకలోని కంటెయినర్లలో గుట్టుచప్పుడు కాకుండా భారీగా ఎర్రచందనం దుంగలు రవాణా అవుతున్నాయి. సమాచారం అందుకున్న డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు హైదరాబాద్ నుంచి విశాఖపట్నం చేరుకున్నారు. చెన్నైలో బుధవారం బయలుదేరిన నౌక గురువారం సాయంత్రానికి విశాఖలోని వీసీటీఎల్ చేరుకుంది. నౌక చేరే సమయానికి వీసీటీఎల్ చేరుకున్న అధికారులు మూడు కంటెయినర్లను విశాఖలో దింపి పరిశీలించారు. రెండు కంటెయినర్లలో సుమారు 10.1 టన్నుల బరువున్న ఎర్రచందనాన్ని కనుగొన్నారు. వీటి విలువ సుమారు రూ.4 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఎర్రచందనంతోపాటు బెంజినేట్ పౌడర్‌ను కూడా డీఆర్ఐ అధికారులు సీజ్ చేశారు.

రాజేంద్ర ప్రసాద్‌ను స్పెషల్ పీపీగా నియమించండి

- హైకోర్టుకు నివేదించిన బాధిత గిరిజన మహిళలు
- అభ్యంతరం చెప్పని ప్రభుత్వం
- రాజేంద్రప్రసాద్ అంగీకారం తెలుసుకోవాలన్న ధర్మాసనం
- విచారణ 13కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: గ్రేహౌండ్స్ పోలీసుల అత్యాచార ఘటనకు సంబంధించి నమోదైన కేసులో కింది కోర్టులో వాదనలు వినిపించేందుకు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విజయవాడకు చెందిన సుంకర రాజేంద్రప్రసాద్ నియామకానికి బాధిత గిరిజన మహిళలు మొగ్గు చూపారు. రాజేంద్రప్రసాద్‌ను స్పెషల్ పీపీగా నియమించవచ్చునని బాధిత మహిళల తరఫు న్యాయవాది వసుధా నాగరాజ్ శుక్రవారం హైకోర్టుకు నివేదించారు. రాజేంద్రప్రసాద్ నియామకం పట్ల ప్రభుత్వ న్యాయవాది సైతం ఎటువంటి అభ్యంతరం చెప్పలేదు. దీంతో స్పెషల్ పీపీ నియామకం విషయంలో రాజేంద్రప్రసాద్ అంగీకారం తెలుసుకోవాలని రిజిస్ట్రార్ జనరల్‌ను హైకోర్టు ఆదేశించింది. ఫీజు విషయంలో కూడా స్పష్టత తీసుకోవాలని రిజిస్ట్రార్ జనరల్‌కు స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలంటూ విచారణను ఈ నెల 13కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. 2007లో కూంబింగ్‌కు వచ్చిన గ్రేహౌండ్స్ పోలీసులు తమపై అత్యాచారానికి పాల్పడ్డారంటూ విశాఖ జిల్లా వాకపల్లికి చెందిన గిరిజన మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై విశాఖపట్నం 11వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు మరియు ఎస్సీ ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం విచారణ జరుపుతోంది. ఈ కేసులో స్పెషల్ పీపీగా పల్లా త్రినాథరావును నియమించాలని బాధిత మహిళలు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి ఇటీవల ఉత్తర్వులిస్తూ పల్లా త్రినాథరావును స్పెషల్ పీపీగా నియమించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ అటు ప్రభుత్వం, ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్రే హౌండ్స్ పోలీసులు వేర్వేరుగా ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై విచారణ జరుపుతున్న జస్టిస్ నాగార్జునరెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం స్పెషల్ పీపీ నియామకానికి సంబంధించి ఉభయ రాష్ట్రాల నుంచి ఏడుగురు ప్రముఖ న్యాయవాదుల పేర్లను రిజిస్ట్రార్ జనరల్ ద్వారా తెప్పించుకుంది. వీరినుంచి ముగ్గుర్ని ప్రాధాన్యతా క్రమంలో ఎంచుకోవాల్సిందిగా బాధిత మహిళల తరఫు న్యాయవాదికి సూచించింది. శుక్రవారం ఈ కేసు విచారణకు రాగా స్పెషల్ పీపీగా సుంకర రాజేంద్రప్రసాద్‌ను నియమిస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని బాధితుల తరఫు న్యాయవాది వసుధా నాగరాజ్ ధర్మాసనానికి తెలిపారు.

బీసీల 'విద్యోన్నతి' గాలికి..

- ఎన్టీఆర్ విద్యోన్నతి కింద పలు ప్రాంతాల్లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు
- నాలుగు నెలలైనా పైసా చెల్లించని రాష్ట్ర సర్కార్
- విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న కోచింగ్ సెంటర్లు, హాస్టళ్లు

సాక్షి, అమరావతి: బీసీల 'విద్యోన్నతి'ని రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేసింది. ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం కింద సివిల్స్ కోచింగ్ తీసుకుంటున్న బీసీ విద్యార్థులకు ఫీజులు, మెయింటెనెన్స్ చార్జీలు ఇవ్వకుండా వేధిస్తోంది. కోచింగ్ మొదలై నాలుగు నెలలైనా ప్రభుత్వం నుంచి రావాల్సిన మొత్తం రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేయలేక కొందరు పేద విద్యార్థులు మధ్యలోనే వెనుతిరుగుతున్నారు. వివరాలు.. సుమారు వెయ్యి మంది బీసీ విద్యార్థులు హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరులో సివిల్స్ పరీక్షలకు కోచింగ్ తీసుకుంటున్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం కింద ఫీజుల కోసం రూ.లక్ష, హాస్టళ్లలో ఉండేందుకు నెలకు రూ.10 వేల చొప్పున చెల్లించాల్సి ఉంది. గతంలో నేరుగా కోచింగ్ సెంటర్లకు ప్రభుత్వమే ఆ మొత్తం చెల్లించేది. బీసీ సంక్షేమ శాఖ ఈ విధివిధానాలను మార్చింది. మూడు నెలలకొకసారి నేరుగా విద్యార్థి అకౌంట్‌లోనే రూ.35 వేల చొప్పున జమ చేస్తామని ప్రకటించింది. కానీ కోచింగ్ మొదలై నాలుగు నెలలైనా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా అందకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే నాలుగు నెలలుగా సొంత డబ్బులతో హాస్టళ్లలో ఉంటున్నామని, ఇక తమ వద్ద డబ్బుల్లేవని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఫీజు కట్టాలని లేకపోతే ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ హాస్టళ్ల యజమానులు గెంటేస్తున్నారని వాపోయారు. బీసీ సంక్షేమ శాఖకు ఫోన్ చేసి విద్యోన్నతి డబ్బుల గురించి అడిగితే.. వాళ్లు ఫోన్ పెట్టేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కోచింగ్ సెంటర్లలోనూ పరిస్థితి ఇలాగే ఉందన్నారు. డబ్బులు ఇవ్వకుండా ఎంతకాలం కోచింగ్ ఇస్తామంటూ.. తోటి విద్యార్థుల ముందు తమను అవమానిస్తున్నారని కన్నీరు పెట్టుకున్నారు.

చదువుకోలేకపోతున్నాం..

కోచింగ్ సెంటర్లు, హాస్టళ్ల యాజమాన్యాల ఛీత్కారాలు, అవమానాలు భరించలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి ఒత్తిడి వల్ల కోచింగ్‌పైన కూడా దృష్టి పెట్టలేకపోతున్నామని వాపోయారు. ప్రభుత్వం ఈ విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ప్రశాంతంగా చదువుకోలేక పోతున్నామని చెప్పారు. కోచింగ్ ఇప్పిస్తున్నా సరైన ఫలితాలు రావడం లేదని అధికారులు చెబుతున్నారని.. ఈ విధంగా చేస్తే ఎలా చదువుకోగలమని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

భెల్ తిరుచిరాపల్లిలో 918 ట్రేడ్ అప్రెంటీస్ ఖాళీలు

తమిళనాడులోని తిరుచిరాపల్లిలో ఉన్న భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) విభాగం.. 918 ట్రేడ్ అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో ఫిట్టర్-330, వెల్డర్ (జీఅండ్ఈ) -240, టర్నర్-25, మెషినిస్ట్-25, ఎలక్ట్రీషియన్-75, వైర్‌మ్యాన్-20, ఎలక్ట్రానిక్ మెకానిక్-15, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్-20, ఏసీ అండ్ రిఫ్రిజిరేషన్-20, డీజిల్ మెకానిక్-15, డ్రాట్స్‌మ్యాన్ (మెకానికల్)-15, షీట్ మెటల్ వర్కర్-15, పాసా-50, ఫోర్గర్ అండ్ హీట్ ట్రీటర్-10, కార్పెంటర్-15, ప్లంబర్-15, ఎంఎల్‌టీ పాథాలజీ-3 ఖాళీలు ఉన్నాయి. ఎనిమిది/పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులు అర్హులు. పాథాలజీకి ఇంటర్ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి. **చివరి తేదీ:** మార్చి 20, 2018. **వెబ్‌సైట్:** www.bheltry.co.in

ఉద్యోగ సమాచారం

ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్‌లో 50 ఖాళీలు

నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) ఇండియా లిమిటెడ్... 50 ట్రైనీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** ఇండస్ట్రియల్ ట్రైనీ (ఐటీ).
- **విభాగం:** ఫైనాన్స్.
- **శిక్షణ వ్యవధి:** ఏడాది.
- **స్టైపెండ్:** రూ.10,000.
- **అర్హతలు:** సీఏ/సీఎంఏలో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత.
- **వయసు:** 2018, మార్చి 1 నాటికి 28 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** సీఏ/సీఎంఏలో మార్కుల ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** మార్చి 27, 2018.
- **వెబ్‌సైట్:** www.nlcindia.com

ఐఐటీ జోధ్‌పూర్‌లో 30 ఖాళీలు

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ).. వివిధ విభాగాల్లోని 30 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** రిజిస్ట్రార్-1, డిప్యూటీ రిజిస్ట్రార్-1, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్ఈఈ)-1, అసిస్టెంట్ రిజిస్ట్రార్-1, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ)-2 (సివిల్-1+ఎలక్ట్రికల్-1), జూనియర్ ఇంజనీర్-1 (ఎలక్ట్రికల్), అసిస్టెంట్ మేనేజర్ (ఏఎం)-1 (హార్టికల్చర్), అసిస్టెంట్-2, జూనియర్ అసిస్టెంట్ (జేఏ)-6, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ (జేటీఏ)-14 (కెమిస్ట్రీ-1+ ఆటోమేషన్-1+బయోసైన్స్ అండ్ బయోఇంజనీరింగ్-1+కెమికల్ ఇంజనీరింగ్-2+ సివిల్ ఇంజనీరింగ్-2+ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-1+ మెకానికల్ ఇంజనీరింగ్-1+మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్-2+ఫిజిక్స్-2+ ఇన్‌స్ట్రుమెంటేషన్-1).
- **వేతనం:** జేటీఏ, జేఏ-రూ.21,700; అసిస్టెంట్-రూ.25,500; ఏఎం, జేఈ-రూ.35,400; అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఏఈఈ-రూ.56,100; ఎస్ఈఈ, డిప్యూటీ రిజిస్ట్రార్-రూ.78,800; రిజిస్ట్రార్-రూ.1,44,200.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి మాస్టర్స్ డిగ్రీ/బీఈ/బీటెక్/ఎంఈ/ ఎంటెక్/ఇంజనీరింగ్ డిప్లొమా/బీఎస్సీ/ఎంఎస్సీ/ ఏదైనా డిగ్రీ. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, అనుభవం, సంబంధిత రంగం ప్రత్యేకాంశాల్లో నైపుణ్యం తదితరం ఉండాలి.
- **వయసు:** రిజిస్ట్రార్‌కు 55 ఏళ్లు; డిప్యూటీ రిజిస్ట్రార్, ఎస్ఈఈ, అసిస్టెంట్ రిజిస్ట్రార్-50 ఏళ్లు; ఏఈఈ-40 ఏళ్లు; జేఈ, ఏఎం, జేఏ-30 ఏళ్లు; జేటీఏకు 27 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, ప్రజెంటేషన్/ ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** పోస్టు పే లెవెల్‌ను బట్టి రూ.1,000/రూ.750/రూ.500; ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగ/మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో. ■ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 13, 2018. ■ **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** మార్చి 20, 2018.
- **వెబ్‌సైట్:** www.iitj.ac.in

ఏపీ ఎడ్‌సెట్

టీచింగ్ వృత్తిని చేపట్టాలనుకునే అభ్యర్థులు చదవాల్సిన కోర్సు.. బీఎడ్ (బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్). ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలనుకుంటే రెండేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఎడ్) కోర్సు పూర్తిచేయడం తప్పనిసరి. 2018-19 విద్యాసంవత్సరంలో ప్రారంభమయ్యే బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎడ్‌సెట్)కు శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది.

- ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: 2018, మార్చి 8-ఏప్రిల్ 5.
- అప్లికేషన్ రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.650 (ఎస్సీ, ఎస్టీలకు రూ.450).
- పరీక్ష తేదీ: 2018, ఏప్రిల్ 19 (ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు).
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.apsche.org/apsche_new

ఏపీ సెట్స్-2018

2018-19 విద్యా సంవత్సరంలో ప్రారంభమయ్యే వివిధ ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (సెట్)లకు ఏపీ ఉన్నత విద్యామండలి తరపున యూనివర్సిటీలు నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నాయి. ఎంసెట్, లాసెట్, ఎడ్‌సెట్ తదితర పరీక్షలకు తేదీలు ఖరారయ్యాయి. మరికొన్ని సెట్‌ల పూర్తిస్థాయి వివరాలు త్వరలో విడుదల కానున్నాయి.

ఏపీ లాసెట్



రోజురోజుకు న్యాయవాద వృత్తి కొత్త పుంతలు తొక్కుతోంది. న్యాయ నిపుణులకు కార్పొరేట్ రంగం రెడ్‌కార్పెట్ పరుస్తోంది. యూత్‌లో క్రేజీ కోర్సుగా కనిపిస్తున్న 'లా'లో చేరడానికి నిర్వహించే.. లా కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (లాసెట్)కు, పీజీలో చేరేందుకు పీజీలాసెట్‌కు శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ప్రకటన విడుదల చేసింది.

- లాసెట్‌లో రెండు రకాల టెస్టులుంటాయి. ఒకటి ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ కోర్సులో ప్రవేశాలకు ఇంటర్ అర్హతతో ఉద్దేశించింది కాగా, రెండోది డిగ్రీ అర్హతతో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే టెస్ట్.
- మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సు ఔత్సాహికులు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుకు ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.
- ఎల్ఎల్ఎం కోర్సు ప్రవేశాలకు నిర్వహించే పీజీ లాసెట్‌కు.. ఎల్ఎల్‌బీ పూర్తిచేసిన వారు అర్హులు.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 2018, మార్చి 9-ఏప్రిల్ 5.
- **దరఖాస్తు రుసుం:** ఎల్ఎల్‌బీ ప్రవేశ పరీక్షకు రూ.750, ఎల్ఎల్ఎం ప్రవేశ పరీక్షకు రూ.850.
- **ప్రవేశ పరీక్ష తేదీ:** ఏప్రిల్ 19, 2018.
- **వెబ్‌సైట్:** www.apsche.org/apsche_new



ఏపీ ఎంసెట్

ఏపీ ఎంసెట్ 2018 నోటిఫికేషన్‌ను జేఎన్‌టీయూ, కాకినాడ విడుదల చేసింది. ఇంజనీరింగ్ స్ట్రీమ్; అగ్రికల్చర్, మెడికల్ స్ట్రీమ్‌లకు ఆన్‌లైన్‌లో పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్షను ఏప్రిల్ 22 నుంచి 25 వరకు వివిధ సెషన్లల్లో నిర్వహిస్తారు.

ఇంజనీరింగ్ స్ట్రీమ్:

- **కోర్సులు:** ఇంజనీరింగ్/బీఫార్మసీ (ఎంపీసీ)/ఫార్మ్-డీ/బీటెక్ (డెయిరీ టెక్నాలజీ)/బీటెక్ (అగ్రికల్చర్ ఇంజనీరింగ్)/బీటెక్ (ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ/బీఎస్సీ (అగ్రికల్చర్ ఇంజనీరింగ్).
- **అర్హతలు:** ఇంటర్మీడియట్ ఎంపీసీ ఉత్తీర్ణత అర్హత.
- **పరీక్ష విధానం:** పరీక్ష 160 ప్రశ్నలతో 160 మార్కులకు ఉంటుంది. మ్యాథమెటిక్స్ నుంచి 80, ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.

అగ్రికల్చర్, మెడికల్ స్ట్రీమ్

- **కోర్సులు:** బీఎస్సీ (అగ్రికల్చర్), బీఎస్సీ (హార్టికల్చర్), వెటర్నరీ సైన్స్, యానిమల్ హజ్బెండరీలో బ్యాచిలర్ కోర్సులు, బీఎఫ్ఎస్సీ, బీటెక్ (ఎఫ్ఎస్‌టీ), బీఎస్సీ కమర్షియల్ అగ్రికల్చర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, బీఫార్మసీ, బీటెక్ (బయోటెక్నాలజీ) (బైపీసీ), ఫార్మ్-డీ (బైపీసీ).
- **అర్హత:** బైపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత.
- **పరీక్ష విధానం:** ప్రశ్నపత్రం 160 ప్రశ్నలతో 160 మార్కులకు ఉంటుంది. ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 40 ప్రశ్నల చొప్పున 80 ప్రశ్నలు; బయాలజీ (బోటనీ, జువాలజీ) నుంచి 80 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయించారు.

ర్యాంకుల నిర్ధారణ ఇలా:

- వివిధ సెషన్లల్లో ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రశ్నల క్లిష్టత అన్ని సెషన్ల వారికి ఒకేలా ఉండకపోవచ్చు. ఏ ఒక్క విద్యార్థి నష్టపోకుండా ఉండేందుకు నార్మలైజేషన్ విధానం ద్వారా ముందుగా ఎంసెట్ మార్కులు నిర్ధారిస్తారు. ఈ మార్కులకు 75 శాతం వెయిటేజీ ఇచ్చి, ఇంటర్ మార్కులకు మిగతా 25 శాతం వెయిటేజీ ఇచ్చి తుది ర్యాంకుల జాబితా రూపొందిస్తారు.

ముఖ్య సమాచారం:

- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** మార్చి 29, 2018.
- **దరఖాస్తు రుసుం:** రూ.500.
- ఇంజనీరింగ్, అగ్రికల్చర్ విభాగాలు రెండింటికీ హాజరుకావాలనుకుంటే రూ.1,000 చెల్లించాలి. అపరాధ రుసుము రూ.500తో ఏప్రిల్ 6 వరకు, రూ.1,000తో ఏప్రిల్ 11 వరకు, రూ.5 వేలతో ఏప్రిల్ 16 వరకు,
- రూ.10 వేలతో ఏప్రిల్ 21 వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష తేదీలు

- **హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్:** ఏప్రిల్ 18 నుంచి.
- **ఇంజనీరింగ్ పరీక్ష:** ఏప్రిల్ 22 నుంచి 25 వరకు.
- **అగ్రికల్చర్ పరీక్ష:** ఏప్రిల్ 25, 26 తేదీల్లో నిర్వహిస్తారు.
- రెండు పరీక్షలకు హాజరయ్యే వారికి ఏప్రిల్ 24, 25 తేదీల్లో ఆన్‌లైన్ టెస్టులు ఉంటాయి. రోజూ రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు.
- **వెబ్‌సైట్:** http://sche.ap.gov.in/EAMCET

ఏపీ ఐసెట్

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష... ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఐసెట్). పరీక్ష మే 2న ఆన్‌లైన్‌లో జరగనుంది.

- **అర్హతలు:** ఎంబీఏ కోర్సులో చేరాలనుకుంటే బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంసీఏకు డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఇంటర్మీడియెట్ స్థాయిలో మ్యాథమెటిక్స్‌ను ఒక సబ్జెక్టుగా చదివుండాలి. ఫైనలియర్ విద్యార్థులూ అర్హులే.
- **పరీక్ష విధానం:** ఐసెట్ పరీక్ష 200 మార్కులకు ఉంటుంది. ఇందులో మూడు విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. అనలిటికల్ ఎబిలిటీ, మ్యాథమెటికల్ ఎబిలిటీల నుంచి 75 ప్రశ్నలు చొప్పున, కమ్యూనికేషన్ ఎబిలిటీ నుంచి 50 ప్రశ్నలు వస్తాయి. అభ్యర్థుల్లో విశ్లేషణ నైపుణ్యం, గణిత సామర్థ్యం, ఇంగ్లిష్ గ్రామర్, రీడింగ్ కాంప్రెహెన్షన్, వొకాబ్యులరీని పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి.
- **పరీక్ష వ్యవధి:** రెండున్నర గంటలు.

EBRD approves India's Membership

INTERNATIONAL

- **Iraq pips Saudi to become India's top oil supplier**
Iraq has overtaken Saudi Arabia by a wide margin to become India's top crude oil supplier, meeting more than a fifth of the country's oil needs in the current financial year. Saudi Arabia traditionally has been India's top oil source but in the April-January period of 2017-18, Iraq dethroned it, supplying 38.9 million tonnes (MT) of oil.
- **EBRD approves India's Membership**
India becomes 69th member of the European Bank for Reconstruction and Development (EBRD) after shareholders of the international financial institution gave their nod to the country's candidature. The London-headquartered EBRD is a multilateral development bank set up in 1991 after the fall of the Berlin wall to promote private and entrepreneurial initiative in emerging Europe. It invests in 38 emerging economies across three continents.

NATIONAL

- **BJP wins in Tripura; Hung in Nagaland, Meghalaya**
Bharatiya Janata Party has won in Tripura elections. No party emerged with clear victory in Meghalaya and Nagaland states. However, BJP formed coalition governments in both states. All the three states have 60 assembly seats.
- **New Chief Ministers**

Conrad Sangma: National People's Party leader Conrad Sangma is the next Chief Minister of Meghalaya. He assumed office on 6th March.
Niephui Rio: People's Democratic Alliance, PDA's leader Niephui Rio has been sworn-in as the new Chief Minister of Nagaland on 8th March while State BJP Legislatures leader Y. Patton has been appointed as Deputy Chief Minister.
Biplab Kumar Deb: The BJP State President, Biplab Kumar Deb, was unanimously elected as the leader of the Legislature Party. He assumed office on 9th March.

- **BBBP extended to 640 districts**
Indian Prime Minister Narendra Modi on 8th March inaugurated the pan-India expansion of flagship programme--Beti Bachao-Beti Padhao. Giving a fillip to the Government's initiative to save and educate the girl child, the programme expanded from the existing 161 districts to 640 districts all over the country. Prime Minister also launched the National Nutrition Mission nationwide. He said that this will be executed in a mission mode using technology for maximum benefits.

Suvidha launched: The Government on 8th March launched 'Biodegradable Sanitary Napkins' under the 'Pradhan Mantri Bhartiya Janaushadhi Pariyojana', on the occasion of International Women's Day.

ECONOMY

- **Tax cut on gold: NITI Aayog**
NITI Aayog Committee, headed by Ratan P Watal, has recommended drastic cuts in taxes on gold and also proposed a more liberalised approach towards the gold to increase its contribution to the gross domestic product (GDP) to 3 per cent by 2022. The name of the report is 'Transforming India's Gold Market. The panel has recommended a sharp cut in all taxes on the gold business, including import duty and goods and services tax (GST). Committee also recommended to replace sovereign gold bonds with gold saving account.
- **RBI tightens PSL norms**
The Reserve Bank has further tightened the priority sector lending PSL norms for foreign banks by directing them to mandatorily create sub-targets so that they lend a portion of their loans to small and marginal farmers as well as micro enterprises. The PSL norms mandate foreign banks to eventually lend 40 per cent of their total loan book to the priority sector, such as agriculture, rural infra, and MSMEs among others from April 2020. A sub-target of 8 per cent of net bank credit, or credit equivalent amount of off-balance sheet exposure, whichever is higher shall become applicable for foreign banks with 20 branches and above, for lending to MSMEs from next financial year.
- **Committee to study issues in Fintech space**
The government has set up a steering committee to consider



Civils, Groups Special
Current Affairs

various issues relating to the development of Fintech space in India with a view to make Fintech related regulations more flexible and generate enhanced entrepreneurship. The eight-member committee headed by Economic Affairs Secretary, Subhash Chandra Garg will also focus on how Fintech can be leveraged to enhance financial inclusion of MSMEs. Financial technology, also known as fintech, is an economic industry composed of companies that use technology to make financial services more efficient.

SPORTS

- **Navjot Kaur clinches India's first gold in Asian Wrestling Championships**
Navjot Kaur has scripted history by becoming the first Indian woman to win a Gold medal at the Senior Asian Wrestling Championships. She clinched gold in the 65 kg freestyle category at the tournament being held at Bishkek in Kyrgyzstan. Rio Olympics Bronze medallist Sakshi Malik won a bronze in the 62 kg division.
- **India's Manu Bhaker wins Gold at ISSF World Cup**
India's shooting sensation Manu Bhaker won the gold medal in 10 metre Air Pistol Women event at the ISSF World Cup in Guadalajara, Mexico. Manu Bhaker has also won a second successive gold medal in a mixed team event as India consolidated their position at the top in the ISSF World Cup in Guadalajara, Mexico.

Shahzar Rizvi sets world record: Shahzar Rizvi clinched the gold medal with a world record score in his maiden ISSF World Cup appearance. The Meerut-based Rizvi shot a world record 242.3 in the 10 metre air pistol event's final to beat reigning Olympic champion Christian Reitz of Germany to win the top prize.

AWARDS

- **Oscar award winners**
The 90th Annual Academy Awards were held at the Dolby Theatre in Los Angeles. Awards were given in 24 categories.
Some categories - winners:

1. ***Best Picture:*** The Shape Of Water.
2. ***Best Director:*** Guillermo del Toro, The Shape Of Water.
3. ***Best Actress:*** Frances McDormand, Three Billboards Outside Ebbing, Missouri.
4. ***Best Actor:*** Gary Oldman, Darkest Hour.
5. ***Best Supporting Actress:*** Allison Janney, I, Tonya.
6. ***Best Supporting Actor:*** Sam Rockwell, Three Billboards Outside Ebbing, Missouri.
7. ***Best Original Screenplay:*** Get Out.
8. ***Best Adapted Screenplay:*** Call Me By Your Name.
9. ***Best Animated Feature Film:*** Coco.
10. ***Best Foreign Language Film:*** A Fantastic Woman, Chile.
11. ***Best Original Score:*** The Shape Of Water.
12. ***Best Original Song:*** Remember Me, Coco.
13. ***Best Documentary Feature:*** Icarus.
14. ***Best Documentary Short:*** Heaven Is A Traffic Jam On The 405.
15. ***Best Live Action Short:*** The Silent Child.

PERSONS

- **Balkrishna Doshi:** Indian architect Balkrishna Doshi has been awarded this year's Pritzker Prize for being able to interpret architecture and transform it into buildings that respect Eastern culture. The Pritzker Prize is regarded as architecture's equivalent to the Nobel Prize.

Rajendra Sharma
Current Affairs Faculty, Hyderabad



సాక్షి బిజినెస్
శనివారం 10-3-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
44 ▼	16 ▼
33,307	10,227

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 10.30కి)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	7,529	▲ 101
డోజోన్స్	25,233	▲ 337
ఎఫ్‌టీఎస్ఈ 100	7,225	▲ 21
డాక్స్	12,347	▼ 9
షాంఘై	3,308	▲ 19
నికాయ్	21,469	▲ 101

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	65.85	65.98
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	91.20	91.38
€	యూరో	ఎస్‌బీఐ	81.32	81.49
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	62.01	62.13
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.53	51.63
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.08	50.17
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.75	18.66
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.12	18.84
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.27	11.78

ఉబెర్ బ్రాండ్ అంబాసిడర్‌గా కోహ్లి



న్యూఢిల్లీ: అంతర్జాతీయ దిగ్గజ ట్యాక్సీ సేవల సంస్థ 'ఉబెర్' తాజాగా ఇండియన్ క్రికెట్ టీమ్ కెప్టెన్ విరాట్ కోహ్లిని భారత్‌లో బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. దీనికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలను కంపెనీ వెల్లడించలేదు. డీల్‌లో భాగంగా ఇకపై ఉబెర్ ఇండియా మార్కెటింగ్, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ ప్రచార కార్యక్రమాల్లో కోహ్లి పాల్గొంటారు. ఉబెర్ సంస్థ ఆసియా–పసిఫిక్‌లో బ్రాండ్ అంబాసిడర్‌ను నియమించుకోవడం ఇదే ప్రథమం. గత నెల ఫుట్‌బాల్ ప్లేయర్ మహమద్ సలాహ్‌ను ఈజిప్ట్ మార్కెట్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. ఉబెర్‌తో జతకట్టడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా కోహ్లి వ్యాఖ్యానించారు.

ఫోక్స్‌వ్యాగన్ 'పోలో' కొత్త వెర్షన్

న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన ప్రముఖ వాహన తయారీ కంపెనీ 'ఫోక్స్‌వ్యాగన్' తాజాగా తన పాపులర్ హ్యాచ్‌బ్యాక్ 'పోలో'లో కొత్త వెర్షన్‌ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దీని ప్రారంభ ధర రూ.5,41,800 (ఎక్స్‌షోరూమ్). ఇందులో 1.0 లీటర్ ఎంపీఐ ఇంజిన్ అమర్చినట్లు కంపెనీ తెలియజేసింది.



అలాగే భారత్‌లోని 1.2 లీటర్ ఎంపీఐ ఇంజిన్‌ను 1.0 లీటర్ ఎంపీఐ ఇంజిన్‌తో భర్తీ చేస్తామని పేర్కొంది. అంటే 1.2 లీటర్ ఎంపీఐ ఇంజిన్ ఉన్న వాహనాలు 1.0 ఎంపీఐ లీటర్ ఇంజిన్‌తో మార్కెట్‌లోకి వస్తాయి. తాజా 1.0 లీటర్ ఎంపీఐ ఇంజిన్ కలిగిన వెర్షన్ లీటరుకు 18.78 కిలోమీటర్ల మైలేజ్‌ను ఇస్తుందని కంపెనీ తెలిపింది.

ట్వీటర్ సీటీవోగా పరాగ్ అగర్వాల్



న్యూఢిల్లీ: మైక్రోబ్లాగింగ్ ప్లాట్‌ఫామ్ 'ట్వీటర్' తాజాగా పరాగ్ అగర్వాల్‌ను చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా (సీటీవో) నియమించుకుంది. ఈయన ఆడమ్ మెస్సింగర్ స్థానాన్ని భర్తీ చేశారు. ఆడమ్ మెస్సింగర్ 2016 చివరిలో కంపెనీ నుంచి బయటకు వచ్చేశారు. ఇకపోతే అగర్వాల్ ఐఐటీ–బాంబే పూర్వ విద్యార్థి. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఈయన 2011లో యాడ్స్ ఇంజనీర్‌గా ట్వీటర్‌లో చేరారు. ట్వీటర్‌లో చేరకముందు మైక్రోసాఫ్ట్ రీసెర్చ్, యాహూ రీసెర్చ్, ఏటీఅండ్‌టీ ల్యాబ్స్‌తో కలసి డేటా మేనేజ్‌మెంట్‌పై రీసెర్చ్ చేశారు.

రూ.13,000 కోట్లకు నీరవ్ మోదీ మోసాలు

మరో రూ.322 కోట్ల మోసాలపై బ్యాంకు ఫిర్యాదు



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకుకు వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ చేసిన మోసాల మొత్తం మరో రూ.322 కోట్లు పెరిగి రూ.13,000 కోట్లకు విస్తరించింది. మొదటి రెండు ఎఫ్ఐఆర్‌లలో మోదీ మోసాల మొత్తం రూ.12,686 కోట్లుగా పేర్కొన్న విషయం తెలిసిందే. మోదీకి చెందిన ఫైర్ స్టార్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, ఫైర్‌స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్ ప్రైవేటు లిమిటెడ్ తదితర కంపెనీలు కూడా గ్యారంటీలు, చట్టబద్ధమైన రుణాల్లో అక్రమాలకు పాల్పడి, రూ.49.4 మిలియన్ డాలర్లు (రూ.322 కోట్లు) మోసం చేసినట్లు పీఎన్‌బీ ఈ నెల 4న సీబీఐకి ఫిర్యాదు చేసింది. దీంతో మోదీ మోసాల మొత్తం రూ.13,008 కోట్లకు చేరింది.

సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...


- 4 ఐటీ ఆణిముత్యాలు
- ఈ షేర్లకు రిస్క్ ఎక్కువ.. ?
- బంధన్ బ్యాంక్ ఐపీఓ.. మరీ కాస్ట్‌లీ..!
- పుల్ బ్యాక్ ర్యాలీల్లో బయటపడండి
- లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్‌ల్లో ఇప్పుడు... ఏవి బెటర్?
- తగ్గిన సెయిల్ వెలుగులు..

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం..
WWW.SAKSHIBUSINESS.COM
SAKSHIBUSINESS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి
GET IT ON Google Play | Available on the App Store

ట్రంప్ 'సుంకం' షాక్..!

ఉక్కు దిగుమతులపై 25%, అల్యూమినియంపై 10% విధింపు ; 15 రోజుల్లో అమల్లోకి

- మెక్సికో, కెనడాకు మినహాయింపు
- మిగతా దేశాలకూ చర్చల ద్వారా అవకాశం
- ఇది దేశ భద్రత కోసమే: ట్రంప్
- భారత్, చైనాల మాదిరే తామూ స్పందిస్తామని వ్యాఖ్య
- తాజా చర్యలపై మండిపడ్డ చైనా, యూరోపియన్ దేశాలు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్... మొత్తానికి అన్నంత పనీ చేశారు. అమెరికాలోని ఉద్యోగాలను, ఎకానమీని కాపాడే పేరిట వివాదాస్పద నిర్ణయాలతో ప్రపంచ దేశాలను నిత్యం టెన్షన్ పెడుతున్న ట్రంప్ తాజాగా ఉక్కు, అల్యూమినియంలపై దిగుమతి సుంకాలు విధించారు. ఈ మేరకు చేసిన ప్రతిపాదనలకు శుక్రవారం ఆమోద ముద్ర వేశారు. తద్వారా అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధాల భయాలకు ఆజ్యం పోశారు. ట్రంప్ ప్రస్తుత నిర్ణయంతో... ఉక్కుపై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం మేర దిగుమతి సుంకాలు 15 రోజుల్లో అమల్లోకి వస్తాయి. అయితే, పొరుగుదేశాలైన మెక్సికో, కెనడాలకు మాత్రం మినహాయింపునిచ్చారు. మిగతా దేశాలు కూడా మినహాయింపులు కావాలనుకుంటే అమెరికా వాణిజ్య శాఖ ప్రతినిధులతో (యూఎస్‌టీఆర్) చర్చల ద్వారా సాధించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ట్రంప్ నిర్ణయంపై అమెరికాలో మిశ్రమ స్పందన వ్యక్తం కాగా.. కీలక వ్యాపార భాగస్వామ్య దేశాలు మాత్రం తీవ్రంగా వ్యతిరేకించాయి.

ఉక్కు, అల్యూమినియం పరిశ్రమలు రెండూ.. దేశ భద్రతకు సైతం కీలకమైనవని ఈ సందర్భంగా ట్రంప్ వ్యాఖ్యానించారు. 'ఉక్కు ఉక్కే. దీనికి తిరుగులేదు. ఉక్కు లేకుంటే దేశం లేదు. అనేక సంవత్సరాలుగా మన పరిశ్రమలను మిగతా దేశాలు టార్గెట్ చేశాయి. నిజానికి దశాబ్దాలుగా పాటిస్తూ వస్తున్న అనుచిత విదేశీ వాణిజ్య విధానాల వల్ల మన ప్లాంట్లు మూతపడ్డాయి. లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. కొన్ని వర్గాలు పూర్తిగా అణగారిపోయాయి. ఇకపై ఇలాంటివన్నీ ఆగిపోతాయి' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఉక్కు, అల్యూమినియంపై సుంకాల విధించడం ద్వారా అమెరికా భద్రతను కూడా కాపాడుతున్నానని ఆయన చెప్పుకొచ్చారు. అమెరికాలో ఉక్కు, అల్యూమినియం రంగంలో పెరుగుతున్న సంక్షోభం గురించి వాణిజ్య శాఖ తొమ్మిది నెలలుగా అధ్యయనం చేసిన మీదట ఈ నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడించారు.

అమెరికా ప్రయోజనాల కోసమే..

అమెరికా ఉద్యోగులు, కంపెనీల పరిరక్షణ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ చెప్పారు. అమెరికాలో తయారు చేసే ఉత్పత్తులపై పన్నులు ఉండవని.. ఒకవేళ ఇతర దేశాల కంపెనీలేవైనా ఆ ప్రయోజనాలు పొందదల్చుకుంటే, అమెరికాలోనే ప్లాంటు పెట్టి పొందవచ్చని తెలియజేశారు. 'మన నౌకలు, మన విమానాలు.. మన యుద్ధ పరికరాలు మొదలైన వాటన్నింటినీ మన దేశంలో తయారైన ఉక్కు, అల్యూమినియంతోనే ఉత్పత్తి చేద్దాం. ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న సమస్య పరిష్కారానికి ఇప్పటికైనా సరైన చర్యలు తీసుకుంటున్నాం' అని ట్రంప్ పేర్కొనారు. కాగా అమెరికాలోనే దీనిపై మిశ్రమ స్పందన వ్యక్తమైంది. కొని వర్గాలు అమెరికాకు ప్రయోజనకరమైన చరిత్రాత్మక నిర్ణయంగా అభివర్ణించగా... మరికొన్ని వర్గాలు ఈ నిర్ణయం దేశ ఎకానమీని దెబ్బతీస్తుందని, వాణిజ్య యుద్ధాలకు దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి.

భారత్ ఇంజనీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులకు ప్రతికూలం..

సుంకాల వల్ల భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే ఇంజనీరింగ్ ఉత్పత్తులపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఇంజనీరింగ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఈఈపీసీ) చైర్మన్ రవి సెహ్‌గల్ తెలిపారు. అమెరికా బాటలోనే చైనా, యూరప్ కూడా రక్షణాత్మక చర్యలకు దిగితే భారత ఎగుమతులు మరింతగా దెబ్బతింటాయన్నారు. అమెరికా దిగుమతి చేసుకునే మొత్తం ఉక్కులో భారత్ వాటా 1.28 శాతంగా, అల్యూమినియం దిగుమతుల్లో 1.12 శాతంగా ఉంది.

చైనా, ఈయూ అభ్యంతరాలు..

దిగుమతి సుంకాల విధింపుపై చైనాతో పాటు యూరోపియన్ యూనియన్‌లోని అమెరికా వ్యాపార భాగస్వామ్య దేశాలు తీవ్రంగా స్పందించాయి. ఇది ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వ్యాఖ్యానించాయి. సుంకాల నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చైనా పేర్కొనగా.. ఇరు దేశాల సంబంధాలపై ఇది పెను ప్రభావం చూపుతుందని జపాన్ వ్యాఖ్యానించింది. దీనిపై ప్రపంచ వాణిజ్య సంస్థలో (డబ్ల్యూటీవో) ఫిర్యాదు చేసే అవకాశం ఉందని దక్షిణ కొరియా వెల్లడించింది. మిగతా యూరోపియన్ యూనియన్ దేశాలతో కలిసి పరిణామాల ప్రభావాలపై చర్చించి, తగు నిర్ణయాలు తీసుకుంటామని ఫ్రాన్స్ పేర్కొంది. వాణిజ్య వివాదాలను పరిష్కరించుకునేందుకు టారిఫ్‌లు విధించడమనేది సరైన పద్ధతి కాదని బ్రిటన్ అభిప్రాయపడింది. రక్షణాత్మక ధోరణులు, టారిఫ్‌లు పనిచేయవని పేర్కొంది. సుంకాల పెంపునకు ప్రతీకారంగా చర్యలు తీసుకునేందుకు తాము కూడా సిద్ధంగా ఉన్నామని, అయితే చర్చలకే ఎక్కువగా ప్రాధాన్యమిస్తామని యూరోపియన్ కమిషన్ వైస్ ప్రెసిడెంట్ జిర్కీ కెటైనెన్ తెలిపారు. అమెరికా నుంచి దిగుమతయ్యే ఏయే ఉత్పత్తులపై సుంకాలు విధించవచ్చన్న దానిపై బ్రసెల్స్ ఇప్పటికే ఒక జాబితా కూడా సిద్ధం చేసింది.

భారత్‌కు హెచ్చరిక..

సుంకాల విధింపు విషయంలో పనిలో పనిగా చైనాతో పాటు భారత్‌కు కూడా హెచ్చరికల్లాంటివి చేశారు ట్రంప్. చైనా, భారత్ లాంటి దేశాలు విధించే సుంకాలకు, అమెరికా విధించే సుంకాలకూ వ్యత్యాసముంటే ఆ మేరకు మార్పులుంటాయన్నారు. 'ఏదో ఒక దశలో ఈ తరహా విధానాన్ని కూడా తెస్తాం. ఉదాహరణకు మనమేమీ సుంకాలు విధించకుండానే.. చైనా 25 శాతమో.. భారత్ 75 శాతమో విధిస్తోందనుకుందాం. అలాంటప్పుడు మనమూ అదే స్థాయిలో సుంకాలు విధిస్తాం. వాళ్లు 50 శాతం వేస్తే.. మనమూ 50 శాతం విధిస్తాం' అని అధికారిక ప్రకటనలపై సంతకాలు చేయడానికి ముందు ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికా మోటార్ సైకిల్స్ ముఖ్యంగా – హార్లే డేవిడ్సన్ బైకుల మీద భారత్ విధిస్తున్న సుంకాలు చాలా భారీగా ఉంటున్నాయని ట్రంప్ కొద్ది రోజుల క్రితమే ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో తాజా వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో మార్చి 20న భారత్ నిర్వహించబోయే డబ్ల్యూటీవో సదస్సుకు అమెరికా ప్రతినిధి రాబర్ట్ లైథిజర్ రాకపోవచ్చని అధికార వర్గాలు తెలిపాయి.

హైదరాబాద్‌లో ఎఫ్ఎస్‌టీసీ ఫ్లయింగ్ స్కూల్!

- ప్రభుత్వం సహకరిస్తే ఏర్పాటు చేస్తాం
- సాక్షితో కంపెనీ సీఈవో దిలావర్ సింగ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పైలట్లకు శిక్షణ ఇస్తున్న ప్రముఖ సంస్థ ఫ్లయిట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్ (ఎఫ్ఎస్‌టీసీ) రెండు ఫ్లయింగ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోంది. ఒకటి ఉత్తరాదిన, మరొకటి దక్షిణాది రాష్ట్రంలో తొమ్మిది నెలల్లో ఏర్పాటు చేయనుంది. వీటి ఏర్పాటుకు మౌలిక వసతులు మెరుగ్గా ఉండి, రద్దీ లేని విమానాశ్రయం తమకు అనువుగా ఉంటుందని ఎఫ్ఎస్‌టీసీ సీఈవో దిలావర్ సింగ్ బస్రాన్ శుక్రవారమిక్కడ 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధితో చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం సహకరిస్తే బేగంపేట విమానాశ్రయాన్ని ఫ్లయింగ్ స్కూల్‌కు వాడుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. శంషాబాద్‌లో సిమ్యులేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్న కంపెనీ.. ఫ్లయింగ్ స్కూల్‌ను సైతం హైదరాబాద్‌లో నెలకొల్పేందుకే మొగ్గు చూపుతోంది.

ఒక్కో కేంద్రానికి రూ.100 కోట్లు..

ఫ్లయింగ్ స్కూల్ ఏర్పాటుకు రూ.100 కోట్లు ఖర్చు అవుతాయని దిలావర్ సింగ్ పేర్కొన్నారు. ''స్కూల్ ద్వారా పైలట్ శిక్షణ ఇస్తాం. ఇందుకోసం శిక్షణ విమానాలను కొనుగోలు చేస్తున్నాం. 40 విమానాలను సమకూర్చుకోవాలన్నది ఆలోచన. వచ్చే 10 ఏళ్లలో భారత్‌కు 9- 10 వేల మంది పైలట్లు అవసరం. గుర్గావ్‌లోని సిమ్యులేషన్ సెంటర్ ద్వారా ఇప్పటికే 600కు పైగా పైలట్లకు ట్రైనింగ్ ఇచ్చాం. భారత్‌లో ఉన్న పైలట్లలో 40 శాతం మా దగ్గర శిక్షణ తీసుకున్నవారే. శంషాబాద్‌లో రూ.500 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సిమ్యులేషన్ సెంటర్ ఆగస్టు నాటికి సిద్ధం కానుంది. ఎఫ్ఎస్‌టీసీ పైలట్లకు కోర్సు ఫీజు రూ.15–30 లక్షలు ఉంది'' అని దిలావర్ వివరించారు.



మీడియా సమావేశంలో దిలావర్ సింగ్

ఎయిర్ ట్రాఫిక్..

అయిదున్నర రెట్లకు

- ప్రపంచ సగటు కంటే అధిక వృద్ధి
- 1,750 కొత్త విమానాలకు డిమాండ్
- భారత్‌పై ఎయిర్‌బస్ అంచనాలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా పది మందిలో ఒకరు విమాన ప్రయాణం చేస్తున్నారు. ఈ సంఖ్య 20 ఏళ్లలో నాలుగుకు చేరుకుంటుందని ఎయిర్‌బస్ అంచనా వేస్తోంది. భారత్‌లో ఎయిర్ ట్రాఫిక్ అయిదున్నర రెట్లకు చేరుకుంటుందని ఎయిర్‌బస్ ఆసియా మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ జూస్ వాన్ డీ హేజ్డెన్ శుక్రవారమిక్కడ మీడియాకు తెలిపారు. 'ప్రయాణికుల వృద్ధి రేటు ప్రపంచ సగటు 4.4% నమోదు కానుంది. భారత్ మాత్రం దాదాపు రెండింతలతో 8.1% ఉండనుంది. దేశీయ ప్రయాణికుల వృద్ధి రేటు 8.9 శాతంగా నమోదు చేస్తుంది. కొత్తగా 1,750 విమానాలు అవసరం అవుతాయి. వచ్చే 10 సంవత్సరాల్లో ప్రతి వారం ఒక ఎయిర్‌బస్ విమానం భారత్‌లో అడుగుపెట్టనుంది. ఇప్పటికే ఇక్కడ 300 లకుపైగా ఎయిర్‌బస్ విమానాలు ఎగురుతున్నాయి' అని వివరించారు.

మేకిన్ ఇండియాకు కట్టుబడ్డాం..: భారత్ నుంచి విడిభాగాలను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నట్టు ఎయిర్‌బస్ ఇండియా కమర్షియల్ ప్రెసిడెంట్ శ్రీనివాసన్ ద్వారకానాథ్ తెలిపారు. 'మేకిన్ ఇండియాకు కట్టుబడి ఉన్నాం. మూడేళ్లలో రూ.9,750 కోట్ల విలువైన విడిభాగాలను భారత్ నుంచి కొనుగోలు చేశాం. 10 ఏళ్లలో కొనుగోళ్లు 16 రెట్లకు చేరుకున్నాయి. 6,000 మందికి ఉపాధి కల్పించగలిగాం. ఎయిర్‌బస్ పూర్తి స్థాయి శిక్షణ కేంద్రం ఆసియాలో మొదటిసారిగా ఢిల్లీలో నెలకొల్పుతున్నాం' అని తెలిపారు. హైదరాబాద్ స్టార్టప్స్‌తో చేతులు కలుపబోతున్నారా అన్న ప్రశ్నకు టి–హబ్‌తో కలిసి పనిచేయబోతున్నామని చెప్పారు.



ఎయిర్‌బస్ ప్రతినిధులు జూస్ వాన్, శ్రీనివాసన్

టీసీఎస్ బ్రాండ్... 10 బిలియన్ డాలర్లపైనే!!



ముంబై: దేశీ దిగ్గజ ఐటీ సర్వీసెస్ సంస్థ 'టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్' (టీసీఎస్) తాజాగా అరుదైన ఘనత సొంతం చేసుకుంది. 2018లో ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఐటీ సర్వీసెస్ బ్రాండ్‌గా టీసీఎస్ అవతరించింది. ప్రముఖ బ్రాండ్ వాల్యుయేషన్ సంస్థ 'బ్రాండ్ ఫైనాన్స్' నివేదికలో ఈ విషయం వెల్లడయ్యింది. దీని ప్రకారం.. టీసీఎస్ బ్రాండ్ విలువ వార్షిక ప్రాతిపదికన 1.309 బిలియన్ డాలర్ల పెరుగుదలతో 9.081 బిలియన్ డాలర్ల నుంచి 10.391 బిలియన్ డాలర్లకు ఎగసింది. బ్రాండ్ విలువలో 14.4 శాతం వృద్ధి నమోదయ్యింది. ఐటీ పరిశ్రమలోని ఏ ఇతర సంస్థ బ్రాండ్ విలువలోనూ ఈ స్థాయి వృద్ధి నమోదు కాలేదు. దీంతో గ్లోబల్ ఐటీ సర్వీసెస్ రంగంలో టాప్–3 అత్యంత విలువైన బ్రాండ్స్ సరసన టీసీఎస్ చోటు దక్కించుకుంది. తొలి రెండు స్థానాల్లో ఐబీఎం, యాక్సెంచర్ ఉన్నాయి. టాటా బ్రాండ్ విలువ (14.236 బిలియన్ డాలర్లు)లో టీసీఎస్ వాటా 73 శాతానికిపైగా ఉండటం గమనార్హం.

చిన్న విమానాశ్రయాల నుంచి కార్గో: జయంత్ సిన్హా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుతం భారత ఎయిర్ కార్గో రంగంలో టాప్–10 ఎయిర్‌లైన్స్ హవా నడుస్తోంది. దేశీయ, అంతర్జాతీయ సరుకు రవాణా విషయంలో వీటి వాటా ఏకంగా 65 శాతమని విమానయాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా చెప్పారు. ఈ విమానాశ్రయాలపై భారం తగ్గించడానికి చిన్న విమానాశ్రయాల నుంచి సరుకు రవాణాను ప్రోత్సహిస్తామని చెప్పారు. 'ఎయిర్ కార్గో దేశంలో ఏటా 15% వృద్ధి చెందుతోంది. వార్షికంగా 3.7 లక్షల మెట్రిక్ టన్నుల సరుకు రవాణా జరుగుతోంది. వ్యవసాయ, ఆహార, ఫార్మా, చర్మ సంబంధ ఉత్పత్తులు, వస్త్రాలు వీటిలో అధికం' అని చెప్పారు.

ఎయిర్ కోస్టాకు మళ్లీ రెక్కలు?

ఈ ఏడాదే సేవలు తిరిగి ప్రారంభం!

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రెక్కలు తెగి ఆగిపోయిన ఎయిర్ కోస్టా... మళ్లీ రెక్కలు తొడుక్కోనుందా? 50 విమానాల కోసం ఎయిర్ కోస్టా ఇచ్చిన ఆర్డరింకా రద్దు కాలేదని ఎంబ్రాయిర్ సంస్థ స్పష్టం చేయడంతో ఈ ఊహాగానాలు నిజం కావచ్చనే అనిపిస్తోంది. తెలుగు రాష్ట్రాల నుంచి ప్రారంభం అయిన తొలి విమానయాన సంస్థ ఎయిర్ కోస్టా.. నిధుల సమస్యతో 2016 జూలై నుంచి తన సర్వీసులను నిలిపేయటం తెలిసిందే. సమస్య నుంచి బయట పడేందుకు ఎయిర్ కోస్టా ప్రయత్నిస్తోందని ఎంబ్రాయిర్ కమర్షియల్ ఏవియేషన్ ఆసియా పసిఫిక్ వైస్ ప్రెసిడెంట్ సీజర్ పెరీరా వెల్లడించారు. ఇక్కడ జరుగుతున్న వింగ్స్ ఇండియా 2018లో భాగంగా శుక్రవారం ఆయన మీడియాతో ఈ విషయాలు చెప్పారు. '50 విమానాల కోసం ఎయిర్ కోస్టా ఇచ్చిన ఆర్డరింకా మా పుస్తకాల్లో ఉంది. రద్దు కాలేదు. ఆ సంస్థ తిరిగి సర్వీసులు ప్రారంభించవచ్చు. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే తప్ప ఆర్డరు రద్దు చేయం. ఆ సంస్థతో సంప్రతింపులు జరుపుతున్నాం. సమస్య నుంచి బయటపడేందుకు ఎయిర్ కోస్టా కృషి చేస్తోంది. ఆ సంస్థ ఆర్డర్లు వేరే కంపెనీకి బదిలీ చేయలేదు' అని పేర్కొన్నారు.



యెస్.. నిజమే: ఎయిర్ కోస్టా..

విజయవాడకు చెందిన లింగమనేని గ్రూప్ ఎయిర్ కోస్టాను ప్రమోట్ చేస్తోంది. పెరీరా వ్యాఖ్యలు నిజమేనని ఎల్ఈపీఎల్ ప్రతినిధి ఒకరు సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. 'మీరు విన్నది నిజమే. త్వరలోనే ఎయిర్ కోస్టాకు రెక్కలు రానున్నాయి. అన్నీ అనుకూలిస్తే ఈ ఏడాదే సర్వీసులు తిరిగి ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నాం' అని ఆయన వెల్లడించారు. ఎంబ్రాయిర్‌తో సంప్రతింపులు కొనసాగుతున్నాయని ధ్రువీకరించారు.


240 విమానాశ్రయాలకు క్లబ్ వన్ ఎయిర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: చార్టర్ ఆపరేటర్ క్లబ్ వన్ ఎయిర్ భారత్‌లో 240 విమానాశ్రయాలకు సేవలు అందిస్తోంది. ఎయిర్ స్ట్రిప్ ఉన్న చిన్న విమానాశ్రయాల్లోనూ అడుగుపెడుతున్నట్టు సంస్థ సీఈవో రాజన్ మెహ్రా తెలిపారు. మార్కెటింగ్ హెడ్ సంజీవ్ సేథితో కలిసి మీడియాతో మాట్లాడారు. కొత్తగా కొనుగోలు చేసిన ఫాల్కన్ 2000 మోడల్‌తో కలిపి సంస్థ వద్ద 10 విమానాలు ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది నాలుగైదు కొత్త విమానాలను కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. నడుస్తున్న తమ వద్ద 250 మంది ఉద్యోగులు ఉన్నారని వివరించారు. 'ప్రపంచంలో ఎక్కడా లేనంతగా విమాన ఇంధనం ధర భారత్‌లోనే ఎక్కువ. ఇంధనంపై రాష్ట్రాన్ని బట్టి పన్నులు 4–40% దాకా ఉన్నాయి. ఫ్యూయల్ వ్యయాలు విదేశాల్లో 15 శాతమే. ఇక్కడ ఏకంగా 40% దాటాయి. విమాన దిగుమతి సుంకమూ ఎక్కువే. ఇవన్నీ పరిశ్రమ వృద్ధికి అడ్డంకులు' అని చెప్పారు.



మీడియాతో రాజన్ మెహ్రా, సంజీవ్ సేథి

రేటు పావుశాతం పెరగొచ్చు: కేర్ రేటింగ్స్



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు– రెపోను (ప్రస్తుతం 6 శాతం) 2018లో పావుశాతం పెంచే అవకాశం ఉందని కేర్ రేటింగ్స్ తన తాజా నివేదికలో పేర్కొంది. ద్రవ్యోల్బణం అధిక శ్రేణికి పెరిగే అవకాశం ఉండటమే దీనికి కారణమని పేర్కొంది. ప్రభుత్వ ఆదాయ వ్యయాలకు సంబంధించిన నికర వ్యత్యాసమైన ద్రవ్యలోటు పెరుగుతోందని, చమురు ధరల తీవ్రత, వ్యవసాయ వృద్ధి తగ్గడం వంటివి ధరల పెరుగుదలకు దారితీసే అవకాశం ఉందని అభిప్రాయపడింది. 2 శాతం ప్లస్, 2 శాతం మైనస్‌తో 4 శాతం వద్ద ద్రవ్యోల్బణం ఉండాలన్నది ఆర్‌బీఐ లక్ష్యం. అయితే ఈ శ్రేణికి మించి ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని కేర్ తన నివేదికలో వెల్లడించింది.

లోహ షేర్లకు సెగ

కొనసాగిన బ్యాంక్ షేర్ల నష్టాలు • 43 పాయింట్ల పతనంతో 33,307కు సెన్సెక్స్

• 16 పాయింట్ల నష్టంతో 10,227కు నిఫ్టీ



చివరి గంటలో జరిగిన అమ్మకాలు ఆరంభ లాభాలను హరించేయడంతో శుక్రవారం స్టాక్ మార్కెట్ నష్టపోయింది. ఉక్కు, అల్యూమినియమ్ ఉత్పత్తులపై అమెరికా దిగుమతి సుంకాలు విధించడంతో వాణిజ్య యుద్ధాలు చెలరేగుతాయనే ఆందోళనతో లోహ షేర్లలో అమ్మకాలు జరగడం, బ్యాంక్ షేర్లలో నష్టాలు కొనసాగడం ప్రతికూల ప్రభావం చూపించాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 43 పాయింట్లు పతనమై 33,307 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 16 పాయింట్లు క్షీణించి 10,227 పాయింట్ల వద్ద ముగిశాయి. ఇక వారం పరంగా చూస్తే, వరుసగా రెండో వారమూ స్టాక్ మార్కెట్ నష్టపోయింది. సెన్సెక్స్740 పాయింట్లు, నిఫ్టీ 232 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.

లోహ షేర్లు విలవిల...

ఉక్కు ఉత్పత్తులపై 25 శాతం, అల్యూమినియమ్ ఉత్పత్తులపై 10 శాతం చొప్పున అమెరికా దిగుమతి సుంకాలు విధించింది. దీంతో లోహ షేర్లు వెలవెలపోయాయి. సెయిల్ 6.4 శాతం నష్టపోయి రూ.69.45 వద్ద ముగిసింది. జిందాల్ స్టీల్ 5.2 శాతం, టాటా స్టీల్ 4.6 శాతం, నాల్కో 2.1 శాతం, ఎన్ఎమ్‌డీసీ 1.8 శాతం, వేదాంత 1.5 శాతం, హిందాల్కో 1.2 శాతం చొప్పున క్షీణించాయి. బ్యాంక్‌షేర్ల నష్టాలు కొనసాగాయి. యాక్సిస్ బ్యాంక్ 3 శాతం వరకూ, బ్యాంక్ ఆఫ్ బరోడా 2.1 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.4 శాతం, యస్ బ్యాంక్ 1.4 శాతం, ఎస్‌బీఐ 1.4 శాతం చొప్పున నష్టపోయాయి. డాలర్‌తో రూపాయి మారకం బలహీనపడటంతో ఐటీ షేర్లు పెరిగాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రోలు 1 శాతం వరకూ లాభపడ్డాయి.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	3,212
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	25,975
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	4,81,492
ఎఫ్ఐఐ	550
డీఐఐ	-65

జీటీఎల్ ఇన్‌ఫ్రా 20 శాతం డౌన్...

ఎయిర్‌సెల్ దివాలా తమపై బాగానే ప్రభావం చూపించగలదని జీటీఎల్ ఇన్‌ఫ్రా వెల్లడించడంతో జీటీఎల్ ఇన్‌ఫ్రా షేర్ 20 శాతం పతనమై, తాజా ఏడాది కనిష్ట స్థాయి,రూ.3.11కు పడిపోయింది. ఈ ఏడాదిలో ఈ షేర్ 57 శాతం నష్టపోయింది. తమ మొత్తం ఆదాయంలో 43 శాతం వరకూ ఎయిర్‌సెల్ నుంచే వస్తోందని జీటీఎల్ ఇన్‌ఫ్రా పేర్కొంది.

కొనసాగిన గీతాంజలి జెమ్స్ పతనం...

గీతాంజలి జెమ్స్ షేర్ పతనం కొనసాగుతోంది. ఈ షేర్ మరో 5% పతనమై ఏడాది కనిష్ట స్థాయి, రూ.15.80కు పడిపోయింది. వరుసగా 17వ రోజు ఈ షేర్ పతనమైంది.

263 పాయింట్ల శ్రేణిలో కదిలిన సెన్సెక్స్

ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జంగ్ యున్‌తో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించడంతో గురువారం అమెరికా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఈ దన్నుతో శుక్రవారం ఆసియా మార్కెట్లు లాభపడడం సానుకూల ప్రభావం చూపించింది. సెన్సెక్స్ ఒక దశలో 168 పాయింట్ల లాభంతో 33,519 పాయింట్ల వద్ద ఇంట్రాడేలో గరిష్టాన్ని తాకింది. అయితే ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై అమెరికా సుంకాలు విధించడంతో లోహ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడం, బ్యాంక్ షేర్ల నష్టాలు కొనసాగడం, పై స్థాయిల్లో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో చివర్లో నష్టాలు వచ్చాయి. సెన్సెక్స్ ఒక దశలో 95 పాయింట్ల నష్టంతో 33,256 పాయింట్ల వద్ద ఇంట్రాడేలో కనిష్ట స్థాయిని తాకింది. మొత్తం మీద రోజంతా 263 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. మరో వైపు నిఫ్టీ ఒక దశలో 54 పాయింట్లు పెరగ్గా, మరో దశలో 31 పాయింట్లు నష్టపోయింది. స్టాక్ మార్కెట్ లాభాల్లో ఆరంభమైందని, అయితే గురువారం నాటి ర్యాలీ కారణంగా అమ్మకాలు జరిగాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు.

ఆర్ఈసీ బాండ్లకు బీఏఏ3 రేటింగ్

మధ్య స్థాయి రిస్క్ అంటున్న మూడీస్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) సీనియర్ అన్ సెక్యూర్డ్ బాండ్లకు మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ సంస్థ బీఏఏ3 రేటింగ్‌ను ఇచ్చింది. ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించిన రేటింగ్‌లో ఇది అత్యంత కనిష్ట స్థాయి. మధ్యస్థాయి రిస్క్‌ను ఇది సూచిస్తుంది. అయితే రేటింగ్ అవుట్‌లుక్ 'స్థిరం' అని పేర్కొంది. ఆర్ఈసీ తన మధ్య కాలిక నోట్ ప్రోగ్రామ్‌లో భాగంగా 300 కోట్ల డాలర్ల బాండ్లను జారీ చేస్తోంది. ఈ బాండ్ల మెచ్యూరిటీ కాలం పదేళ్లు. ఇవి సింగపూర్ ఎక్స్ఛేంజ్ సెక్యూరిటీస్ ట్రేడింగ్ లిమిటెడ్ (ఎస్‌జీఎక్స్–ఎస్‌టీ), లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు చెందిన ఇంటర్నేషనల్ సెక్యూరిటీస్ మార్కెట్‌లో (ఐఎస్ఎమ్) లిస్టవుతాయి. ప్రభుత్వ విద్యుత్ సంస్థలకు ప్రాధాన్య రుణదాతగా ఆర్ఈసీకి మంచి ట్రాక్ రికార్డ్ ఉందని మూడీస్ ఈ సందర్భంగా పేర్కొంది. గ్రామీణ విద్యుదీకరణ ప్రాజెక్ట్‌లకు, విద్యుత్ ప్రసారం, పంపిణీ, విద్యుదుత్పత్తి ప్రాజెక్ట్‌లకు ఆర్ఈసీ రుణాలందిస్తోందని వివరించింది.

421 బిలియన్ డాలర్లకు ఫారెక్స్ నిల్వలు



ముంబై: విదేశీ మారకం నిల్వలు మార్చి 2తో ముగిసిన వారంలో 167.8 మిలియన్ డాలర్ల మేర పెరిగి 420.75 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతకుముందు వారంలో 1.13 బిలియన్ డాలర్ల మేర తగ్గడం గమనార్హం. ఫిబ్రవరి 9న విదేశీ మారకం నిల్వలు ఆల్ టైమ్ గరిష్ట స్థాయి 421.91 బిలియన్ డాలర్లుగా నమోదైన విషయం తెలిసిందే. గతేడాది సెప్టెంబర్‌లో ఫారెక్స్ నిల్వలు తొలిసారిగా 400 బిలియన్ డాలర్ల మార్కును దాటగా, అప్పటి నుంచి హెచ్చు, తగ్గులు చోటు చేసుకుంటున్నాయి.

ఆర్‌కామ్‌కు సీసీఐ ఊరట

న్యూఢిల్లీ: రుణ సంక్షోభంలో కూరుకుపోయిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్)కు ఊరట లభించింది. కంపెనీకి చెందిన టవర్లు, ఆప్టిక్ ఫైబర్ కేబుల్, స్పెక్ట్రం తదితర ఇన్‌ఫ్రా అసెట్స్‌ని రిలయన్స్ జియోకి విక్రయించుకునే ప్రతిపాదనకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మైక్రో బ్లాగింగ్ సైటు ట్వీటర్‌లో ట్వీట్ ద్వారా సీసీఐ ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ లావాదేవీ విలువ రూ. 18,000 కోట్లు ఉండొచ్చని అంచనా. 2017 డిసెంబర్‌లో ఆర్‌కామ్, జియో ఇందుకు సంబంధించిన ఒప్పందం కుదుర్చుకున్నాయి. దశలవారీగా 2018 మార్చికల్లా ఈ డీల్ పూర్తి కావొచ్చు.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,545	▼	90
బంగారం (99.5, 10గ్రా)	30,395	▼	90
వెండి (కిలో)	38,385	▲	25
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		
బంగారం (22 క్యారెట్లు)	29,050	▼	100
వెండి (కిలో)	– –		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,500	▼	110
బంగారం (22 క్యారెట్లు)	29,050	▼	100
వెండి (కిలో)	41,500	▼	0
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,320	▼	80
బంగారం (22 క్యారెట్లు)	28,980	▼	50
వెండి (కిలో)	39,500	▼	200
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	31,040	▼	140
బంగారం (22 క్యారెట్లు)	29,020	▼	130
వెండి (కిలో)	41,700		0
విజయవాడ (గురువారం ధరలు)			
బంగారం (24 క్యారెట్లు)	31,500		
బంగారం (22 క్యారెట్లు)	29,200		
వెండి(కిలో)	39,600		
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,420	▼	100
బంగారం (22 క్యారెట్లు)	29,050	▼	100
వెండి (కిలో)	39,500		0

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	61.77 (రాత్రి 11.00కు)	$60.12 (గురువారం ముగింపు)
బ్రెంట్	65.18 (రాత్రి 11.00కు)	$63.61 (గురువారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 10-3-2018

విశాఖ	330–00
చిత్తూరు	378–00
వరంగల్	332–00
ముంబై	370–00
చెన్నై	385–00
విజయవాడ	320–00
గోదావరి	320–00
నమక్కల్	370–00
09–3–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	330–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.90
బెంగళూరు	375–00
కోల్‌కతా	368–00
ఢిల్లీ	325–00

నిస్తేజంగా హెచ్‌జీ ఇన్‌ఫ్రా లిస్టింగ్

ఇష్యూ ధర వద్దే లిస్టింగ్, క్లోజింగ్

న్యూఢిల్లీ: హెచ్‌జీ ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ కంపెనీ షేర్ స్టాక్ మార్కెట్లో పేలవంగా లిస్టయింది. బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో ఈ షేర్ ఇష్యూ ధర, రూ.270 వద్దే లిస్టయింది. ఇంట్రాడేలో రూ.276, రూ.253 గరిష్ట, కనిష్ట స్థాయిల మధ్య కదలాడింది. చివరకు ఇష్యూ ధర రూ.270 వద్దే ముగిసింది. ఎన్ఎస్ఈలో మాత్రం 0.8 శాతం నష్టంతో రూ.268 వద్ద ముగిసింది. బీఎస్ఈలో 33 లక్షలు, ఎన్ఎస్ఈలో 1.58 కోట్ల షేర్లు ట్రేడయ్యాయి. గత నెల 26–28 మధ్య రూ.263–270 ప్రైస్‌బాండ్‌తో వచ్చిన ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.462 కోట్లు సమీకరించింది. ఈ నిధులను సాధారణ వాణిజ్య అవసరాలకు, రుణ భారం తగ్గించుకోవడానికి, మూలధన పరికరాల కొనుగోళ్లకు వినియోగించుకోవాలని కంపెనీ యోచిస్తోంది. ఈ ఐపీఓకు ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు మర్చంట్ బ్యాంకర్లుగా వ్యవహరించాయి.

భెల్‌కు భారీ ఆర్డర్

జార్ఖండ్ పవర్ ప్రాజెక్టు నుంచి.. • విలువ రూ.11,700 కోట్లు



న్యూఢిల్లీ: విద్యుదుత్పత్తి పరికరాలు తయారు చేసే ప్రభుత్వ రంగ కంపెనీ, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌కు (భెల్) భారీ ఆర్డర్ లభించింది. జార్ఖండ్‌లో థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు ఆర్డర్‌ను సాధించామని, ఈ ఆర్డర్ విలువ రూ.11,700 కోట్లని భెల్ తెలిపింది. ఎన్‌టీపీసీ, జార్ఖండ్ బిజిలి వితరణ్ నిగమ్ లిమిటెడ్‌ల జాయింట్ వెంచర్– పత్రతు విద్యుత్ ఉత్పదాన్ నిగమ్ లిమిటెడ్(పీవీయూఎన్ఎల్) ఈ థర్మల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. జార్ఖండ్‌లోని రామ్‌గఢ్ జిల్లాలోని పత్రతులో ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో ఈ ప్రాజెక్ట్‌ను చేపడతామని తెలిపింది. స్టాక్ మార్కెట్ నష్టపోయినప్పటికీ, ఈ భారీ ఆర్డర్ భెల్‌కు దక్కిందన్న వార్తల నేపథ్యంలో బీఎస్ఈలో భెల్ షేర్ 0.2 శాతం లాభంతో రూ.86 వద్ద ముగిసింది.

భారతీ ఎయిర్‌టెల్ రూ.3,000 కోట్లు సమీకరణ!



న్యూఢిల్లీ: టెలికం దిగ్గజ కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ రూ.3,000 కోట్ల వరకూ నిధులు సమీకరించనుంది. నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) ద్వారా ఈ నిధులు సమీకరిస్తామని, దీనికి సంబంధించిన అంశాలపై చర్చించడానికి ఈ నెల 12న డైరక్టర్ల సమావేశంతో పాటు 13న డైరెక్టర్ల కమిటీ కూడా భేటీ అవుతుందని భారతీ ఎయిర్‌టెల్ బీఎస్ఈకి నివేదించింది. గత ఏడాది డిసెంబర్ చివరి నాటికి కంపెనీ రుణ భారం రూ.91,714 కోట్లుగా ఉంది. ఈ నిధుల సమీకరణ వార్తల నేపథ్యంలో బీఎస్ఈలో భారతీ ఎయిర్‌టెల్ షేర్ స్వల్పంగా లాభపడి రూ.402 వద్ద ముగిసింది.

ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్‌కు రూ.5 కోట్ల జరిమానా



ముంబై: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాజాగా ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్‌పై రూ.5 కోట్ల జరిమానా విధించింది. కేవైసీ నిబంధనలను, నిర్వహణా మార్గదర్శకాలను అతిక్రమించిన కారణంగా ఈ మేరకు జరిమానా విధిస్తున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ కస్టమర్ల అనుమతి తీసుకోకుండా ఖాతాలు తెరిచిందనే ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ గతేడాది నవంబర్ 20–22 మధ్యకాలంలో ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్‌లో తనిఖీలు నిర్వహించింది. ఇందులో బ్యాంక్ నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలింది. కాగా ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ గతేడాది జనవరిలో కార్యకలాపాలను ప్రారంభించింది.

భూషణ్ స్టీల్ రుణ పరిష్కారంతో బ్యాంకులకు లబ్ధి: మూడీస్



న్యూఢిల్లీ: భారీ రుణ సంక్షోభంలో కూరుకుపోయిన భూషణ్ స్టీల్ వివాద పరిష్కారం... బ్యాంకులకు రుణపరపతి పరంగా సానుకూలమని మూడీస్ ఇన్వెస్టర్ సర్వీసెస్ పేర్కొంది. ముఖ్యంగా బ్యాంకుల కన్సార్షియానికి సారథ్యం వహిస్తున్న ఎస్‌బీఐకి మరింత ప్రయోజనం చేకూరగలదని వివరించింది. చాలా మటుకు భారతీయ బ్యాంకులు భూషణ్ స్టీల్‌కు ఎంతో కొంత అప్పు ఇచ్చి ఉంటాయని మూడీస్ ఇన్వెస్టర్ సర్వీసెస్ అంచనా వేసింది. దాదాపు రూ. 44,478 కోట్ల మేర రుణాలు బాకీ పడిన భూషణ్ స్టీల్‌పై దివాలా చట్టం కింద చర్యల ప్రక్రియ జరుగుతోన్న సంగతి తెలిసిందే. టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ లివింగ్, భూషణ్ స్టీల్ ఉద్యోగుల కన్సార్షియం... కంపెనీ అసెట్స్‌ను కొనుగోలు చేసేందుకు బిడ్లు వేశాయి. అత్యధిక బిడ్ తామే దాఖలు చేసినట్లు టాటా స్టీల్ చెబుతోంది.

భూషణ్ పవర్ ఎవరి సొంతమో తేలేది వచ్చే వారమే




న్యూఢిల్లీ: భూషణ్ పవర్ అండ్ స్టీల్ కంపెనీ ఆస్తుల కొనుగోలుకు అధిక బిడ్డర్ ఎవరన్నది వచ్చే వారంలో తేలిపోనుంది. ఈ కంపెనీకి రుణాలిచ్చిన బ్యాంకుల కన్సార్షియం 14న సమావేశమై దీనిపై నిర్ణయాన్ని తీసుకోనుంది. భారీ స్థాయిలో రుణాలు తీసుకుని ఎగవేసిన ఈ కంపెనీ దివాలా పరిష్కార ప్రక్రియ కిందకు వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో సంస్థ ఆస్తుల విక్రయ ప్రక్రియ జరుగుతోంది.

ఎస్ఎఫ్ఐఓ విచారణకు హాజరైన సింఘాల్

రూ.1,000 కోట్ల నిధుల మళ్లింపు కేసుకు సంబంధించి భూషణ్ స్టీల్ చైర్మన్ బీబీ సింఘాల్ సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ విభాగం ముందు హాజరయ్యారు. ఈ విషయాన్ని కంపెనీ బీఎస్ఈకి తెలియజేసింది.

కుమ్మక్కై ధరలు పెంచితే కఠిన చర్యలు

సిమెంట్, ఉక్కు కంపెనీలకు కేంద్ర మంత్రి హెచ్చరిక



న్యూఢిల్లీ: ధరలు పెంచడానికి కుమ్మక్కయితే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని సిమెంట్, ఉక్కు రంగ కంపెనీలను కేంద్ర రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ హెచ్చరించారు. ఇటీవల కాలంలో మౌలిక రంగ కార్యకలాపాలు ఊపందుకున్నాయని, నాణ్యతలో రాజీపడకుండా ప్రాజెక్ట్‌ల వ్యయాలను తగ్గించేలా కొత్త టెక్నాలజీలు ఉండాలని ఆయన సూచించారు. రాయల్టీ, కార్మికుల వ్యయాలు పెరగకపోయినా, నిర్మాణ రంగంలో వ్యయాలు పెరిగాయని చెప్పారు. కంపెనీలు కుమ్మక్కవ్వడం వల్లే సిమెంట్, ఉక్కు ధరలు పెరిగాయని వివరించారు. ఇప్పుడు ఇసుక ధర కూడా సిమెంట్ ధరతో సమానమైందని తెలిపారు.

కంపెనీలు లాభాలు ఆర్జించడం పట్ల ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేదని, అయితే ఆ లాభార్జన సమంజసంగా ఉండాలని గడ్కరీ సూచించారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే అది మంచిది కాదని, దీనిని నియంత్రించాల్సిన బాధ్యత కంపెనీదేనని, ఈ విషయమై తీవ్రమైన కసరత్తే చేస్తున్నామని వివరించారు. కంపెనీలు కుమ్మక్కై ధరలను పెంచితే, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ జరిగిన ఒక వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. తాను రైతు బిడ్డనని, నీరు అమూల్యమైన వనరని, నీటి వనరుల సమర్థ నిర్వహణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తగినంతగా నీటి వనరులు లేకపోవడం వల్ల పంటలు సరిగ్గా పండటం లేదని, ఫలితంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్పొ బ్రీఫ్

రిలయన్స్ కమ్యూనికేషన్స్: ఈ కంపెనీకి చెందిన ప్రమోటర్ సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఎంటర్‌ప్రైజెస్ రూ.304 కోట్ల విలువైన ఆర్‌కామ్ షేర్లను హెచ్‌డీఎఫ్‌సీకి తాకట్టు పెట్టింది. మొత్తం షేర్ మూలధనంలో 4.85 శాతానికి సమానమైన 13.4 కోట్ల షేర్లను హెచ్‌డీఎఫ్‌సీ వద్ద తాకట్టు పెట్టామని పేర్కొంది. ఈ నేపథ్యంలో బీఎస్ఈలో ఈ షేర్ 10 శాతం నష్టంతో రూ.22.7 వద్ద ముగిసింది.

ఓపాల్‌లో ఓఎన్‌జీసీ వాటా విక్రయం

త్వరలో రుణ రహిత కంపెనీగా మారతాం: ఓఎన్‌జీసీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) గుజరాత్‌లోని మెగా పెట్రోకెమికల్ ప్రాజెక్ట్ ఓపాల్‌లో వాటాను విక్రయించే అవకాశాలున్నాయి. హిందుస్తాన్ పెట్రోలియమ్ కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) కొనుగోలు కోసం తీసుకున్న బ్యాంక్ రుణాలను తీర్చడానికి ఈ సొమ్మును వినియోగిస్తామని కంపెనీ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. గుజరాత్‌లోని దహేజ్‌లో ఓఎన్‌జీసీ–పెట్రో అడిషన్స్ లిమిటెడ్ (ఓపాల్) ప్లాంట్ ఉందని, దీన్లో రూ.30,000 కోట్లు ఇన్వెస్ట్ చేశామని, గత ఏడాదే కార్యకలాపాలు ప్రారంభించిన ఈ ప్లాంట్ గత నెల్లో పూర్తి స్థాయి సామర్థ్యాన్ని సాధించిందని ఆ అధికారి తెలిపారు. సాధారణంగా తమ కంపెనీ రుణ రహిత కంపెనీ అని, హెచ్‌పీసీఎల్ కోసం బ్యాంక్‌ల నుంచి రుణాలు తీసుకోవలసివచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ రుణం తీర్చడానికి తగిన ఆస్తులున్నాయని, వీటిని విక్రయించి ఈ రుణాలు తీర్చేస్తామని త్వరలోనే మళ్లీ రుణ రహిత కంపెనీగా మారతామని తెలిపారు.

డిటర్జెంట్ల తయారీలోకి జీసీసీ!

- రూ.5కే 100 గ్రాముల సబ్బు
- నెలకు 2 లక్షల సబ్బులు విక్రయించాలని లక్ష్యం
- త్వరలో డీఆర్ డిపోల ద్వారా అందుబాటులోకి


రవిప్రకాష్

సాక్షి, విశాఖపట్నం: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) డిటర్జెంట్ సబ్బుల తయారీలోకి అడుగుపెడుతోంది. ఇప్పటికే జీసీసీ వివిధ రకాల స్నానపు సబ్బులను తయారు చేస్తోంది. తాజాగా గిరిజనుల కోసమే డిటర్జెంట్ (బట్టలు ఉతికే) సబ్బులను ఉత్పత్తి చేసి విక్రయించడానికి సన్నాహాలు పూర్తి చేసింది. విజయనగరంలో ఉన్న జీసీసీ సబ్బుల తయారీ యూనిట్ ప్రాంగణంలోనే ఈ డిటర్జెంట్లను కూడా తయారు చేయనున్నారు. మార్కెట్లో గిరిజనులు ఇతర రకాల డిటర్జెంట్ సబ్బులను రూ.15–20కు (100 గ్రాములు) కొనుగోలు చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని వివిధ సంతల్లో 70 శాతానికి పైగా అసలును పోలిన నకిలీ డిటర్జెంట్ సబ్బులనే విక్రయిస్తుంటారు. మార్కెట్లో పేరున్న బ్రాండ్ల సబ్బుల్లా కనిపించేలా రేపర్లను (పై కవర్లు) ముద్రించి విక్రయిస్తున్నారు. వీటిలో నాణ్యత లేకున్నా గత్యంతరం లేక గిరిజనులు కొనుగోలు చేస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన డిటర్జెంట్ సబ్బులను తయారు చేసి, గిరిజనులకు తక్కువ ధరకు విక్రయించాలని జీసీసీ ఉన్నతాధికారులు యోచించారు. దీంతో విజయనగరంలో ఉన్న సబ్బుల తయారీ యూనిట్‌లో వీటిని ప్రయోగాత్మకంగా ఉత్పత్తి చేశారు. వాటి నాణ్యతను నిర్ధారించుకున్నాక ఇప్పుడు తయారీకి సిద్ధమవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో నెలకు సగటున రెండు లక్షల డిటర్జెంట్ సబ్బుల వినియోగం జరుగుతున్నట్టు జీసీసీ అధికారులు అంచనాకు వచ్చారు. దీంతో ఆ మేరకు ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. వీటిని జీసీసీకి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డీఆర్ (డొమెస్టిక్ రిక్వైర్‌మెంట్) డిపోల ద్వారా విక్రయించాలని నిర్ణయించారు. వంద గ్రాముల సబ్బు రూ.5 ధరకే విక్రయిస్తారు. దీనివల్ల గిరిజనులకు ఆర్థికంగా లబ్ధి చేకూరనుంది.

గిరిజనుల కోసమే..

ఈ సబ్బులను బయట మార్కెట్లో కాకుండా గిరిజన ప్రాంతాల్లోని డీఆర్ డిపోల్లోనే విక్రయిస్తాం. బయటి సబ్బుల కన్నా నాణ్యంగా, తక్కువ ధరకే అందిస్తాం. విజయనగరం యూనిట్‌కి నెలకు 6 లక్షల డిటర్జెంట్ సబ్బుల తయారీ సామర్థ్యం ఉంది. ఇప్పటికే వీటిని ప్రయోగాత్మకంగా తయారు చేసి చూశాం. త్వరలోనే వీటి ఉత్పత్తిని ప్రారంభించి అమ్మకాలు చేపడతాం. – **ఏఎస్‌పీఎస్ రవిప్రకాష్, ఎండీ, జీసీసీ**

ప్రభుత్వ బ్యాంకులకు 19,533 కోట్ల టోపీ..!

2016–17లో పరిస్థితి ఇదీ.. • పార్లమెంటులో జైట్లీ



న్యూఢిల్లీ: లక్ష రూపాయలు, ఆపైన జరిగిన మోసాలకు సంబంధించి 2016–17లో ప్రభుత్వ రంగంలోని మొత్తం 27 బ్యాంకులు (ఐదు అనుబంధ బ్యాంకులు, భారతీయ మహిళా బ్యాంక్ ఎస్‌బీఐలో విలీనం కావడానికి ముందు) ఏకంగా రూ. 19,533 కోట్లు నష్టపోయాయి. ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంటుకు శుక్రవారం ఈ విషయం తెలియజేశారు. 2015–16లో ఈ విలువ రూ.16,910 కోట్లు (2,789 కేసులు) కాగా, 2014–15లో రూ.16,803 కోట్లు (3,113 కోట్లు). 2016–17కు సంబంధించి ఆర్థికమంత్రి తాజాగా తెలిపిన సమాచారం ప్రకారం వివరాలివీ...

బ్యాంకు	నష్టపోయిన మొత్తం (రూ.కోట్లలో)	కేసుల సంఖ్య	ఉద్యోగుల ప్రమేయం ఉన్న కేసులు
ఎస్‌బీఐ	2,422	544	83
పీఎన్‌బీ	2,808	158	18
బ్యాంక్ ఆఫ్ ఇండియా	2,774	162	–
బ్యాంక్ ఆఫ్ బరోడా	1,165	224	–
ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్	1,372	95	–
ఐడీబీఐ బ్యాంక్	1,137	107	–
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	921	111	–
అలహాబాద్ బ్యాంక్	896	60	–
సెంట్రల్ బ్యాంక్	868	146	–

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	377.9	387.95
AMBUJA CEME	235.4	236.25
ASIAN PAINT	1129.1	1127.6
AXIS BANK L	505.35	520.55
BAJAJ AUTO	2935.4	2923.9
BAJAJ FINAN	1654.2	1628.05
BHARTI AIRT	402.15	401.3
BOSCH LIMIT	18203.55	18094.8
BHARAT PETR	439.4	442.2
CIPLA LTD	571.05	578
COAL INDIA	304.05	305.5
EICHER MOTO	27963.85	27711.85
GAIL (INDIA	436.9	436.45
HCL TECHNOL	943	950.65
HDFC LTD	1818.6	1798.75
HDFC BANK L	1851.05	1852.85
HERO MOTOCO	3586.35	3586.7
HINDALCO I	220.2	222.7
HINDUSTAN P	357.05	360.55
HINDUSTAN U	1300.75	1293.15
INDIABULLS	1199.2	1206.35
ICICI BANK	292.7	296.95
INDUSIND BA	1697.55	1694.15
BHARTI INFR	333.15	331.2
INFOSYS LIM	1163.4	1156.65
INDIAN OIL	385.5	382.1
ITC LTD	259.25	258.85
KOTAK MAHIN	1082.45	1082.3
LARSEN & TO	1290.5	1283.8
LUPIN LIMIT	764.5	771.15
MAHINDRA &	728.5	726.65
MARUTI SUZU	8660.6	8729.35
NTPC LTD	164.4	165.3
OIL AND NAT	179.9	180.15
POWER GRID	192.9	195.4
RELIANCE IN	913.1	911.45
STATE BANK	253.25	256.8
SUN PHARMAC	506.8	514.6
TATA MOTORS	341.5	345.15
TATA STEEL	606.75	635.9
TATA CONSUL	3034.1	3003.95
TECH MAHIND	619.2	607.2
ULTRATECH C	4079.85	4119.9
UPL LIMITED	712.15	710.8
VEDANTA LIM	304.15	308.4
WIPRO LTD	285.05	285.2
YES BANK LI	303.25	308.55
ZEE ENTERTA	568.5	563.5
నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ		
ABB INDIA L	1437.7	1425.75
ACC LIMITED	1531.85	1544.95
ASHOK LEYLA	147	144.15
BAJAJ FINSE	4966.25	4864.6
BANK OF BAR	131.55	134.35
BHARAT ELEC	148.45	147.25
BHEL	86.15	86.1
BRITANNIA I	4841.8	4848.4
CADILA HEAL	384.2	388.9
COLGATE PAL	1037.65	1037.05
CONTAINER C	1248.7	1250.6
CUMMINS IND	776.75	783.4
DABUR INDIA	327.25	325.05
DLF LIMITED	211.35	218.4
AVENUE SUPE	1306.55	1293.15
EMAMI LIMIT	1084.5	1090.5
GLAXOSMITHK	2272.8	2286.25
GLENMARK PH	533.15	552.95
GODREJ CONS	1072.85	1067.1
GLAXOSMITHK	6626.75	6590
HAVELLS IND	503.25	502.55
HINDUSTAN Z	313.3	313.85
ICICI PRU L	390.5	388.3
IDEA CELLUL	78.85	79.65
INTERGLOBE	1289.6	1288.95
JSW STEEL L	291.95	289.25
LIC HOUSING	483.3	484.1
MARICO LIMI	308.6	303.3
UNITED SPIR	2978.25	3001.7
MOTHERSON S	317.15	316.25
MRF LTD	70781.65	70204.4
NHPC LTD	26.85	26.7
NMDC LTD.	121.9	124.05
ORACLE FIN	3892.1	3871.45
OIL INDIA L	320.85	326.55
PIRAMAL ENT	2362.6	2331.5
PETRONET LN	230.7	235.4
POWER FIN C	93.1	91.9
P&G HYGIENE	9402.7	9291.3
PIDILITE IN	878.7	872.25
PUNJAB NATI	95.6	96.65
RURAL ELEC	128.15	125.7
STEEL AUTHO	69.5	74.3
SHREE CEMEN	16000.75	16098.7
SIEMENS LTD	1085.8	1102.1
SHRIRAM TRA	1338.7	1326.25
SUN TV NETW	879.3	898.4
TATA POWER	80	79.9
TITAN COMPA	819.1	817.7
TORRENT PHA	1329.8	1317.8

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADITSPIN	8	8
ALPHAGEO	755	773.95
ALU FLOURIDE	108.5	108.85
AMAR RAJA BAT	795.6	794.45
AND BANK	38.5	39.5
AND CEMEN	10.13	10.25
AND PAPER	289.65	289.45
AND PETRO	57.65	54.95
ANJANI PORTL	177.05	181.35
ARIES AGRO LTD	186	181.45
AUROBINDO PH	592.45	588.95
AVANTEL SOFT	524	529.55
AVANTI FEEDS	2357.7	2329.55
AVONORG	9.35	9.6
BN RATHI SEC	39.05	39.5
BALAJI AMIN	580	597.5
BAMBINO AGRO	233	242.7
BARTRONICS	11.8	12.03
BHAGIRA CHEM	289	284.75
BHAGYA NAG	47.15	48.9
BHAGYA WOOD	25	25.7
BRILLIANT SEC	8.71	9.16
CIL SECURI	25.65	26.55
COLOR CHIP	37.3	36.5
COMBAT DRUGS	26	27
CONT COFFEE	288.85	293.9
COROFERT	510	521.95
COSBOARD IND	33	34.85
COUNTRY CLUB	13.25	13.45
CUBEX TUB	23.75	24.95
CYBERMATE	2.82	2.84
DR REDDY	2130.45	2145.5
DANLAW TEC	73.25	69.85
DECCEMENT	541	540.35
DIVI'S LAB	996.45	1001.2
DOLPHIN MEDI	1.18	1.13
DREDGIN CORP	653.05	661.25
EMPEE SUGARS	3.72	3.91
EVEREST ORG	143	140.15
FORTUNE INFO	72.3	72.3
FOUR SOFT	75.5	71.65
GMR FERRO	3.1	3.07
GMR INFRA	17.1	17.35
GVK POWER	14.65	14
GATI CORPN	101.35	100.95
GAYATRI PROJ	198.3	206.55
GAYATRI SUGRS	9.88	9.64
GENNEX LAB	3.85	3.86
GODAVDRU	34	34.35
GOLDSTN TELE	196.85	197.5
GOLDSTONE TECH	13.65	13.47
GRANULES (I)	107.2	108.15
HBL NIFE POW	49.6	51.15
HYDINDUS	1640.55	1641.7
HERITAGE FOOD	697.95	686.05
HINDFLUROCARB	10	10.5
ICSA LTD	3.1	3.1
IDL INDUSTRS	531	530.95
IKF SOFT	0.62	0.63
IQMS SOFT	15.55	15.85
IVRCL INFRAS	3.9	4.1
INCAP	80	81.3
INDONATIONL	830.3	820.9
INFOTECH EN	622	620.9
INNAREDY COM	3.1	3.1
INVINEX LAB	119	120
JSTL	42	42.55
KCP LTD	117.4	116.85
KNR CONSTRUCTIO	295	296.45
KAKATICEM	268.5	263.3
KALLAM SPG	31.5	31.25
KERNEX MICRO	38.2	38.35
KREBS BIO	209.2	199.65
LGS GLOBAL	5	5.08
LANCOINDUS	315.45	323.95
LOKESH MACH	58.65	61
LOTUS CHOC	51.2	51.45
MIC ELEC	6.15	5.97
MADHUCON PROJE	24.1	24.95
MAYTAS INFRA	37.5	36.8
MOLD-TEK	55.5	54.85
MOLDTEK PLASTIC	318.45	309.1
MOSCHIP SEMI	28.45	29.35
NCLIND	222	207.1
NETTLINX	76.85	73.3
NMDC LTD	122.05	124.35
NAGARAGRICH	39	38.3
NAGARCONST	117.95	120.1
NATCO PHARMA	720.15	717.15
NAVA BH VENTUR	145.55	144.45
NEHA INTER	6.59	6.88
NEOCURE THER	3.31	3.43
NEULAND LAB	715	698.25
NIHAR INFO GLO	12.25	12.6
NILE	727.05	734
OIL COUNTRY	37.7	38.7
PADMALAYA TELE	3.8	3.99
PANKAJ POLY	8.76	9.22
PANYAM CEMEN	44.05	42.6
PENNIND	55.25	54
PHYTOCHEM I	60.9	61.8
PITTI LAMIN	86.5	88.1
POKARNA	197.9	198.9
PRAJAY ENGS	12.9	12.62
PREMIEXPL	362.5	365.1
PRISM CEMENT	115.9	119.65
RAIN INDUSTRIES	388.5	381.9
RAJ PACKAGIN	35.5	35
RAM INFORMAT	40.25	40.35
REG.CERAMIC	5.93	5.65
RESTILE CER	6.6	6.57
ROOPA INDUS	15	14.9
SS ORGANICS	8	8.4
SAGAR CEM	920.1	921.25
SAI WIRES(I)	1.04	1.04
SAMKRG PIST	289.5	284.25
SAMPRE NUTRI	53.4	55
SANGIND	112	112.3
SATVAH. ISPAT	19.95	20.75
SAVEN TECHNO	27	26
SOFTSOL	32	33.35
SOUTH BIO TECH	2.7	2.82
SOUTH MAGNES	22.8	24
SRRAYALK	51.85	52.75
SRINIVASA SHIP	58	60.7
STARCHIK SP	20.55	19.6
SUJANA METAL	1.29	1.35
SUJANA TOWERS	3.56	3.73
SUJANA UNIVERS	0.81	0.85
SURANA STRIP	2.34	2.23
SURANA TELE	4.9	5
SURYACHAKRA POW	0.9	0.9
SURYALATA SP	135.6	138.85
SURYAVA SPIN	6.06	6.35
SUVARCEM	128.25	130.8
SUVEN PHARMA	176.85	174.45
TCI FINANCE	26.1	27.05
TAJ GVK HOTEL	152.3	153.4
TANLA SOLUTIONS	33.5	33.95
TRANS BIOTEK	2.4	2.47
TRANSPORT CO	261.95	270.9
TRENDY KNIT	0.27	0.27
USHER AGRO	5.3	5.57
VBC FERRO	36.6	37.35
VST INDUS	3000	2926.4
VAMSHI RUBB	47.05	49.9
VICEROY HOTELS	14	14.25
VIJAYTEXTIL	45.3	47.65
VIMTA LABS	192.65	198.35
VIRAT CRANE	56.5	55.75
VIRINCHI CON	105.65	108.25
VISAKAIND	639	657.95
VISTA PHARMA	42.7	44.1
VIVIMED LABS	71.9	70.5
VJIL CONSULT	16.8	17
ZENOTECH LAB	37.5	38.75

23న విజయవాడ నుంచి భారత్ దర్శన్ రైలు

షిర్డి, నాసిక్, ఎల్లోరా గుహల సందర్శన

రైల్వేస్టేషన్ (విజయవాడ రైల్వే స్టేషన్): ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో భారత్ దర్శన్ యాత్రా ప్రత్యేక రైలు ఈ నెల 23వ తేదీన విజయవాడ నుంచి ఐఆర్‌సీటీసీ ప్రాంతీయ అధికారి మధుసూదన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. షిర్డి, నాసిక్, త్రయింబకేశ్, ఎల్లోరా గుహలు ,ఔరంగాబాద్ తదితర క్షేత్రాల సందర్శన అనంతరం తిరిగి ఈ నెల 28వ తేదీన రైలు విజయవాడ చేరుకుంటుందన్నారు. భోజనం, వసతితో కలిపి స్లీపర్ క్లాస్‌కు అయితే ఒక్కొక్కరికి రూ.5,945, ఏ.సీకి అయితే ఒక్కొక్కరికి రూ.7,205 గా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు ఐఆర్‌సీటీసీ ప్రాంతీయ కార్యాలయాల్లో గాని, 9701360632 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

శేషాచలంలో ఏనుగుల అలజడి

కుందేలుకుంటలోనే 30 ఏనుగుల మంద సంచారం

సాక్షి, తిరుమల: తిరుమల శేషాచల అడవుల్లో ఏనుగులు అలజడి సృష్టిస్తు న్నాయి. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 20లోపే ఏనుగులున్నట్టు ప్రభుత్వ అటవీశాఖ లెక్కలు చెబుతున్నాయి. శుక్రవారం మామండూరు కుందేలుకుంటలోనే 30 ఏనుగుల మందను అటవీశాఖ సిబ్బంది గుర్తించారు. ఈ అడవులు ఏనుగుల ఆవాసానికి అనువైనవి. గతంలో చిత్తూరు జిల్లాలో జంతు గణన లెక్కల ప్రకారం 16 నుంచి 20 ఏనుగులున్నట్టు గుర్తించారు. శేషాచలంలోని తూర్పున రాజంపేట నుంచి పడమర తలకోన వరకు ఏనుగుల సంచారం ఉంది. శుక్రవారం ఒకేసారి మొత్తం 30 ఏనుగుల మంద ఉండటాన్ని అటవీ శాఖ సిబ్బంది గుర్తించారు. అర కిలోమీటరు దూరంలోనే ఏకంగా 30 ఏనుగుల మందను చూసిన అటవీశాఖ సిబ్బంది తమ సెల్‌ఫోన్లతో ఫొటోలు తీసుకుని వెనుతిరిగారు.

'గుండు' కొట్టేస్తున్నారు!



తిరుమలలోని ప్రధాన కల్యాణకట్ట

తిరుమల ఖజానాకు భారీగా గండి

- సీసీ కెమెరాలు ఉన్నా తరలిపోతున్న తలనీలాలు
- కల్యాణకట్టల్లో అక్రమార్కుల చేతివాటం
- తిరుపతి కేంద్రంగా మాఫియా దోపిడీ
- పట్టించుకోని టీటీడీ అధికారులు

సాక్షి, తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానానికి కాసులు కురిపించే భక్తుల తలనీలాలు దోపిడికి గురవుతున్నాయి. కల్యాణ కట్టల్లో సీసీ కెమెరాలు ఉన్నా ఇంటిదొంగల చేతివాటంతో విలువైన నల్లబంగారం పక్కదారి పడుతోంది. తిరుపతి కేంద్రంగా వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో శ్రీవారి ఖజనాకు పెద్ద మొత్తంలో గండి పడుతోంది. 2017 వార్షిక లెక్కల ప్రకారం మొత్తం 2.75కోట్ల మంది శ్రీవారిని దర్శించుకోగా, వీరిలో సుమారుగా 1.20 కోట్ల మంది భక్తులు శ్రీవారికి తలనీలాల మొక్కులు చెల్లించారు. కనిష్టంగా రోజుకు 600 కేజీలు.. గరిష్టంగా 1,200 కేజీల కురులు భక్తులు సమర్పిస్తారు. సరాసరిన రోజుకు టన్ను చొప్పున ఏడాదిలో 360 టన్నుల దాకా తలనీలాలు టీటీడీకి సమకూరుతున్నాయి. వీటిని ఐదు గ్రేడ్‌లుగా విభజించి శుద్ధిచేసి ఈ-వేలంలో విక్రయిస్తుంటారు. తాజా ధరల ప్రకారం మొదటి రకం కేజీ రూ.23వేలు, రెండో రకం రూ.18వేలు, మూడోరకం రూ.3వేలు, నాల్గో రకం రూ.2వేలు, ఐదోరకం రూ.24లు, తెల్ల వెంట్రుకలు రూ.6 వేలు పలుకుతున్నాయి. ఇలా ఏడాదిలో తలనీలాలు విక్రయం ద్వారా సుమారు రూ.200 నుండి 250 కోట్లు దేవస్థానానికి సమకూరుతున్నాయి. ఏటా ఇంతటి రాబడి తెచ్చి పెడుతున్న ఈ తలనీలాలను కొందరు టీటీడీ ఇంటి దొంగలు తస్కరిస్తున్నారు.

నిర్లక్ష్యంతో తరలిపోతున్న నల్లబంగారం

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి భక్తులు సమర్పించే తలనీలాలకు అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉంది. తిరుమలలో రెండు ప్రధాన కల్యాణ కట్టలతోపాటు మరో తొమ్మిది ముఖ్య కాటేజీల వద్ద మినీ కల్యాణకట్టలున్నాయి. అన్నిచోట్లా క్లోజ్డ్ సర్క్యూట్ (సీసీ) కెమెరాలు ఉన్నాయి. టీటీడీ నిబంధనల ప్రకారం.. భక్తులు సమర్పించిన



తలనీలాలు శుద్ధి చేస్తున్న సిబ్బంది

తలనీలాలను సిబ్బంది ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన హుండీల్లో వేయాలి. ఈ మొత్తం ప్రక్రియను సీసీ కెమెరాల్లో చిత్రీకరించాలి. సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారా? లేదా? అన్నదానిపై నిఘా సిబ్బంది కంట్రోల్ రూము నుంచి నిశితంగా పరిశీలించాలి. కానీ, ఈ ప్రక్రియ సరిగ్గా జరగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిఘా కళ్లుగప్పి కొందరు ఇంటి దొంగలు చేతివాటం ప్రదర్శిస్తూ భక్తులు సమర్పించిన తలనీలాలను అక్రమంగా బయటకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

తిరుపతి కేంద్రంగా మాఫియా

తలనీలాల అక్రమ విక్రయాలు తిరుపతి కేంద్రంగా సాగుతున్నట్లు సమాచారం. సాధారణంగా మహిళా భక్తులకు సంబంధించిన పొడవైన కురులకు డిమాండ్ ఎక్కువ. వీటి రేటు కూడా ఎక్కువగా ఉండడంతో అక్రమారులు ఎక్కువగా వీటిపైనే దృష్టి పెట్టారు. దీంతో మహిళా కురుల కోసం పోటీపడే చోరుల సంఖ్య గణనీయంగా పెరగడంతో వారు మాఫియాలా తయారయ్యారు. దీనివల్ల టీటీడీకి ఏటా రూ.కోట్ల విలువైన కురులు దొంగలపాలవుతోందని కొందరు కల్యాణకట్ట సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రూటుమార్చిన ఇంటిదొంగలు

భక్తుల తలనీలాలు తీసే నాయీబ్రాహ్మణులకు టీటీడీ గుండుకు రూ.11, కత్తిరింపులకు రూ.3 ఇస్తోంది. ఇందులో కొందరు నిజాయితీగా పనిచేస్తుండగా, మరికొందరు భక్తుల నుండి డిమాండ్ చేస్తుంటారు. ఇలా చేస్తూ దొరికిపోయిన కొందరిని టీటీడీ విధుల నుండి తొలగించింది. మరికొందరిని సస్పెండ్ చేసింది. దీంతో అక్రమార్కులు రూటు మార్చి తలనీలాలు తస్కరించడం ప్రారంభించినట్లు సహచర సిబ్బందే చెబుతున్నారు. దీనివల్ల శ్రీవారి ఖజానాకు రావాల్సిన సొమ్ము అక్రమార్కుల ఖాతాల్లోకి చేరిపోతోంది. ఈ-వేలం ద్వారా తలనీలాల ఆదాయం పెంచామని చెప్పుకునే టీటీడీ అధికారులు వాటి భద్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. దీనిపై టీటీడీ విజిలెన్స్ విభాగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

నేడు విజయవాడకు శృంగేరీ పీఠ ఉత్తరాధికారి

పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న జగద్గురు విధుశేఖర భారతి

విజయవాడ కల్చరల్: శృంగేరిపీఠ ఉత్తరాధికారి జగద్గురు విధుశేఖర భారతి మహాస్వామి రాష్ట్రపర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం విజయవాడ రానున్నారు. 13 రోజులపాటు నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని శృంగేరి పీఠపాలిత శివరామ కృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్లా హనుమత్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఇక్కడి శివరామకృష్ణ క్షేత్రంలో స్వామి పర్యటనకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ.. విధుశేఖర భారతి స్వామికి దుర్గాపురం సంగీత కళాశాలలో పూర్ణకుంభం స్వాగతం పలకనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.శంకరావు, జస్టిస్ ఎం.సీతారామమూర్తి, భక్తులు పాల్గొంటారని చెప్పారు. శ్రీ రామకోటి క్షేత్రంలో విధుశేఖర భారతి స్వామి విడిది చేస్తారన్నారు. తొలి రోజు భక్తులను అనుగ్రహించి ప్రసంగిస్తారని ప్రసాద్



విధుశేఖర స్వామి పర్యటనకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10.00 నుంచి 12.00 గంటల వరకు దర్శనానికి అనుమతిస్తారని తెలిపారు. సమావేశంలో మాజీ మేయర్ జంధ్యాల శంకర్, పూర్వ ధర్మాధికారి జొన్నవిత్తుల ప్రభాకరశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

దాతలు, సేవకులకు టీటీడీ ఉగాది శుభాకాంక్షలు

గ్రీటింగ్ కార్డులు పంపనున్న టీటీడీ

సాక్షి, తిరుమల: ఈనెల 18వ తేదీన శ్రీవిళంబినామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వివిధ పథకాలకు విరాళాలు అందించిన దాతలు, శ్రీవారి సేవకులకు తిరుమల తిరుపతి వేవస్థానం ఉగాది శుభాకాంక్షలు తెలిపింది. ఈ మేరకు వారికి టీటీడీ గ్రీటింగ్ కార్డ్సు పంపనుంది. ధార్మిక సంస్థలో మొత్తం 9 ట్రస్టులు, రెండు పథకాలు ఉన్నాయి. లక్ష రూపాయలకు పైగా డొనేషన్ ఇచ్చిన దాతలకు 2012వ సంవత్సరం నుంచి టీటీడీ ఉగాది శుభాకాంక్షలతో కూడి పత్రికలను పంపుతోంది.

24 నుంచి ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు

ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన టీటీడీ ఈవో



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈవో, అధికారులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: టీటీడీ అనుబంధ ఒంటిమిట్ట శ్రీకోదండ రామస్వామి ఆలయంలో ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. శుక్రవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో ఇంజినీరింగ్, ఎలక్ట్రిసిటీ, ఆరోగ్య, భద్రతా శాఖల అధికారులతో సమావేశమైన ఈవో ఉత్సవాల నిర్వహణపై సమీక్షించారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, బ్యారికేడ్లు, క్యూలైన్లు, శోభాయమానంగా కల్యాణ వేదికను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. మార్చి 30న జరిగే సీతారాముల కల్యాణానికి లక్షలాది మంది భక్తులు వచ్చే వీలున్నందున భద్రతా పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా కడప జిల్లా ఎస్పీతో సమన్వయం చేసుకోవాలని టీటీడీ సీవీఎస్‌వో ఆకే రవికృష్ణకు సూచించారు. ఉత్సవాల కోసం 1,000 మంది శ్రీవారి సేవకులను సిద్ధం చేయాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో సీవీఎస్‌వో రవికృష్ణ, ప్రత్యేకాధికారి ముక్తేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో చేనేత రంగానికి మొండిచేయి

- వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రావు ధ్వజం
- మేనిఫెస్టోలో హామీలు నెరవేర్చలేదు
- నేతన్నలను నిలువునా మోసం చేశారు
- బడ్జెట్ కేటాయింపులు ఏమూలకూ సరిపోవు



మాట్లాడుతున్న చిల్లపల్లి మోహనరావు

విజయవాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తి స్థాయి చివరి బడ్జెట్‌లో కూడా చేనేత రంగానికి మొండిచేయి చూపారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చిల్లపల్లి మోహనరావు విమర్శించారు. విజయవాడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, భారత దేశంలో వ్యవసాయం తరువాత చేనేత రంగం అతి పెద్దదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ జనాభాలో 12 శాతం మంది చేనేతపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. రూ.వెయ్యి కోట్ల మూలధనంతో చేనేత అభివృద్ధికి కృషి చేస్తామని, ఇళ్లు, షెడ్లు కట్టించి ఇస్తామని, అలాగే రుణమాఫీ చేస్తామని ఎన్నిక మేనిఫెస్టోలో చంద్రబాబు అబద్ధపు వాగ్దానాలు చేశారని దుయ్యబట్టారు. చివరి సంవత్సరంలో కూడా ఆ వాగ్దానాలకు తగ్గట్టుగా బడ్జెట్ కేటాయింపులు జరగకపోవడం దారుణమన్నారు. చేనేతకు రూ. 173 కోట్లు కేటాయించారని, అవి ఎందుకూ సరిపోవని తెలిపారు. జనతా వస్త్రాలకు సంబంధించి రూ.200 కోట్లు కేటాయించామని చెప్పడం బూటకమన్నారు. జనతా వస్త్రాలకు సంబంధించి ఒక చీర నేస్తే రూ. 80 వస్తాయని, ఇది చేనేత కార్మికులకు ఏ విధంగా ఉపయోగపడుతుందని ప్రశ్నించారు. ఇతర కులాలకు ఏర్పాటు చేసినట్లుగా చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో చేనేతలకు రూ. 300 కోట్లు మేర రుణమాఫీ చేశారని, టీడీపీ హయాంలో రూ.100 కోట్లు కూడా రుణమాఫీ జరగలేదన్నారు. జీఎస్టీ నుంచి చేనేతను మినహాయించేలా చేస్తారనుకుంటే చంద్రబాబు ప్రభుత్వం కనీసం స్పందించలేదని మండిపడ్డారు. చేనేతలకు పెన్షన్లు డాక్టర్ వైఎస్సార్ హయాంలో 50 ఏళ్లకే మంజూరు చేస్తే, చంద్రబాబు దానిని 55 ఏళ్లకు పెంచారని మండిపడ్డారు. వైఎస్ జగన్ అధికారంలోకి వస్తే చేనేతలకు 45 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని ప్రకటించారని దీనిని, చేనేత కార్మికులు ఆహ్వానిస్తున్నారన్నారు.

ఇంటర్ పరీక్షల్లో నారాయణ విద్యార్థి డీబార్

- పరీక్ష రాసి పేపర్ ఇవ్వకుండా వెళ్లిపోయిన వైనం
- వెంటనే గుర్తించిన అధికారులు


కంకిపాడు: నారాయణ విద్యాసంస్థల విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడ్డ ఘటన శుక్రవారం కృష్ణాజిల్లా పునాదిపాడులో చోటుచేసుకుంది. నారాయణ కళాశాలకు చెందిన ఓ విద్యార్థి ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలను పునాదిపాడు శ్రీ చైతన్య కళాశాలల పరిధిలోని ఓ పరీక్షా కేంద్రంలో రాస్తున్నాడు. శుక్రవారం గణితం పరీక్షకు హాజరై సమాధాన పత్రాన్ని ఇన్విజిలేటర్‌కు అప్పగించకుండా తన వెంట తీసుకెళ్లిపోయాడు. పరీక్షా పత్రాలను, హాజరైన విద్యార్థుల సంఖ్యను లెక్కించిన ఇన్విజిలేటర్ ఈ విషయాన్ని గుర్తించి వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. విద్యార్థి వివరాలు తెలుసుకునేందుకు కళాశాలలోని సీసీ కెమెరాలను పరిశీలించి ఆ విద్యార్థిని గుర్తించారు. ఇన్విజిలేటర్ల బృందం ఆ విద్యార్థి కోసం గాలిస్తుండగా సమాధాన పత్రాన్ని తీసుకుని వెళ్లిన విద్యార్థి తిరిగి వచ్చి ఇన్విజిలేటర్‌కు అందించాడు. పరీక్షా పత్రాలను సీలు చేసి కంకిపాడు పోస్టాఫీసులో అప్పగించేందుకు సిబ్బంది బయలుదేరి వెళ్లగా పార్సిల్ సమయం ముగిసిందని పోస్టల్ సిబ్బంది తెలిపారు. దీంతో పరీక్షా పత్రాల బాక్సులను స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించగా విద్యార్థి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడ్డ విషయం వెలుగుచూసింది. ఇంటర్ బోర్డు ఆర్ఐవో శివసత్యనారాయణ రెడ్డి సిబ్బంది రాత్రి 8.30 గంటలప్పుడు పోలీసుస్టేషన్‌కు చేరుకుని పరీక్షా పత్రాలను పరిశీలించారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడ్డ విద్యార్థి పరీక్షా పత్రాన్ని వేరుగా పార్సిల్ చేయించారు. శనివారం పోస్టాఫీసులో భద్రపరిచేంత వరకూ స్టేషన్‌లో ఉంచాలని పోలీసు అధికారులను కోరారు. ఆర్ఐవో విలేకరులతో మాట్లాడుతూ ఆన్సర్‌షీట్‌ను విద్యార్థి తన వెంట తీసుకెళ్లిపోవడాన్ని మాల్ ప్రాక్టీస్‌గా గుర్తించి విద్యార్థిని డీబార్ చేస్తున్నామన్నారు. శనివారం నుంచి జరిగే పరీక్షలకు అతడిని హాజరు కానివ్వమన్నారు. ఇన్విజిలేటరును విధుల నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు.

తొలి పూజలందుకున్న శ్రీలలితాసంగమేశ్వరుడు

కొత్తపల్లి: గత ఆగస్టులో కృష్ణమ్మ ఒడిలో ఒదిగిపోయిన శ్రీలలితాసంగమేశ్వరుడు ఆరుమాసాల అనంతరం భక్తులకు దర్శమిచ్చారు. శుక్రవారం స్వామికి తొలిపూజలు నిర్వహించారు. కర్నూలు జిల్లా కొత్తపల్లి మండల పరిధిలోని సప్తనదీ తీరంలోని శ్రీ లలితాసంగమేశ్వరుడి ఆలయం.. శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం తగ్గిపోవటంతో బయటపడింది. దీంతో స్వామిని సప్తనదీ జలాలతో అభిషేకించి సుందరంగా అలంకరించారు. అనంతరం పంచముఖి ఆంజనేయస్వామికి మహా మంగళహారతి ఇచ్చారు.

కేంద్ర వాగ్దానాలు సరే.. మీసంగతేంటి?

సీఎం చంద్రబాబుకు యార్లగడ్డ సూటి ప్రశ్న



సాక్షి, తిరుమల: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పడాన్ని తాను సమర్థిస్తున్నానని, అయితే ఆయన ఇచ్చిన వాగ్దానాలు అమలు విషయమేంటని మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తర్వాత యార్లగడ్డ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తెలుగును అధికార భాషను అమలు చేయడంలో అధికారులకు ఉన్న ఇబ్బందులేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. టీటీడీ పరిపాలనతో ముడిపడి ఉన్న ట్రస్టు బోర్డు 10 మాసాలుగా ఖాళీగా ఉన్నా ఎందుకు భర్తీ చేయలేదని ప్రశ్నించారు. ట్రస్టు బోర్డును నియమించుకునేందుకు ఎలాంటి ఆర్థికపరమైన అంశాలు ఉండవని, అయితే సీఎం ఎందుకు చొరవ చూపట్లేదని నిలదీశారు. ఒక సమస్య మీరు ఎత్తిచూపితే మూడు సమస్యలు మిమ్మల్నే ప్రశ్నిస్తాయన్న విషయాన్ని సీఎం చంద్రబాబు గుర్తించుకోవాలని హితవుపలికారు.

ఎస్ఆర్ఎం వర్సిటీలో అర్జున్‌రెడ్డి సందడి

చెన్నై: ఎస్ఆర్ఎం వర్సిటీలో జరుగుతున్న 'మిలాన్-2018' పేరిట జరుగుతున్న ఇంటర్నేషనల్ కల్చరల్ ఫెస్ట్‌లో ప్రముఖ సినీనటుడు, 'అర్జున్ రెడ్డి' ఫేమ్ విజయ్ దేవరకొండ సందడి చేశారు. ఈ ఉత్సవాల్లో మొదటి రోజు ఆరు వేల మందికి పైగా పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా విజయ్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఇంత పెద్ద సాంస్కృతిక ఉత్సవాలకు రావడం ఇదే మొదటి సారి అని తెలిపారు. తనను సాదరంగా ఆహ్వానించినందుకు విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు వర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ టీఆర్ పర్వేందర్ మాట్లాడుతూ విజయ్ దేవరకొండను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులందరూ తమ తమ రంగాల్లో గొప్ప పేరు తెచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను



విజయ్‌కి పుష్పగుచ్ఛం అందిస్తున్న వర్సిటీ అధికారులు

చూపించడానికి మిలాన్ ఫెస్ట్ ఒక గొప్ప వేదిక అని తెలిపారు. ఈ వేడుకల్లో మొత్తం 160 కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఐదు ఖండాల్లోని 40 దేశాల నుంచి విద్యార్థులు ఇక్కడికి వస్తుండటం విశేషం. ఇందులో పెట్టే పోటీల్లో గెలుపొందే వారికి రూ.15 లక్షలకు పైగా నగదు బహుమతులు అందించనున్నారు. వర్సిటీ వీసీ డాక్టర్ సందీప్ సంచేటి, రిజిస్ట్రార్ ఎన్.సేతురామన్, డాక్టర్ సీపీ రామచందిని తదితరులు పాల్గొన్నారు.



చుంగ్ జె సుంగ్ హఠాన్మరణం

ప్రపంచ బ్యాడ్మింటన్‌లో స్టార్ డబుల్స్ ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్న చుంగ్ జె సుంగ్ (దక్షిణ కొరియా) శుక్రవారం గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. అతని వయసు 35 సంవత్సరాలు మాత్రమే. డబుల్స్ విభాగంలో సుదీర్ఘ కాలం పాటు బ్యాడ్మింటన్‌ను శాసించిన షట్లర్‌గా సుంగ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. లీ యోంగ్ డేతో కలిసి 2012 లండన్ ఒలింపిక్స్‌లో అతను కాంస్య పతకం గెలుచుకున్నాడు. 2009లో వరల్డ్ నంబర్‌వన్ స్థానానికి చేరుకున్న సుంగ్...ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో 3, ఆసియా క్రీడల్లో 4 పతకాలు సాధించాడు. 2012 ఒలింపిక్స్‌లో ఆటకు గుడ్‌బై చెప్పేనాటికి ఏకంగా 18 సూపర్ సిరీస్ టోర్నీలు గెలుచుకున్న ఘనత జె సుంగ్ సొంతం.



షమీ చుట్టూ కేసుల ఉచ్చు

పలు సెక్షన్ల కింద నమోదు • మరో నలుగురిపైన కూడా...

కోల్‌కతా: టీమిండియా పేసర్ మొహమ్మద్ షమీ పరిస్థితి మరింత క్లిష్టంగా మారిపోయింది. వ్యక్తిగత, క్రీడా జీవితంపై అతడి భార్య హసీన్ జహాన్ ఆరోపణల ఉదంతం కేసుల నమోదు వరకు చేరింది. తన భర్త మోసగాడని, తీవ్రంగా హింసిస్తున్నాడని, పలువురు యువతులతో సంబంధాలున్నాయని, పాకిస్తానీ స్నేహితురాలి నుంచి డబ్బులు తీసుకున్నాడంటూ ఇప్పటికే జహాన్ మీడియాకెక్కింది. తాజాగా ఆమె ఫిర్యాదుతో శుక్రవారం కోల్‌కతా పోలీసులు షమీ సహా అతని కుటుంబ సభ్యులు నలుగురిపై కేసులు నమోదు చేశారు. సెక్షన్ 307 (హత్యాయత్నానికి పాల్పడటం), సెక్షన్ 498ఎ (గృహ హింస), సెక్షన్ 376 (లైంగిక దాడి)ల కింద నాన్ బెయిలబుల్, సెక్షన్ 323 (ఉద్దేశపూర్వకంగా గాయపర్చడం), సెక్షన్ 506 (నేరపూరిత బెదిరింపు)ల కింద జాదవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు కోల్‌కతా జాయింట్ పోలీస్ కమిషనర్ (క్రైం) ప్రవీణ్ త్రిపాఠి తెలిపారు. వీటిలో సెక్షన్ 376 కింద కేసును షమి సోదరుడిపై పెట్టినట్లు పేర్కొన్నారు. ఏడాది క్రితం యూపీలో తన అత్తారింటికి వెళ్లినప్పుడు షమీ సోదరుడు షోయబ్ అహ్మద్ తనపై అత్యాచారం చేసినట్లు హసీన్ ఫిర్యాదులో పేర్కొంది. మరోవైపు షమీపై ఆరోపణల అనంతరం ఫేస్‌బుక్‌లో తన ఖాతాను బ్లాక్ చేశారని హసీన్ ఆరోపించింది. 'కొన్నేళ్లుగా వారు నన్ను తీవ్రంగా హింసించారు. ఆ కుటుంబంలో ఒక్కరు కూడా నాకు అండగా నిలవలేదు. షమీ కుటుంబ సభ్యులు ఉత్తరప్రదేశ్‌లో నివసిస్తారు. నేనక్కడకు వెళ్లినప్పుడల్లా వేధించేవారు. వారంతా వేచి చూడాలని మాత్రమే చెప్పేవారు తప్ప షమీకి వ్యతిరేకంగా ఏమీ చేసేవారు కాదు' అని ఆమె పేర్కొంది. వివాదం నేపథ్యంలో షమీకి రెండు రోజుల క్రితం ప్రకటించిన బీసీసీఐ కాంట్రాక్టుల్లో చోటుదక్కలేదు. అయితే... అతడికి ఊహించని విధంగా దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్ నుంచి మద్దతు లభించింది. షమిది కష్టపడే తత్వమని, కుటుంబ సమస్యలు ఉన్నట్లు తనకు తెలుసని కానీ అతడి భార్య ఇలాంటి ఆరోపణలకు దిగడం సరికాదని కపిల్ వ్యాఖ్యానించారు. ఒకవేళ ఇవన్నీ నిజమైతే షమీని ఎవరూ కాపాడలేరని పేర్కొన్నారు.



శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న హసీన్ జహాన్

'డేర్ డెవిల్స్'ను పంచుకున్నారు

- 50 శాతం వాటా కొనుగోలు చేసిన జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్
- రూ.550 కోట్లకు డీల్!

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2018 సీజన్ ఆరంభానికి నెల రోజుల ముందు ఫ్రాంచైజీ విషయంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. జీఎంఆర్ గ్రూప్‌కు చెందిన ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్టులో 50 శాతం వాటాను జిందాల్ సౌత్ వెస్ట్ (జేఎస్‌డబ్ల్యూ) స్పోర్ట్స్ కొనుగోలు చేసింది. ఈ విషయాన్ని జీఎంఆర్, జేఎస్‌డబ్ల్యూ సంయుక్తంగా ప్రకటించాయి. అయితే ఈ 50–50 ఒప్పందాన్ని బీసీసీఐ అధికారికంగా ఆమోదించాల్సి ఉంటుంది. ఈ నెల 16న జరిగే ఐపీఎల్ పాలకమండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోవడం లాంఛనమే కావచ్చు. కొందరు వ్యక్తులు, సంస్థలు కన్సార్టియంగా ఏర్పడి రాజస్థాన్, పంజాబ్, కొచ్చి వంటి ఐపీఎల్ జట్లను కొనుగోలు చేయడం గతంలో జరిగినా... ఒక యాజమాన్యం మరొకరికి తమ జట్టులో వాటా అమ్మడం మాత్రం ఇదే తొలిసారి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ ఒప్పందానికి ముందు ప్రస్తుతం ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్టు విలువను రూ. 1100 కోట్లుగా నిర్ధారించారు. 2008లో ఢిల్లీ జట్టును తెలుగు పారిశ్రామికవేత్త గ్రంధి మల్లికార్జున రావు కొనుగోలు చేసినదానితో పోలిస్తే ప్రస్తుత విలువ రెట్టింపు కావడం విశేషం. జేఎస్‌డబ్ల్యూ ఈ డీల్ కోసం రూ. 550 కోట్లను చెల్లించనుంది. 'ఇది మా జట్టును ఉన్నత శిఖరాలకు చేర్చే తరుణం. విస్తృత అనుభవం ఉన్న జేఎస్‌డబ్ల్యూ భాగస్వామ్యంతో జట్టు విలువ మరింత పెరుగుతుందని భావిస్తున్నాం' అని జీఎంఆర్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్ గ్రంధి తెలిపారు.

తొలి ఐపీఎల్‌నుంచి పదేళ్ల పాటు లీగ్‌లో ఉన్నా డేర్‌డెవిల్స్ ఒక్కసారి కూడా విజేతగా నిలవలేదు. 2008లో ఆ జట్టు సెమీఫైనల్ చేరింది. 2012లో మూడో స్థానంలో నిలవడమే ఢిల్లీ అత్యుత్తమ ప్రదర్శన. ఈ సీజన్‌లో అత్యధిక విజయాలతో లీగ్‌లో అగ్రస్థానంలో నిలిచినా...ప్లే ఆఫ్‌లో ఓడి డేర్‌డెవిల్స్ మూడో స్థానానికే పరిమితమైంది. మరో వైపు జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్‌కు ఇప్పటికే ఇండియన్ సూపర్ లీగ్ ఫుట్‌బాల్ బెంగళూరు క్లబ్ ఉండగా...ప్రొ కబడ్డీ లీగ్, ప్రొ రెజ్లింగ్ లీగ్‌లలో కూడా ఆ జట్టు భాగస్వామ్యం ఉంది. పలువురు వర్ధమాన ఆటగాళ్లకు స్పాన్సర్‌షిప్ అందిస్తూ కూడా జిందాల్ స్పోర్ట్స్ అండగా నిలుస్తోంది.

వెంగ్‌సర్కార్ చెప్పింది అబద్ధం

బీసీసీఐ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసన్



చెన్నై : 'విరాట్ కోహ్లిని 2008లో టీమిండియాకు ఎంపిక చేయడాన్ని నేను ఇష్టపడలేదని మాజీ చీఫ్ సెలెక్టర్ వెంగ్‌సర్కార్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదు. అసలు అతడు ఎవరి తరఫున, ఏ ఉద్దేశంతో మాట్లాడుతున్నాడు? ఇదంతా అబద్ధం' అని బీసీసీఐ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసన్ శుక్రవారం ఖండించారు. శ్రీనివాసన్ బీసీసీఐ కోశాధికారిగా ఉన్న సమయంలో బద్రీనాథ్‌ను తీసుకోవాలని పట్టుబట్టినా తాను వినకపోవడంతో చీఫ్ సెలెక్టర్ పదవిని కోల్పోయానని బుధవారం వెంగ్‌సర్కార్ వ్యాఖ్యానించాడు. దీనిపై శ్రీనివాసన్ స్పందించారు. 'ఒక క్రికెటర్ ఈ రకంగా మాట్లాడటం మంచిది కాదు. వెంగ్‌సర్కార్‌ను ముందుగానే తప్పించామనడం తప్పు. ఈ విషయాన్ని ఇప్పుడు ప్రస్తావించడంలో అర్థం లేదు. జట్టు ఎంపికలో నేను జోక్యం చేసుకునే వాడిని కాదు. అతడు చెప్పిన ఇద్దరు ఆటగాళ్లు (కోహ్లి, బద్రీనాథ్) 2008 శ్రీలంక సిరీస్‌లో ఆడారన్న విషయం గుర్తుంచుకోవాలి. 2008లో కొత్త కమిటీలు ఏర్పాటు చేయాల్సిన తరుణంలో బోర్డు సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముంబై క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడిగా వెళ్లేందుకే వెంగ్‌సర్కార్ మొగ్గుచూపాడు. అందుకే సెలెక్షన్ కమిటీలో చోటుకు పరిగణనలోని తీసుకోలేదు. వివాదం సృష్టించేందుకే ఇలా మాట్లాడినట్లున్నాడు. ఇదంతా నిరాధారం' అని శ్రీనివాసన్ వివరించారు. 'అతడితో నాకు శత్రుత్వం ఏమీ లేదు. నా చొరవ కారణంగా ప్రోత్సాహకాలు దక్కిన మాజీ క్రికెటర్లలో వెంగ్‌సర్కార్ ఒకడు. 1994లో వెంగీ బెనిఫిట్ మ్యాచ్ కోసం ఇండియా సిమెంట్స్ లక్ష రూపాయలు ఇచ్చింది. అతను ఆడిన దాదర్ క్లబ్‌లో సౌకర్యాలు మెరుగుపర్చేందుకు మేం పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వడం నాకు బాగా గుర్తుంది. క్రికెటర్‌గా కల్నల్ అంటే గౌరవం ఉంది. అతడిని మేం ఒక జాతీయ హీరోగా చూశాం. ఇలా మాట్లాడటం దురదృష్టకరం' అని శ్రీనివాసన్ స్పందించారు.

అంజుమ్‌కు రజతం

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీ

గ్వాడలహారా (మెక్సికో): ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత షూటర్ అంజుమ్ మౌద్గిల్ రజత పతకం సొంతం చేసుకుంది. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఈవెంట్‌లో అంజుమ్ 454.2 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో భారత్‌కు ఇదే తొలి రజత పతకం. రుజియో పెయ్ (చైనా, 455.4 పాయింట్లు), తింగ్‌సున్ (చైనా 442.2 పాయింట్లు) వరుసగా స్వర్ణం, కాంస్యం దక్కించుకున్నారు. అంతకుముందు ఫైనల్‌కు అర్హత సాధించడానికి జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో రుజియో పెయ్ 1178 పాయింట్లు, అంజుమ్ 1170 పాయింట్లు సాధించి తొలి రెండు స్థానాల్లో నిలిచారు. అర్హత పోటీల్లో మరో భారత షూటర్ గాయత్రి 1153 పాయింట్లతో 15వ స్థానంతో... మాజీ ప్రపంచ చాంపియన్ తేజస్విని సావంత్ 16వ స్థానంతో సరిపెట్టుకున్నారు. టోర్నీలో ఇప్పటి వరకు మూడు స్వర్ణాలు, నాలుగు కాంస్యాలతో కలుపుకొని మొత్తం ఏడు పతకాలతో అగ్రస్థానంలో ఉన్న భారత్... తాజా రజతంతో పతకాల సంఖ్య ఎనిమిదికి పెంచుకుంది. రెండు స్వర్ణ, రెండు రజత, ఓ కాంస్యంతో చైనా రెండో స్థానంలో కొనసాగుతోంది. పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో పదిహేనేళ్ల అనీశ్ భన్వాలా ఏడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. మరో భారత షూటర్ నీరజ్ కుమార్‌కు 13వ స్థానం దక్కింది.



రబడకు 5 వికెట్లు

ఆస్ట్రేలియా 243 ఆలౌట్

పోర్ట్ ఎలిజబెత్: ఆస్ట్రేలియాతో శుక్రవారం ప్రారంభమైన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా పేస్ బౌలింగ్ త్రయం చెలరేగింది. రబడ (5/96), ఇన్‌గిడి (3/51), ఫిలాండర్ (2/25) ప్రత్యర్థిని దెబ్బ తీశారు. ఫలితంగా తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 243 పరుగులకే ఆలౌటైంది. వార్నర్ (100 బంతుల్లో 63; 9 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం తొలి రోజు ఆట ముగిసే సరికి దక్షిణాఫ్రికా తమ తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 39 పరుగులు చేసింది. మార్క్‌రమ్ (11) ఔట్ కాగా...ఎల్గర్ (11 బ్యాటింగ్), రబడ (17 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్‌కు ఓపెనర్లు వార్నర్, బెన్‌క్రాఫ్ట్ (38) శుభారంభం అందించారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 98 పరుగులు జోడించారు. అయితే 19 పరుగుల వ్యవధిలో ఆసీస్ 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. నాలుగో వికెట్‌కు 44 పరుగులు జోడించి స్మిత్ (25), షాన్ మార్ష్ (24) జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ఈ స్థితిలో రబడ అద్భుత స్పెల్ ఆటను మలుపు తిప్పింది. కేవలం 18 బంతుల తేడాతో అతను ఐదు వికెట్లు తీసి కంగారూల వెన్ను విరిచాడు. స్మిత్, షాన్ మార్ష్‌లతో పాటు మిషెల్ మార్ష్ (4), కమిన్స్ (0), స్టార్క్ (8)లను రబడ పెవిలియన్ పంపించాడు. ఒక దశలో 182/8తో ఆసీస్ ఇన్నింగ్స్ తొందరగానే ముగిసేలా కనిపించింది. అయితే వికెట్ కీపర్ టిమ్ పైన్ (36) సఫారీలను అడ్డుకున్నాడు. లయన్ (17), హాజల్‌వుడ్ (10 నాటౌట్) సహకారంతో మరిన్ని పరుగులు జోడించాడు. చివరి 2 వికెట్లకు ఆసీస్ 61 పరుగులు చేయడం విశేషం. ఇరు జట్ల మధ్య ఉద్రిక్త వాతావరణం ఇంకా చల్లారలేదు. తొలి టెస్టులో వివాదానికి కేంద్రంగా నిలిచిన వార్నర్ ఈ సారి ప్రశాంతంగా ఆడి పరుగులు చేయగా... స్మిత్‌ను అవుట్ చేసిన సమయంలో అతడి శరీరాన్ని తాకి రబడ తన ఆగ్రహాన్ని ప్రదర్శించాడు. ఐసీసీ డీమెరిట్ పాయింట్ల విధానంలో ఇప్పటికే ప్రతికూల రికార్డు ఉన్న రబడ తప్పు రుజువైతే అతను ఈ టెస్టు సిరీస్‌కు దూరమయ్యే ప్రమాదం కూడా ఉంది.



రబడను అభినందిస్తున్న సహచరులు


చైనా హవా తగ్గుతోంది

ఇండియా టుడే కాంక్లేవ్‌లో శ్రీకాంత్

ముంబై: ప్రస్తుతం ప్రపంచ బ్యాడ్మింటన్‌లో చైనా ఆటగాళ్ల ఆధిపత్యం తగ్గిందని భారత షట్లర్ కిడాంబి శ్రీకాంత్ అన్నాడు. ప్రపంచ నంబర్ 1 హోదాను సాధించడం కన్నా కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణాన్ని నెగ్గడమే తన లక్ష్యమని స్పష్టం చేశాడు. ప్రపంచ వేదికపై యూరోప్ దేశాలు సత్తా చాటుతున్నప్పటికీ, వాటికన్నా కూడా భారతే బలమైన దేశంగా ఎదిగిందని వివరించాడు. భారత్‌కు చెందిన ఐదుగురు పురుష షట్లర్లు ప్రపంచ టాప్–20లో ఉండటమే దీనికి నిదర్శనమన్నాడు. శుక్రవారం ఇండియాటుడే కాంక్లేవ్‌లో పాల్గొన్న భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, భారత స్టార్ ప్లేయర్ పీవీ సింధు, శ్రీకాంత్ పలు అంశాలపై మాట్లాడారు.

చైనా హవా తగ్గింది: శ్రీకాంత్

ఇప్పుడు బ్యాడ్మింటన్ ముఖచిత్రం మారిపోయింది. 2008 బీజింగ్, 2012 లండన్ ఒలింపిక్స్‌లో చైనా హవా సాగింది. కానీ ఇప్పుడు చూస్తే టాప్–4లో నాతో పాటు అక్సెల్సన్ (డెన్మార్క్), చోంగ్ వీ (మలేసియా), చెన్ లాంగ్ (చైనా) ఇలా నాలుగు దేశాలకు చెందిన వారున్నారు. టోర్నీ ఫైనల్ గెలవడం ద్వారా నంబర్‌వన్‌గా నిలిస్తేనే నాకు సంతోషంగా ఉంటుంది. ఆల్‌ఇంగ్లండ్, ఒలింపిక్ పతకాలు గెలవడం ద్వారానే దిగ్గజ ఆటగానిగా గుర్తింపు వస్తుంది.



రియో రజతం తర్వాత చాలా మారింది: సింధు

రియో ఒలింపిక్స్ రజతం సాధించాక నా జీవితంలో చాలా మార్పు వచ్చింది. కానీ నేను మాత్రం ముందులాగే ఉన్నా. రియోతో పాటు ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం చాలా పోరాడా. కానీ ఫలితం రాలేదు. ఆటలో గెలుపోటములు సహజం. బరిలో దిగినపుడు అత్యుత్తమ ఆటను ప్రదర్శిస్తా. ఒక్కోసారి ఓటమి తప్పదు.

నేనప్పుడు పార్టీ చేసుకుంటా: గోపీచంద్

ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఫైనల్లో సింధుతో సైనా, ప్రణయ్‌తో శ్రీకాంత్ తలపడే రోజు వస్తే నేను బయటికి వెళ్లి పెద్ద పార్టీ చేసుకుంటా. అది నా జీవితంలోనే గొప్ప రోజు అవుతుంది. నా ప్రతి విద్యార్థి జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో సాధించిన విజయాలు కూడా నాకు సంతృప్తినిస్తాయి.

విజేత భారత్

- దక్షిణ కొరియాతో మహిళల హాకీ సిరీస్
- 3–1తో భారత్ సొంతం
- ఆదివారం చివరి మ్యాచ్

సియోల్: దక్షిణ కొరియాతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల హాకీ సిరీస్‌ను భారత మహిళల జట్టు 3–1తో చేజిక్కించుకుంది. నాలుగో మ్యాచ్‌లో ఆతిథ్య జట్టుపై 3–1 గోల్స్ తేడాతో విజయం సాధించిన రాణి రాంపాల్ నేతృత్వంలోని భారత్ మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను సొంతం చేసుకుంది. ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ కొరియాతో శుక్రవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో పదో ర్యాంక్‌లో ఉన్న భారత జట్టు ఆధిపత్యం చెలాయించింది. ప్రారంభం నుంచే ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టిన భారత్ తొలి క్వార్టర్‌లోనే రెండు గోల్స్ నమోదు చేసింది. గుర్జీత్ కౌర్ (2వ నిమిషం), దీపిక (14వ నిమిషం) చెరో గోల్ చేశారు. ఆ తర్వాత పూనమ్ రాణి (47వ నిమిషం) మరో గోల్ కొట్టడంతో భారత్ ఆధిక్యం 3–0కు పెరిగింది. మ్యాచ్ ముగియడానికి మూడు నిమిషాల ముందు కొరియా తరఫున మై హున్ పార్క్ (57వ నిమిషం) ఏకైక గోల్ చేసినా అప్పటికే భారత్ విజయం ఖాయమైంది. ఇరు జట్ల మధ్య చివరిదైన ఐదో మ్యాచ్ ఆదివారం జరుగనుంది.

పాండ్యాతో పోలికలొద్దు

ఆల్‌రౌండర్ విజయ్ శంకర్



కొలంబో: 'రోజురోజుకు ఆటను మెరుగుపర్చుకోవడమే నాకు ముఖ్యం. ఎక్కువ శాతం క్రికెటర్లు వేరొకరితో పోల్చడాన్ని ఇష్టపడరు. హార్దిక్ పాండ్యాతో నన్ను పోల్చొద్దు. ఒత్తిడికి గురికాకుండా సామర్థ్యానికి తగ్గట్లు ఉత్తమ ఆటతీరు కనబర్చడమే మేమిద్దరం చేయాల్సింది' అని అంటున్నాడు టీమిండియా కొత్త ఆల్ రౌండర్ విజయ్ శంకర్. గురువారం బంగ్లాదేశ్‌పై టి20లో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన అనంతరం అతడు మాట్లాడాడు. రైనా, సుందర్ క్యాచ్‌లు వదిలేయడంతో... తొలి అంతర్జాతీయ వికెట్ కోసం నిరీక్షించాల్సి రావడాన్ని విజయ్ తేలిగ్గా తీసుకున్నాడు. ఇలాంటివన్నీ ఆటలో సహజమని పేర్కొన్నాడు. 'తర్వాతి బంతిని ఎలా వేయాలనేదే నా ప్రాధాన్యం. నా కష్టానికి ప్రస్తుతం గుర్తింపు దక్కింది. ఇది ప్రారంభం మాత్రమే. రాబోయే కొద్ది వారాలపైనే నా దృష్టంతా' అని ఈ తమిళనాడు ఆటగాడు వివరించాడు. 'ఆత్మస్థైర్యమే నన్ను ప్రశాంతంగా ఉండేలా చేస్తోంది. భారత్‌కు ఆడే ప్రతి మ్యాచ్ ప్రత్యేకమైనదే. అందుకని ఎక్కడా ఉదాసీనత కనబర్చను. జట్టు మేనేజ్‌మెంట్ నాకు స్వేచ్ఛనిచ్చింది. ఒత్తిడి ఎప్పుడూ ఉంటుంది. దీటుగా ఎదుర్కొంటే అది బలంగా మారుతుంది. లొంగిపోతే సమస్యలకు దారితీస్తుంది' అని విశ్లేషించాడు.

ముంబై లీగ్ మెంటార్‌గా వెంగీ

ముంబై: భారత మాజీ కెప్టెన్ వెంగ్‌సర్కార్ ముంబై టి20 లీగ్ చీఫ్ మెంటార్‌గా ఎంపికయ్యారు. అతడిని చీఫ్ మెంటార్‌గా నియమిస్తున్నట్లు ముంబై క్రికెట్ అసోసియేషన్ మంగళవారం ప్రకటించింది. 'ముంబై క్రికెటర్లకు ఇదో గొప్ప అవకాశం. తమ సత్తా చాటి గుర్తింపు పొందడానికి యువకులకు ఇది చక్కటి వేదిక. చీఫ్ మెంటార్‌గా యువ ప్రతిభను ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నాను' అని ఆయన తెలిపారు. ఈ లీగ్‌కు భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అంబాసిడర్‌గా, లిటిల్ మాస్టర్ సునీల్ గావస్కర్ కమిషనర్‌గా వ్యవహరించనున్నారు.



సెరెనా శుభారంభం

ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ

ఇండియన్ వెల్స్: అమెరికా టెన్నిస్ స్టార్, మాజీ వరల్డ్ నంబర్‌వన్ సెరెనా విలియమ్స్ ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. గతేడాది సెప్టెంబర్‌లో కూతురు ఒలింపియా పుట్టిన తర్వాత సెరెనా ఫెడ్‌కప్‌లో రాకెట్ పట్టినా... డబ్ల్యూటీఏ టోర్నీ బరిలో నిలవడం ఇదే ప్రథమం. గురువారం రాత్రి జరిగిన మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో సెరెనా 7–5, 6–3తో జరీనా దియాస్ (కజకిస్తాన్)పై విజయం సాధించింది. మ్యాచ్ ఆసాంతం ఆధిపత్యం చెలాయించిన 36 ఏళ్ల సెరెనా తనలో మునుపటి జోరు తగ్గలేదని నిరూపించింది. తదుపరి మ్యాచ్‌లో కీకీ బెర్టెన్స్‌తో సెరెనా తలపడనుంది. గత 17 ఏళ్లలో సెరెనా గతంలో కేవలం రెండు సార్లు మాత్రమే ఈ టోర్నీలో ఆడింది. మరోవైపు ఇదే టోర్నీలో సెరెనా సోదరి వీనస్‌కు తొలి రౌండ్‌లో 'బై' లభించింది.

నేడు లంకతో బంగ్లాదేశ్ ఢీ

ముక్కోణపు టి20 టోర్నమెంట్

రాత్రి 7 గంటల నుంచి డి స్పోర్ట్స్‌లో మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం

కొలంబో: నిదహాస్ కప్ ముక్కోణపు టి20 టోర్నీలో భాగంగా శనివారం శ్రీలంకతో బంగ్లాదేశ్ తలపడనుంది. భారత్‌పై తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన ఆతిథ్య జట్టుకు... బంగ్లాతో పోరు ఒకింత తేలికే. పైగా ఇటీవలే ఆ జట్టును వారి దేశంలోనే టి20 సిరీస్‌లో ఓడించింది. జట్టు పరంగానూ పెద్దగా సమస్యలు లేకపోవడంతో లంక పూర్తి ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది. కీలక ఆల్‌రౌండర్, కెప్టెన్ షకీబుల్ హసన్ లేని లోటు బంగ్లాదేశ్‌పై ప్రభావం చూపుతోంది. దూకుడు కొరవడిన బ్యాటింగ్, పసలేని బౌలింగ్‌తో భారత్‌పై వారి ప్రదర్శన సాదాసీదాగా కనిపించింది. ఈ నేపథ్యంలో అత్యుత్తమ ఆటతీరు కనబరిస్తేనే గెలుపును ఊహించే పరిస్థితి. శ్రీలంక 70వ స్వాతంత్ర్య సంబరాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీకి శ్రీలంక ఎయిర్‌లైన్స్ అధికారిక భాగస్వామిగా వ్యవహరిస్తోంది.

ఐర్లాండ్ చేతిలోనూ ఓడారు

2-3తో భారత్ ఓటమి ◆ అజ్లాన్‌షా కప్ హాకీ టోర్నీ



ఇఫో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్‌షా కప్ హాకీ టోర్నీలో భాగంగా ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఓటమి పాలై ఫైనల్ అవకాశాలను చేజార్చుకుంది. శుక్రవారం ఇక్కడ జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 2–3 గోల్స్ తేడాతో ఓడింది.మన జట్టు తరఫున రమణ్‌దీప్ సింగ్ (10వ నిమిషం), అమిత్ రొహిదాస్ (26వ నిమిషం) చెరో గోల్ చేశారు. ప్రత్యర్థి జట్టు తరఫున షేన్ డొనొగ్ (24వ నిమిషం), సీన్ ముర్రే (36వ నిమిషం), లీ కోల్ (42వ నిమిషం) గోల్స్ నమోదు చేశారు. ఇక శనివారం జరిగే పోరులో ఐదో స్థానం కోసం భారత్ పోటీపడనుంది.

ఆర్టీసీకి రూ.46.06 కోట్లు

సాక్షి, అమరావతి: ఆర్థిక ఏడాది ముగుస్తున్న నేపథ్యంలో ఏపీఎస్ ఆర్టీసీకి రూ.46.06 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాయితీ పాస్‌లకు రూ.29.50 కోట్లు, వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు వడ్డీ చెల్లించేందుకు రూ.16.56 కోట్లు విడుదల చేశారు.

12 నుంచి మెగలిథిక్ సంస్కృతిపై అంతర్జాతీయ సదస్సు

పురావస్తు శాఖ కమిషనర్ జి.వాణీమోహన్

సాక్షి, అమరావతిబ్యూరో: మెగలిథిక్ సంస్కృతిపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 12 నుంచి 14 వరకు నాగార్జున విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పురావస్తు శాఖ కమిషనర్ జి.వాణీమోహన్ తెలిపారు. విజయవాడలో శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ సదస్సులో దక్షిణ కొరియా, కాంబోడియా, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక తదితర దేశాల నుంచి ప్రొఫెసర్లు దేశ, విదేశీ పరిశోధక విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులు పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాలను సందర్శించి అక్కడ తవ్వకాల్లో వెలికితీసిన మెగలిథిక్ సంస్కృతి అవశేషాలను పరిశీలిస్తారని వివరించారు. భవిష్యత్తులో పోలవరం ప్రాజెక్టు వద్ద మ్యూజియం నిర్మించి మెగలిథిక్ అవశేషాలను ప్రజలు సందర్శించే అవకాశం కల్పిస్తామని కమిషనర్ చెప్పారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

సాక్షి
ఫ్యామిలీ
విజయవాడ
శనివారం, 10-3-2018



ఎనిమిదడుగుల బంధం

ఇద్దరు ఒకటవ్వాలంటే..
ఏడడుగుల బంధం
సరిపోతుంది.
కానీ పెళ్లిచేసుకున్నాక
ఉండేది
ఈ సమాజంలోనే..
బతికేది ఈ ప్రకృతిలోనే..
కదా.
అందుకే పెళ్లిచేసుకునేటప్పుడు
తనూ నేనే లోకం అని
కాకుండా
తను, నేను, లోకమూ ఉండాలని
ఏడడుగులకు ఇంకొక్క
అడుగు వేస్తే..
ఎనిమిదో అడుగూ వేస్తే..
అదే నిజమైన వివాహబంధం
అవుతుంది!



కట్నంగా ఐదు మొక్కలు

ఉత్తర ప్రదేశ్‌లో ఓ పెళ్లికొడుకు. పేరు తపన్ పాండే. పెళ్లికి స్పెషల్ గెస్ట్‌లను ఆహ్వానించాలను కున్నాడు. వధువు అంజలి మిశ్రా కూడా ఓకే చెప్పింది. అలా వారి పెళ్లికి ఆ ప్రత్యేక ఆహ్వానితులు విచ్చేసి సంతోషంగా గడిపారు. ఆ ఆహ్వానితులు అనాథపిల్లలు! వాళ్లలో కొందరు వికలాంగులు. అంతటితో అయిపోలేదు. వధూవరులిద్దరూ తమ కళ్లను దానం చేస్తున్నట్లు ప్రతిజ్ఞ చేశారు. పెళ్లికి కట్నం ఇచ్చి తీరాలని కూడా డిమాండ్ చేశాడు పెళ్లి కొడుకు! అయితే ఆ కట్నం.. అతడిని నేరస్థుడిని చేసి జైలు పాలు చేసేది కాదు. కట్నంగా అతడు అడిగి తీసుకున్నవి ఐదు మొక్కలు! పెళ్లి సందర్భంగా మామగారిచ్చిన ఆ మొక్కలను ఇంటి పెరట్లో నాటుకున్నాడు అల్లుడుగారు.

మూగ జీవులకు రిసెప్షన్

మహారాష్ట్రలో మరో పెళ్లి కొడుకు ఆదిత్య తివారి. అతడు పెళ్లి నాటికే ఓ బిడ్డకు తండ్రి! సింగిల్ పేరెంట్. దత్తత స్వీకార నిబంధన మార్పు కోసం రెండేళ్లుగా సామాజిక పోరాటం చేస్తున్న ఆదిత్య.. తన పెళ్లి సందర్భంగా 'డౌన్స్ సిండ్రోమ్'తో బాధపడుతున్న ఓ బిడ్డను దత్తత చేసుకున్నాడు. అతడి పెళ్లి వేడుకకు హాజరైన వారిలో పది వేల మంది నిర్వాసితులు, వృద్ధులు, అనాథలే. ఆ రోజు స్థానిక జూలోని వెయ్యి జంతువులకు, వందలాది వీధి కుక్కలకు ఆహారం పెట్టారు. ఆహ్వానితులు వెయ్యి మొక్కలు నాటారు. వచ్చిన కానుకలకు బదులుగా అందరికీ పుస్తకాలు, మందులు తిరుగు కానుకగా ఇచ్చాడు ఆదిత్య.

వధువుకు మంచి పుస్తకాలు

మలయాళీ వధువుది మరో మార్గం. అత్తవారింటి వారు పెళ్లి సందర్భంగా వధువుకి ఖరీదైన దుస్తులు, నగలు బహుమతిగా ఇవ్వడం అక్కడి సంప్రదాయం. అయితే వాటికి బదులుగా యాభై మంచి పుస్తకాలను బహుమతిగా ఇవ్వమని కోరింది. వధువు సాహ్లా ముచ్చట తీర్చడానికి వరుడు అనీష్ స్వయంగా బెంగళూరు వెళ్లాడు. అవును మరి, ఆమె కోరిన పుస్తకాలు చిన్న పట్టణాలలో దొరికేవి కావు. ఆమె కోరిన అరుదైన పుస్తకాల కోసం బ్లోసమ్స్, గంగారామ్స్, బుక్‌వార్మ్ వంటి షాపులన్నీ గాలించాడు. వాటిలో ఇస్లామిక్ ఫెమినిస్ట్ లిటరేచర్, ఫిక్షన్, పాలిటిక్స్ వంటివి ఉన్నాయి. ''మెహర్ అనేది మహిళ హక్కు. ఆమె హక్కును గౌరవంగా తీర్చాల్సిన బాధ్యత భర్త మీద ఉంటుంది. ఆ బాధ్యతను నెరవేర్చాను. అంతే తప్ప ఇదేమీ నా ఉదారత కాదు'' అంటున్నాడు అనీస్.

వితంతువులకు ప్రత్యేక ఆహ్వానం

గుజరాత్‌లోని వ్యాపారి జితేంద్ర పటేల్ తన కొడుకు పెళ్లికి పాటించిన వైవిధ్యత మూఢనమ్మకాలకు చెంపపెట్టుగా నిలిచింది. దేశం ఎంత అభివృద్ధి చెందినా, మన సమాజంలో శుభకార్యాలకు వితంతువులను ఆహ్వానించడానికి వెనుకాడే దుస్సంప్రదా యం ఇంకా ఉంది. దానిని చెరిపేసే ప్రయత్నంలో భాగంగా తన పెళ్లికి వితంతువులను ఆహ్వానించాడు జితేంద్ర. పెళ్లికి వచ్చిన 18 వేల మంది వితంతువులకు అతడు అందమైన శాలువాలు, ఫలాలనిచ్చే మొక్కలు పంచారు. వారిలో జీవనాధారం లేని ఐదు వందల మందికి ఒక్కొక్కరికి ఒక్కొక్క పాలిచ్చే ఆవుని కూడా ఇచ్చాడు జితేంద్ర పటేల్.

ప్రమాణాలకు బదులు ప్రతిజ్ఞ

గుజరాత్‌కే చెందిన మరో వ్యాపారి గోపాల్ వస్తాపారా తన కొడుకు పెళ్లితోపాటు 'తోడుపెళ్లి'లా మరో వంద మంది ఆడపిల్లలకు పెళ్లి చేశాడు! చెవులు చిల్లులు పడే బ్యాండ్ బాజాలకు, ఇతరత్రా హంగామాలకు చేసే దుబారాను తగ్గించి ఆ డబ్బుతో అల్పాదాయ వర్గాల వధూవరులకు సామూహికంగా వివాహాలు జరిపించాడు. గోపాల్ వస్తాపారా కొత్త దుస్తులిచ్చి, పెళ్లి చేసి, అక్షింతలు వేసి ఆశీర్వదించి అంతటితో ఊరుకోలేదు. ఆ వందమంది దంపతులతో 'ఆడపిల్లలను కాపాడుతాం, అలాగే పర్యావరణాన్ని పరిరక్షిస్తాం'' అని ప్రతిజ్ఞ చేయించాడు. కడుపులో ఉన్నది అమ్మాయి అని తెలియగానే భ్రూణహత్యలకు పాల్పడడం, పుట్టగానే చంపేయడం అనే దుస్సంప్రదాయానికి అడ్డు కట్ట వేయడానికి తన వంతుగా బాధ్యత తీసుకున్నాడు. 'బేటీ బచావో' అని వందల మంది చేత వందలసార్లు ప్రమాణాలు చేయించడం కంటే వైవాహిక జీవితం మొదలు పెట్టిన కొత్త దంపతుల చేత ప్రతిజ్ఞ చేయించడం మంచిదనుకున్నాడు.

సైకిల్ ర్యాలీ సందేశం

సూరత్‌లో దాదాపు 250 మంది పెళ్లి కొడుకులు సైకిల్ ఎక్కి సందేశం ఇచ్చారు. వాతావరణ కాలుష్యం పట్ల అవేర్‌నెస్ తీసుకురావడానికి ఆ యువకులు చేసిన ప్రయత్నం ఇది. ఉత్తర భారత దేశంలోని ఢిల్లీ, సూరత్ వంటి అనేక నగరాలు విపరీతమైన వాయు కాలుష్యానికి లోనయ్యాయి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈ సంగతి గుర్తు చేస్తూ వాహనాల వాడకం తగ్గించాలని, లేకపోతే ఊపిరి తిత్తుల సమస్యలు ఎదురవుతాయని, జనజీవనం ప్రమాదంలో పడనుందని ఏటా హెచ్చరికలు ఇస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో సూరత్‌లో యువకులు వాయు కాలుష్యం, పర్యావరణ పరిరక్షణ వంటి విషయాల మీద చైతన్యవంతం చేయడానికి పూనుకున్నారు. ఎకో ఫ్రెండ్లీ లైఫ్ స్టయిల్‌ను పరిచయం చేయాలనుకున్నారు.

పెళ్లి దుస్తుల్లో బంధువులతో కలసి సైకిళ్లెక్కి సూరత్ పట్టణంలో చక్కర్లు కొట్టారు.


ప్రీతీ, అబే

'ఆత్మహత్య' రైతుల పిల్లలకు విరాళం

ఈ వధూవరుల పేర్లు అబే దివారే, ప్రీతీ కుంభారే. వీళ్లది మహారాష్ట్ర. ఇద్దరూ ఐఆర్‌ఎస్ ఉద్యోగులు. నిరాడంబరంగా పెళ్లి చేసుకున్నారు. తమ పెళ్లికి ఖర్చు చేయాలనుకున్న డబ్బుని ఆత్మహత్య చేసుకున్న పదిమంది రైతుల పిల్లల చదువు కోసం ఒక్కొక్కరికి 20 వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఇంకా వారందరికీ కలిపి 50 వేల రూపాయల పుస్తకాలు, ఐదు లైబ్రరీలకు కూడా ఆర్థిక సహాయం చేశారు.

– మంజీర

ఫైటర్


మిగ్–21 బైసన్ యుద్ధ విమానాన్ని నింగిలో సోలోగా ఒక ఆట ఆడించేందుకు సిద్ధమవడానికి ముందు చిరునవ్వులు చిందిస్తున్న అవని చతుర్వేది (ఫైల్ ఫొటో)

బ్రెయిన్ పవర్


అవని

శత్రువు గురిపెట్టి కూర్చున్న మారణాస్త్రాన్ని ఐదువేల కిలోమీటర్ల దూరం నుంచి టార్గెట్ చేసి 'ఫట్'మని కొట్టడానికి కావలసింది.. కండలు తిరిగిన బాడీ కాదు, బ్రెయిన్! స్త్రీ, పురుషులలో అంత షార్ప్ బ్రెయిన్ ఎవరికుంది? ఇంకెవరికి! మహిళలకే. 'మహిళలకే' అని ఊరికే అనేయడం కాదు. పరిశోధకుల 'కంపారిటివ్ స్టడీస్'లో.. ఫిమేల్ బ్రెయినే ఎప్పుడూ గుడ్ కండిషన్‌లోనే ఉంటుందని ఇప్పటికెన్నోసార్లు నిర్ధారణ అయింది. అదికాదు విశేషం. ఎలాంటి వరస్ట్ కండిషన్స్‌లోనైనా గుడ్ కండిషన్‌లోనే పనిచేస్తుందట మహిళల మైండ్. అదీ వాళ్ల గ్రేట్నెస్! కోపమొస్తే అరిచేయడం, రెచ్చగొడితే విరుచుకు పడడం మగవాళ్ల బలంలోని బలహీనతలు. యుద్ధ పరిస్థితుల్లో అవి నడవ్వు. ఓర్పుండాలి. వ్యూహం ఉండాలి. ప్రశాంతంగా ఆలోచించే 'ప్రెజన్స్ ఆఫ్ మైండ్' ఉండాలి. ప్రపంచదేశాల రక్షణ వ్యవస్థలు మహిళల శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకోవడానికి.. 'అమ్మా.. రండి' అని ఆహ్వాన దరఖాస్తులు పెట్టుకుంటున్నాయంటే ఆ ప్రెజెన్స్ ఆఫ్ మైండే కారణం! రెండు వారాల క్రితం అవని చతుర్వేది అనే యువతి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఫైటర్ జెట్‌ను గగనంలో సోలోగా గింగిర్లు కొట్టించి నేర్పుగా నేలకు దిగివచ్చింది. అంతటి గట్స్ ఉన్న ఫస్ట్ ఇండియన్ ఉమన్.. అవని. ఇక నిర్మలా సీతారామన్ భారతదేశపు తొలి మహిళా రక్షణశాఖ మంత్రి. (ఇందిరాగాంధీ రక్షణశాఖ మంత్రిగా ఉన్నారు కానీ, ప్రధానిగా ఉంటూ అదనపు బాధ్యతగా మాత్రమే ఆమె ఆ శాఖను నిర్వహించారు). సోల్జర్లు, బాంబర్ పైలట్‌లు, కల్నళ్లు, జనరళ్లు.. ఇలా అన్ని స్థాయిలలో, అన్ని దేశాలలో మహిళలు కనిపించడం నిజానికిప్పుడు సాధారణం అయింది. అయితే ఏదో నిరూపించుకోవాలని వీళ్లీ యుద్ధక్షేత్రాల్లోకి రావడం లేదు. 'వియ్ టూ' అని పోటీగా కూడా పిడికిలి బిగించడం లేదు. కాన్ఫిడెన్స్ ఉంది. వచ్చేస్తున్నారు. దేశాలకు నమ్మకం ఉంది. వారిని రమ్మంటున్నాయి. నమ్మకం దేనిపైనంటే.. నారీశక్తి మీద!

యుద్ధోన్మాదం, మారణ హోమం
అంతా మగశక్తిదే.
నారీశక్తి ఆధిక్యం
కోసం చూడదు. నష్ట నివారణ
కోసం చూస్తుంది. నవ నిర్మాణం
కోసం చూస్తుంది.

హిస్టరీలో లిస్టవుట్ చేస్తే.. యుద్ధోన్మాదం, మారణహోమం అంతా మగశక్తిదే. ఊరికే దాహం! ఆధిక్యం కోసం. నారీశక్తి ఆధిక్యం కోసం చూడదు. నష్ట నివారణ కోసం చూస్తుంది. నవ నిర్మాణం కోసం చూస్తుంది. యుద్ధం కోసం పురుషుడు మీసాలైనా రాని పిల్లల్ని సైన్యంలోకి రప్పిస్తే, స్త్రీ.. యుద్ధనేతల్ని సైతం పిల్లలుగా కూర్చోబెట్టి.. వాళ్ల చేతిలో తలా ఇంత 'బుద్ధి'ని ముద్దలు చేసి పెడుతుంది. అభివృద్ధి కన్నా ఇప్పుడు ముఖ్యం బుద్ధి. అది మహిళ చేతిలో ఉంది. చెయ్యి చాపి అడగడం నామోషీ అనుకుంటే, పెట్టడానికి ఆమె చాపిన చెయ్యికి దోసిలి పడితే సరి.

చెట్టు నీడ

తరాలు కొనసాగే సంపద

ఆ గృహస్థుకు కోపమొచ్చింది. 'నేను ఇంటికి పిలిచి మీకు మర్యాదలు చేసిందానికి ఇదా ఫలితం? నాతో పరిహాసం ఆడుతున్నారా?' అన్నాడు.

ఒక ఊరికి ఒక సాధువు వచ్చాడు.

ఊరి మర్రిచెట్టు కింద కూర్చుని, వచ్చిపోయేవారికి తన బోధనలు చేస్తున్నాడు. సాధువుల పట్ల గౌరవం ఉన్న ఒకాయన ఆయన్ని తన ఇంటికి ఆహ్వానించాడు. భక్తిశ్రద్ధలతో ఆతిథ్యం ఇచ్చాడు. సాధువు దానికి ఎంతో సంతోషించాడు.

ఇంట్లోంచి సెలవు తీసుకునేముందు ఏమైనా కోరుకొమ్మని గృహస్థును అడిగాడు.

దానికా గృహస్థు, తరతరాలకు కొనసాగే అసలైన సంపద ఏదైనా ఉంటే అది ప్రసాదించమని అడిగాడు.

సాధువు చిరునవ్వి, 'తండ్రి మరణిస్తాడు, కొడుకు మరణిస్తాడు, మనవడు మరణిస్తాడు' అని పలికాడు.

దాంతో ఆ గృహస్థుకు కోపమొచ్చింది.

'నేను ఇంటికి పిలిచి మీకు మర్యాదలు చేసిందానికి ఇదా ఫలితం? నాతో పరిహాసం ఆడుతున్నారా?' అన్నాడు.

'నాయనా, నా మాటల్లో పరిహాసం ఏమీలేదు. నీవుండగానే నీ కుమారుడు మరణిస్తే నీకు మిగిలేది శోకమే. నీవూ, నీ కుమారుడూ ఉండగానే నీ మనవడు మరణిస్తే మీ ఇద్దరికీ కలిగేది అమితమైన దుఃఖమే. అలా కాకుండా, ముందు నువ్వు వెళ్లిపోయి, తర్వాత నీ కుమారుడు, అటుపై నీ మనవడు నిష్క్రమిస్తే... అది ఒక సహజ క్రమం. మీ తరతరాల్లోనూ ఇలాగే జరిగితే ఇంతకంటే సంపద ఏముంటుంది?' అని వివరించాడు సాధువు.

అందులోని ఆంతర్యం అర్థమైన ఆ గృహస్థు వినమ్రంగా సాధువుకు నమస్కరించాడు.

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్..! నేనొక అమ్మాయిని ఫోర్ ఇయర్స్‌గా లవ్ చేస్తున్నాను. తను కూడా నన్ను ఇష్టపడుతుందనిపిస్తోంది. ప్రపోజ్ కూడా చేశాను కానీ, ఆ అమ్మాయి బయటపడ్డంలేదు. ఎందుకు లవ్ చెయ్యడంలేదని అడిగితే.. "నేను చదువుకోవాలి" అని చెబుతోంది. సో నేను ఏం చెయ్యాలి? లవ్ చెయ్యాలా..??? వదిలెయ్యాలా..????

– రాజ్

వదిలెయ్యి!

'సార్ రాజ్ గుండె మీద తుపాకీతో కాల్చినట్టు ఏంటి సార్ ఆ సమాధానం?'

గురి పెట్టి కాల్చడానికి రాజ్ ఏమైనా పిట్టా???

'అది తెలిసి కూడా.. డిష్యూం అని ఎలా కాల్చారు సార్?'

రాజ్ కాల్చలేదా?

'ఏంటి సార్ కాల్చింది?'

తన గుండెలో భావాన్ని తీసుకుని.. దాన్ని బుల్లెట్లా సాన పెట్టి... నోటి పండ్ల మధ్య బిగబెట్టి.. మాటల తూటా పేల్చలేదా???

'ప్రేమించానని చెప్పడం కూడా పేల్చడమేనా సార్?'

అమ్మాయి పిట్ట కాదు. బడేల్మని రాలి మనోడి కాళ్లదగ్గర పడ్డానికి..? షీ ఈజ్ ఎ కంప్లీట్ ఉమెన్. రిమెంబర్ దట్!!

'ఎందుకు సార్ అంత కోపం మీకు!!!?!!!'

అరే.. ప్రేమించాను అనగానే అమ్మాయి పడాలా? రాజ్ తన మనసులో మాట చెప్పుకున్నాడు. అమ్మాయికి ఇష్టం ఉంటే ఒప్పుకుంటుంది. తెలియక పోతే టైమ్ తీసుకుని చెబుతుంది. అప్పుడు కూడా పాజిటివ్‌గా చెప్పాలనేంలేదు. తనకు కూడా కరెక్ట్ అనిపిస్తేనే కదా.. అమ్మాయి మనసును గౌరవించకుండా రాజ్ లాంటి మంచి వాళ్లు కూడా రెచ్చిపోతే ఎలా నీలాంబరీ!?!

'కరెక్ట్‌గా చెప్పారు సార్..! రాజ్.... ప్లీజ్ రెస్పెక్ట్ ఉమెన్ యార్!'

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

కాయితో సుడోకు

			2		9	6		5
1		4		5		2		7
	2			4	7	9		1
		8					7	
		3				4		2
	1					5		
8		5	9	2			6	
7		1		6		8		9
2		9	8		3			

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

1	4	[illegible]	9	5	[illegible]	3	7	[illegible]
5	9	7	[illegible]	3	8	[illegible]	6	4
8	2	[illegible]	4	6	[illegible]	[illegible]	9	[illegible]
7	[illegible]	9	[illegible]	1	[illegible]	8	[illegible]	[illegible]
[illegible]	[illegible]	5	6	[illegible]	3	7	[illegible]	[illegible]
[illegible]	[illegible]	2	[illegible]	7	[illegible]	1	[illegible]	8
[illegible]	[illegible]	[illegible]	1	9	6	[illegible]	8	3
6	3	[illegible]	8	2	[illegible]	9	5	7
[illegible]	7	8	[illegible]	4	5	[illegible]	1	2

రాగి రగస్యాలు

పిండి వంటలు 3

రాగిలో చాలా దాగి ఉన్నాయి...
ఆరోగ్యం, ఆస్వాదనం, సంబరం, సంతోషం...
ఇవే మరి రాగి రగస్యాలు...

కావలసినవి: రాగుల పిండి – 2 టేబుల్ స్పూన్లు; ఆపిల్స్ – 2; బెల్లం పొడి – ఒక టేబుల్ స్పూను; నెయ్యి – అర టీ స్పూను; నీళ్లు – ముప్పావు కప్పు.

తయారి: ● ఆపిల్స్‌ను శుభ్రంగా కడిగి (తొక్క, గింజలు వేరు చేసి) చిన్న చిన్న ముక్కలుగా కట్ చేయాలి ● ఒక బాణలిలో రాగుల పిండికి, ముప్పావు కప్పు నీళ్లు జత చేసి ఉండలు లేకుండా బాగా కలిపి, స్టౌ మీద సన్నని మంట మీద ఆపకుండా కలుపుతూ బాగా ఉడికించాలి ● ఉడుకుతున్న రాగుల పిండిలో... ఆపిల్ గుజ్జు, బెల్లం పొడి, నెయ్యి వేసి బాగా కలపాలి ● సుమారు నాలుగైదు నిమిషాలు బాగా ఉడికి, దగ్గర పడిన తరవాత దింపేయాలి ● చల్లారాక బౌల్స్‌లో అందించాలి.

ఆపిల్ రాగుల పిండి హల్వా



రాగులు పల్లీల లడ్డు



కావలసినవి: రాగుల పిండి – ఒక కప్పు; పల్లీలు – 2 కప్పులు; బెల్లం పొడి – ఒకటిన్నర కప్పులు; పాలు – అర కప్పు; నువ్వులు – అర కప్పు;

తయారి: ● స్టౌ మీద బాణలి వేడయ్యాక, మంట తగ్గించి, రాగుల పిండి వేసి పచ్చి వాసన పోయేవరకు వేయించి (సుమారు పది నిమిషాల సమయం పడుతుంది) వేరే పాత్రలోకి తీసుకుని పక్కన ఉంచాలి ● అదే బాణలిలో పల్లీలు, వేసి వేయించి, మరో పాత్రలోకి తీసుకుని, చల్లారాక మిక్సీలో వేసి పొడి చేయాలి ● అదే బాణలిలో నువ్వులు కూడా వేసి వేయించి, వేరే పాత్రలోకి తీసుకుని, చల్లారాక మిక్సీలో వేసి మెత్తగా చేయాలి ● ఒక గిన్నెలో రాగుల పిండి, పల్లీల పొడి, నువ్వుల పొడి, బెల్లం పొడి వేసి, బాగా కలపాలి ● పాలు జత చేస్తూ చిన్న చిన్న లడ్డూల మాదిరిగా చేసుకోవాలి ● గాలి చొరని డబ్బాలో నిల్వ చేసుకోవాలి.

రాగి కోకోనట్ కుకీస్



కావలసినవి: ఎండు కొబ్బరి తురుము – ముప్పావు కప్పు; రాగుల పిండి – ముప్పావు కప్పు; గోధుమ పిండి – అర కప్పు; అన్ సాల్టెడ్ బటర్ – 150 గ్రా; పంచదార పొడి – 150 గ్రా.; పంచదార – ఒక టేబుల్ స్పూను; వెనిలా ఎసెన్స్ – 2 టీ స్పూన్లు; కోడి గుడ్డు – 1 (చిన్నది);

తయారి: ● ఒక పాత్రలో బటర్, పంచదార పొడి వేసి బాగా కలిసేవరకు గిలకొట్టాలి ● కోడి గుడ్డుసొనలు, వెనిలా ఎసెన్స్ జత చేసి మరోమారు గిలకొట్టి, ఒక పాత్రలోకి తీసుకోవాలి ● పంచదార జత చేసి నెమ్మదిగా కలిపి, మూత పెట్టి సుమారు గంటసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి ● కుకర్‌లో ఇసుక పోసి స్టౌ మీద ఉంచి, బాగా వేడయ్యాక మంట తగ్గించాలి ● కుకర్ వేడెక్కేలోపు, ఫ్రిజ్‌లో నుంచి రాగుల పిండి మిశ్రమం బయటకు తీసి, చిన్న చిన్న ఉండలుగా చేసి, చేతితో ఒత్తి, అల్యూమినియం ట్రేలో దూరం దూరంగా ఉంచి, కుకర్‌లో పెట్టాలి (విజిల్ పెట్టకూడదు) ● సుమారు పావు గంట తరవాత స్టౌ మీద నుంచి దింపేయాలి ● కొద్దిగా చల్లారాక ఒక ప్లేట్‌లోకి తీసి, అందించాలి.

కావలసినవి: రాగుల పిండి – పావు కప్పు; గోధుమ పిండి – పావు కప్పు; మిరప పొడి – అర టీ స్పూను; ఉప్పు – తగినంత; గరం మసాలా – పావు టీ స్పూను; నూనె – ఒక టీ స్పూను; ఆలు గడ్డ – 1; మెంతి ఆకుల తరుగు – రెండు టేబుల్ స్పూన్లు.

తయారి: ● ఆలుగడ్డను ఉడికించి, తొక్క తీసి పక్కన ఉంచాలి ●బాణలిలో కొద్దిగా నూనె వేసి కాగాక, మెంతి ఆకుల తరుగు వేసి, పచ్చి వాసన పోయేవరకు వేయించి తీసేయాలి ● ఒక పాత్రలో తొక్క తీసిన ఆలు గడ్డ వేసి చేతితో మెత్తగా అయ్యేలా చిదిమాక, వేయించి ఉంచుకున్న మెంతి ఆకులు, గోధుమ పిండి, రాగి పిండి, మిరప పొడి, గరం మసాలా, ఉప్పు, తగినన్ని నీళ్లు జతచేసి చపాతీ పిండిలా కలపాలి ● టీ స్పూను నూనె జత చేసి బాగా కలిపి సుమారు గంటసేపు పక్కన ఉంచాక, పెద్ద పెద్ద ఉండలు చేయాలి ● ఒక్కో ఉండను పరాఠాలుగా ఒత్తాలి ● స్టౌ మీద పాన్ వేడయ్యాక, ఒక్కో పరాఠాను వేసి రెండు వైపులా నూనె వేసి, దోరగా కాల్చి తీసేయాలి ● వేడివేడిగా అందించాలి.

రాగి ఆలు మేథీ పరాఠా



రాగి బ్రెడ్



కావలసినవి: రాగుల పిండి – అర కప్పు; గోధుమ పిండి – ఒక కప్పు; పాల పొడి – అర కప్పు; అరటిపండ్లు – 3 (బాగా పండినవి); రిఫైన్డ్ ఆయిల్ – అర కప్పు; తేనె – పావు కప్పు; బేకింగ్ పౌడర్ – అర టీ స్పూను; బేకింగ్ సోడా – ఒక టీ స్పూను; దాల్చిన చెక్క పొడి – ఒక టీ స్పూను; జాజి కాయ పొడి – అర టీ స్పూను; ఉప్పు – చిటికెడు; డ్రై నట్స్ పొడి – అర కప్పు (బాదం పప్పులు + వాల్నట్స్)

తయారి: ● ఒక పాత్రలో గోధుమపిండి, రాగుల పిండి, దాల్చిన చెక్క పొడి, జాజి కాయ పొడి, ఉప్పు, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా వేసి బాగా కలిపి, రెండుమూడు సార్లు జల్లెడ పట్టాలి ● మరొక పాత్రలో తొక్క తీసిన అరటిపండ్లను వేసి మెత్తటి గుజ్జులా చేసాక – తేనె, రిఫైన్డ్ ఆయిల్ జత చేసి మరోమారు కలిపాక, బీటర్ (కవ్వం) సహాయంతో బాగా గిలకొట్టాలి ● పాల పొడి జత చేసి, మరోమారు గిలకొట్టాలి ● రాగుల పిండి మిశ్రమం జత చేస్తూ, ఉండ కట్టకుండా బాగా కలపాలి ●డ్రై నట్స్ పొడి జత చేయాలి ● నలు చదరంగా ఉన్న అల్యూమినియం ట్రేకి నెయ్యి పూసి, తయారుచేసి ఉంచుకున్న మిశ్రమాన్ని అందులో పోసి, సమానంగా పరిచి పక్కన ఉంచాలి ● కుకర్‌లో అంగుళం మందంలో ఇసుక పోసి స్టౌ మీద ఉంచి వేడయ్యాక, మంట బాగా తగ్గించాలి ● సిద్ధంగా ఉంచుకున్న అల్యూమినియం ట్రేను కుకర్‌లో ఉంచి, మూత పెట్టాలి. (విజిల్ పెట్టకూడదు) ● సుమారు 40 నిమిషాలయ్యాక దింపాలి ● కొద్దిగా చల్లారాక ట్రేను బయటకు తీసి, వేరే ప్లేటులోకి మార్చుకోవాలి ● చాకుతో బ్రెడ్ మాదిరిగా కట్ చేసి అందించాలి.

బాగా ఎండలు పెరిగాక మార్కెట్‌లో మెంతి కూర దొరకదు కదా. మరి ఆ సీజన్‌లో కూడా మెంతికూర తినాలంటే ఏం చేయాలి?

● ఎండలు పెరిగేకొద్దీ మెంతికూర ధర బాగా పెరుగుతుంది. అంతేకాదు, లేతగా తాజాగా ఉండే మెంతి కూర దొరకడం కూడా కష్టమే. అందువల్ల ఇంకా ఎండలు బాగా ముదరకుండా, ఇప్పుడే ఎక్కువ మెంతి కూర కొని, తెచ్చుకోవాలి. ఆకులు తెంపి, శుభ్రంగా కడగాలి. పొడి వస్త్రం మీద, నీడలో ఆరబెట్టాలి. పూర్తిగా తడి పోయిన మెంతి ఆకులను గాలిచొరని డబ్బాలో నిల్వ చేసుకోవాలి. ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు ఈ ఆకులను వంటలో వాడుకోవచ్చు.



సేకరణ: **వైజయంతి**

ఈ పాటకు ట్యూన్ తెలుసా?

కట్‌చేయ్...దాచేయ్...

ఏరుసెనగ కోసం మట్టిని తవ్వితే.. ఏకంగా తగిలిన లంకెబిందెలాగ
ఎంత సక్కగున్నావే... లచ్చిమి ఎంత సక్కగున్నావే
సింత సెట్టు ఎక్కి సిగురు కొయ్యబోతే... సేతికి అందిన సందమామలాగ
ఎంత సక్కగున్నావే లచ్చిమి ఎంత సక్కగున్నావే
మల్లెపూల మద్దె ముద్దబంతిలాగ ఎంత సక్కగున్నావే
ముత్తయిదువ మెళ్లో పసుపు కొమ్ములాగ ఎంత సక్కగున్నావే
సుక్కల సీర కట్టుకున్న ఎన్నెలలాగ ఎంత సక్కగున్నావే
॥ ఏరుసెనగ కోసం ॥

చరణం - 1
ఓ రెండు కాళ్ల సినుకువి నువ్వు ... గుండె సెర్లో దూకేసినావు
అలలమూటలిప్పేసినావు ఎంత సక్కగున్నావే లచ్చిమి ఎంత సక్కగున్నావే
మబ్బు లేని మెరుపువి నువ్వు నేల మీద నడిసేసినావు
నన్ను నింగి సేసేసినావు ఎంత సక్కగున్నావే లచ్చిమి ఎంత సక్కగున్నావే
సెరుకుముక్క నువ్వు కొరికి తింటా ఉంటే ఎంత సక్కగున్నావే...
సెరుకు గెడకే తీపి రుసి తెలిపినావే ఎంత సక్కగున్నావే
తిరునాళ్లలో తప్పి ఏడ్సేటి బిడ్డకు ఎదురొచ్చిన తల్లి సిరునవ్వులాగ
ఎంత సక్కగున్నావే లచ్చిమి ఎంత సక్కగున్నావే
గాలి పల్లకిలో ఎంకి పాటలాగ ఎంకి పాటలోన తెలుగు మాటలాగ
ఎంత సక్కగున్నావే లచ్చిమి ఎంత సక్కగున్నావే

చరణం - 2
కడవ నువ్వు నడుమున బెట్టి కట్ట మీద నడిసొత్తా ఉంటే
సంద్రం నీ సంకెక్కినట్టు ఎంత సక్కగున్నావే లచ్చిమి ఎంత సక్కగున్నావే
కట్టెలమోపు తలకెత్తుకుని అడుగులోన అడుగేత్త ఉంటే
అడవి నీకు గొడుగట్టినట్టు ఎంత సక్కగున్నావే లచ్చిమి ఎంత సక్కగున్నావే
బురద సేలో వరి నాటు ఏత్తా ఉంటే ఎంత సక్కగున్నావే
భూమి బొమ్మకు నువ్వు ప్రాణం పోస్తున్నట్టు ఎంత సక్కగున్నావే
॥ఏరు సెనగ కోసం॥



చిత్రం: రంగస్థలం
రచన: చంద్రబోస్
సంగీతం: దేవిశ్రీ ప్రసాద్
గానం: దేవిశ్రీ ప్రసాద్

https://youtu.be/sVFDtM0Jy6Y

రేపటి ఫన్‌డేలో..



ట్రాంపోలీన్ జంప్

"లైఫ్ ఈజ్ ఎ ట్రాంపోలీన్ జంప్" అన్నాడు కృష్ణ. వాడు ఆ మాట నవ్వుతూ చెప్పినా ఆ మాటల్లో గొప్ప ఫిలాసఫీ ఉంది కదా అనిపించింది నాకు. ఈ రోజు ఇక్కడికొచ్చి కూర్చోవడం బాగుంది. 'రేపు నిన్నటిలా కచ్చితంగా ఉండదు' అన్న ఆలోచన ఎంత బాగుందీ! అర్జున్ అంతవరకూ భయపడ్డాడు జీవితాన్ని చూసి. కానీ అతని భయాన్నంతా ఆ ఒక్క సాయంత్రం పోగొట్టింది. జీవితం మీద ఆశ పెంచింది. గెలవాలన్న ఆలోచనకు బలాన్నిచ్చింది. అర్జున్‌కు ట్రాంపోలీన్ జంప్ చూపిన దారి.. 'ట్రాంపోలీన్ జంప్' కథలో..

నాకు ఆకలిగా ఉంది



"నాకు ఆకలిగా ఉంది..". ఈ ఒక్క మాట అతనికి ఆ రైల్వే స్టేషన్‌లో లెక్కలేనన్ని సార్లు వినిపించింది. కానీ అన్నిసార్లూ ఆ మాట ఒకేలా వినిపించలేదు. ఎందుకు వినిపించలేదు? ఆకలి ఎవ్వరికైనా ఒక్కటి కాదా? అతని చుట్టూ ఉన్న కథలు అతనికి ఆకలిని ఎలా అర్థమయ్యేలా చేశాయ్? చదవండి.. 'నాకు ఆకలిగా ఉంది' కథలో..

రెప్పలతడి



బుజ్జోడు చనిపోయినప్పుడు ఏడ్చినట్టు ఆమె అంతకుముందెప్పుడూ ఏడవలేదు. చివరికి భర్త చనిపోయినప్పుడు కూడా! బుజ్జోడితో ఆమెకున్న అనుబంధం అలాంటిది. ఎవరు ఆ బుజ్జోడు? శతాయుష్షులో సగం దాటబోతున్న ఆమెకు బుజ్జోడితో స్నేహం ఎలా కుదిరింది?

చదవండి.. 'రెప్పలతడి' కథలో..

నేను నారీ శక్తి!


అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం న్యూఢిల్లీలో 'నారీశక్తి' అవార్డు అందుకున్న 'ఆలిండియా మిల్లెట్ సిస్టర్ నెట్‌వర్క్' సభ్యులు సుమిత్ర, స్వరూప, చంద్రమ్మ.

'పంచగవ్యం'. సంస్కృత పదం అని తెలియదు.
పంచగవ్యం చేశారు, పంటలు పండించారు!
రసాయన మందుల పేరు తెలియదు.
చీడపీడలొస్తే బెల్లం నీళ్లు చల్లి పోగొట్టారు.
చేలో ధాన్యం రాశి పోశారు, కాపలాగా పొలంలోనే పడుకున్నారు.

రైతంటే మగవాళ్లే కాదు. మహిళలు కూడా.
నేలను, ఒంట్లో శక్తిని నమ్ముకుంటే ఒకరికి చేయి చాచే పని లేదంటున్నారు.
వీళ్లు పుస్తకాలను చదవలేదు. నేలను చదివారు. గింజలను చదివారు.
సిద్ధాంత పత్రాలకు కంటెంట్ ఇస్తున్నారు!
జేబు నింపే పంటలు కాదు, కడుపు నింపే పంటలు కావాలంటున్నారు.
వీళ్లు... 'నారీశక్తి' అవార్డును అందుకున్న రైతు మహిళలు.

చేసిన కష్టం ఊరికే పోతుందా?!


● మొలిగెరి చంద్రమ్మ

నాకప్పుడు ముప్పైఐదు ఏళ్లుంటయ్యేమో. భర్త పోయిండు. ఐదుగురు పిల్లలు. అత్తమామలు ముసలోళ్లు. కొడుకును పోగొట్టుకున్న దుఃఖాన్ని దిగమింగుకుని నాకు ధైర్యం చెప్పారు. 'ఆడి పాలికొచ్చిన పొలం ఇది' అంటూ ఒకటిన్నర ఎకరా ఇచ్చారు. ఆ పొలంతో ఏడాదంతా అన్ని కడుపులు ఎలా నిండాలె? నేలనే నమ్ముకున్న, నా ఒంట్లోని శక్తినే నమ్ముకున్న. పంటలు పెట్టిన. రోజంతా పొలంలో వంచిన నడుము ఎత్తకుండా పని చేసిన. జొన్నల రాశి కాడ కాపలా పండుకున్న. రాశికాడ కాపలా పడుకోవడం మగాళ్ల పని అనుకుంటే నేను మగాణ్ని ఎక్కడ తెచ్చేది. మూటలు మోసిన, గడ్డి మోపులు మోసిన... ఇది మొగోళ్ల పని అనుకున్ననా? ఇదీ అంతే. నాతోపాటు మరొకామె ఉండేది. ఆమెకీ మొగుడు లేడు. ఇద్దరం రాత్రిళ్లు పొలంలో ధాన్యం రాశులకు కాపలా కాశాం. చేసిన కష్టం ఊరికే పోతుందా! ఏడాదంతా తినడానికి పోగా మిగులు పంట చేతికొచ్చేది. ఏటా అర్ధ ఎకరా, ఒక ఎకరా కొంటూ వచ్చిన. ఇప్పుడు ఇరవై ఎకరాలకు ఆసామిని నేను. నేలను, శక్తిని నమ్మితే చేయి చాచి అడుక్కో

గింజల్ని వాళ్ల చేతుల్లో పెట్టొద్దు

మాలాగ సేద్యం చేయాలని దేశదేశాల్నించి వస్తున్నారంట. పెద్దోళ్లకు మేము చెప్పేదొక్కటే. తరతరాలుగా మన నేల ఆస్తులైన మన పంటలను, గింజలను వాళ్ల చేతిలో పెట్టొద్దు. మన కొర్రల్లాంటివే కినోవా అంట. అక్కడెక్కడో పండుతాయంట. వాటిని మన దగ్గర కిలో పద్నాలుగు వందలకు అమ్ముతారంట. కొర్రలు అరవై రూపాయలకొస్తాయి. కార్పొరేటోళ్లకు మన గింజలను ధారాదత్తం చేస్తే మన జొన్నలు, కొర్రలను కూడా కిలో వెయ్యి రూపాయలు పెట్టి వాళ్ల డబ్బాల్లో, ప్యాకెట్లలో కొనాల్సిందే.

వాల్సిన గతి పట్టదు, ఒకరికి కడుపు నిండా పెట్టే వాళ్లమవుతాం.

అదే సాగో తెల్వదు!

అప్పట్లో.. అంటే ముప్పై ఏళ్ల కిందట మాకది సేంద్రియ సేద్యం అని తెలీదు. ఇప్పుడు టీవీల్లో అదే పనిగా చెప్తున్నారు. పెద్ద పెద్ద చదువులు చదివినోళ్లు కూడా ఉద్యోగాలొదిలి ఈ సేద్యం చేయడానికి వస్తున్నారంట. పెద్ద పెద్ద కంపెనీ వోళ్లు కూడా ఈ సేద్యం చేయడానికి వందల ఎకరాలు గుత్తకి కొంటున్నారట. అప్పట్నుంచి మేము చేస్తున్న పనికి ఇప్పుడు 'నారీ శక్తి' అని ఢిల్లీలో రాష్ట్రపతి అవార్డు ఇచ్చిన్రు.

– **మొలిగెరి చంద్రమ్మ**, బిడకన్నె, సంగారెడ్డి జిల్లా
'నారీశక్తి' అవార్డు గ్రహీత

చదువుకునేటోళ్లు అడుగుతుంటరు


● దండు స్వరూప

నాకు మెడలో పుస్తె కూడా లేకుండే. నా భర్త పటేల్ గడిలో పని చేసేటోడు. పిల్లలు గొర్రెలు కాసేటోళ్లు. నేను పని చేసుకుని నాలుగు గింజలు పండించుకోవడానికి చిన్న మడి ఉండేది. కూలికి పోతే రోజుకు ఐదు రూపాయలొచ్చేవి. చంద్రవ్వలాగ చానా మంది మందుల్లేని వ్యవసాయం చేసి దండిగ పండించేటోళ్లు. మాకు చేతనైన పని ఇదొక్కటే. దీన్లనే నేర్చుకోవాలె. దీన్లనే బతకాలె. అందుకే పని చేస్తూ నేర్చుకున్నా. ఇప్పుడు ముప్పై రకాలు పండిస్తున్నా. యాభై రకాల గింజలను తెలుసుకున్న. గింజను చూడగానే అదేం గింజో చెప్పేస్తాను. ఆ పంటకు ఎన్ని రోజులు పడుతుంది, ఏ కాలం నాటాలి.. అన్నీ చెప్పేస్తా. వ్యవసాయం చేయడంలో పెద్ద చదువులు చదివినోళ్లకు కూడా ఇన్ని గింజలు తెలియవు. ప్యాకెట్ మీద పేరు లేకపోతే అదేం గింజో చెప్పలేరు. యూనివర్శిటీల వాళ్లు మా పొలాలకొచ్చి నోట్స్ రాసుకుంటున్నారు.

ఆడబిడ్డకు కష్టం వస్తే మేముంటాం!

మహిళా రైతులు సంఘంగా మారి పనులు చేసుకోవడంతో ఒకరికొకరం అండ అవుతున్నాం. ఏ ఆడపిల్లనైనా కష్టపెడుతున్నారని తెలిస్తే మేమంతా వెళ్లి నిలబడతాం. 'పెళ్లయిన నాలుగైదేళ్లకు ఈ భార్య నాకొద్ద'ని పుట్టింట్లో వదిలి పెట్టిన మొగుళ్లను పిలిచి మాట్లాడుతాం. దారికి రాకపోతే ఆ అమ్మాయి తరపున మేమే పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టి దారికి తెస్తాం. జిల్లా ఎస్‌పి దగ్గరకు పోయి మాట్లాడినం కూడ.

భర్త చనిపోయిన అత్తమామలు పొలం ఇవ్వకుండా 'ఆడే పోయాక ఇక నీతో మాకేం సంబంధం' అని ఆడపిల్ల ఉసురుపోసుకునే వాళ్లుంటారు. ఆ ముసలోళ్ల దగ్గరకు మేమెళ్లి 'ఆ బిడ్డ ఎలా బతకాలే' అని నచ్చచెప్పి పొలం ఇప్పిస్తాం. వినకపోతే కేసు, కోర్టులకు వెళ్లడానికి కోడలికి మేము తోడుంటామని వాళ్లకి తెలుసు. అందుకే మా మాట వింటారు. ఇప్పుడు పటేళ్లు కూడా ఊర్లలో పంచాయితీ వస్తే మమ్మల్ని పిలిపిస్తున్నారు.

మా ఎడాకుల పల్లిలో ఆడవాళ్లం సంఘంగా కూడి 90 ఎకరాలు సాగు చేస్తున్నాం. 'మా పంటలను తృణధాన్యాలంటారంట. ఇవి అలా తృణప్రాయం కాదు. సిరి సంపదలనిచ్చే సిరిధాన్యాలు'... అని ఒక ప్రొఫెసర్ అన్నారు.

– **దండు స్వరూప**, ఎడాకుల పల్లి, సంగారెడ్డి జిల్లా,
'నారీశక్తి' అవార్డు గ్రహీత

మమ్మల్ని చూసి తిండిపంటలేస్తున్నరు


● తలారి సుమిత్ర

రైతు అంటే మగవాళ్లనే చూపిస్తారు. టీవీలు,పేపర్లు కూడా అంతే. ఓసారి మా పొలాల్లోకొచ్చి చూస్తే తెలుస్తుంది రైతులంటే మగాళ్లు మాత్రమే కాదని. మగాళ్లు పైసల పంటలేస్తుంటే మేము తిండి పంటలేస్తున్నం. ఆడోళ్లమంతా గింజధాన్యాల పంటలు పెట్టాం, పక్కన మగాళ్లు పత్తి పంట పెట్టారు. మా పంట గింజపట్టి కంకులు చేతినిండుగా వచ్చాయి. అంతలో ఎక్కడి నుంచి వచ్చాయో పిట్టలు. కంకికి నాలుగు చొప్పున వాలి తింటుంటే మనసు ఉసూరుమన్నది. రాత్రిళ్లు నిద్ర పట్టేది కాదు. ఆ చిన్న ప్రాణులకు కడుపు నింపుకోవడానికి దేవుడు మా పొలాలని చూపించాడు. మా కడుపులు నిండే దారి కూడా ఆ దేవుడే చూపిస్తాడని మిన్నకున్నం. పంట సగమే చేతికొచ్చింది. 'మీ పంటలు కడుపు నింపడం లేదు, అందుకే పక్షులు మా పొలాలకే వస్తున్నాయి, మీరూ కడుపు నింపే పంటలేయచ్చు కదా' అని ఓ సారి మాట వరసకన్నాం. వచ్చే ఏడాది తాము కూడా చిరుధాన్యాలే వేస్తామంటున్నారు.

తెలుగుళ్లకు బెల్లం నీళ్లు చల్లుతం

మేము రైతులం మాత్రమే కాదు. ఊరికి ఊతమిచ్చే శక్తిగా మారాం. మా చంద్రవ్వ తరంలో ఆడపిల్లలకు ఐదేళ్లకే పెళ్లి చేసేవారు. ఇప్పుడు ఆడపిల్లలను, మగపిల్లలను చదివిస్తున్నాం. పద్దెనిమిది నిండాకే పెళ్లి చేస్తున్నాం. మైనర్ బాలికకు పెళ్లి చేయడం నేరమని చెప్తున్నం. మా ఇళ్లలో పిల్లలందరూ చదువుకుంటున్నరు. పొలం పని చేస్తున్నరు. పెద్ద ఉద్యోగాలకంటే ఎక్కువ రాబడి చిట్టి గింజల మీద వస్తుంటే సేద్యం ఎందుకు చేయరు? పెద్ద పంటలేసి విదేశాల సంస్థల గింజలు కొని, పంటల చీడపీడలకు మందులు చల్లి ఆ ఖర్చులు తిరిగి రాక రైతులు చచ్చిపోతున్నారు. మేము తెగుళ్లకు బెల్లం నీళ్లు చల్లుతాం. బెల్లం నీటికి చీమలు వస్తాయి, చీడ పురుగును కూడా తినేస్తాయి. మనసు పెట్టి చేస్తే మట్టిలో బంగారం పుడుతుంది. ఆ సంగతి నిరూపించాం.

నేల నిండుగా మందులేసి పండిస్తే గాదె నిండుతుందేమో, అందరి కడుపు నిండుతదేమో! కానీ ఒంట్లో సత్తువ ఉండాలంటే మాత్రం మేము పండించే చిరుధాన్యం తినాల్సిందే.

– **తలారి సుమిత్ర**, ఎడాకుల పల్లి, సంగారెడ్డి జిల్లా,
'నారీశక్తి' అవార్డు గ్రహీత

– **వాకా మంజులారెడ్డి**, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి ::: ఫొటోలు: **రమేష్‌బాబు**

రాశి ఫలాలు (సౌరమానం)



జన్మనక్షత్రం తెలియదా?
నో ప్రాబ్లమ్! మీ పుట్టినరోజు తెలుసా?
మీ పుట్టిన తేదీని బట్టి ఈవారం (మార్చి 10 నుంచి 16 వరకు) మీ రాశి ఫలితాలు

డా॥ మైలవరపు శ్రీనివాసరావు
జ్యోతిష్య పండితులు

మేషం (మార్చి 21 - ఏప్రిల్ 19)

నిచ్చెనని ఎక్కుతూన్నప్పుడు ప్రతి మెట్టుకీ మెట్టుకీ కొంత తేడా అంటే – మరి కొంత ఎత్తులో ఉన్న ప్రదేశాలు కనిపిస్తూంటే – ఏదో ఒక కొంత ఆనందం కలుగుతుంది. అలాగే ఎప్పటినుంచో ఆగిపోయిన పనుల్లో కొంత కొంత చొప్పున కదలిక వస్తూ, పనులన్నీ మెల్లగా గమ్యం వైపుకి ప్రయాణిస్తున్న కారణంగా మీకు చెప్పలేని ఉత్సాహంగా ఉంటుంది.

ఓ జపమైనా, ధ్యానమైనా సంస్థలో పని చేస్తున్న పని అయినా... ఇలా దేనికైనా సరే మధ్యలో ఎవరో పిలవడం, మరో పనిని అప్పగించడం వంటివి జరిగితే, చేస్తున్న ఆ పని మీద పూర్తి ఏకాగ్రత ఎలా ఉండదో, అదే తీరుగా మీ పనులన్నీ క్రమంగా కదులుతున్న ఈ దశలో ఆ పనీ, ఈ పనీ, వీరికి సహాయం, వారికి సహకారమంటూ గాని వెళ్తే, మీ పని వెనుకపడచ్చు. అలాగని బంధుమిత్రుల్ని రానీయద్దని దీనర్థం కాదు. మీకంటూ పరిమిత స్వార్థం ఉండి తీరాలని చెప్పడం మాత్రమే. 'తన్ను మాలిన ధర్మం' అనే సామెత ఉండనే ఉంది కదా! వర్షకాలం ముగిసాక, మేఘాలు పూర్తిగా తెల్లముఖం వేసాక, ఇక వర్షాలకి అవకాశమే లేనట్లు, ఇప్పుడు ప్రారంభించిన – అలాగే ప్రారంభింపబోయే పనుల్లో, 'అవుతుందో? కాదో?' అనే మీమాంసకి అవకాశమే లేదు. ముందుకి సాగండి.

ఎవరిమీదో ప్రతీకారాన్ని తీర్చుకోవాలనే ఆలోచనలూ, మాట పట్టింపులకి పోయి ఎలాగైనా గెలవాలనే ధోరణితో వాగ్వివాదాలని చేయడం, శరీరంలోని తాత్కాలిక అనారోగ్యం కారణంగా తీవ్రంగా కోపానికి గురవడం... వంటివి మీ వేగాన్ని తగ్గిస్తాయి. దృష్టిని మరోవైపుకి తీసుకుపోతాయి. మీ సంతానం భార్యాభర్తల పరిస్థితి ఆనందకరంగానూ ప్రోత్సాహక కరంగానూ ఉంటుంది. శుభమస్తు.

లౌకిక పరిష్కారం: పరుగు పందెంలో పరిగెత్తుతున్న మీరు మీ వెనుకవాడు ఎంత దూరంలో ఉన్నాడో గమనించకూడదు.

అలౌకిక పరిష్కారం: ఆంజనేయస్వామి కార్యసాధకుడు కాబట్టి ఆంజనేయనామాలని (12) రోజుకి 12 మార్లు చొప్పున పఠిస్తూ ఉండండి.

మిథునం (మే 21 - జూన్ 20)

ఇప్పటివరకూ పనుల్ని ప్రారంభించకుండానూ, అలాగే ప్రారంభించిన పనుల్ని ఎంత అలసట (బద్ధకం/పట్టించుకోకపోవడం) కారణంగా విలువైన సమయాన్ని వ్యర్థపరచుకున్నారో మీకు మీరే గ్రహించుకోగలుగుతారు. పైగా ప్రస్తుతం సాగుతున్న దశ కారణంగా చేస్తున్న – చేపడుతున్న పని గురించిన అవగాహన స్పష్టంగా వస్తుంది మీకు. అలాగే పని జరుగుతున్న సందర్భంలో ఏదైనా విఘ్నం లభిస్తే, ఏ తీరుగా దాన్ని ఎదుర్కోవాలో, తిరిగి పట్టాల మీదికి ఎలాగ ఎక్కించాలో మీకు మీకే తెలుస్తుంది. అదృష్టకాలమని గుర్తించండి.

పనిని ఎలాగైనా పూర్తి చేయాలనుకుంటూ ఓ ప్రణాళిక లేకుండా ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేయకండి. ఆర్థికమైన ఇబ్బంది ఎదురు చూస్తూ ఉందని గుర్తించండి. అదృష్టవశాత్తు మీ ఆరోగ్యం చక్కగా ఉన్న కారణంగా మనసు సరైన తీరులో ఆలోచించి సరైన నిర్ణయాన్ని సకాలంలో తీసుకోగలుగుతారు.

జరిగిన అనుభవాల దృష్ట్యా వేగంగా మాట్లాడడం, ఆవేశం పూసిన మాటల్ని భాగాలుగా విడవడం, ఎదుటివారు చెప్పేది విందామనే ఊహ ఏ మాత్రమూ లేకపోవడం... వంటి ఆ (అవ) లక్షణాలన్నీ తొలగిపోతాయి. మరో ముఖ్యమైన యోగమేమంటే – మొగమాటం పూర్తిగా మిమ్మల్ని విడిచి వెళ్లిపోవడమే.

మీకు పుట్టుకతో వచ్చిన కార్యనిర్వహణలో ఉత్తమ శైలి కారణంగా నిష్కారణంగా శత్రువులు ఏర్పడుతారు. వాటిలో కనిపించి ప్రధాన కారణం అసూయ. ఆ కారణంగా ఎవరు మిమ్మల్ని కొంటెగా మాట్లాడినా ఎత్తి పొడిచినా మరే తీరుగా మరో పద్ధతిలో ప్రవర్తించినా ప్రతిస్పందించకండి. ప్రస్తుతం మీ పరిస్థితి అరిటాకులాంటిది. వార్ల ప్రవర్తన ముల్లులాంటిది. గుర్తించండి.

లౌకిక పరిష్కారం: ధనాన్నీ సమయాన్నీ విలువ తెలిసి వ్యయం చేయండి.

అలౌకిక పరిష్కారం: ఈ వారం రోజుల పాటు రోజూ కనీసం ఆరుమార్లయినా నవగ్రహాలకు ప్రదక్షిణ చేయండి.

సింహం (జూలై 23 - ఆగస్ట్ 22)

ఎంతో బలమున్న ఏనుగులు కూడా ఒకటికొకటి సహాయపడవచ్చుననే ఉద్దేశ్యంతో గుంపులు గుంపులుగానే సంచరిస్తుంటాయి. సింహాలు కూడా ఒక జంతువుని ఒక్కటే పట్టుకోవడం కష్టసాధ్యం కాబట్టి, నాలుగువైపుల నుండీ జంతువుని పట్టేందుకోసం సమూహంగానే ఉంటాయి. అంతటి బలమూ ధైర్యసాహసాలూ గల జంతువులే సమూహంగా ఉంటూంటే, మీరెందుకని– ఎవరికీ మీ ఆలోచనని చెప్పకుండా– ఒంటరిగా వెళ్లడం? మంచిది కాదు. అన్ని విషయాలనీ కుటుంబ సభ్యులందరికీ వివరించి చెప్పడం ఎంతైనా అవసరం. చేతికి ఐదువేళ్లుండేది ఎందుకంటే– ఒక పనిని ఒక్కరు కాదు ఐదుగురూ కలిసి పని చేస్తే తేలిక– అని చెప్పేందుకే. ఒక్కరే గనుక చేస్తే, ఆ పని ఒకవేళ కాకపోతే నింద మీ ఒక్కరిమీదే ఉంటుంది. ఆలోచించుకోండి.

ప్రస్తుత దశ మీకు పెద్ద అనుకూలంగా లేని కారణంగా ప్రతి అడుగునీ ఆలోచించి వేయాల్సి ఉంటుంది. ప్రతి మాటనీ ఆచితూచి మాట్లాడాల్సి ఉంటుంది. మీ దశ గురించి తెలియని జనమంతా దీన్ని 'నిదానం– చాదస్తం...' అనచ్చు. వాళ్లని పట్టించుకోవద్దు. కష్టమో నిష్ఠురమో అనుభవించాల్సింది మీరు గదా!

మీకు పెద్ద రక్షణకవచం లోధైర్యం. ఎంతటి పరిస్థితికైనా వెరువని తనం. అది ఒకందుకు మంచిదే అయినా, కాలం అంత అనుకూలంగా లేనప్పుడు సరికాదు కదా! ఎన్నో పాముల్ని అవలీలగా పట్టినవాడు కూడా దాన్ని పట్టుకోవడానికి్కావలసిన ఒక వింత కర్రనో, ఇనుప పరికరాన్నో వెంట ఉంచుకుంటాడు. ఆ కారణంగా సాహసం ధైర్యం.. అంటూ సాగిపోకండి.

నిష్కారణంగా మీతో స్నేహం చేయడానికి వచ్చేవాళ్లనీ, అలాగే పరిచయం లేకుండా సహాయపడతామని వచ్చేవారినీ, ... ఈ తీరుగా ఎవరు రాదలిచినా వస్తున్నా కొద్దిగా ఆలోచించండి. గుట్టుగా ఉండండి. ఇది అనుమానించే లక్షణాన్ని నేర్పడం– నేర్చుకోవడం కాదు. మోసపోకుండా ఆత్మరక్షణని చేసుకోవడం మాత్రమే.

లౌకిక పరిష్కారం: ఆలోచించి మాట్లాడండి. ఆచితూచి అడుగేయండి.

అలౌకిక పరిష్కారం: కాలభైరవునికి అభిషేకాన్ని చేయించుకోండి.

తుల (సెప్టెంబర్ 23 - అక్టోబర్ 22)

నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది – సంకల్పం సరైనదైతే విజయం విశేషంగా లభిస్తుంది... వంటి నానుడులని మనం వింటుంటాం. ఈ సూత్రం ప్రకారం ఎవరినో సాధించాలి – ప్రతీకారం తీర్చుకోవాలి – మన పట్టు నెగ్గించుకోవాలి... వంటి ఆలోచనలని మాని సత్సంకల్పంతోనూ ధర్మబద్ధంగానూ మీరు ముందడుగు వేస్తే ప్రస్తుతం నలుగుతూ ఉన్న మీ సమస్య చక్కగా పరిష్కరింపబడుతుంది.

ఆర్థికంగా మీకు మంచి అవకాశముంది. అయితే అనుకోకుండా కొంత ఎక్కువ మొత్తంలో ఖర్చు అయ్యే పరిస్థితి గోచరిస్తోంది. ప్రారంభం నుండీ ఎదుటివారెంత బతిమాలినా ప్రాధేయపడినా వేడుకున్నా 'కాదు–కుదర'దంటూ బిగువుతో పలికి, ఇప్పుడు పరిస్థితి తలకిందులౌతుందని గ్రహించిన సందర్భంలో కాళ్ల బేరానికి రావలసి వస్తుందేమో (వస్తోందేమో?) గమనించుకుని ఓ మెట్టు దిగడమే మంచిది మీకు.

మిమ్మల్ని రెచ్చగొట్టి ప్రోత్సహించి ఆ మాటలూ ఈ మాటలూ ఆ ఉదాహరణలూ ఈ సాక్ష్యాలూ చెప్పి మిమ్మల్ని గోతిలోనికి దించినవారంతా ఒకరి కంటే ఒకరు ముందుగా దేవతల కంటే వేగంగా అదృశ్యమైపోతారు. గమనించుకోవాలి. ఇలాంటివారంతా గోతులో పడేసేంతవరకే వెంట ఉంటారు. మనం గోతిలో పడ్డాక 'అయ్యో' అని కూడా అననే అనరు. 'ఎందుకిలాంటి పనిని చేసి రెచ్చగొట్టా?'వని అడిగితే 'నే చెప్పాననుకో! నీ బుద్ధి ఏమైంది? ఆలోచించుకోవద్దా?' అంటారు. మీ పట్టుదలే వాళ్ల పాలిటి వజ్రాయుధం.

ఈ వారంలో ఒక శుభవార్తని వినబోతున్నారు. శుభ యోగం ఉంది. సంతానం విషయంలో దూర భవిష్యత్తుని ఆలోచించుకోవాలి తప్ప, ప్రస్తుత పరిస్థితిని గమనించి ఓ అంచనాకి రాకూడదు.

లౌకిక పరిష్కారం: పట్టుదల మానండి. సంతానం గురించి దూరదృష్టితో ఆలోచించండి.

అలౌకిక పరిష్కారం: లలితా సహస్రనామాలని రోజుకి ఓ మారు పారాయణం చేసుకుంటూ ఉండండి.

ధనుస్సు (నవంబర్ 22 - డిసెంబర్ 21)

ఎప్పటినుండో ఎదురుచూస్తున్న గృహాన్ని నిర్మించడం గాని, కొత్తగా నిర్మించిన గృహాన్ని కొనడం గాని తప్పక చేస్తారు. పనిలో పనిగా చక్కని తీర్థయాత్ర, పుణ్యక్షేత్ర ప్రయాణం, దైవదర్శనం వంటివి చేస్తారు. దానధర్మాల మీదికి దృష్టి మళ్లుతుంది. మంచిదే కాని అపాత్రునికి దానం చేయడం సరికాదు – భిక్షాటనని ప్రోత్సహించినట్లే అవుతుంది – లేదా – బద్ధకాన్ని నేర్పినట్లే (పెంచినట్లే) అవుతుంది.

అదృష్టం తలుపుతట్టే కాలం ఇదైన కారణంగా ఉద్యోగం చేస్తున్నవారైతే పోటీ పరీక్షలకి సిద్ధం కావడం, చదువుకునే స్థాయిలో ఉన్నవారైతే పైచదువుల కోసం ప్రయత్నించడం, ఏదో ఓ వృత్తిలో ఉన్నవారైతే వృత్తిలోని అదనపు నైపుణ్యం కోసం కృషి చేయడం చాలా మంచిది. సంగీత, సాహిత్య, శిల్ప, నృత్య శాఖలకి చెందిన పండితులకి పురస్కారాలు కూడా లభించవచ్చు.

ఒక మార్గంలో ప్రయాణిస్తూంటే ఎత్తులు పల్లాలూ నీళ్లూ గులకరాళ్లూ ఎండా వానా... ఇలాంటివి ఉన్నట్టుగా – ఉండేటట్లుగా కొన్ని విఘ్నాలు మీకూ ఎదురౌతాయి. అమృతం లభించేంత వరకూ ఎన్ని ఆటంకాలు వచ్చినా రాక్షసులూ దేవతలూ పాలసముద్రాన్ని చిలుకుతూనే ఉండటం మాననట్లూ మీరూ చిన్న చిన్న విఘ్నాలని సాకుగా భావిస్తూ చూపించుకుంటూ పనిని మానకండి. అదృష్టమనేది ఎల్లకాలమూ ఉండదు. కావాలనుకున్నప్పుడు రాదు. కలిసొచ్చినప్పుడు విడిచుకోనూ విడుచుకోకూడదు.

భోగి పండుగనాడు పెద్ద మంటని వేస్తే హానికర క్రిములన్నీ తమంత తామే అగ్నికి ఆకర్షింపబడి తమని తామే మంటల్లో దహించుకున్నట్లు, మీ మానవ ప్రయత్నం కారణంగా మీతో పోటీ రాలేని శత్రువులు తమంత తామే మీ తోవకి అడ్డుగా ఉండకుండా తొలగిపోయి సరైన దోవలో మీరు ప్రయాణించేలా చేస్తారు.

లౌకిక పరిష్కారం: మీ ప్రయత్నాన్ని విరమించకండి. మీ జీవన గమనంలో ఎదిగేందుకు ప్రయత్నించండి.

అలౌకిక పరిష్కారం: శ్రీహరికి ఇష్టమైన చందన ద్రవంతో అభిషేకాన్ని చేయించండి.

కుంభం (జనవరి 20 - ఫిబ్రవరి 18)

తేలికగా అయ్యే పనుల్ని ఎవరైనా చేయగలుగుతారు. అయితే ఎంతో శ్రమపడితేనే సాధ్యమయ్యే పనుల్ని చేసి చూపించడంలోనే ఉంది గొప్పదనమంతా. మీకు ప్రస్తుతం అదృష్టయోగం జరుగుతున్న కారణంగా మీరు ఏ పనిని చేయదలిచినా, ఆ పనికి అనుకూలించే వ్యక్తుల్నీ కావలసిన పనిముట్లనీ మీరు అందిపుచ్చుకునేలా ఏర్పాటు చేస్తుంది ఈ కాలం. ఈ సమయంలో మీరు చేయవలసింది ఆలస్యం చేయకపోవడమే (బద్ధకించకపోవడం). కర్తవ్యం అంటే తప్పక చేయవలసిన పని అని అర్థం. నిర్వహణం అంటే ఆ చేయవలసిన పనిని ఏ మాత్రపు లోటూ లేకుండా చేయగల సమర్థత ఉండటం. కర్తవ్యం తెలిసినవారికి నిర్వహణ సామర్థ్యం లేకపోవచ్చు. అలాగే నిర్వహణ తెలిసినవారికి కర్తవ్యం గురించిన అవగాహన ఉండకపోవచ్చు. భగవంతుని దయవల్లా ఈ కాలం మీకు అనుకూలం ఔతున్న కారణంగానూ, మీరు చేపట్టబోయే పనిని గురించిన కర్తవ్యం – నిర్వహణం అనే ఈ రెండూ మీకు తెలుసు. మిమ్మల్ని ప్రోత్సహించే వారితో గాని మీరున్నట్లయితే పనిని చేయడం సులువౌతుంది. పొలాన్ని దున్నవలసిన ఆషాఢమాసం వచ్చినప్పుడు ఎద్దుకి కొంత నలత ఉన్నా, పెద్దగా ఉత్సాహంగా లేకపోయినా, తగినంత మేతని పెట్టి ఒంటినిండుగా ఒక జాతి నూనెని పట్టించి మొత్తానికి చేనులోకి దింపుతారు తప్ప ఊరుకోరు. అలాగే మీకు తాత్కాలికంగా శక్తి లేకున్నా, అది నిజమే అయినా కూడా ఊరుకోవలసిన కాలం కాదిది. ముఖ్యంగా వ్యాపారాన్ని చేస్తున్నవారైతే శక్తికి మించిన పనిని చేయాల్సిందే. నీరు వెళ్లిపోయాక ఆనకట్ట వేయాల్సిన అవసరం లేదు. ధనవ్యయం మాత్రమే మిగులుతుంది ఫలితంగా!

నిద్రిస్తున్న సింహం నోట్లోకి – మమ్మల్ని తినవలసిందంటూ ఏ మృగాలూ రావు. సింహమైనా సరే ఏ రోజు తిండికి ఆ రోజు ప్రయత్నించాల్సిందే.. గమనించండి.

లౌకిక పరిష్కారం: సరైన అదును ఇది. ఆలసించకుండా రంగంలోకి తగు ప్రయత్నంతో దిగండి.

అలౌకిక పరిష్కారం: ఆదిత్యహృదయ స్తోత్రాన్ని (బుద్ధినీ ఆరోగ్యాన్నీ ఉత్సాహాన్నీ ఇస్తుంది) రోజూ మూడుపూటలా మూడేసి మార్లు అంటే 9 మార్లు పఠించండి.

వృషభం (ఏప్రిల్ 20 - మే 20)

చిటికెన వేలు ప్రేమనీ, నాల్గవ వేలు ఆభరణాలనీ, మధ్యవేలు ఔన్నత్యాన్నీ, మొదటివేలు బెదిరింపునీ, బొటనవేలు ఆత్మస్థైర్యాన్నీ తెలియ చేస్తాయనేది లోకంలో కనిపించే ఓ వాడుకమాట. ఈ ఐదూ అరచేతికి కలిసి ఉన్న కారణంగానే ఆ చేయి సక్రమంగా అన్ని పనుల్నీ నిర్వహించగలుగుతోంది. అలాగే సంపదలో పలుకుబడిలో పాండిత్యంలో నేర్పరితనంలో బంధుత్వంలో ఎవరెంత చిన్న? ఎవరెక్కువ? అని ఆలోచించకుండా అందరినీ కలుపుకోండి. అప్పుడే మీరు విజయాన్ని సాధించుకోగలుగుతారు ఈ నడుస్తున్న దశలో. తెలియకుండా అకస్మాత్తుగా వర్షం వస్తే తడవడంలో మన తప్పు లేదు. కారు మేఘాలు కమ్మి ఉన్నా గమనించి కూడ కాసేపు ఆగడం గాని, గొడుగు లేకుండా వెళ్లడం గాని చేస్తే అది మన తప్పే – తెలిసి చేస్తున్న తప్పే! అలాగే ఏ వ్యక్తులతో లేదా ఏ సంఘటనని గురించి మాట్లాడితే వివాదం వస్తుందో ముందుగానే మీకు తెలుసు కాబట్టి, ఆ వివాదాలు వచ్చే పరిస్థితులకి దూరంగా ఉండండి. కావాలని మన వద్దకే వచ్చి మీద పడదలిస్తే మౌనాన్ని ఆశ్రయించండి. మౌనమంటే ఎంత అవసరమో అంత మాత్రమే. ఆచితూచి ముక్తసరిగా మాట్లాడటమని అర్థం. అనుకూలించే ఓ పదిమంది పెద్దలతో ఓ బృహత్కార్యాన్ని మొదలెట్టదలుస్తారు. అనుకోకుండా అందరి సహకారమూ మీ అభ్యర్థన లేకుండా అందే అవకాశముంది. ఇలా అదృష్టం తనకు తానై తలుపు తడుతూన్నవేళ కార్యాన్ని 'కాదు– చేయలేను'అని 'శ్రీ రా మోకాలడ్డిన చందం' గా కాకుండా సంకల్పశక్తితో ఆత్మస్థైర్యంతో అంగీకరించండి – ముందుకు సాగండి. ముఖ్యంగా ఆర్థిక సహకారం అనుకున్నదాని కంటే మించి కార్యరూపంలో లభిస్తుంది. మీ నమ్మకాన్ని మాత్రమే అవతలివారంతా హామీగా అనుకుని ఈ సహాయసహకారాలకి వచ్చారని గమనించి, ఆర్థికమైన లావాదేవీలని మీరు మాత్రమే పర్యవేక్షించుకుంటూ ఉండాల్సిందే. లేనిపక్షంలో ధనమూ పరువూ ప్రతిష్ఠా కీర్తీ అన్నీ – రాయి విసిరితే పక్షులన్నీ ఒక్కమారు ఎగిరిపోయినట్టు – అయిపోతాయని గ్రహించండి.

లౌకిక పరిష్కారం: పల్లకీ ఎక్కామని ఆనందపడకండి. బాధ్యత పెరిగిందని గుర్తించండి!

అలౌకిక పరిష్కారం: విఘ్నాలు లేకుండా పని ప్రారంభమౌతోంది కాబట్టి, గణపతిని ఆరాధిస్తూ ఉండండి రోజూ.

కర్కాటకం (జూన్ 21 - జూలై 22)

మీ విలువైన సమయమంతా కుటుంబ సభ్యులతో ఏవో అనవసర విషయాల మీద చర్చలనీ వాదోపవాదాలనీ చేయడంతో సరిపోతూ, ముఖ్యమైన విషయాల్లో అవసరమైన అతి ముఖ్యమైన వాటిని మరచిపోయి ఆ పనుల్ని పూర్తి చేసుకోలేకపోతారు. ముందుకు ముందే పనుల నిర్వహణకి కావలసిన అన్నిటినీ ప్రణాళికాబద్ధంగా రాసుకుని తదనుగుణంగా మీతో తీసుకు వెళ్లండి పని చేయబోతున్న ప్రదేశానికి.

ప్రతిపనికీ భయపెట్టే లక్షణమున్నవారినీ, ప్రతిక్షణమూ 'జాగ్రత్త...' అని సూచించేవారినీ, జీవితంలో ఓడిపోయి నిరాశా నిస్పృహలతో ఉన్నవారినీ, తీవ్ర కోపిష్ఠులనీ, మీతో తీసుకెళ్లకండి. వారితో సహవాసం (కలసి మెలసి తిరగడం) పూర్తిగా మానండి. క్షయరోగి దగ్గితే ఎంత ఆత్మీయుడైనా సరే– ఆ వ్యాధి మనకి వచ్చే విధంగా పైవారి లక్షణాలు మనకీ సంక్రమించి మన పనులకి అభ్యంతరం కావచ్చు. కొన్ని కొన్ని విషయాలని ఖండితంగా చెప్పకోవాలి. మొహమాటపడి నష్టపోయి చివరికి మనని మనం నిందించుకోవడం వల్ల వచ్చే ప్రయోజనం శూన్యం. కార్యాలయానికో వ్యాపారానికో వృత్తి ఉద్యోగాలకో లేదా ప్రయాణాల్లోనో ఎక్కువకాలం గడుపుతున్నారనే అభియోగం (నిజమే సుమా) మీ మీద మీ భార్యాభర్తల విషయంలో ఉండవచ్చు. జీవితాన్ని సుఖమయం చేసుకోవాలంటే ఇది తప్పనిసరే. అయితే రోజులో కొంత సేపైనా దంపతి, పరస్పరం ముచ్చటించుకోని పక్షంలో చికాకులు, విసుగులు, ఎత్తి పొడుచుకోవడాలూ వంటివి ప్రారంభమై– మాట్లాడదలిస్తే పోట్లాట వచ్చే పరిస్థితొస్తుంది. దాంతో మరింత బిగుసుకుపోయి మాట్లాడుకోవడం కరువౌతుంది. పురుషుడే తగ్గి రెండుమాటలు పడి స్త్రీ (భార్య)ని శాంతింపజేయాలని నీతిశాస్త్రం చెప్తోంది. లొంగి ఉండాలనేది భార్య విషయంలోనే కదా! తన ఇల్లు బాగుపడేందుకై కదా ఈ నిర్ణయం. తప్పక పాటించండి.

లౌకిక పరిష్కారం: కుటుంబ సభ్యులందరితోనూ కొంతసేపు ముచ్చటిస్తూ గడపండి. అశాంతి నివారణకిది దివ్యౌషధం.

అలౌకిక పరిష్కారం: పెద్ద ఇల్లాలు (అనేకులకి తల్లి) అయిన అమ్మకి సంబంధించిన ఏ సహస్రనామాన్నైనా చదువుతూ ఉండండి రోజు మొత్తం మీద.

కన్య (ఆగస్ట్ 23 - సెప్టెంబర్ 22)

మంచి అనుకూల సమయం మీకిది. చేనుని బాగా దున్నడం అయ్యాక నీరు పెట్టి పదును చేశాక కల్తీ విత్తనాన్నో పుచ్చు విత్తనాన్నో వేస్తే ఎలా ఓ సంవత్సరకాలపు శ్రమ వృథా అవుతుందో, అలా, ఈ అదృష్టయోగ కాలంలో సరికాని నిర్ణయాన్ని తీసుకుని అనుభవం ఏమాత్రం లేని వ్యాపారాన్ని ప్రారంభిస్తే– కొత్త ఉద్యోగానికి మారితే– పరిస్థితి తారుమారౌతుంది. వృద్ధులూ అనుభవజ్ఞులూ అయిన వారిని సంప్రదించాక మాత్రమే ముందడుగు వేయడం ఉత్తమం.

ఆర్థికంగా ఇది ఎంత అనుకూల కాలమో, సరిగా ఈ కాలమే మొగమాటంతో నో– అధిక లాభాపేక్షతోనో– మీ ముందు పదిమంది ఉన్నారూగా ధీమాతోనో ధనాన్ని ఎక్కడో దాచడం గాని, ఏదో సంస్థలో పొదుపు దృష్టితో పెట్టడం గాని చేస్తే– ఇక అక్కడినుండీ మానసిక అశాంతికి ప్రారంభం అయిందన్నమాటే! డబ్బు పోవచ్చుగాని మనశ్శాంతి కరువైతే ధనాన్ని సంపాదించే ఆలోచనలు కూడా మరుగౌతాయి. ఓ తీరు పిరికితనం మిమ్మల్ని ఆవహిస్తుంది కూడా జాగ్రత్త! బలంగా ఉండి ఎత్తుగా కనిపిస్తున్న రథం ఒక కొంతమంది లాగినంత మాత్రాన కదల లేదంటే మరికొంతమంది అవసరం ఉన్నట్టే. అలాగే మీరనుకున్న పని జరగడం లేదని నిరుత్సాహపడవద్దు. మీరు చేసిన– చేస్తున్న ప్రయత్నం చాల(డం) లేదని భావించి దాని గురించిన అవగాహన ఉన్న మరికొందరిని పోగు చేసుకోండి. తప్పక మీ పని పూర్తవుతుంది. చిత్రమేమంటే మీకు ఈ దశలో అమలు అవుతూనే ఉంటాయి కాని, అన్ని పనులూ మాత్రం శ్రమ మీదనే పూర్తవుతాయని గ్రహించండి.

పొట్టమీద ఉన్న చేనుని చూసి, పాలు పోసుకున్న గింజని చూసి, కంకిగా మారబోతోందనే ఆనందంతో రైతు ఎలా చెప్పలేని ఆనందంతో ఉంటాడో, అలా మీ సంతానం చదువులో క్రమక్రమంగా పెరుగుతూ వెళ్తుంటే మీ ఆనందం చెప్పనలవి కాదు. ఆలోచిస్తే సంపదంటే వాళ్లూ వవ్వాళ్ల ప్రవర్తనమే కదా!

లౌకిక పరిష్కారం: పని కాలేదనుకోకండి. పని పూర్తి కావలసినంత ప్రయత్నాన్ని చేయలేకపోతున్నాననుకుని ప్రయత్నించండి.

అలౌకిక పరిష్కారం: సామూహికంగా శ్రీ విష్ణు సహస్రనామ పారాయణాన్ని ఇంట్లో అందరూ కలిసి చేయండి.

వృశ్చికం (అక్టోబర్ 23 - నవంబర్ 21)

ఎంతమటుకూ మీ మాటల్నే వింటూ, మీ ఆలోచనలకి అనుగుణంగానే ఎదుటివారు నడవాలని భావించడం సరికాదు. ఆత్మీయులైన పెద్దల మాటల్ని గౌరవించండి. అనుభవంతో చెప్పిన మాట దీర్ఘవ్యాధిని రూపుమాపగల దివ్యౌషధంతో సమానం. అంత పెద్ద శరీరం బలం ఉన్న ఏనుగు చిన్న డప్పు చప్పుడుకి బెదిరి పారిపోతుందనే రహస్యాన్ని చెప్పినవాడు – అడవిలో వెళ్తున్న మనని ఎన్ని ఆపదల నుండి రక్షించినవాడో కదా! అర్థం చేసుకోండి!

నేలమీది దుమ్ముని చీపురుతో దూరంగా నెట్టేయవచ్చు. వస్త్రానికి పట్టిన మాపుని ఉతకడంతో తొలగించవచ్చు. ఎదురు తిరుగుతున్న ఎద్దుని కర్ర చూపించి తోవకి తేవచ్చు. అయితే ఆకాశంలో పట్టిన నల్లని మేఘాన్ని తరమాలంటే అది వాయువుకే సాధ్యమైనట్లు, మన చేతిలో పని, మానవ ప్రయత్నానికి మించిన ఆపదని తొలగించాలంటే అది దైవానికే సాధ్యం. అందుకని విశేషంగా దైవపూజని చేయండి. సంపూర్ణ విజయాన్ని పొందబోతున్నారు ఈ వారంలోనే. న్యాయస్థానంలో ఏవైనా మీమీద అభియోగాలున్నా – లేక – తీర్పు వెలువడబోతున్నా – లేక ఎవరైనా మిమ్మల్ని కారాగారపు పాలు చేయాలని ప్రయత్నిస్తున్నా – న్యాయస్థానానికి ఈడ్చే ఆలోచనలో ఉన్నా మీ దైవపూజ వాళ్లని మడమ తిప్పేలా చేసి మీకు అలాంటివాళ్ల చేత తలవంచి నమస్కరించేలా చేసి తీరుతుంది మీ అదృష్ట యోగం.

పర్వతమంత ఎత్తుగా దూది ఉన్నా – ఎండుగడ్డి ఉన్నా అదంతా దగ్ధమైపోవాలంటే ఒక చిన్న నిప్పురవ్వ సరిపోతుందన్నట్లు మీ మౌనంతో కూడిన మనోబలం ఆత్మస్థైర్యం తీవ్రంగా నోరు చేసుకుని పడకపోవడం శాంతంగా ఉండడం (వాళ్లు రెచ్చగొట్టినా) అనేవి మీ శత్రువులైన ఎదుటివారికి – ఒక చేత్తో చప్పట్లు చరవ వీల్లేనట్లు – మిమ్మల్ని ఏమీ చేయలేని పరిస్థితికి తెస్తాయి.

లౌకిక పరిష్కారం: మౌనంగా ఉండడం, మనోబలాన్ని విడవకుండా ఉండడం అవసరం.

అలౌకిక పరిష్కారం: వీలైనంత ఎక్కువసేపు వేదగానాన్ని (వేద మంత్రాలు) వినే ప్రయత్నాన్ని చేయండి.

మకరం (డిసెంబర్ 22 - జనవరి 19)

శ్రీహరిని భృగుమహర్షి అంతటివాడు వక్షఃస్థలం మీద బలంగా తంతే, వినయంతో విధేయతతో భక్తితో ఆయన పాదాన్ని పట్టుకున్నట్టుగా నటించిన శ్రీహరి ఆయన మహిమకి కారణమైన ఆ పాదంలోని కంటిని తన వేలితో పొడిచి ఆయనకి గర్వభంగం చేసి శక్తిహీనుణ్ణి చేశాడు. ఇది ఉపాయంతో శత్రువుని జయించే తీరు. ఈ వారంలో మీరు చేయవలసిన పని ఇదే. కచ్చితంగా మీ తోవకి అడ్డుగా రాబోతున్నారు శత్రువులు. మీరు విజయాన్ని సాధించబోతున్నారు. అయితే సాధించే పద్ధతి మాత్రం – ఉపాయమే.

జేబునిండా ధనమున్నవారికి ఎంత దూరమైనా ప్రయాణించగల శక్తి దానంతట అదే వచ్చినట్లు, ధర్మాన్ని ఆశ్రయించి మీరున్న పక్షంలో మీకు ఎదురనేది ఉండనే ఉండదు. కావాలని కొన్ని మాటలను కల్పించి ప్రచారం చేయకండి. నిజాన్ని చెప్పవలసి వచ్చినా–దాని వల్ల ఎదుటివారికి ఇబ్బందీ హానీ కల్గుతుందన్న పక్షంలో మౌనంగా ఉండండి లేదా ఆ ప్రదేశాన్ని వీడి వెళ్లండి తప్ప, ఎదుటివారానందపడతారు గదా అని అసత్యం చెప్పకండి. అలాగని నిజమే కదా అని నిజాన్ని కక్కెయ్యకండి. ప్రస్తుతం నడుస్తున్న దశలో మీకు ఇలాంటి పరీక్షలు తప్పవు.

'పనిని ప్రారంభించాను ఏమౌతుందో?' అని ఊహించడంలో కొంతలో కొంత అర్థముంది గాని, 'పని కాదేమో – తలకిందులౌతుందేమో!' అని ఈ తీరుగా వ్యతిరేకదిశలో ఆలోచిస్తూ ఉంటే తప్పక పని చెడి తీరుతుంది. ఇది ఏ విజ్ఞాన శాస్త్రమూ నిరూపించ(లే)ని సత్యం. అయితే అనుభవంలో యథార్థం.

సరైన బుద్ధిలేని కోతులతో మార్గం లేని సముద్రం అవతల లంకకి వెళ్లి రూపం, భాష, ప్రవర్తన, లక్షణాలూ.. ఇలా అన్నింటిలోనూ సరిపోలని రాక్షసుల్ని మానవుడైన రాముడు చంపగలిగాడంటే కారణం – అనుకూల దిశగా ఆలోచించడమే. అదే పనిని చేస్తూ ఉండండి. విజయం మీదే!

లౌకిక పరిష్కారం: 'సాధించగల'ననే ధీమాతో ప్రయత్నాన్ని చేయండి. సంశయంతో వద్దు.

అలౌకిక పరిష్కారం: కార్యసాధకుడైన ఆంజనేయుని 'చాలీసా'ని రోజుకి 12 మార్లు పఠిస్తూ ఉండండి.

మీనం (ఫిబ్రవరి 19 - మార్చి 20)

ఎండా అలాగే వాన వచ్చే కాలాల్లో రెంటి నుండీ రక్షించగలది గొడుగు. బాగా పెద్ద ఎండా పెద్ద వర్షమూ రాబోతోంది. లేదా వస్తోందనిపిస్తే కాసేపు ఆగుతాం. అలాగే మీరు వృద్ధిలోకి వస్తున్న కారణంగా ఈర్ష్యా ద్వేషాలున్న కొందరు మీ పనులకి విఘాతాన్ని కల్గించాలనే దురుద్దేశ్యంతో మీతో వాదులాటకి దిగడానికి వస్తారు. వాదులాట వల్ల మనసు పాడవడం, పని విషయంలో శ్రద్ధ ఉండకపోవడం, ఏకాగ్రత భగ్నం కావడం.. ఇదే కదా ఫలితం. వాదులాట వల్ల నష్టపోయేది మీరే. ఆ కారణంగా వాదులాడాలని ఎవరొచ్చినా మౌనం లేదా ఆ ప్రదేశాన్ని వీడడం లేదా ఇప్పుడు సమయం లేదని చెప్పెయ్యడమో చేసి గట్టెక్కండి. నిజంగా వాదులాడాల్సిన అవసరం లేదు. కేవలం మిమ్మల్ని అప్రతిష్ఠపాలు చేయాలనేది వారి ఆశయం. దీనిక్కారణం మీ అభివృద్ధి మాత్రమే. దాని నేపథ్యం వారి కళ్లనిండుగా ఉన్న అసూయ.

అనుకున్నపని అనుకున్నట్లుగా జరిగే సమయం ఇది. చేతిలో పుష్కలంగా ధనం ఉండే కాలం కూడా ఇది. ఎవరెవరో ఫలాని వృత్తి, ఫలాని వ్యాపారం, ఫలాని చోట పొదుపు చేయడం మంచిదంటూ సూచనలనియ్యబోతే వారించద్దు. వినండి. అయితే మీ ఆలోచన(ల)ని మాత్రమే అమలు చేసుకోండి. ఒకటికి పదిమార్లు ఆలోచించుకుని ఒకరి ఆలోచనకి బానిస కావద్దు.

సంతానానికి 'సంవత్సరానికి ఇంత' అంటూ ఓ ఆదాయానికి శ్రీకారం చుట్టే సమయం కాబట్టి, నెలకి ఇంత అని వెనకేస్తూ, సంవత్సరంలో నికరాదాయం గురించిన ప్రయత్నాన్ని చేయండి. సఫలమౌతుంది. సంతానానిక్కూడా ఉత్సాహంగా ఉంటుంది. వారి సహకారమూ మీకు తోడవుతుంది.

కుటుంబంలో ఉన్న సంతానం ప్రవర్తన ఆరోగ్యం గురించి జాగ్రత్త తీసుకోవాల్సిన కాలమని కూడా గుర్తించండి. చీడ అనేది ప్రారంభమౌతున్న కాలంలోనే ఆ ఆకుని తుంచిపడేస్తే ఆ చీడకి వ్యాపించే అవకాశం ఉండదు. గుర్తించండి.

లౌకిక పరిష్కారం: ఓపిక లేకున్నా కార్యరంగంలోనికి దిగాల్సిందే.

అలౌకిక పరిష్కారం: దుర్గాదేవి స్తోత్రాన్ని లేదా నామాలని పఠిస్తూ ఉండండి.

సాక్షి ఫ్యామిలీ
సినిమా
విజయవాడ
శనివారం
10-3-2018

ఇద్దరి గురి ఎవరిపై?


నాగార్జున,మైరా సరీన్

పుల్లీ లోడెడ్ గన్‌తో టార్గెట్‌పై కాన్సంట్రేట్ చేశారు నాగార్జున. ఆన్ డ్యూటీలో ఈ ఆఫీసర్ ఏ విధంగా టార్గెట్‌ను రీచ్ అయ్యాడో తెలుసుకోవాలంటే మాత్రం 'ఆఫీసర్' సినిమా చూడాల్సిందే. నాగార్జున హీరోగా కంపెనీ పతాకంపై సుధీర్ చంద్రతో కలిసి రామ్‌గోపాల్ వర్మ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న సినిమా 'ఆఫీసర్'. మైరా సరీన్ ఫీమేల్ లీడ్ క్యారెక్టర్ చేస్తున్నారు. క్లైమాక్స్ షూటింగ్ ముంబైలో జరుగుతుంది. ''నా గన్‌తో పాటు మైరా సరీన్ గన్ కూడా 'ఆఫీసర్' సినిమా కోసం ఫుల్‌గా లోడై ఉంది. మే 25న థియేటర్స్‌లో షూట్ చేస్తాం'' అని పేర్కొన్నారు నాగార్జున. అంతేకాదు.. ఆన్‌లొకేషన్స్ ఫొటోలను షేర్ చేశారు. వీటిని చూసిన అభిమానులు నాగ్ మరో హిట్‌పై గురిపెట్టాడు అని అనుకుంటున్నారు. ''మైరా సరీన్ యాక్టింగ్ చూసి నాగార్జున, నేను ఇంప్రెస్ అయ్యాం. సరీన్‌కు ఇది ఫస్ట్ మూవీ అంటే నమ్మబుద్ధి కావడం లేదు'' అన్నారు రామ్‌గోపాల్ వర్మ. ఆఫీసర్ చిత్రాన్ని మే 25న రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

ఎన్నిసార్లు వెళ్లినా...


రజనీకాంత్

మళ్లీ మళ్లీ వెళుతుంటారు రజనీకాంత్. ఎక్కడికి అంటే.. హిమాలయాలకు. ఒక సినిమా పూర్తయ్యాక మరో సినిమా మొదలుపెట్టే ముందు రజనీకాంత్ హిమాలయాలకు వెళతారు. అక్కడ కొన్ని రోజులు ధ్యానం చేస్తారు. పలువురు భక్తులను, గురువులను కలుస్తారు. కొన్నాళ్లుగా రాజకీయాలు, రిలీజ్‌కు రెడీ అవుతున్న 'కాలా', '2.0', కార్తీక్ సుబ్బరాజుతో చేయబోతున్న కొత్త సినిమాల కార్యకలాపాలతో బిజీగా ఉన్న రజనీ 'బ్రేక్' తీసుకున్నారు. ఈ బ్రేక్ ఎందుకంటే 'స్పిరిచ్యువల్ జర్నీ' కోసం. వారం రోజుల పాటు ఈ ఆధ్యాత్మిక ప్రయాణం సాగుతుంది. ఈరోజే రజనీ ప్రయాణం. సిమ్లా వెళ్లి, అట్నుంచి ధర్మశాల, ఆ తర్వాత రిషికేశ్ వెళ్లేట్లు ప్లాన్ చేసుకున్నారని సమాచారం. ఈ జర్నీ పూర్తయ్యాక కొత్త సినిమా జర్నీతో రజనీ బిజీ అవుతారట.

అప్పుడు తెలుగు... ఇప్పుడు ఫిజిక్స్



వెంకటేశ్

తెలుగు మాస్టర్‌గా పద్యాలు చెప్పిన వెంకటేశ్ ఇప్పుడు ఫిజిక్స్ చెప్పడానికి రెడీ అవుతున్నారని సమాచారం. ఆల్మోస్ట్ పాతికేళ్ల క్రితం రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'సుందరకాండ' చిత్రంలో వెంకటేశ్ తెలుగు మాస్టర్‌గా నటించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు తేజ దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా ఓ సినిమా రూపొందనుంది. ఈ సినిమాలోనే వెంకి ఫిజిక్స్ లెక్చరర్‌గా నటించనున్నారని టాక్. ఈ చిత్రానికి 'ఆట నాదే వేట నాదే' అనే టైటిల్‌ను అనుకుంటున్నారు. ఈ సినిమాలో వెంకటేశ్ లుక్ ఇదేనంటూ ఓ ఫొటో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. ఇంతకీ ఫొటోను బాగా గమనించారు కదా! వెంకీ చేతిలో ఉంది ఫిజిక్స్ సబ్జెక్ట్‌కి చెందిన బుక్. సో.. ఈ సినిమాలో ఆయన ఫిజిక్స్ లెక్చరర్‌గా కనిపించనున్నారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. నారా రోహిత్ ఓ కీలక పాత్రను చేయనున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే స్టార్ట్ కానుంది. ఈ సంగతి ఇలా ఉంచితే... త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ మూవీ, అనిల్ రావిపూడి మల్టీస్టారర్ మూవీలో వెంకటేశ్ హీరోగా నటించనున్న సంగతి తెలిసిందే.

కళాకారుల ఆనందమే సుబ్బరామి రెడ్డి ఆహారం

- బ్రహ్మానందం

''లలిత కళలంటే లలితాగాయత్రి యొక్క అంశ కలిగిన కళలు. ఈ కళలు అబ్బటం ఆ దేవత ఆశీర్వచనం. అటువంటి కళాకారులు ఎక్కడ పుట్టినా గౌరవించేవాళ్లు కొందరు ఉంటారు. అప్పుడు శ్రీకృష్ణ దేవరాయలు. ఆయన చిరస్థాయిగా ఉన్నారంటే కళలకు, కళాకారులకు ఆయన చేసిన సేవే. ఆయన పేరు వినగానే మనకు 'భువనవిజయం' గుర్తొస్తుంది. కళలకు ఉన్న గొప్పతనం అలాంటిది. సుబ్బరామి రెడ్డి మనసెప్పుడూ కళల మీద, కళాకారుల మీదే ఉంటుంది. వాళ్లను గౌరవించటం. వాళ్ల ఆనందమే ఈయన ఆహారం. నా పూర్వ జన్మ సుకృతం వల్ల రేపు కాకతీయ కళలను గుర్తు చేసుకుంటూ తీసుకోబోయే ఈ అవార్డు నాకు ప్రత్యేకమైంది. ఆలీ నాకంటే నటనలో సీనియర్. పరిశ్రమలో నటించటం పక్కన పెడితే, అసలు ఉండటమే కష్టం. అందుకే ఆలీ 'ఏ' నేను 'బీ'' అన్నారు బ్రహ్మానందం. 'కాకతీయ లలిత కళా పరిషత్' ఏర్పాటు చేసి, కళాకారులను సన్మానిస్తున్నారు సుబ్బరామి రెడ్డి. మార్చి 11న మహబూబ్‌నగర్‌లో జరగనున్న ఈ ఉత్సవాల్లో బ్రహ్మానందానికి 'హాస్య నట బ్రహ్మ' బిరుదును ప్రదానం చేయనున్నారు. ఈ వివరాలు తెలియజేయడానికి ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో టీయస్సార్ మాట్లాడుతూ– ''కళలోనే దైవత్వం ఉంది. అందుకే కళాకారులను గౌరవించినా, అభినందించినా, సత్కరించినా.. మనకు ఆ శక్తి వస్తుంది. 700 సంవత్సరాల క్రితం పరిపాలించిన కాకతీయ చక్రవర్తుల వైభవం, కళల సంపద అపూర్వం. ఆ తర్వాత మనకు గుర్తు వచ్చేది శ్రీకృష్ణ దేవరాయలు. కాకతీయ కళా పరిషత్‌ను 2 నెలల క్రితం ప్రారంభించినప్పుడు మోహన్‌బాబును సత్కరించాం. ఇప్పుడు రూరల్ ఏరియాస్‌లో కూడా ఈ కళా వైభవోత్సవాలు నిర్వహించాలనుకుంటున్నాం. తెలంగాణాలో మొట్టమొదటిగా మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ కార్యక్రమం స్టార్ట్ చేస్తున్నాం. కళాకారులను, స్థానిక కళాకారులను, సినీ కళాకారులని ఇందులో సన్మానించదలిచాము. ఈ కార్యక్రమంలో 1100 చిత్రాల్లో నటించి, హాస్యాన్ని పంచిన బ్రహ్మానందంకు 'హాస్య నట బ్రహ్మ' అనే బిరుదు ప్రదానం చేయనున్నాం. దాదాపు 40 ఇయర్స్ కెరీర్ ఉన్న ఆలీకు కూడా అవార్డ్ ఇవ్వబోతున్నాం. పలువురు సినీరంగ ప్రముఖులను, స్థానిక కళాకారులను ''కాకతీయ అవార్డు'తో సత్కరిస్తాం'' అన్నారు. ''బ్రహ్మానందం గారు తెలియని తెలుగువారుండరు. సుబ్బరామిరెడ్డి గారు పార్లమెంట్ సభ్యుడి కంటే గొప్ప భక్తుడు,కళా పోషకుడు, కళా బంధువు'' అన్నారు శాసన సభ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్. ''నటరాజుకి కళాకారులంటే ఇష్టం. ఆ నటరాజే సుబ్బరామిరెడ్డి గారు. కేవలం 33 సంవత్సరాల్లో 1100 సినిమాలు పూర్తి చేసిన బ్రహ్మానందంగారిని సన్మానించటం ఆనందం'' అన్నారు ఆలీ.


ఆలీ,బ్రహ్మానందం, సుబ్బరామి రెడ్డి,శ్రీనివాస గౌడ్, విజయ్ కుమార్

జంగిల్ జిందగీ!


రానా

ట్రాఫిక్ గొడవే లేదు. పొల్యూషన్ ప్రాబ్లమ్ లేదు. ప్రశాంతంగా ఉండే ఏరియాకి వెళ్లారు బందేవ్. ఇంతకీ బందేవ్ ఎవరు? అంటే.. మన టాలీవుడ్ హీరో రానానే. గజరాజుతో స్నేహం చేయడానికి బందేవ్ ఎక్కడికి వెళ్లాడో తెలుసా? థాయ్‌లాండ్‌లోని జంగిల్‌లోకి వెళ్లాడు. నెల రోజులు అక్కడే ఉంటారట. ప్రభు సాల్మన్ దర్శకత్వంలో రానా హీరోగా తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. హిందీలో 'హాథీ మేరే సాథీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. తెలుగులో 'అడివి రాముడు' అనే టైటిల్ పరిశీలనలో ఉందన్న వార్తలు వినిపిస్తున్నాయి. న్యూ ఇయర్ సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. 1971లో రాజేష్ ఖన్నా హీరోగా వచ్చిన 'హాథీ మేరే సాథీ' చిత్రానికి ఇది రీమేక్ అని సమాచారం. ఈ సినిమా షూటింగ్ కోసం థాయ్‌లాండ్ అడవిలోకి వెళ్లారట రానా. ''హాథీ మేరే సాథీ' చిత్రం కోసం థాయ్‌లాండ్స్‌లోని అడవికి వచ్చా. నెల రోజుల పాటు ఇక్కడే ఉంటాను'' అని పేర్కొన్నారు రానా. అంటే.. వచ్చే నెల రోజులు జంగిల్ జిందగీ అన్నమాట. అదేనండీ.. అడవి జీవితం అంటున్నాం. ఈ సినిమాను ఈ ఏడాది దీపావళికి రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారట.

కొందరి ప్రయోజనాల కోసం బంద్ ఆపేస్తారా?

– ఆర్. నారాయణమూర్తి


ప్రతాని రామకృష్ణ, నారాయణమూర్తి

''చిత్ర పరిశ్రమలో బ్రహ్మాస్త్రం లాంటి బంద్‌ను ఉపయోగించి తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ వాళ్లు ఏం సాధించారో అర్థం కావడం లేదు. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేదు'' అని మండిపడ్డారు ఆర్. నారాయణమూర్తి. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌కు, సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీకి చార్జీల విషయంలో చర్చలు విఫలమై ఈ నెల 2 నుంచి థియేటర్స్ బంద్ అయ్యాయి. చర్చలు తాత్కాలికంగా సఫలమై శుక్రవారం నుంచి థియేటర్స్ ఓపెన్ అయ్యాయి. బంద్ ముగిసింది. ఈ సందర్భంగా దర్శక–నిర్మాత–నటుడు ఆర్. నారాయణమూర్తి మాట్లాడుతూ– ''తమిళ్, మలయాళం, కన్నడ ఇండస్ట్రీలో ఇంకా బంద్ కొనసాగుతూనే ఉంది. ఐదేళ్ల తర్వాత ఫ్రీగా ఇస్తామంటూ డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ ఇచ్చిన హామీలు అమలు కాకముందే హఠాత్తుగా బంద్ ఎందుకు విరమించుకున్నారు? ఈ బంద్ వల్ల సినీ కార్మికులు ఇబ్బందిపడ్డారు తప్ప ఒరిగింది ఏమీ లేదు. డిజిటల్ సర్వీస్ చార్జీలు తగ్గితే మంచి జరుగుతుందనే ఉద్దేశంతో సంఘీభావం తెలిపాం. కానీ కొందరి ప్రయోజనాలు, స్వార్థం కోసం బంద్‌ను ఆపేస్తారా? దీనికోసమైతే సురేశ్‌బాబు, జెమిని కిరణ్, అల్లు అరవింద్ లాంటి పెద్దలు బంద్ వరకు వెళ్లకుండా ముందే మాట్లాడి సెటిల్ చేస్తే సరిపోయేది కదా? గతంలో రామానాయుడుగారు, దాసరి నారాయణరావుగారు లాంటి పెద్దలు పదిమంది నిర్మాతల మంచి కోరేవారు. ఐక్యత లేకపోవడం వల్ల గతంలో మేం చేసిన పోరాటాలు, నిరహార దీక్షల వల్ల సక్సెస్ సాధించలేకపోయాం. ఇప్పుడూ సక్సెస్ కాలేకపోయాం. ఇందుకు కారణం మేజర్ సెక్టార్ సపోర్ట్ లేకపోవడమే. తెలుగు రాష్ట్రాల సినిమాటోగ్రఫీ మంత్రులు కలగజేసుకుని చిన్న చిత్రాల నిర్మాతలకు న్యాయం చేయాలి. తక్కువ చార్జీలకే కొత్త కంపెనీలు వస్తున్నా కొందరు రానివ్వడం లేదు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ జోక్యం చేసుకుని మంచి జరిగేలా చూడాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''ఉచితంగా ఇచ్చేంతవరకు బంద్ ఆపబోమని చెప్పి, రెండు వేల రూపాయలు తగ్గించగానే థియేటర్స్ బంద్ ఆపేశారు. ఇది కాదు మేం కోరుకున్నది'' అన్నారు తెలంగాణ చలనచిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్.

రేటింగ్స్ కోసం అలా రాయొద్దు


శ్రీకాంత్

''రేటింగ్స్ కోసం, లైక్స్ కోసం అవాస్తవ వార్తలను ప్రచారం చేయటం తప్పు'' అని మండిపడ్డారు హీరో శ్రీకాంత్. ఇటీవల బెంగళూర్ షూటింగ్‌లో శ్రీకాంత్ గాయపడ్డారంటూ కొన్ని యూట్యూబ్ ఛ్యానల్స్ ప్రచారం చేశాయి. దానికి ఆయన ఘాటుగా స్పందిస్తూ – ''నేను షూటింగ్ చేసుకుంటూ ఉండగా సడెన్‌గా ఫోన్ కాల్స్ రావడం స్టార్ట్ అయ్యాయి. నా కుటుంబ సభ్యులు, అభిమానులు కంగారుపడి ఫోన్ చేశారు. కల్పిత వార్తలకు వాయిస్ ఓవర్ యాడ్ చేసి లైక్స్ తెచ్చుకోవటం, సబ్‌స్క్రైబర్స్ పెంచుకోవటం కోసం యూట్యూబ్‌లో వీడియోస్ పెట్టడం చాలా పెద్ద తప్పు. దీన్ని తీసుకొని మరికొన్ని వెబ్‌సైట్స్ కూడా వార్తలు రాస్తున్నాయి. ఇలాంటి అసత్యపు వార్తలను రాయొద్దు. ఈ విషయాన్ని 'మా' అసోసియేషన్ కూడా చాలా సీరియస్‌గా తీసుకుంటుంది. ఇలాంటి అసత్య ప్రచారం జరిపిన వారిపై సైబర్ క్రైమ్ ఎస్.పి రామ్మోహన్ గారికి 'మా' ద్వారా కంప్లైట్ చేయనున్నాం'' అని అన్నారు.

తొలకరి చూసి...


విశాల్, సమంత

విశాల్, సమంత జంటగా ఎస్.మిత్రన్ డైరెక్షన్‌లో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'ఇరంబుదురై'. హరి వెంకటేశ్వర పిక్చర్స్ పతాకంపై జి.హరి ఈ సినిమాను తెలుగులో 'అభిమన్యుడు'గా విడుదల చేస్తున్నారు. ఈ సినిమాలోని తొలిపాట 'తొలి తొలిగా తొలకరి చూసి పిల్లాడ్నై..'ను హీరో నితిన్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా జి.హరి మాట్లాడుతూ– ''యువన్ శంకర్ రాజా అద్భుతమైన మ్యూజిక్ అందించారు. యాక్షన్ కింగ్ అర్జున్‌తో పాటు భారీ తారగణం ఈ సినిమాలో యాక్ట్ చేశారు. విశాల్ కెరీర్‌లోనే ఎక్కువ బడ్జెట్‌తో రూపొందిన సినిమా ఇది. షూటింగ్ పూర్తి అయిపోయి, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు. ఈ సినిమాకు కెమెరా:జార్జ్ సి విలియమ్స్, సహనిర్మాత: ఇ.కె.ప్రకాశ్.


అనుష్కా శర్మ

అమ్మ అడుగుజాడల్లో...


ధడక్ షూట్‌లో జాన్వీ కపూర్

'అచ్చంగా అమ్మలానే'... జాన్వీ కపూర్ గురించి 'ధడక్' టీమ్ అంటున్న మాటలివి. చూడ్డానికి తల్లి శ్రీదేవిలానే జాన్వీ ఉంటుంది కాబట్టి అలా అన్నారా? అంటే.. ఊహూ. ఇది 'క్రమశిక్షణ' గురించి. తల్లి మరణించి పట్టుమని పదిరోజులు కూడా గడవకముందే 'ధడక్' లొకేషన్‌లో కాలుపెట్టారు జాన్వీ కపూర్. యాక్చువల్లీ జాన్వీ లాంగ్ బ్రేక్ తీసుకుంటుందని, సినిమా వాయిదా తప్పదని కొందరు భావించారు. అయితే తండ్రి బోనీకపూర్ నిర్మాత, తల్లి శ్రీదేవి ఆర్టిస్ట్ కాబట్టి జాన్వీకి సినిమా కష్టాలు తెలుసు. అందుకే షూటింగ్‌లో పాల్గొనాలని ఫిక్సయ్యారు. ఇషాన్ కట్టర్, జాన్వీ కపూర్ జంటగా శశాంక్ కేతన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ధడక్' మరాఠీ సినిమా 'సైరట్'కు రీమేక్. గురువారం ఈ సినిమా తాజా షెడ్యూల్ స్టార్టైంది. రెండు రోజుల పాటు ఇషాన్, జాన్వీలపై రొమాంటిక్ సీన్స్ తీసి, ఆ తర్వాత కోల్‌కత్తాలో నెక్స్ట్ షెడ్యూల్ స్టార్ట్ చేస్తారు. ''మా షూటింగ్‌కు బ్రేక్ పడుతుందని వచ్చిన వార్తల్లో నిజం లేదు. కోల్‌కతా షెడ్యూల్ కోసం ఎదురు చూస్తున్నాం'' అన్నారు శశాంక్ కేతన్. శ్రీదేవి ఆరోగ్యంగా లేకున్నా తన వల్ల మూవీ యూనిట్‌కు ఇబ్బంది కలగకూడదు అనుకునేవారు. జాన్వీ కూడా అంతే. అచ్చు అమ్మ అడుగుజాడల్లోనే ముందుకెళ్తుంది అని అనుకుంటున్నారు బాలీవుడ్ సినీవాసులు. ఈ సంగతి ఇలా ఉంచితే.. శ్రీదేవి గురించి బాలీవుడ్ దర్శకుడు మహేశ్ భట్ ఓ ఇన్సిడెంట్‌ను గుర్తు చేసుకున్నారు. ''గుమ్రా' సినిమా చేస్తున్నప్పుడు శ్రీదేవి జ్వరంతో బాధపడుతున్నారు. షూట్ క్యాన్సిల్ చేద్దామని చెప్పా. 'లేదు. లేదు..నా వల్ల షూటింగ్ అగిపోకూడదు' అని శ్రీదేవి చెప్పారు. అంతేకాదు అంత జ్వరంలోనూ వాటర్ సీన్స్‌లో అద్భుతంగా నటించారామె. ఆమె అంకితభావం సూపర్'' అని పేర్కొన్నారు మహేశ్ భట్. సో.. జాన్వీ కూడా అచ్చంగా అమ్మలానే. తన మానసిక స్థితి ఎలా ఉన్నా సినిమాపై ఆ ప్రభావం పడకూడదనుకుంది. 'ధడక్' చిత్రాన్ని ఈ ఏడాది జూలై 20న విడుదల చేయాలనుకుంటున్నారు.

షాకయ్యా!

''నాతో ఎవరూ మాట్లాడలేదు. ఏ ప్రశ్నలకూ నేను సమాధానాలు చెప్పలేదు. కానీ నేను చెప్పినట్లుగా ఆర్టికల్ వచ్చింది. చదివి షాకయ్యాను'' అన్నారు బాలీవుడ్ బ్యూటీ అనుష్కా శర్మ. అసలు విషయానికొస్తే.. అనుష్కా శర్మ చెప్పినట్లుగా ఆమె వ్యక్తిగత విషయాల గురించి న్యూస్ ఆర్టికల్స్ వచ్చాయి. దీంతో ఆమె తెగ ఫీలై పోయారు. ఆ ఆర్టికల్స్ గురించి ఆమె చెబుతూ– ''నా గురించి పూర్తిగా కల్పించి రాసిన వార్తలు చూసి షాకయ్యాను. నా వ్యక్తిగత విషయాల గురించి ఎవ్వరికీ ఏమీ చెప్పలేదు. ఏ ఇంటర్వ్యూ ఇవ్వలేదు. ఇలా ఒకరి పర్సనల్ లైఫ్ ఫ్రీడమ్.. ఇంకొకకరి వల్ల డిస్టర్బ్ అవ్వడం సరికాదేమో. సెన్సేషన్ కోసం ఇవ్వని ఇంటర్వ్యూని ఇచ్చినట్లుగా రాయడం సబబు కాదు'' అని అన్నారు. ప్రస్తుతం 'సూయి ధాగా, సంజు, జీరో' చిత్రాల్లో నటిస్తున్నారామె.

ఆపరేషన్ @ బోరు బావి


నయనతార

లేడీ ఓరియంటెడ్ చిత్రాలు కూడా చేస్తూ దూసుకెళ్తున్న నయనతార నటించిన తమిళ చిత్రం 'ఆరమ్' తెలుగులో 'కర్తవ్యం' పేరుతో విడుదల కానుంది. గోపి నైనర్ దర్శకత్వంలో 'శివ లింగ, విక్రమ్ వేదా' వంటి సూపర్ హిట్ చిత్రాలను అందించి, 450 పైగా చిత్రాలను డిస్ట్రిబ్యూట్ చేసిన ఆర్. రవీంద్రన్, నార్త్ స్టార్ ఎంటర్టైన్మెంట్స్ అధినేత శరత్ మరార్ సంయుక్తంగా ట్రైడెంట్ ఆర్ట్స్ పతాకంపై ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ని విడుదల చేశారు. ''ప్రజలకు ఏది అవసరమో అదే చట్టమవ్వాలి కానీ చట్టాన్ని ముందే తయారు చేసి దాన్ని ప్రజల మీద రుద్దకూడదు'' అని ఈ టీజర్‌లోని డైలాగ్ ఆకట్టుకుంటోంది. ''తమిళంలో నయనతారకు లేడీ సూపర్ స్టార్ ఇమేజ్ తెచ్చి పెట్టిన చిత్రమిది. బోరు బావిలో ఆడుకుంటున్న పిల్లలు పడిపోతే, అక్కడ జరుగుతున్న ఆపరేషన్ కథా వస్తువుగా తీసుకుని సహజత్వానికి దగ్గరగా గోపి నైనర్ ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. ఆ ఆపరేషన్ స్పెషల్ ఆఫీసర్‌గా కలెక్టర్ పాత్రలో నయనతార నటన అద్భుతం. ఆసక్తికి గురి చేసే మలుపులతో సాగే మంచి పొలిటికల్ డ్రామా. ఈ నెల 16న చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు నిర్మాతలు.